ఈనాడు
విజయవాడ 29-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 139
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

లక్కీ Anniversary ఉత్సవాలు

లక్కీ Anniversary ఉత్సవాలు



(c) eenadu

ముఠాల మధ్య అల్లుకున్న ఆర్థిక బంధం

- నిందితుల ఖాతాల నడుమ భారీగా లావాదేవీలు
- విజయవాడ నుంచి దిల్లీ, ముంబయి వరకు విస్తరించిన నెట్‌వర్క్
- శిశు విక్రయాల వ్యవహారంలో వెలుగులోకి వస్తున్న కీలక అంశాలు

ఈనాడు, అమరావతి: పిల్లల విక్రయ ముఠాల మధ్య భారీగా నెలకొన్న ఆర్థిక బంధం బయటపడుతోంది. పెద్దఎత్తున లావాదేవీలు జరిగినట్లు తేలింది. విజయవాడ నుంచి ఉత్తరాది వరకు విస్తరించిన నిందితులు, గుర్తుతెలియని వ్యక్తుల మధ్య భారీగా నగదు బదిలీ జరిగింది. విజయవాడకు చెందిన ప్రధాన నిందితురాలు బలగం సరోజిని దిల్లీ, ముంబయిలోని ముఠాల ద్వారా పిల్లలను తెప్పించి ఇక్కడ అమ్ముతున్నారు. ఈ రెండు ముఠాల మధ్య సంబంధాలున్నట్లు తేలింది. ఆర్థిక లావాదేవీల విశ్లేషణలో ఇది బయటపడింది.

ఒక ఖాతా నుంచి మరొకదానికి..

పిల్లల విక్రయాల కేసులో ఇప్పటివరకు 12 మందిని విజయవాడ పోలీసులు అరెస్టుచేశారు. వీరి విచారణలో నిందితుల మధ్య నగదు బదిలీ బయటపడింది. విజయవాడ నుంచి ముంబయి, దిల్లీలకు రూ.10వేల నుంచి రూ.1.80 లక్షల వరకు చేతులు మారింది. ఈ డబ్బు సరోజిని నుంచి సతీష్, అనిల్, కిరణ్ శర్మ, తదితరులకు చేరింది. ఉత్తరాది ముఠాలో దిల్లీకి చెందిన కిరణ్ శర్మ, ప్రియాంక, బర్తిలను కీలక వ్యక్తులుగా పోలీసులు గుర్తించారు. ముంబయి గ్యాంగ్‌లో అనిల్, కవిత, నూరి, కాజల్, సతీష్ ప్రధాన సూత్రధారులు. వీరిలో ప్రియాంక, బర్తి.. దిల్లీలో ఒకే ప్రాంతంలో ఉంటారు. ఎక్కువ లావాదేవీల్లో సతీష్‌కు డబ్బులు చేరినట్లు తెలిసింది. నిందితుల మధ్యనే కాకుండా పలువురు గుర్తుతెలియని వ్యక్తుల మధ్య కూడా లావాదేవీలు జరిగాయి.

సగం.. సగం

దిల్లీ, ముంబయి పరిసర ప్రాంతాల్లో పిల్లల పోషణ కష్టంగా ఉండే కుటుంబాలను ఉత్తరాది ముఠా ఎంచుకుంటుంది. వీరి నుంచి శిశువులను తీసుకుని.. విజయవాడలో ఉన్న సరోజిని ముఠాకు చేరవేస్తారు. విక్రయాల ద్వారా వచ్చే సొమ్ము రెండు ముఠాల మధ్య పంచుకుంటున్నట్లు నిందితుల యూపీఐ లావాదేవీల ఆధారంగా గుర్తించారు. అహ్మదాబాద్‌కు చెందిన అనిల్, సతీష్‌లు సమీప బంధువులు. విజయవాడలో విస్తరించిన నెట్‌వర్క్‌లో నిందితురాలు శారదతోపాటు ఆమె భర్త, ప్రధాన నిందితురాలు సరోజిని సోదరుడు కూడా పాలుపంచుకున్నట్లు తేలింది.

నాలుగు బృందాలతో: ఈ కేసులో మూలాలు దిల్లీ, ముంబయి, అహ్మదాబాద్ నగరాల్లో ఉండడంతో పోలీసులు అక్కడికి వెళ్లి ఛేదించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అనిల్, సతీష్, కవిత, నూరి కోసం ఈ నగరాలకు ప్రత్యేకబృందాలు రెండురోజుల్లో బయలుదేరనున్నాయి. నిందితుల అరెస్టుతోపాటు ఎక్కడి నుంచి పిల్లలను తీసుకొచ్చారో చూసి.. వీలైతే ఆ తల్లిదండ్రులను కలిసేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు.

‘స్వచ్ఛ సర్వేక్షణ్’ అవార్డుల సాధనే లక్ష్యం

- నగరాలు, పట్టణాల్లో పరిశుభ్రతపై దృష్టి
- నాలుగు నెలలపాటు ప్రత్యేక డ్రైవ్

ఈనాడు, అమరావతి: కొత్త ఏడాదిలో నగరాలు, పట్టణాలు స్వచ్ఛతను సంతరించుకోనున్నాయి. జనవరి నుంచి నాలుగు నెలలపాటు పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పుర, నగరపాలక సంస్థలు పని చేయనున్నాయి. క్రమపద్ధతిలో పరిశుభ్రతను పెంచాలని భావిస్తున్నాయి. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడంతోపాటు కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో ఏటా ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ఈసారి రాష్ట్రానికి ఎక్కువ వచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఘనవ్యర్థాల నిర్వహణ నుంచి పరిశుభ్రత వరకు ఒక్కో నగరం, పట్టణం వివిధ విభాగాల్లో మొత్తం 10,000 మార్కులు సాధించేలా వాటి మధ్య అంతర్గత పోటీ పెడుతున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు స్వచ్ఛ కార్యక్రమాలను సమీక్షిస్తారు. గత ఏడాది ఐదు నగరపాలక సంస్థలు, ఆరు పురపాలక సంఘాలు స్వచ్ఛ సర్వేక్షణ్-2025 అవార్డులు సాధించాయి. ఈసారి మరిన్ని అవార్డులు దక్కాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలతో పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కార్యాచరణ రూపొందించింది. ముఖ్యమంత్రి సైతం నెలలో మూడో శనివారం స్వచ్ఛ కార్యక్రమంలో పాల్గొంటారు. స్వచ్ఛత ప్రాధాన్యం వివరిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తారు.

హడావుడి పనులకు చెల్లుచీటీ

- స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల కోసం ఏటా డిసెంబరు నుంచి పుర, నగరపాలక సంస్థలు హడావుడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రణాళిక లోపించడంతో నాలుగైదు నగరాలు, పట్టణాలే వీటిని దక్కించుకుంటున్నాయి. ఈసారి అన్ని నగరాలు, పట్టణాలకూ ఇందులో భాగం కల్పిస్తున్నారు. కేంద్రం నిర్దేశించిన ప్రమాణాల మేరకు స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించేలా సన్నద్ధం చేస్తున్నారు.
- ఏటా ఏప్రిల్‌లో కేంద్ర అధికార బృందాలు రాష్ట్రంలో పర్యటించి స్వచ్ఛ కార్యక్రమాలను పరిశీలిస్తుంటాయి. నిర్దేశించిన ప్రమాణాల మేరకు పనులు చేస్తున్నారో లేదో అధికారులు విశ్లేషిస్తారు. ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తారు. దిల్లీ నుంచే ప్రజలకు నేరుగా ఫోన్లు చేసి తెలుసుకుంటారు. ప్రత్యక్ష పరిశీలన, ఫోన్ల ద్వారా చేసే ప్రజాభిప్రాయ సేకరణ ఆధారంగా మార్కులు కేటాయించి అవార్డులకు ఎంపికచేస్తారు.

అంతర్గత పోటీలతో ఫలితాలు

- స్వచ్ఛ కార్యక్రమాలపై పుర, నగరపాలక సంస్థల మధ్య అంతర్గత పోటీ వల్ల మంచి ఫలితాలొస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కేంద్రబృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలించే అంశాల ఆధారంగా నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దనున్నారు. 12 విభాగాల్లో మార్కులు కేటాయించనున్నారు.
- ఏప్రిల్ నాటికి నిర్దేశించిన ప్రమాణాల మేరకు పూర్తి స్థాయిలో స్వచ్ఛ కార్యక్రమాల అమలుతో కేంద్రబృందాల పరిశీలనలో తగినన్ని మార్కులు సాధించవచ్చని అధికారులు భావిస్తున్నారు.



ప్రసంగాల సంపుటిని ఆవిష్కరిస్తున్న రవీంద్రకుమార్ జైన్, మైత్రి చౌదరి, సతీష్ కుమార్ తదితరులు

సామాజిక అభివృద్ధితోనే దేశ ప్రగతి

అఖిలభారత సామాజిక శాస్త్ర సదస్సులో వక్తలు

తుళ్లూరు, న్యూస్‌టుడే: సామాజిక స్థితిగతులను అర్థం చేసుకొని ఉత్తమ జీవన విధానం అలవర్చుకుంటే ప్రతి రంగంలోనూ విజయావకాశాలను అందిపుచ్చుకోవచ్చని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త రవీంద్రకుమార్ జైన్ తెలిపారు. సామాజిక అభివృద్ధితోనే దేశప్రగతి సాధ్యమవుతుందన్నారు. దేశంలోని సామాజిక శాస్త్రవేత్తలను ఒకే వేదికపైకి తెచ్చి, ఈ రంగంపై సమీక్షించడమే లక్ష్యంగా ఇండియన్ సోషియాలాజికల్ సొసైటీ నిర్వహిస్తున్న 50వ అఖిలభారత సామాజికశాస్త్ర సదస్సు- 2025 ఆదివారం అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వందేళ్లలో భారత్ సోషియాలజీ స్థితిగతులపై డా.అబా చౌహాన్ రాసిన పుస్తకం, ‘మైగ్రేషన్ అండ్ మొబిలిటీ’ పుస్తకం, మాజీ ఎంపీ డా.యలమంచిలి శివాజీ రచించిన సామాజికరంగ ప్రసంగాల సంపుటిని వర్సిటీ వీసీ సతీష్‌కుమార్, ఆర్.కె.జైన్, సొసైటీ అధ్యక్షులు మైత్రి చౌదరి ఆవిష్కరించారు. అనంతరం అతిథులను వీసీ సతీష్‌కుమార్ సత్కరించారు. సదస్సుకు సొసైటీ కార్యదర్శి శ్వేతా ప్రసాద్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆర్.ప్రేమ్‌కుమార్, డీన్ డాక్టర్ విష్ణుపథ్, సామాజిక శాస్త్రవేత్తలు హాజరయ్యారు.

బెంగళూరులో 3 డ్రగ్స్ తయారీ కేంద్రాల గుట్టురట్టు

రూ.56 కోట్ల విలువైన మోఫెడ్రోన్, ముడిసరకు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను పరిశీలిస్తున్న మహారాష్ట్ర పోలీసులు

బెంగళూరు(యశ్వంతపుర), న్యూస్‌టుడే: మహారాష్ట్ర పోలీసులు బెంగళూరులో చేసిన దాడుల్లో మత్తుపదార్థాల తయారీ కేంద్రాల రాకెట్ బయటపడింది. నగర పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే ఈ సోదాలు జరగడం గమనార్హం. శనివారం రాత్రి స్థానిక గొల్లహళ్లి, యరప్పనహళ్లి, కణ్ణూరు ప్రాంతాల్లో జరిగిన ఈ దాడుల్లో మూడు తయారీ కేంద్రాల నుంచి రూ.56 కోట్ల విలువైన 4 కిలోల మోఫెడ్రోన్ అనే మత్తు పదార్థాన్ని మహారాష్ట్ర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 17 కిలోల ఇతర మాదకద్రవ్యాలు, యంత్రాలు, డబ్బాలు, లిక్విడ్ సీసాలూ స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన రమేష్ యాదవ్, మల్ఖాన్ రామ్‌లాల్ బిష్ణోయిలను అరెస్టుచేశారు. నిందితులు ఇక్కడ డ్రగ్స్ తయారుచేసి వాటిని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. వచ్చిన నగదుతో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూమి కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల మహారాష్ట్ర మాదకద్రవ్యాల నియంత్రణ దళం పోలీసులు అబ్దుల్ ఖాదిర్ షేక్ అనే పెడ్లర్‌ను అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు బెళగావి నివాసి ప్రశాంత్ యల్లప్ప పాటిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆ విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ దాడులు జరిగాయి. ఈ ఘటనతో అప్రమత్తమైన నగర పోలీసులు ఇలాంటి కేంద్రాలు ఇంకా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

రాష్ట్రానికి 750 విద్యుత్ బస్సులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి పీఎం-ఈబస్ సేవ పథకం కింద 750 విద్యుత్ బస్సులను కేంద్ర పట్టణ, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ కేటాయించిందని ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. అందులో 150 బస్సులను విశాఖ నగరంలో వినియోగించాలని నిర్ణయించినట్లు తెలిపింది. ఆపరేటర్లను గుర్తించేందుకు వీలుగా ఆర్టీసీకి లెటర్ ఆఫ్ అవార్డు జారీచేసినట్లు పేర్కొంది.

సామాజిక బాధ్యతగా వెయ్యికిపైగా వినతులు

జనం సమస్యలపై అలుపెరగక గళం వినిపిస్తున్న రామాంజనేయులు

కోసూరుపాలెం(మోపిదేవి), న్యూస్‌టుడే: సాధారణంగా చాలామంది ఊరి సమస్యలు మనకెందుకులే అని తప్పించుకొనే ప్రయత్నంచేస్తారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండల పరిధిలోని కోసూరుపాలెం పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు దీనికి కాస్త భిన్నం. ఆయనకు ఇలాంటి సమస్యలు కంటపడినా, చెవినపడినా వాటి పరిష్కారానికి వంద శాతం ప్రయత్నం చేస్తారు. 2001 నుంచి ఇప్పటి వరకు ఆయన ఒక్కరే మండలంలోని వివిధ సమస్యలపై పరిష్కారం కోరుతూ 1008 వినతిపత్రాలు అధికారులు, ప్రజాప్రతినిధులకు అందించారు. నిజానికి స్వదస్తూరితో వినతిపత్రం రాయడం కూడా రాదాయనకు. సమస్యను తనకు తెలిసిన వారికి వివరించి వినతిపత్రాలు రాయించుకుంటారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఆ మండలంలో ఏదైనా గ్రామానికి పర్యటనకు వచ్చినప్పుడు వారిని కలిసి వినతిపత్రాలు అందిస్తుంటారు. ప్రతి సోమవారం నిర్వహించే ‘మీ కోసం’తో పాటు అధికారులు అప్పుడప్పుడు నిర్వహించే డయల్ యువర్ కార్యక్రమాలను వినియోగించుకొని సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారు. ఇప్పటివరకు అందించిన వినతుల్లో 35శాతం వరకు పరిష్కారం కావడం రామాంజనేయులు దృఢ సంకల్పానికి, కార్యసాధనకు నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. కోసూరుపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డును బీటీ వేసి అభివృద్ధి చేయడం, మోపిదేవి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్త ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, మోపిదేవిలో తూములు వేసి రోడ్డుపై మురుగునీరు పారకుండా చేయడం.. ఇలా ఎన్నో సమస్యలు ఆయన వినతులతో పరిష్కారానికి నోచుకున్నాయి.



మోపిదేవి జడ్పీ ఉన్నత పాఠశాలలో సురక్షిత తాగునీటి ప్లాంట్ పాడైపోయిందని కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న రామాంజనేయులు



మోపిదేవి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సురక్షిత శుద్ధజల యంత్రం



మోపిదేవిలో రైతుబజారు ఏర్పాటుపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తూ..



వైకాపా పాలనలో తవ్వి వదిలేసిన కోసూరుపాలెం ఆర్‌అండ్‌బీ రహదారి



రామాంజనేయులు ఇచ్చిన వినతులతో కూటమి ప్రభుత్వంలో వేసిన రోడ్డు

అమృతమూర్తికి అశ్రునివాళి

అపారమైన ప్రేమ.. అంతులేని ఆప్యాయత.. అందరి యెడల ఆదరణతో ఆదర్శ గృహిణిగా, మాతృ మూర్తిగా క్రమశిక్షణ, ఉన్నత విలువలు మాకు నేర్పి..
మా జీవన ప్రస్థానంలో అనుక్షణం మా వెన్ను తట్టి.. మమ్ములను ప్రోత్సహించి మా భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన మీరు మా నుండి భౌతికంగా దూరమైననూ
మీ మధుర స్మృతులను మరువలేము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...అంజలి ఘటిస్తున్నాము.



1926 — 2025

కీ॥శే॥ కంభంపాటి వెంకట నరసమ్మ గారు
(కీ॥శే॥ కంభంపాటి రాజారావు గారి ధర్మపత్ని)
పెద ఆవుటపల్లి, కృష్ణా జిల్లా

కుమారుడు - కోడలు
కంభంపాటి వెంకటేశ్వరరావు - ప్రమీలారాణి

వియ్యంకులు - వియ్యపురాండ్రు
నాగుమోతు వెంకటేశ్వరరావు (లేటు) - సీతారావమ్మ (లేటు)
అట్లూరి పురుషోత్తం (లేటు) - లలితాంబ
మద్దుకూరి గోవర్ధనరావు - ధనలక్ష్మి (లేటు)

మనుమరాండ్రు : నాగుమోతు లక్ష్మి - రాజా
అట్లూరి లావణ్య - భాషాపతి (లేటు)

మనుమడు : కంభంపాటి కళ్యాణ్ - అనిత

కుమార్తె - అల్లుడు: పుసులూరి శశిరేఖ - నారాయణరావు (లేటు)
మనుమరాలు : మైనేని పద్మజ - సాంబశివరావు (లేటు)
మనుమడు : మైనేని హరీష్

కుమారుడు - కోడలు
కంభంపాటి రామమోహనరావు - లక్ష్మి
పార్లమెంట్ మాజీ సభ్యులు (రాజ్యసభ), టి.డి.పి. జాతీయ ప్రధాన కార్యదర్శి

వియ్యంకులు - వియ్యపురాండ్రు
సబ్బినేని సురేంద్ర - శాంతిశ్రీ
కొల్లా సుబ్బారావు - రమాదేవి

మనుమడు : కంభంపాటి జయరామ్ - శివాని
మనుమరాలు : కొల్లా స్వాతి - శ్రీకాంత్

మునిమనుమలు : కంభంపాటి కౌశిక్, కంభంపాటి రామ్, కొల్లా ధ్రువన్, నాగుమోతు టినేష్
మునిమనుమరాండ్రు : కంభంపాటి అనిక, డా॥ అట్లూరి లిఖితప్రియ, వల్లభనేని భవాని - భగత్

పెద్దకర్మ : ది. 29-12-2025 సోమవారం ఉదయం 11 గంటలకు గన్నవరం రావ్‌ఫిన్ వెంచర్స్ భార్గవి నగర్‌లోని, S.M. కన్వెన్షన్ నందు జరుపబడును. కావున తెలియజేయడమైనది

(c) eenadu

EENADU Epratibha Super COMBO
SSC APPSC RRB TGPSC BANK
మీ కలల కొలువును సాధించండి!
SCAN HERE
www.epratibha.net | 800 800 1640

ఈనాడు

తాజా బిజినెస్ వార్తలు, ఆర్థిక సందేహాల నివృత్తికి సిరి చూడండి
www.eenadusiri.net

విజయవాడ 29-12-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 139
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



సోలార్ పవర్డ్ చికీపీ నిప్పింగ్ యంత్రం

శనగ కొనలు తుంచేందుకు 'సౌర' కత్తెర

అన్నదాత ఆవిష్కరణతో నిప్పింగ్ కష్టాలకు విముక్తి

ఈనాడు డిజిటల్, తిరుపతి

శనగ పంట సాగు చేసే రైతులు సాధారణంగా 'నిప్పింగ్' (కొనలు తుంచడం) చేస్తుంటారు. మొక్క ఎత్తు పెరగకుండా, పక్క కొమ్మలు అధికంగా వచ్చి దిగుబడి పెరగాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి. ఇందుకు ఎక్కువ మంది కూలీలు, ఎంతో సమయం వెచ్చించాలి. ఈ పనిని ఇప్పుడు ఒక చిన్న యంత్రం పూర్తి చేస్తోంది.

కర్ణాటకలోని బిజాపుర్ జిల్లాకు చెందిన 44 ఏళ్ల గిరీష్ అనే రైతు ఈ 'సోలార్ పవర్డ్ చికీపీ నిప్పింగ్ మెషీన్'ను తయారు చేశారు. ఇది కేవలం మొక్కల కొనలను తుంచడమే కాదు, శనగ ఆకులను కూడా సేకరిస్తుంది. దీనివల్ల అటు కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా, సేకరించిన ఆకులను ఇతర అవసరాలకు వాడుకునే వెసులుబాటు కలుగుతుంది. ఈ యంత్రం పూర్తిగా సౌర శక్తితో నడుస్తుంది. దీనిపై అమర్చిన 100 వాట్ల సౌర ఫలక ద్వారా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. ఇది యంత్రంలోని 6 డీసీ మోటార్లకు శక్తిని అందిస్తుంది. మూడు వరుసల్లో అమర్చిన 18 పదునైన బ్లేడ్లు యంత్రం కదులుతున్నప్పుడు వరుస క్రమంలో శనగ మొక్కల కొనలను కత్తిరిస్తాయి. అలా ఒకేసారి మూడు వరుసల్లో మొక్కల కొనలను తుంచుకుంటూ యంత్రం సాగిపోతుంది.

సౌర శక్తి: 100 వాట్ల సామర్థ్యం గల సోలార్ ప్యానెల్.

పని సామర్థ్యం: గంటకు 0.20 నుంచి 0.23 హెక్టార్ల విస్తీర్ణంలో నిప్పింగ్.

యంత్రం సామర్థ్యం

చక్రాల వేగం: గంటకు 2.00 నుంచి 2.20 కి.మీ. వరకు.



గిరీష్

నిర్మాణం 6 మోటార్లు, 18 బ్లేడ్లు.. ప్రతి మోటారుకు 3 బ్లేడ్ల అనుసంధానం.

తగ్గిన శ్రమ

కూలీల కొరతతో సతమతమవుతున్న రైతులకు ఈ యంత్రం ఉపయుక్తంగా ఉంటుంది. ఒకప్పుడు రోజులు పట్టే పనిని ఇప్పుడు కొద్ది గంటల్లోనే, పైసా ఇంధన ఖర్చు లేకుండా పూర్తి చేసుకోవచ్చని గిరీష్ నిరూపించారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సహకారంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. నల్లరేగడి నేలల్లోనూ అత్యంత సమర్థంగా ఈ యంత్రం పనిచేస్తుంది.

ఆటల్లో గెలిచాం.. అంతరిక్షంలో మెరిశాం

మన్ కీ బాత్‌లో ప్రధాని వెల్లడి

నరసాపురం లేస్ ఉత్పత్తులను ప్రత్యేకంగా ప్రస్తావించిన మోదీ

లోపలి పేజీల్లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గ్రుడ్ల రిటైల్ ధర ₹ 96	ఫారం దగ్గర లైవ్ బర్డ్	135 కిలో	డ్రెస్సేడ్ స్కిన్‌తో	235 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	162 కిలో	స్కిన్‌లెస్	267 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

నేటి అర్ధరాత్రి తర్వాత.. తెరుచుకోనున్న వైకుంఠ ద్వారాలు

తొలి 3 రోజులు టోకెన్లున్న భక్తులకే అనుమతి

తిరుమల వ్యాప్తంగా తితిదే సుందరీకరణ

లోపలి పేజీలో

తొలిరోజు 20 గంటలపాటు వైకుంఠద్వార దర్శనం


'ఈనాడు'తో తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి

అవి కల్తీసారా మరణాలే

సహజ మరణాలు కావు ● జంగారెడ్డిగూడెం మృతుల శరీరాల్లో మిథైల్ ఆల్కహాల్ నమూనాలు

దర్యాప్తు సంస్థలపై నాటి వైకాపా పాలకుల ఒత్తిళ్లు ● ఈ కేసుల్ని ఐపీసీ 304 (2) కిందకు మార్చి విచారించాలి

ఈనాడు - అమరావతి



ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన సిట్

వైకాపా ప్రభుత్వ హయాంలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగినవి సహజమరణాలు కావని, మిథైల్ ఆల్కహాల్ కలిసిన సారా తాగడం వల్లే వారంతా ప్రాణాలు కోల్పోయారని సిట్ తేల్చింది. మృతుల శరీరాల్లో ప్రమాదకర మిథైల్ ఆల్కహాల్ నమూనాలు ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికల విశ్లేషణలో స్పష్టమైనట్లు పేర్కొంది. అప్పట్లో అనుమానాస్పద మరణాలుగా నమోదైన ఈ కేసులను కల్పబుల్ హోమిసైడ్ నాట్ ఎమౌంటింగ్ టూ మర్డర్ (ఐపీసీ 304 (2)) సెక్షన్ కిందకు మార్చి దర్యాప్తు చేయాలని నిర్ణయించింది. నాటుసారాలో మిథైల్ ఆల్కహాల్ కలిపితే.. మరణాలకు దారితీస్తుందని తెలిసే, వ్యాపారులు విక్రయించారని వెల్లడించింది. వైకాపా హయాంలో ఈ కేసుల దర్యాప్తులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారి వైఫల్యమూ ఉందని గుర్తించింది. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్ నేతృత్వంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సహాయ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్, కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరరావు సభ్యులుగా ఏర్పాటైన సిట్ ఈ మేరకు తాజాగా ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు నివేదికలో ప్రధానాంశాలివి.

జంగారెడ్డిగూడెంలో 2022 మార్చి 9 నుంచి 12 వరకు 25మంది ఒకే లక్షణాలతో మృతిచెందారు. వీరంతా చనిపోవడానికి కొద్ది గంటల ముందు నాటుసారా తాగారు. ఈ మరణాలపై జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదులందగా.. అనుమానాస్పద మృతి కింద అప్పట్లో 4 కేసులు నమోదుచేశారు. తర్వాత ఉద్దేశపూర్వకంగానే వాటిని దర్యాప్తు చేయలేదు. మృతుల శరీరాల నుంచి నమూనాలు తీసుకుని ఫోరెన్సిక్ ప్రయోగశాలలకు పంపినా.. ఆ నివేదికలు బయటకు రాకుండా తొక్కిపెట్టారు. మృతుల కుటుంబీకులు, ఎక్సైజ్ అధికారులు, సారా విక్రేతలు సహా ఎవరినీ విచారించలేదు. అప్పటి పాలకుల ఒత్తిడికి పోలీసులు తలొగ్గి దర్యాప్తును అటకెక్కించారు.

సైకలాజికల్ అటాప్సీతో నిర్ధారణ

'మద్యం తాగడానికి ముందు బాధితులు ఎలా ఉన్నారు? తాగాక ఎలాంటి లక్షణాలతో ఇబ్బంది పడ్డారు? గతంలో వారికి అనారోగ్య సమస్యలు న్నాయా? మద్యం తాగే అలవాటు ఎన్నాళ్లుగా ఉంది? గతంలో సారా తాగినప్పుడు వాంతులు, విరేచనాలు, తల తిరగడం లాంటి అనుభవాలు ఉన్నాయా?' అని మృతుల కుటుంబీకుల్ని సిట్ ప్రశ్నించగా, అంతకుముందు తమవారిలో అలాంటి లక్షణాలేవి చూడలేదని వారంతా వాంగ్మూలాలిచ్చారు. సైకలాజికల్ అటాప్సీలో భాగంగా ఈ వివరాలు సేకరించారు. వీటన్నింటినీ విశ్లేషించాక అవి సహజ మరణాలు కావని తేల్చారు.

సహజ మరణాలంటూ జగన్ సర్టిఫికెట్లు

నాటుసారా తాగిన తర్వాత బాధితులంతా.. కడుపులో తీవ్రమైన నొప్పి, కళ్లు మసకబారిపోయి చూపు కోల్పోవడం, వాంతులు, తల తిరగడం, ఆయాసం, ముఖమంతా (మిగతా 3లో)

మంచి బ్రాండ్లు దొరక్క..

వైకాపా పాలనలో నాణ్యమైన, ప్రాచుర్యం పొందిన మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకపోవడం, నాసిరకం బ్రాండ్లను అధిక ధరలకు కొనాల్సి రావడంతో కూలీలు, పేదలు నాటుసారాకు అలవాటు పడ్డారు. దీంతో కల్తీ, నాటుసారా తయారీ కేంద్రాలు పెద్ద ఎత్తున ఏర్పడ్డాయి. వాటిని అధికార యంత్రాంగం నిర్మూలించలేదు.

● పారిశ్రామిక అవసరాలకు వాడే మిథైల్ ఆల్కహాల్ దుర్వినియోగం కాకుండా, దాన్ని రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయాలి. తద్వారా ఇది పక్కదారి పట్టకుండా చూడొచ్చు.



కోనేరు హంపి అర్జున్ ఇరిగేశి

హంపి, అర్జున్ కంచు మోత

ప్రపంచ ర్యాపిడ్ చెస్

దోహా: తెలుగు గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశి ప్రపంచ చెస్‌లో మెరిశారు. చక్కని ఆటతో ఫిడే ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో కాంస్య పతకాలు సాధించారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగిన హంపి.. టైటిల్ నిలబెట్టుకోవడానికి ఆఖరిదాకా పోరాడింది. 11 రౌండ్లలో 8.5 పాయింట్లతో జు జినెర్ (చైనా), అలెగ్జాండ్రా గోర్యాచ్‌కినా (రష్యా)తో ఉమ్మడిగా అగ్రస్థానంలో నిలిచింది. కానీ టైబ్రేక్ స్కోరులో హంపి మూడో స్థానంలో నిలిచింది. అలెగ్జాండ్రా గోర్యాచ్‌కినా ఛాంపియన్‌గా నిలవగా.. జినెర్‌కు రజతం దక్కింది. ఓపెన్ విభాగంలో అర్జున్ సత్తా చాటాడు. 9.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ప్రపంచ చెస్‌లో అర్జున్‌కు ఇదే తొలి పతకం.

వివరాలు ఛాంపియన్ లో..

ముగిసిన నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్



మహిళల సింగిల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన తన్వి పత్రి (ఒడిశా), విజేతగా నిలిచిన సూర్యచరిష్మ తమిరి (ఏపీ)లకు పతకాలు, నగదు అవార్డులు అందజేసిన రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు ద్వారకానాథ్, బాయ్ సెక్రటరీ సంజయ్ మిశ్రా, శాప్ వీసీఎండీ భరణి, ఛాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అంకమ్మచౌదరి

- 28 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల క్రీడాకారుల హాజరు
- 520 మంది క్రీడాకారులతో 543 మ్యాచ్‌ల నిర్వహణ
- ముగింపు వేడుకల్లో పాల్గొన్న పుల్లెల గోపీచంద్, సాత్విక్ సాయిరాజ్

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు: విజయవాడలో జరుగుతున్న '87వ నేషనల్ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025' పోటీలు ఆదివారం ముగిశాయి. ఐదురోజుల పాటు జరిగిన ఈ క్రీడల్లో 28 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు రైల్వేస్, ఆర్బీఐ, కాగ్, ఎల్ఐసీ, ఎఫ్‌సీఐ నుంచి సుమారు 520 మంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదురోజులు కలిపి సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లలో 543 మ్యాచ్‌లు జరిగాయి. చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీల్లో పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన పోటీలకు సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, జాతీయ చీఫ్‌కోచ్ పుల్లెల గోపీచంద్, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ హాజరయ్యారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఈ పోటీలకు ఆతిథ్యం ఇచ్చింది. (మిగతా 3లో)



అయోధ్య రామాలయంలో బాలరాముణ్ని దర్శించుకుంటున్న సీఎం చంద్రబాబు

అత్యుత్తమ పాలనకు రామరాజ్యమే కొలమానం

అయోధ్యలో బాలరాముణ్ని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అత్యుత్తమ పాలనకు రామరాజ్యమే కొలమానమని.. అయోధ్యలో శ్రీరామ దర్శనం తనకు కొత్త శక్తిని ఇచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'రాముడు పాటించిన విలువలు కాలానికి అతీతంగా స్ఫూర్తినిస్తుంటాయి. సుపరిపాలనకు నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తాయి' అని కొనియాడారు. చంద్రబాబు ఆదివారం అయోధ్యలో బాలరాముణ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ 'అయోధ్య రామమందిరం మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక. ఎన్నో వివాదాల తర్వాత ఆలయం నిర్మితమైంది. దేశ ప్రజల కల సాకారమైంది. భారత ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య రామాలయం మారింది' అని వివరించారు. దేశంలోని ఇతర దేవాలయాలకు అయోధ్య (మిగతా 3లో)

కొండ కోనల్లోనూ.. 'సెల్' మోహనరంగ

- రాష్ట్రంలో సిగ్నల్ సమస్యలకు చెక్ పెట్టడంపై ప్రభుత్వ దృష్టి
- కొత్తగా 707 మొబైల్ టవర్ల ఏర్పాటుకు కసరత్తు

ఈనాడు, అమరావతి: హలో.. హలో.. సరిగా వినిపిస్తోందా.. కొంచెం ఆగు.. బయటకు వస్తున్నా.. సిగ్నల్ సరిగా లేదు.. రాష్ట్రంలోని కొన్ని గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు ఎదురవుతున్న సమస్య ఇది. ప్రపంచం 5జీ సాంకేతికతతో పరుగులు పెడుతుంటే.. మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నేటికీ పూర్తిస్థాయిలో సెల్ సేవలు అందట్లేదు. ఈ సిగ్నల్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో సంతృప్తస్థాయిలో సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తేనుంది. ఇందుకోసం కొత్తగా 707 సెల్ టవర్లను ఏర్పాటుచేస్తోంది. 'డిజిటల్ భారత్ నిధి' పథకం కింద కేంద్రం కొత్త సెల్‌టవర్ల ఏర్పాటుకయ్యే వ్యయాన్ని భరిస్తుండగా, అందుకోసం స్థలాన్ని రాష్ట్రప్రభుత్వం సమకూరుస్తుంది. ఈ పథకం కింద ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌తో పాటు ప్రైవేటు సంస్థలు జియో, ఎయిర్‌టెల్ టవర్లు ఏర్పాటు చేయనున్నాయి.

మారుమూల ప్రాంతాలకు 4జీ నెట్‌వర్క్

మారుమూల ప్రాంతాల్లో సిగ్నళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సెల్‌ఫోన్ల సంఖ్య పెరగడంతో ఇప్పటికే ఉన్న టవర్ల సామర్థ్యం సరిపోవడం లేదు. అలాంటిచోట్లా సిగ్నల్ సమస్య ఎదురవుతోంది. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాలతో పాటు తరచూ (మిగతా 3లో)



అల్లూరి జిల్లాలో టవర్ల ఏర్పాటుకు ఎదురవుతున్న సమస్యలు

సమస్య	టవర్ల సంఖ్య
అటవీ భూములు	6
రోడ్ల అనుసంధాన ఇబ్బందులు	49
రాష్ట్ర ప్రభుత్వ అనుమతుల కోసం	14


మిగిలిన 31 లొకేషన్లు రెవెన్యూకి చెందినవి. వాటిలో టవర్ల ఏర్పాటుకు ఇబ్బంది లేదు.

ఆ రెండూ ఆసియా హైవేలు

అంతర్జాతీయ గుర్తింపు ఉన్న ఆ మార్గాలు వెళ్లేది తెలుగు రాష్ట్రాల మీదుగానే

ఈనాడు - అమరావతి

తెలుగు రాష్ట్రాల మీదుగా వెళ్లే రెండు జాతీయ రహదారులకు.. ఆసియా హైవే(ఏహెచ్)లుగా కూడా గుర్తింపు ఉందనేది మీకు తెలుసా. వివిధ దేశాల మీదుగా సరకు రవాణా చేసేందుకు, రోడ్డు మార్గంలో పలు దేశాలు చుట్టేయాలనుకునే పర్యాటకులు సులువుగా గుర్తించేందుకు వీలుగా ఆసియా హైవేల నంబర్లు దోహదపడతాయి. ఆసియా దేశాలతోపాటు, కొన్ని ఐరోపా దేశాలు కలిపి మొత్తం 32 దేశాల మీదుగా రాకపోకలు సాగించేందుకు ఆసియా హైవేల రోడ్ నెట్‌వర్క్ రూపొందింది. ఇది 1.40 లక్షల కి.మీ. నెట్‌వర్క్. అయితే ఈ హైవేల మీదుగా ఆయా దేశాలకు రోడ్డు మార్గంలో ప్రయాణించాలంటే పాస్‌పోర్ట్‌తోపాటు వీసా ఉండాల్సిందే. ఆసియా హైవేల్లో 45, 43 తెలుగు రాష్ట్రాల మీదుగా వెళుతున్నాయి.



ఏపీ మీదుగా ఆసియా హైవే-45..

● కోల్‌కతా నుంచి భువనేశ్వర్, విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు మీదుగా చెన్నై వరకు జాతీయ రహదారి-16 ఉంది. దీనిని ఆసియా హైవే(ఏహెచ్)-45గా పిలుస్తారు. మళ్లీ చెన్నై నుంచి వేలూరు మీదుగా కృష్ణగిరి వరకు ఉన్న జాతీయ రహదారి-48ని కూడా ఏహెచ్-45గా పిలుస్తారు. అంటే మొత్తంగా కోల్‌కతా నుంచి కృష్ణగిరి వరకు ఆసియా హైవే-45 ఉంది.

ఏహెచ్-1కి అనుసంధానంగా..



కాకినాడ జిల్లా తుని సమీపంలో ఏహెచ్-45

● ఏహెచ్-45 అనేది.. ఏహెచ్-1కి అనుసంధానంగా ఉంటుంది. వాస్తవానికి ఏహెచ్-1 జపాన్‌లోని టోక్యో నుంచి మొదలై.. దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, చైనా, వియత్నాం, కాంబోడియా, థాయ్‌లాండ్, మయన్మార్, బంగ్లాదేశ్, భారత్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, ఇరాన్ మీదుగా తుర్కియే-బల్గేరియా అంతర్జాతీయ (మిగతా 3లో)



ఐఎన్ఎస్ వాఘ్‌శీర్‌లోకి వెళుతూ అభివాదం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము. చిత్రంలో నౌకాదళ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి


నేవీ నైపుణ్యానికి నిదర్శనం ఐఎన్ఎస్ వాఘ్‌శీర్

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రశంస

గంటపాటు జలాంతర్గామిలో ప్రయాణించిన ప్రథమ పౌరురాలు


3లో

(c) eenadu



ఇది ఓ మలయాళీ వండిన తెలుగు పులస..

చేపలందు పులస చేప రుచి వేరయా అంటారు. ఓ మలయాళీ 'పులస' తెలుగు సాహిత్య నదిలోకి ఎదురీదుతూ వచ్చింది. హైదరాబాద్‌లో గత పది రోజులుగా జరుగుతున్న పుస్తక ప్రదర్శనలో కొలువుదీరిన లక్షల పుస్తకాల్లో ఈ 'పులస' ఆకట్టుకుంటోంది. దీని రచయిత పేరు.. 'హరీష్ ఆర్. మేనన్'. ఈ పేరు చూస్తే మలయాళీలా ఉందే! ఒక మలయాళీ తెలుగు పుస్తకం రాశారా? లేక ఆయన పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారా? అనే సందేహాలు తలెత్తుతాయి. అయితే ఇది అచ్చ తెలుగు పుస్తకమే. ఇప్పటికే ఈ మేనన్.. 'ఎక్స్'లో వందల తెలుగు కథలు రాసి గుర్తింపుపొందారు. వాటిలో కొన్నింటిని గుదిగుచ్చి 'పులస' పేరుతో పుస్తక రూపంలోకి తెచ్చారు. పుస్తకాలు చదవడం తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఒక మలయాళీ రాసిన ఈ పుస్తకం 12 వేల కాపీలకు పైగా అమ్ముడైందంటే విశేషమే కదా! ఈ నేపథ్యంలో 'ఈనాడు' ఆయనను పలకరించింది. మలయాళీ పులస తెలుగు నదిలోకి ఎలా ఎదురీదుతూ వచ్చిందని అడగగా.. తన ప్రయాణాన్ని ఇలా పంచుకున్నారు.



మలయాళీ అయిన నేను తెలుగులో కథలు రాసే స్థాయికి చేరానంటే అందుకు మా తెలుగు మాస్టారితో పాటు 'ఈనాడు' పత్రిక ముఖ్య కారణం. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీ కృష్ణదేవరాయలు అనడంలో, సుందర తెలుగు అని భారతీయార్ కొనియాడడంలో ఆశ్చర్యమేమీ లేదు. తెలుగులో ఏ భాషకూ తీసిపోని అద్భుతమైన సాహిత్యం ఉంది. అనేక రచనా ప్రక్రియలు ఉన్నాయి. మలయాళీ అయిన నేను కూడా తెలుగు ఎంతో అందమైన భాష అని అంగీకరిస్తా. తెలుగు మకరందాన్ని ఆస్వాదిస్తూ.. రచయితగా మారా.

పాలక్కాడ్‌లో పుట్టి..

నేను పుట్టింది కేరళలోని పాలక్కాడ్‌లో. సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారాట్.. నాకు పెదనాన్న అవుతారు. మా నాన్న వృత్తి రీత్యా కాంట్రాక్టర్. 80వ దశకంలో స్టీల్ ప్లాంటులో ఒక కాంట్రాక్టు కోసం కుటుంబంతో సహా వచ్చి వైజాగ్‌లో స్థిరపడ్డారు. దీంతో నా విద్యాభ్యాసం విశాఖలోనే మొదలైంది. అయితే నాకు పదేళ్ల వయసు వరకు తెలుగుతో పరిచయం జరగలేదు. ఆరో తరగతిలో తెలుగును రెండో భాషగా ఎంచుకుని అక్షరాలు నేర్చుకున్నా. పెద్దవుతున్న కొద్దీ తెలుగు మీద ఆసక్తి పెరిగింది. ఇంటికి దగ్గర్లో ఉన్న సెలూన్‌కు వెళ్లి రోజూ 'ఈనాడు' పత్రిక చదివేవాడిని. 'ఈనాడు' ఆదివారం అనుబంధంలో పదవినోదంతో తెలుగు మీద పట్టు చిక్కింది. సినిమాలు కూడా భాషతో అనుబంధాన్ని పెంచాయి. యుక్త వయసులోకి వచ్చేసరికి తెలుగు సాహిత్యం మీద ఆసక్తి పెరిగి.. విశ్వనాథ సత్యనారాయణ, కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, చలం, యండమూరి వీరేంద్రనాథ్, యద్దనపూడి సులోచనారాణి లాంటి లబ్ధప్రతిష్ఠుల రచనలు చదవడం మొదలుపెట్టా. బీటెక్ పూర్తి చేసి వేర్వేరు సంస్థల్లో పని చేశా.

ఉద్యోగం పోయి.. రచయితగా మారి..

2020లో ముంబయిలో పనిచేసేవాడిని. కరోనా సమయంలో ఉద్యోగం పోయింది. అప్పటికే నా కుటుంబం పాలక్కాడ్‌కు తిరిగి వెళ్లిపోయినా.. నేను ముంబయి నుంచి హైదరాబాద్‌కు వచ్చేశా. అప్పుడే రచయితగా మారాలన్న ఆలోచన కలిగింది. 'ఎక్స్'లో సరదాగా కథలు రాయడం మొదలుపెట్టా. వాటికి మంచి స్పందన రావడం.. సినీ గేయ రచయిత కిట్టు విస్సాప్రగడ ఒక కథను మెచ్చుకుని రీపోస్ట్ చేయడంతో నాకు ఫాలోవర్లు పెరిగారు. దీంతో మరింత ఉత్సాహంగా కథలు రాయడం మొదలుపెట్టా. ఇప్పటిదాకా ఎక్స్‌లో చిన్నవి పెద్దవి కలిపి 400కు పైగా కథలు రాశా. సినీ రచయితగానూ పని చేశా. సినీ శైలిలో ఉన్న 'పులస' కథకు ఎక్స్‌లో అనూహ్య స్పందన రావడంతో గతేడాది మరో 26 కథలను కలిపి సంకలనంగా తీసుకొచ్చా. ఎక్స్ ఫాలోవర్లు మాత్రమే కాక సాహితీ ప్రియులు ఈ పుస్తకాన్ని ఆదరించారు. నాకెంతో నచ్చిన భాషలో మరిన్ని రచనలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా. ఈటీవీ విన్ 'కథా సుధ'కు నేను రచించిన 'మళ్లీ కొత్తగా' అనే కథ ఎంపికైంది" అని వివరించారు హరీష్ మేనన్.

- ఈనాడు స్పోర్ట్స్ డెస్క్



పీహెచ్‌సీ భవనం వద్ద తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, అధికారులు

తిరుమల నడకదారిలో డిస్పెన్సరీ ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: అలిపిరి నుంచి తిరుమలకు నడిచివెళ్లే మార్గంలో ఏడో మైలు వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఇది తిరుమల నుంచి తిరుపతికి వాహనాల్లో వెళ్తుంటే దిగువ కనుమ దారిలో వస్తుంది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ నడకదారిలోని భక్తులు అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలు వినియోగించుకునేలా ఈ డిస్పెన్సరీలో వసతులు కల్పించినట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీవారి మెట్టుమార్గంలోనూ పీహెచ్‌సీ ఉందని గుర్తుచేశారు. ఈ మార్గంలో రోజూ 20-30 వేల మంది భక్తులు నడుచుకుంటూ వస్తారని, వారికి అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రంలో తక్షణ చికిత్స పొందవచ్చని అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. దిగువ ఘాట్ రోడ్డుకు సమీపంలోనే ఉండటంతో వాహన డ్రైవర్లకూ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తితిదే బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, తితిదే చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.కుసుమకుమారి, సీనియర్ మెడికల్ ఆఫీసర్ ఎస్.కుసుమకుమారి, వీజీవో రామ్‌కుమార్, అశ్విని ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నేటి అర్ధరాత్రి తర్వాత.. తెరుచుకోనున్న వైకుంఠ ద్వారాలు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రం తిరుమల వైకుంఠ ఏకాదశికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక శ్రీవారి ఆలయాన్ని తెరవనున్నారు. స్వామివారికి అర్చకులు పూజా కైంకర్యాలు ఏకాంతంగా నిర్వహించిన అనంతరం.. 1.30 గంటలకు (తెల్లవారితే మంగళవారం) వైకుంఠద్వారాలు తెరచుకోనున్నాయి. మొదట వీఐపీలు, ఉదయం 6 గంటల నుంచి సామాన్యులకు వైకుంఠద్వార దర్శనాన్ని తితిదే ప్రారంభించనుంది. జనవరి 8న రాత్రి 12 గంటల వరకు.. పది రోజులపాటు ఈ దర్శనం కల్పించనుంది.

టైంస్లాట్‌ను బట్టి వేర్వేరుగా ప్రవేశ మార్గాలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం శ్రీవారు ప్రత్యేకంగా స్వర్ణరథంపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ◆ బుధవారం ద్వాదశి సందర్భంగా వేకువజామున స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. ◆ మొదటి మూడు రోజులు డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో టోకెన్లున్న భక్తులనే దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు ఆధార్ కార్డుతో పాటు డిప్‌లో కేటాయించిన టోకెన్ ప్రింట్‌కాపీని తప్పనిసరిగా తీసుకురావాలని తితిదే సూచించింది.

◆ మంగళవారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి ఉదయం 11 గంటల వరకు టైంస్లాట్ టోకెన్ పొందినవారిని కృష్ణతేజ ప్రవేశమార్గం నుంచి, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల స్లాట్‌లో ఉన్నవారిని ఏటీజీహెచ్ నుంచి అనుమతిస్తారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు శిలాతోరణం ప్రవేశ మార్గం ద్వారా భక్తులను ఆలయంలోకి పంపిస్తారు.

◆ జనవరి 2 నుంచి 8 వరకు ఎలాంటి టోకెన్లూ లేకుండా వచ్చే భక్తులకు సర్వదర్శనం కల్పిస్తారు.

◆ ఇప్పటికే జారీచేసిన ఎస్ఈడీ, శ్రీవాణి దర్శన టికెట్లు కలిగిన భక్తులను నిర్దేశిత సమయంలో ఆయా కోటా మేరకు అనుమతిస్తారు. ◆ చివరి మూడు రోజుల్లో స్థానికులకు రోజుకు 5వేల మంది చొప్పున ఇప్పటికే ఈ-డిప్ ద్వారా టోకెన్లు జారీచేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట అష్టలక్ష్ముల అలంకరణ



ప్రధాన ఆలయం ఎదుట సిద్ధమవుతున్న శ్రీరంగనాథ స్వామివారి నమూనా ఆలయం

ఫలపుష్పాలతో సుందర అలంకరణ

వైకుంఠ ఏకాదశి సందర్భంగా సప్తగిరులను తితిదే ప్రత్యేకంగా అలంకరించింది. ఈ పది రోజుల పాటు 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల ఫలాలు, 4 లక్షల కట్ ఫ్లవర్స్‌తో ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను ముస్తాబు చేస్తోంది. విద్యుత్ దీపకాంతులతో దివ్యక్షేత్రం కాంతులీనుతోంది. ప్రధాన ఆలయం వెలుపల శ్రీరంగనాథస్వామి ఆలయ నమూనాను తీర్చిదిద్దారు. ఇందులో అష్టలక్ష్ములు, శ్రీవేంకటేశ్వరస్వామి నమూనాలను కొలువుదీర్చనున్నారు.

తొలిరోజు 20 గంటలపాటు వైకుంఠద్వార దర్శనం

- తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి

ఈనాడు డిజిటల్, తిరుపతి; న్యూస్‌టుడే, తిరుమల: వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు తిరుమలలో భక్తులకు ఏ ఇబ్బందులూ రాకుండా పక్కా ఏర్పాట్లు చేసినట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి వెల్లడించారు. ఆయన ఆదివారం 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ◆ తొలిరోజు ప్రోటోకాల్ దర్శనాలు ముగిసిన వెంటనే స్లాటెడ్ సర్వదర్శనం మొదలవుతుంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత 1.30 నుంచి మంగళవారం రాత్రి 11.45 గంటల వరకు.. 20 గంటల పాటు సామాన్యులకు అవకాశం కల్పిస్తాం. సుమారు 70 వేల మందికి దర్శనం చేయించాలన్నది లక్ష్యం. ఏ రోజు టోకెన్ పొందితే, ఆరోజే దర్శనం చేయించేలా గంటలవారీగా లెక్కలు కట్టి అమలుచేస్తాం. ఇందుకోసం ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వినియోగించనున్నాం. భక్తులు టోకెన్‌లో నిర్దేశించిన సమయానికి, సూచించిన ప్రదేశానికి రావాలి. ◆ వేచి ఉండే భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి, దద్దోజనం తదితర 16 రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నాం. మొదటి మూడు రోజులు 24 గంటలూ అన్నప్రసాదాలు, వేడి పానీయాలు (కాఫీ, టీ, బాదం పాలు), చిన్నపిల్లలకు పాలు సిద్ధంగా ఉంటాయి. నిత్యం 4.90 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచుతున్నాం. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ తగ్గించేందుకు డిజిటల్ పేమెంట్ కియోస్క్‌లు ఏర్పాటు చేశాం. నగదురహితంగా స్లిప్పులు పొంది నేరుగా లడ్డూలు తీసుకోవచ్చు. ◆ పూర్తిగా ఆటోమేటెడ్ సిస్టమ్‌లో గదులు కేటాయిస్తున్నాం. కొత్తగా అందుబాటులోకి వచ్చిన వెంకటాద్రి నిలయం (పీఏసీ -5)లో అద్భుత వసతులున్నాయి. భక్తులు గదుల కోసం వేచి చూడకుండా, ఇక్కడ స్నానాదులు ముగించుకుని తమ స్లాట్ ప్రకారం దర్శనానికి వెళ్తే మంచిది.

మంత్రివర్గ సమావేశం నేడు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సోమవారం జరగనుంది. సచివాలయంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది.

నేడు జిల్లాల పునర్విభజనపై సీఎం సమీక్ష

అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మార్పులు!

ఈనాడు, అమరావతి: అన్నమయ్య జిల్లాలోని మూడు నియోజకవర్గాలను మూడు జిల్లాల్లో కలిపే అంశంపై సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. జిల్లాల పునర్విభజనకు సంబంధించి ఆదివారం సీఎం చంద్రబాబు అధికారులతో మరోమారు సమీక్షించారు. మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో పాటు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, కొన్ని జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లాలోకి రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని, వైఎస్సార్ కడప జిల్లాలోకి రాజంపేట, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లె జిల్లాలోకి రాయచోటి నియోజకవర్గాన్ని చేర్చే ప్రతిపాదనపై చర్చించారు. దీనిపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. చిత్తూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మార్పులు చేర్పులపైనా సీఎం అభిప్రాయాలు తీసుకున్నారు. కొన్ని మార్పులు సూచించారు. దొనకొండ, కురిచేడు మండలాలను కొత్తగా ఏర్పడే మార్కాపురం జిల్లాలో చేర్చాల్సిన అవసరం లేదని, వాటిని ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని నిర్ణయించారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోకి గూడూరు నియోజకవర్గం మొత్తాన్ని చేర్చాలా లేక కొన్ని మండలాలనా? అన్నది పరిశీలిస్తున్నారు. వీటిపై సోమవారం తుది నిర్ణయం ప్రకటించనున్నారు.

పంచాయతీల విభజనకు తాత్కాలిక బ్రేక్

- పాలకవర్గాల పదవీకాలం పూర్తయ్యేవరకు చేయరాదన్న నిబంధన అడ్డు
- వచ్చే నెలలో ప్రారంభం కానున్న జనగణన మరో కారణం
- ఒకట్రెండు రోజుల్లో అధికారిక ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీల విభజన, విలీన ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోనుంది. పాలకవర్గాల పదవీ కాలం ముగిసేవరకు ఇలాంటివి చేపట్టే అవకాశం లేకుండా పంచాయతీరాజ్ చట్టంలో గతంలో చేసిన సవరణలు, కోర్టుల్లో పెండింగ్ కేసులను దృష్టిలో పెట్టుకుని విభజన ప్రక్రియను నిలిపివేయాలన్న నిర్ణయానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ వచ్చినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయి. పంచాయతీలకు ఎన్నికలు సమీపించడంతో విభజన, విలీన ప్రతిపాదనలను ఆహ్వానిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో పెద్దసంఖ్యలో తీర్మానాలు చేసి జిల్లా పంచాయతీ అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నారు. వీటిని కలెక్టర్ల ఆమోదంతో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి పంపాలి. సోమవారంలోగా అన్ని జిల్లాల నుంచి ప్రతిపాదనలు పంపాలని డీపీవోలకు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయం కూడా ఆదేశాలిచ్చింది. గత పంచాయతీ ఎన్నికలకు ముందు జరిగిన విభజనను సవాల్ చేస్తూ హైకోర్టులో వేసిన కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి పరిష్కారం కాకుండా మళ్లీ విభజన అంటే న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు. సర్పంచుల పదవీకాలం పూర్తికాకుండా విభజన ప్రక్రియ చేపట్టకుండా గత ప్రభుత్వం చట్ట సవరణలు చేసింది. వీటికితోడు కేంద్రం ఆధ్వర్యంలో జనగణన జనవరిలో ప్రారంభం కానుంది. వీటిని దృష్టిలో పెట్టుకుని విభజన ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని పంచాయతీరాజ్‌శాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

పింఛన్ల తొలగింపుపై జగన్ విషప్రచారం

అర్హులైన ఏ ఒక్కరి పింఛనూ తొలగించలేదు: మంత్రి డోలా

ఈనాడు, అమరావతి: పింఛన్ల తొలగింపుపై జగన్ విషప్రచారం చేస్తున్నారని, అర్హులైన ఏ ఒక్కరి పింఛనూ తొలగించలేదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. సదరం ధ్రువీకరణ పత్రాల పరిశీలన మాత్రమే ఇప్పటివరకు ప్రభుత్వం చేపడుతోందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైకాపా హయాంలో అర్హులను పక్కన పెట్టి అనర్హులకు తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలతో పింఛన్లను ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు.

అభిమానుల కోసం సినిమాలు వదిలేస్తున్నా

నటుడు, టీవీకే అధినేత విజయ్



చెన్నై, న్యూస్‌టుడే: తమిళ అగ్రనటుడు విజయ్ సినిమా రంగానికి రిటైర్‌మెంట్ ప్రకటించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పేరిట రాజకీయ పార్టీని స్థాపించిన విజయ్‌కు 'జన నాయగన్' ఆఖరి చిత్రమని, ఆ తర్వాత సినీరంగం నుంచి తప్పుకొంటారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని ఆయనే అధికారికంగా ప్రకటించారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో శనివారం జరిగిన 'జన నాయగన్' సినిమా ఆడియో ఆవిష్కరణ వేడుకలో విజయ్ మాట్లాడారు. 'తొలిరోజు నుంచి 33 ఏళ్లుగా మీరే నా వెంట ఉన్నారు. మీతో మరో 33 ఏళ్లు నిలబడాలని నిర్ణయించుకున్నా. నా కోసం అన్నింటినీ వదులుకున్న అభిమానుల కోసం సినిమాలను వదులుకుంటున్నా' అని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో విజయ్ ఒంటరిగా వస్తారా? జట్టుగా వస్తారా? అని తరచూ అడుగుతున్నారు. 33 ఏళ్లుగా మీతో జట్టుగానే వచ్చాను. ఇకపై జట్టుగానే వస్తాను. ఈ వివరణ సరిపోదనుకుంటా.. సస్పెన్స్‌లోనే కిక్ ఉంటుంది' అని నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు.

ఆంధ్రా కోడలిని.. పీఎం లంక కుమార్తెని

- గ్రామాభివృద్ధిలో రాష్ట్రస్థాయిలో ముందుండాలి
- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

ఈనాడు డిజిటల్-భీమవరం, న్యూస్‌టుడే-మొగల్తూరు: రాష్ట్రంలో యువత ఏఐ శిక్షణ తీసుకోవాలంటే పశ్చిమగోదావరి జిల్లా పెదమైనవాని (పీఎం) లంక రావాల్సిందేనని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. మహిళల మద్దతుతోనే ఈ గ్రామంలో అభివృద్ధి సాధ్యమైందని, ఆంధ్రా కోడలిగా పీఎం లంక కుమార్తెగా తనను ఆదరిస్తున్నారన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం పీఎం లంకలో ఏర్పాటుచేసిన వివిధ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. ముందుగా డిజిటల్ భవనంలో ఏర్పాటుచేసిన సైయెంట్ ఏఐ, ఫ్యూచర్ స్కిల్‌హబ్‌ను ప్రారంభించారు. అనంతరం బహిరంగసభలో మాట్లాడుతూ.. 'మహిళలు, రైతులు, యువతకు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో మోడల్ ఏఐ ఆధారిత నైపుణ్య కేంద్రం ఏర్పాటు చేశాం. ఇక్కడ ఉన్న స్మార్ట్ తరగతి గదులు, డ్రోన్ శిక్షణ పరికరాలు, ఓపెన్‌సోర్స్ ఏఐ సాధనాలు, రియల్ టైం ట్రాకింగ్, కేంద్రీకృత అభ్యసన నిర్వహణ వ్యవస్థ ద్వారా నైపుణ్యాలు పెంచవచ్చు.



ఫ్యూచర్ స్కిల్ హబ్‌లో యువతులతో ముచ్చటిస్తున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్. చిత్రంలో కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, సైయెంట్ ఛైర్మన్ బీవీ మోహన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు

రెండో స్థానంలో పీఎం లంక శిక్షణ కేంద్రం

ప్రధాని మోదీ ఆలోచనతోనే తూర్పుతాళ్లు, పీఎం లంక గ్రామాలను దత్తత తీసుకున్నా. తూర్పుతాళ్లలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రజలు సహకరించలేదు. పీఎం లంకలో మహిళల మద్దతు లభించింది. తుపాను, వరదల సమయంలో ప్రజల రక్షణ, పంచాయతీ అవసరాలకు డిజిటల్ భవనం నిర్మించాం. ఏడాది నుంచి పీఎం విశ్వకర్మ పథకం కింద 13 రకాల ట్రేడ్స్‌లో శిక్షణ ఇస్తున్నాం. దానిని ఉపయోగించుకుని యువత ఉద్యోగాలు సాధించడం అభినందనీయం. దేశవ్యాప్తంగా 700 జిల్లాల్లో పీఎం విశ్వకర్మ శిక్షణపై సర్వే చేస్తే జమ్మూకశ్మీర్‌లోని బడ్గావ్ మొదటి స్థానంలో, పీఎం లంక శిక్షణ కేంద్రం రెండోస్థానంలో నిలిచాయి. అభివృద్ధిలో ఈ గ్రామం రాష్ట్ర స్థాయిలో ముందుండాలి' అని కేంద్రమంత్రి పేర్కొన్నారు. అలల కోతకు కొబ్బరితోటలు కొట్టుకుపోకుండా ఇక్కడ రూ.13.75 కోట్లతో రక్షణ గోడ నిర్మిస్తున్నామని, సంక్రాంతికి పనులు పూర్తవుతాయని ఆమె హామీ ఇచ్చారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉన్నందుకే ఈ అభివృద్ధి సాధ్యమవుతోందని అన్నారు. కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రితో సీఎం భేటీ

ఈనాడు, అమరావతి: పశ్చిమగోదావరి జిల్లా పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు కొద్దిసేపు భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



చిన్నారులతో సహవాసం అంటే..?

చిన్నారులతో సహవాసం అంటే వారితో కలిసి కూర్చుని టీవీ చూడటం కాదు. వారితో కలిసి గెంతుతూ, ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ, నవ్వులు పంచుకుంటూ వాళ్లతో మమేకమై ఆనందంగా గడపడమే సిసలైన సహవాసం. తల్లిదండ్రుల సాన్నిహిత్యం పిల్లలకు అత్యంత గొప్ప భద్రతా భావాన్ని కలిగిస్తుంది.

– మిషెల్లీ, ఇన్‌ఫ్లుయెన్సర్

పర్యాటక కేంద్రాలకు సందర్శకుల కళ

అరకులోయ, చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పర్యాటక కేంద్రాలన్నీ ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. ఆంధ్రా కశ్మీర్ లంబసింగి, తాజంగి, చెరువులవెనం, బోడకొండమ్మ ఆలయం, ఎర్రవరం జలపాతాలకు పర్యాటకులు అధికసంఖ్యలో తరలివచ్చారు. చెరువులవెనం వ్యూపాయింట్, పద్మాపురం ఉద్యానం, గిరిజన మ్యూజియం, కాఫీ తోటలు కిక్కిరిసిపోయాయి. అరకులోయకు ఆదివారం సుమారు 5వేల మంది పర్యాటకులు వచ్చారు. సందర్శకుల తాకిడి ఎక్కువ కావడంతో సుంకరమెట్ట కాఫీ తోటల వద్ద ఉడెన్ బ్రిడ్జిని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తాత్కాలికంగా మూసివేశారు. విశాఖపట్నం- కిరండూల్ పాసింజర్ కిటకిటలాడింది.



పర్యాటకులతో కిక్కిరిసిన చెరువులవెనం వ్యూ పాయింట్

త్రైకార్‌కు కూటమి ప్రభుత్వం ఊపిరి

- గిరిజన రైతులకు అండగా పథకం పునరుద్ధరణ
- 90 శాతం రాయితీతో వ్యవసాయ, మత్స్య, ఉద్యాన పరికరాలు
- రూ.13.70 కోట్లు విడుదల.. 12 వేల మందికి లబ్ధి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిన గిరిజన సహకార ఆర్థిక సంస్థ (ట్రైకార్)కు కూటమి ప్రభుత్వం ఊపిరిపోసింది. తెదేపా ప్రభుత్వం అమలుచేసిందనే కారణంతో గతంలో జగన్ సర్కారు పక్కన పెట్టిన పథకాన్ని తిరిగి పట్టాలెక్కించింది. ట్రైకార్ ద్వారా గిరిజన రైతులకు అండగా నిలిచేలా వ్యవసాయ, మత్స్య, ఉద్యాన పరికరాలను అందించేందుకు రూ.13.70 కోట్లను తాజాగా విడుదల చేసింది. ఫలితంగా 12వేల మంది గిరిజన రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే ఐటీడీఏల పరిధిలో వారి ఎంపిక కూడా చేపట్టారు.

వ్యక్తిగతంగా, సంఘాలకు పంపిణీ..

వ్యవసాయ, ఉద్యాన, మత్స్యకార రైతుల అవసరాలకు అనుగుణంగా 30 రకాల పరికరాల్ని అధికారులు గుర్తించారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు 90% రాయితీతో వీటిని అందిస్తారు. కర్షకులు మిగిలిన 10 శాతమే తమ వాటాగా చెల్లించాలి. కోరుకున్న పరికరాల్ని రైతులకు ఇస్తారు. చిన్న మొత్తం విలువ కలిగినవి వ్యక్తిగతంగా, భారీ వ్యయం అయ్యేవి సంఘాలుగా ఏర్పడిన రైతులకు మంజూరుచేస్తారు. ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, ట్రాలీలు, రోటావేటర్లు, ఆయిల్ ఇంజిన్లు, పవర్ టిల్లర్, పవర్ వీడర్, టర్మరిక్ బాయిలర్స్, స్ప్రేయర్లు, ఫిషింగ్ బోట్లు పంపిణీ చేయనున్నారు.

వైకాపా ప్రభుత్వంలో నిధుల మళ్లింపు

స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్ టు ట్రైబల్ సబ్‌స్కీమ్ కింద నిధులను సమీకరించేందుకు అప్పట్లో తెదేపా ప్రభుత్వం చేసిన కృషితో రాష్ట్రానికి ప్రాజెక్టు వచ్చి, 2020-21లో రూ.13.70 కోట్లు మంజూరయ్యాయి. కానీ, వైకాపా ప్రభుత్వం ఈ నిధుల్ని ఇతర అవసరాలకు మళ్లించింది. ఈ నిధుల వినియోగంపై యూసీలు సమర్పించాలని కేంద్రం ఆదేశించినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు.

కడప నగరపాలక సంస్థ, కడప

ప్రకటన తేదీ : 27.12.2025

కడప నగరపాలక సంస్థ పరిధిలోని వీధి పశువులు, విడిచిపెట్టబడిన మరియు స్వాధీనం చేయబడిన పశువుల సంరక్షణ, నిర్వహణ మరియు సంక్షేమ నిమిత్తం సీకే దిన్నె మండలం, బుగ్గఅగ్రహారం గ్రామంలో ఉన్న కడప మున్సిపల్ కార్పొరేషన్ వారి గోశాల నిర్వహణ బాధ్యతలను లాభాపేక్ష లేకుండా నిర్వహించగల అర్హత కలిగిన స్వచ్ఛంద సంస్థల (NGO) నుండి ఆసక్తి వ్యక్తీకరణలు (Expression of Interest - EOI) ఆహ్వానించబడుతున్నాయి.

అర్హత గల ఎన్జీఓలు తప్పనిసరిగా

- సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం, 1860/పబ్లిక్ ట్రస్ట్/సెక్షన్-8 కంపెనీగా నమోదు అయి ఉండాలి.
- పశు సంక్షేమం మరియు గోశాల నిర్వహణలో కనీసం 2-3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి.
- జంతు సంక్షేమ చట్టం, 1960 మరియు అనుబంధ నిబంధనలను పూర్తిగా పాటించాలి.
- భారత జంతు సంక్షేమ మండలి (Animal Welfare Board of India) గుర్తింపు పొంది ఉన్న సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

గోశాల నిర్వహణ ప్రస్తుత బుగ్గ అగ్రహారం, సీకేదిన్నె ప్రాంగణంలోనే జరగవలెను. గోశాల నిర్వహణకు సంబంధించిన అన్ని ఖర్చులు సంబంధిత ఎన్జీఓ వారే భరించవలెను.

ఆసక్తి గల స్వచ్ఛంద సంస్థలు అవసరమైన పత్రాలతో కూడిన దరఖాస్తులను రెండు ప్రతులుగా కార్యాలయ పనిదినాలలో **తేదీ: 12.01.2026 సాయంత్రం 5.00 గంటలలోపు** కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో సమర్పించవలెను.

పూర్తి నిబంధనలు, షరతులు మరియు దరఖాస్తు నమూనా వివరాలకై కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వారిని సంప్రదించవచ్చు.

సం/- **కమిషనర్,** కడప నగరపాలక సంస్థ, కడప

పిల్లల పెంపకం బాధ్యత నుంచి తల్లి తప్పించుకోలేదు

- లేకపోతే సమాజం పునాది కోల్పోతుంది
- ఓ కేసు విచారణలో మద్రాసు హైకోర్టు అభిప్రాయం

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: క్రమశిక్షణతో పిల్లలను పెంచే పవిత్రమైన బాధ్యతను తల్లి విస్మరిస్తే కుటుంబం, సమాజం పునాదులు కదిలిపోయే ప్రమాదముందని మద్రాసు హైకోర్టు అభిప్రాయపడింది. కోయంబత్తూరుకు చెందిన ఓ మహిళ భర్తతో విడిపోయి 14ఏళ్ల కుమార్తెతో జీవిస్తోంది. ఆమెకు స్థానికంగా ఉంటున్న ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. 2017లో కుమార్తెపై కన్నేసిన ఆమె ప్రియుడు.. బాలికను లైంగికంగా వేధించాడు. విషయాన్ని తల్లికి చెప్పగా.. ఎవరికైనా చెబితే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. తర్వాత కూడా ఆ వ్యక్తి బాలికపై వేధింపులను కొనసాగించాడు. దీంతో బాలిక తన కన్నతండ్రికి చెప్పింది. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు తల్లి, ఆమె ప్రియుడిపై కోయంబత్తూరు ఆల్ ఉమెన్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసును విచారించిన కోయంబత్తూరు పోక్సో కోర్టు..బాలిక తల్లి, ఆమె ప్రియుడికి జీవితఖైదు శిక్ష విధిస్తూ 2020లో తీర్పునిచ్చింది. ఈ శిక్షను సవాలు చేస్తూ ఇద్దరూ మద్రాసు హైకోర్టులో అప్పీల్ చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ వేల్‌మురుగన్, జస్టిస్ జ్యోతిరామన్ ధర్మాసనం విచారించింది. అనంతరం న్యాయమూర్తులు శనివారం జారీచేసిన ఉత్తర్వుల్లో.. ఆరోపణలను పోలీసులు రుజువు చేశారని, పోక్సో కోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేమని తెలిపి పిటిషన్‌ను కొట్టివేశారు. తల్లుల అనైతిక ప్రవర్తన కారణంగా వారి పిల్లలపై ఇలాంటి లైంగిక దాడులు జరుగుతున్నాయని, మన సంస్కృతిలో తల్లికి అధిక ప్రాధాన్యం ఉందని, పిల్లలను సురక్షితంగా, గౌరవంగా, క్రమశిక్షణతో పెంచడం తల్లి బాధ్యత అని పేర్కొన్నారు. పవిత్రమైన ఆ బాధ్యతను ఆమె విస్మరిస్తే ఆ కుటుంబమే కాకుండా సమాజం కూడా తన పునాదిని కోల్పోతుందని అభిప్రాయపడ్డారు.

(c) eenadu

ఉత్సాహంగా ఎద్దులు, గుర్రాల పరుగు పోటీలు



పరుగు పెడుతున్న డాకు మహారాజ్ సినిమాలోని గుర్రం



పరుగు పోటీలో ఎద్దులు

రంగంపేట, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రంగంపేట-వడిశలేరు మధ్య గన్నివారి తోట పరిసరాల్లో ఆదివారం గుర్రాలు, ఎద్దుల పరుగు పోటీలతో సందడి నెలకొంది. తన తండ్రి సత్యనారాయణమూర్తి జ్ఞాపకార్థం జీఎస్ఎల్ ఆసుపత్రి ఛైర్మన్ గన్ని భాస్కరరావు ఏటా నిర్వహిస్తున్న ఈ పోటీలను మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 100 ఎడ్ల జతలు, 35 గుర్రాలు పాల్గొన్నాయి. మూడు కిలోమీటర్ల దూరం లక్ష్యాన్ని తక్కువ సమయంలో అధిగమించిన దాన్ని విజేతగా ప్రకటించారు. ఈ పోటీల్లో డాకు మహారాజ్ సినిమాలో ఉన్న గుర్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గుర్రాల పరుగు పోటీలో అనకాపల్లి జిల్లా చేనుల అగ్రహారానికి చెందిన కె.మణికంఠ గుర్రం ప్రథమస్థానం దక్కించుకుంది. ఎద్దుల పరుగు పోటీ జూనియర్స్ విభాగంలో అనకాపల్లి జిల్లా చౌడవాడకు చెందిన గెడ్డం అప్పారావుకు చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. సీనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా జి.మేడపాడుకు చెందిన మలిరెడ్డి అన్నపూర్ణకు చెందిన ఎద్దులు విజేతగా నిలిచాయి. వీరికి ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎమ్మెల్సీ సోమువీర్రాజు ద్విచక్ర వాహనాలను బహుమతులుగా అందజేశారు.



ఎద్దుల పరుగు పోటీ సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన వీరేంద్రకు ద్విచక్ర వాహనాన్ని బహుమతిగా అందజేస్తున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. చిత్రంలో జీఎస్ఎల్ ఛైర్మన్ భాస్కరరావు

ఆటల్లో గెలిచాం.. అంతరిక్షంలో మెరిశాం

- ఈ ఏడాది ఎన్నో మైలురాళ్లను చేరుకున్నాం
- 2025 చిరస్మరణీయమన్న ప్రధాని మోదీ
- మన్ కీ బాత్‌లో ఆపరేషన్ సిందూర్, మహాకుంభమేళా సహా పలు అంశాల ప్రస్తావన



దిల్లీ: భారతావనికి 2025 మరుపురాని సంవత్సరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గర్వం వదగిన ఎన్నో మైలురాళ్లను ఈ ఏడాదిలో మన దేశం చేరుకుందని గుర్తుచేశారు. భద్రత విషయంలో ఎంత మాత్రమూ రాజీ పడబోమని ఆపరేషన్ సిందూర్ చాటిచెప్పిందని పేర్కొన్నారు. ఈ ఏటి చివరి 'మన్ కీ బాత్'లో ఆదివారం ఆయన ప్రసంగించారు. జాతీయ భద్రత, క్రీడలు, సాంకేతిక రంగంలో నవకల్పనలు.. ఇలా అన్నింటా గత సంవత్సర కాలంలో దేశం చెరగని ముద్ర వేసిందన్నారు. "ఆపరేషన్ సిందూర్ భారతీయులందరికీ గర్వకారణంగా నిలిచింది. ఆ ఆపరేషన్ కొనసాగుతున్నప్పుడు.. భరత మాతపై తమకున్న ప్రేమానురాగాలను దేశం నలుమూలల నుంచి ప్రజలు రకరకాల రూపాల్లో చాటుకున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు. వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తవడంతో నిర్వహించిన వేడుకల్లోనూ అదే స్ఫూర్తి కనిపించిందని వ్యాఖ్యానించారు.

ఆటల్లో మేటిగా నిలిచాం

భారత క్రీడారంగానికి ఈ ఏడాది చిరస్మరణీయమని మోదీ అన్నారు. "2025లో- భారత పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని, ఆసియా కప్‌ను గెల్చుకుంది. మహిళల క్రికెట్ జట్టు తొలిసారి ప్రపంచ కప్ సాధించింది. మహిళల అంధుల జట్టు టీ-20 ప్రపంచ కప్‌ను గెల్చుకోవడం ద్వారా చరిత్ర సృష్టించింది. మన పారా అథ్లెట్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్స్‌లో చాలా పతకాలు సాధించారు" అని వివరించారు.

ప్రపంచమంతా ఆశగా చూస్తోంది

శాస్త్ర సాంకేతిక, అంతరిక్ష రంగాల్లో మన దేశం ఈ ఏడాది భారీ ముందడుగు వేసిందని ప్రధాని చెప్పారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) చేరుకున్న తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా రికార్డుల్లోకి ఎక్కిన సంగతిని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచమంతా భారత్ వైపు గొప్ప ఆశతో చూస్తోందని, అందుకు ప్రధాన కారణం మన దేశ యువశక్తి అని తెలిపారు. జనవరి 12న జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని 'యువ నేతల సదస్సు'ను నిర్వహిస్తామని వెల్లడించారు.

మరింత విశ్వాసాన్నిచ్చింది

ఏడాది ఆరంభంలో ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళా యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందని ప్రధాని పేర్కొన్నారు. ఇటీవల అయోధ్య రామమందిరం వద్ద నిర్వహించిన ధ్వజారోహణ వేడుక భారతీయులందరినీ పులకింపజేసిందన్నారు. 2025 మన దేశానికి మరింత గొప్ప విశ్వాసాన్నిచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ ఏడాది చాలా ప్రాంతాల్లో ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాల్సి వచ్చిందనీ గుర్తుచేశారు. కొత్త తీర్మానాలు, కొంగొత్త ఆశలతో 2026 వైపు అడుగులు వేసేందుకు భారతావని సిద్ధంగా ఉందన్నారు.

వైద్యులను సంప్రదించకుండా యాంటీబయాటిక్స్ వాడొద్దు

న్యుమోనియా, యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ (యూటీఐ) వంటి చాలా వ్యాధులను నయం చేయడంలో యాంటీబయాటిక్ ఔషధాలు ప్రస్తుతం ప్రభావరహితంగా మారుతున్నాయంటూ భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) ఇటీవల విడుదల చేసిన నివేదికపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. యాంటీబయాటిక్స్‌ను విచక్షణారహితంగా వాడటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణమన్నారు. వైద్యులను సంప్రదించకుండా ఆ ఔషధాలను వినియోగించకూడదని ప్రజలకు హితవు పలికారు.

జనవరిలో పార్వతీ గిరి శత జయంతి వేడుకలు

ఒడిశాకు చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు పార్వతీ గిరి శత జయంతి వేడుకలను జనవరిలో నిర్వహిస్తామని ప్రధాని ప్రకటించారు. స్వాతంత్య్రోద్యమంలో ఎంతో గొప్ప సేవ చేసినప్పటికీ తగినంత పేరు దక్కనివారిలో ఆమె ఒకరని పేర్కొన్నారు. పార్వతీ గిరి 16 ఏళ్లకే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న సంగతిని గుర్తుచేశారు. 'వెస్టర్న్ ఒడిశా మదర్ థెరిసా'గా పేరుగాంచిన ఆమె.. స్వాతంత్య్ర పోరాటం తర్వాత తన జీవితాన్ని సమాజ సేవ, గిరిజన సంక్షేమం కోసం అర్పించారని కొనియాడారు.

✦ భారత సంస్కృతిని విశ్వవ్యాప్తం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రధాని కొనియాడారు. దుబాయ్‌లో నివసిస్తున్న కన్నడిగులు తమ పిల్లలకు కన్నడ భాష నేర్పించడం కోసం పాఠశాలను నెలకొల్పేందుకు చేస్తున్న కృషిని, ఫిజీలోని రాకీ-రాకీలో ఓ పాఠశాలలో తొలిసారిగా తమిళ దినోత్సవం నిర్వహించడాన్ని ఆయన ప్రశంసించారు.

✦ మణిపుర్‌లోని పలు మారుమూల పల్లెలకు సౌర విద్యుత్తు వెలుగులు అందడంలో కీలక పాత్ర పోషించిన 40 ఏళ్ల శ్రీరామ్ మొయిరాంగ్థెమ్‌పై ప్రధాని ప్రశంసల వర్షం కురిపించారు. 'మనసుంటే మార్గం ఉంటుంది' అనే నానుడిని ఆయన తన కృషి ద్వారా నిరూపించారని పేర్కొన్నారు.

✦ బారాముల్లాకు చెందిన మూడు బౌద్ధ స్తూపాల పాత ఫొటో ఒకటి ఫ్రాన్స్‌లో వెలుగుచూడటం ఘనమైన కశ్మీర్ పూర్వ వైభవానికి నిదర్శనమని చెప్పారు.

కొండ కోనల్లోనూ.. 'సెల్' మోహనరంగ

(మొదటి పేజీ తరువాయి)

సిగ్నల్ సమస్యలు ఎదురయ్యే చోట్ల కొత్తగా టవర్ల ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఇందుకోసం రెవెన్యూ స్థలాలతో పాటు ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ భూముల అవసరం ఉంటుంది. కొన్నిచోట్ల టవర్ల ఏర్పాటుకు సామగ్రి తరలించడానికి సరైన రోడ్డుమార్గం కూడా లేదు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని చాలా గిరిజన గ్రామాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సమస్య ఎక్కువగా ఉంది. ఆ ఒక్క జిల్లాలోనే 100 టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో 42 లొకేషన్లలో అధికారులు జాయింట్ సర్వే పూర్తిచేశారు. మరో 13 స్థలాలను టవర్ల ఏర్పాటు కోసం ఆయా సంస్థలకు అప్పగించారు.

సంతృప్త స్థాయి 'నెట్‌వర్క్'

రాష్ట్రవ్యాప్తంగా తరచూ సిగ్నల్ సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను ప్రభుత్వం గుర్తించింది. నెట్‌వర్క్ వినియోగం పెరగడంతో ఆయా ప్రాంతాల్లోని టవర్ల సామర్థ్యం సరిపోవడం లేదు. ఈ దృష్ట్యా అక్కడ అదనంగా టవర్లు ఏర్పాటు చేయాలి. రాష్ట్రవ్యాప్తంగా '4జీ సంతృప్తత' విధానంలో 624 కొత్త టవర్లను ప్రతిపాదించింది. కొత్త జిల్లాల ప్రాతిపదికగా వీటి ఏర్పాటుకు అధికారులు ఇప్పటికే స్థలాలను గుర్తించారు. 295 ప్రాంతాల్లో సంయుక్త సర్వే పూర్తవగా.. 37 లొకేషన్లను టవర్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.

కొత్త సెల్ టవర్ల ఏర్పాటు ఇలా..

జిల్లా పేరు	టవర్ల సంఖ్య
అనకాపల్లి	15
అనంతపురం	23
అన్నమయ్య	26
బాపట్ల	4
చిత్తూరు	19
బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ	1
తూర్పుగోదావరి	2
ఏలూరు	45
కాకినాడ	8
కృష్ణా	17
కర్నూలు	22
నంద్యాల	14
ఎన్టీఆర్	19
పల్నాడు	19
పార్వతీపురం మన్యం	78
ప్రకాశం	54
నెల్లూరు	75
శ్రీసత్యసాయి	21
శ్రీకాకుళం	44
తిరుపతి	54
విశాఖపట్నం	2
విజయనగరం	23
పశ్చిమగోదావరి	1
వైఎస్సార్ కడప	21

ఆ రెండూ ఆసియా హైవేలు

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు వరకు ఉంది. ఇందులో జపాన్- దక్షిణ కొరియాకు మధ్య సముద్రయానం ఉంటుంది. ఆ తర్వాత మిగిలినదంతా రోడ్డు మార్గమే.

✦ ఈ ఏహెచ్-1 మన దేశంలో మయన్మార్ సరిహద్దులో మణిపుర్‌లోని మొరే వద్ద ప్రవేశించి ఇంఫాల్, కోహిమ, గువాహటి, షిల్లాంగ్ మీదుగా బంగ్లాదేశ్‌లోకి వెళ్తుంది. మళ్లీ పశ్చిమబెంగాల్‌లోని పెట్రాపోల్ వద్ద భారత్‌లోకి ప్రవేశించి కోల్‌కతా, వారణాసి, ప్రయాగ్‌రాజ్, కాన్పుర్, ఆగ్రా, దిల్లీ, లుధియానా, అమృత్‌సర్ మీదుగా అటారీ సరిహద్దు నుంచి పాకిస్థాన్‌లోకి వెళ్తుంది. చెన్నై, నెల్లూరు, విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్ మీదుగా ఉన్న ఏహెచ్-45 కోల్‌కతా దగ్గర ఏహెచ్-1కి అనుసంధానమవుతుంది.

ఏపీ, తెలంగాణ మీదుగా.. ఏహెచ్-43

✦ శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు జాతీయ రహదారి-44 ఉండగా ఇందులోనే కొంత భాగాన్ని ఆసియా హైవే-43గా గుర్తించారు.

✦ ఆసియా హైవే-1లోని ఆగ్రా వద్ద ఏహెచ్-43 మొదలవుతుంది. అక్కడి నుంచి గ్వాలియర్, నాగ్‌పుర్, హైదరాబాద్, కర్నూలు, అనంతపురం, బెంగళూరు, కృష్ణగిరి, సేలం మీదుగా మదురై వరకు ఉన్న జాతీయ రహదారి-44నే.. ఆసియా హైవే-43గా గుర్తించారు. మళ్లీ మదురై నుంచి రామేశ్వరం మీదుగా ధనుష్కోటి వరకు ఉన్న జాతీయ రహదారి-87ని ఆసియా హైవే 43గా పిలుస్తారు. అంటే ఆసియా హైవే-43 ఆగ్రా నుంచి ధనుష్కోటి వరకు ఉంది.

ముగిసిన నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

ఏపీతో పాటు తెలంగాణ, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాలు, మరికొన్ని కేంద్రపాలిత ప్రాంతాల జట్లు తలపడ్డాయి. అంతకుముందు అంతర్రాష్ట్ర, అంతర్ జోనల్ పోటీలు జరిగాయి. వీటిలో స్టార్ ప్లేయర్లు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, ఉన్నతి హుడా, ఆయుష్‌శెట్టి, సమీర్‌వర్మ పోటీపడ్డారు.

ఏడాదిలో అందుబాటులోకి అకాడమీ

– పుల్లెల గోపీచంద్, జాతీయ చీఫ్ కోచ్

ఏడాది నుంచి ఏడాదిన్నరలో అమరావతిలో బ్యాడ్మింటన్ అకాడమీ అందుబాటులోకి రానుంది. అబ్బురాజుపాలెంలో ఇప్పటికే నిర్మాణం ప్రారంభించాం. స్థానిక క్రీడాకారులకు ఇదో మంచి అవకాశం. గతంతో పోల్చుకుంటే ఏపీలో బ్యాడ్మింటన్‌కు మౌలిక వసతులు పెరిగాయి. కొత్త అకాడమీలు, కోర్టులు వచ్చాయి. రాబోయే ఒలింపిక్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడి పతకం తెస్తుందనే నమ్మకం ఉంది. పీవీ సింధు, శ్రీకాంత్ తదితర టాప్ ర్యాంక్ ప్లేయర్లూ రాణిస్తారు.

ప్రభుత్వం స్పాన్సర్ చేయాలి

– తమిరి సూర్య చరిష్మ, ఉమెన్స్ సింగిల్స్ విజేత

సొంత ప్రాంతంలో ఆడటం, గెలవడం చాలా గర్వంగా ఉంది. టోర్నమెంట్లకు వెళ్లడానికి క్రీడాకారులకు ప్రభుత్వం వ్యక్తిగతంగా స్పాన్సర్ చేయాలి. అప్పుడే అంతర్జాతీయ క్రీడలకు వెళ్లగలం. కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుంది. ఓపిగ్గా ఎదురుచూడాలి. నిరుత్సాహపడ్డప్పుడు తల్లిదండ్రులు, కోచ్ నాకు ప్రేరణగా నిలిచారు.



సూర్య చరిష్మను ముద్దాడుతున్న తల్లిదండ్రులు నవీన్, రత్నకుమారి

ఆతిథ్యం బాగుంది

– రిత్విక్ సంజీవి, మెన్స్ సింగిల్స్ విజేత, తమిళనాడు

విజయవాడ ఆతిథ్యం బాగుంది. జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల ఆటను గమనించాను. మెళకువలు నేర్చుకున్నాను. కిదాంబి శ్రీకాంత్‌తో ఆడటం, పైచేయి సాధించడం గౌరవంగా భావిస్తున్నాను.

లోపాలు తెలుసుకున్నాను

– కోడె విష్ణుకేదార్, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, ఏపీ

మెన్స్ డబుల్స్ ప్రీ క్వార్టర్స్‌లో ఓటమి కొత్త పాఠాలు నేర్పించింది. నాలోని లోపాలు తెలుసుకున్నాను. రాబోయే టోర్నమెంట్లలో ఈ పొరపాట్లు జరగకుండా చూసుకుంటాను. అంతర్జాతీయ స్థాయిలో సీనియర్ లెవల్ టోర్నమెంట్లకు సిద్ధం అవుతున్నాను. సొంత రాష్ట్రంలో ఆడటం ఆనందంగా ఉంది.

సూర్యచరిష్మ విజయం రాష్ట్రానికి గర్వకారణం: సీఎం

విజయవాడలో జరిగిన సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో ఉమెన్స్ సింగిల్స్ విభాగంలో ఛాంపియన్‌గా నిలిచిన ఏపీ క్రీడాకారిణి తమిరి సూర్య చరిష్మకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. "సూర్య చరిష్మ విజయం రాష్ట్రానికి గర్వకారణం. ఆమె భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి" అని చంద్రబాబు ఆకాంక్షించారు.

ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెరుగుతోంది

– పోలినేని అంకమ్మచౌదరి, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి

2015 తర్వాత మళ్లీ రాష్ట్రంలో జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతున్నాయి. ఇది గర్వకారణం. ఇలాంటి పోటీలతో ఏపీ బ్రాండ్ ఇమేజ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతుంది. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం లభిస్తోంది. అమరావతిలో స్పోర్ట్స్‌సిటీ పూర్తయితే ప్రపంచంలోనే మేటి క్రీడాకారులు, కోచ్‌లు తయారవుతారు.

నేవీ నైపుణ్యానికి నిదర్శనం ఐఎన్ఎస్ వాఘ్‌శీర్



ఐఎన్ఎస్ వాఘ్‌శీర్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, నౌకాదళ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి, జలాంతర్గామి సిబ్బంది

ఈనాడు, బెంగళూరు: స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన అత్యాధునిక జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌శీర్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రయాణించారు. తద్వారా జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగానే కాకుండా తొలి మహిళా రాష్ట్రపతిగా ముర్ము చరిత్ర సృష్టించారు. 2006లో అప్పటి రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఐఎన్ఎస్ సింధురక్షక్‌లో ప్రయాణించారు. ఆదివారం కర్ణాటకలోని కార్వార నౌకాదళ స్థావరానికి నేవీ యూనిఫాంలో వచ్చిన రాష్ట్రపతి ముర్ము.. జలాంతర్గామిలో ప్రయాణం ప్రారంభించారు. గంటపాటు ఈ యాత్ర కొనసాగగా.. ఆమె వెంట నౌకాదళ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి, ఇతర నేవీ ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రయాణంలో ఐఎన్ఎస్ వాఘ్‌శీర్ సిబ్బందితో ముర్ము ప్రత్యేకంగా ముచ్చటించారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ జలాంతర్గామి భారత నౌకాదళ వృత్తి నైపుణ్యానికి నిదర్శనమని ఆమె కొనియాడారు. పీ75 స్కార్పీన్ ప్రాజెక్టులో భాగంగా తయారైన ఆరో, చివరి జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌శీర్ జనవరిలో విధుల్లోకి ప్రవేశించింది. డీజిల్-ఎలక్ట్రిక్ ఇంధన వ్యవస్థలతో పనిచేసే ఈ సబ్‌మెరైన్.. ప్రపంచంలోనే అతి నిశ్శబ్దమైనదని నేవీ వర్గాలు తెలిపాయి.



రామాలయ నిర్మాణాన్ని చంద్రబాబుకు వివరిస్తున్న ఆలయ నిర్వాహకులు

అత్యుత్తమ పాలనకు రామరాజ్యమే కొలమానం

(మొదటి పేజీ తరువాయి)

రామాలయం మార్గదర్శకంగా నిలవాలని అభిలషించారు.

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యూపీ, బిహార్ కీలకం

వికసిత్ భారత్ లక్ష్యసాధనలో యూపీ, బిహార్ రాష్ట్రాలు కీలకపాత్ర పోషించాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రామమందిర నిర్మాణంతోపాటు యూపీలో సుపరిపాలన అందిస్తున్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు. సాంకేతికంగా ముందడుగు వేస్తున్న భారత్‌ను ఎవరూ నిలువరించలేరని పేర్కొన్నారు.

అవి కల్తీసారా మరణాలే

(మొదటి పేజీ తరువాయి)

నల్లగా మారిపోవడం, నాలుక తెల్లబడిపోవడం వంటి లక్షణాలతో మరణించారు. ప్రాణాలొదిలేయడానికి కొన్ని గంటల ముందు.. తమకు ఏదో అయిపోతోందని, ఆసుపత్రికి తీసుకెళ్లాలంటూ వారి కుటుంబసభ్యుల వద్ద తల్లడిల్లిపోయారు. వారి కళ్ల ముందే విలవిల్లాడుతూ ప్రాణాలొదిలారు. మృతుల్లో 35-45 ఏళ్ల మధ్య ఉన్నవారే ఎక్కువ. నాటుసారా తాగడం వల్లే వారు చనిపోయారంటూ మృతుల కుటుంబసభ్యులు ఆరోపించగా, అవన్నీ సహజ మరణాలేనని నాటి ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీలో చెప్పారు. అనారోగ్యం, ఇతర కారణాలతో జంగారెడ్డిగూడెంలో నెలకు 90 మంది సాధారణంగా చనిపోతుంటారంటూ తీసిపడేశారు. అప్పటి పోలీసు, అధికార యంత్రాంగం కూడా పాలకులకు వంతపాడటంతో ఈ చావుల వెనకున్న చీకటి కోణాలు బయటకురాలేదు. కూటమి ప్రభుత్వం సిట్ వేసి, విచారించడంతో అసలు గుట్టు ఇప్పుడు రట్టయ్యింది.

గ్రహం అనుగ్రహం

29-12-2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, శుక్లపక్షం

దశమి: తె. 3-40 తదుపరి ఏకాదశి

అశ్విని: రా. 2-42 తదుపరి భరణి

వర్జ్యం: రా. 10-56 నుంచి 12-36 వరకు

అమృత ఘడియలు: రా. 7-55 నుంచి 9-25 వరకు

దుర్ముహూర్తం: మ. 12-24 నుంచి 1-08 వరకు తిరిగి 2-35 నుంచి 3-19 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.6.34; సూర్యాస్తమయం: సా.5.31

పూర్వాషాఢ కార్తె

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
హైదరాబాద్	13.2	27.2
విజయనగరం	15.0	27.0
అనంతపురం	15.6	29.8
కర్నూలు	16.4	30.0
కడప	17.0	28.0
శ్రీకాకుళం	17.0	28.0
విశాఖపట్నం	18.0	28.6
రాజమహేంద్రవరం	18.0	32.5
విజయవాడ	18.7	29.0
గుంటూరు	19.0	29.0
ఒంగోలు	20.4	29.1
నరసాపురం	20.6	29.2
నెల్లూరు	21.1	29.1
తాడేపల్లిగూడెం	28.0	30.0

ఫొటోలు ఐబొమ్మ రవివి.. వివరాలు ప్రహ్లాద్‌వి!

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేకెత్తించిన పైరసీ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఐబొమ్మ రవి కేసులో మరో ట్విస్టు బయటపడింది. బెంగళూరుకు చెందిన ప్రహ్లాద్ వెల్లెల అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ గుర్తింపును దొంగిలించి, అతడి పేరుతో ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్సు తీశాడు. ప్రస్తుతం హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసుల కస్టడీలో ఉన్న ఐబొమ్మ రవిని విచారించినప్పుడు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ప్రహ్లాద్ వివరాలతోనే కరీబియన్ దీవుల్లోని సెయింట్ కిట్స్ అండ్ నేవిస్ దేశ పౌరసత్వం తీసుకున్నాడు రవి. ఐబొమ్మ వెబ్‌సైట్‌కి ముందే హాస్పిటల్స్.ఇన్, సప్లైస్.ఇన్ పేరుతో రవి రెండు వెబ్‌సైట్లు ప్రారంభించాడు. ఒకటి ప్రసాద్, రెండోది ప్రహ్లాద్ పేరుతో రిజిస్టర్ చేయించాడు. పోలీసుల విచారణలో విశాఖకు చెందిన ప్రసాద్.. రవికి పదోతరగతి స్నేహితుడని తేలింది. అతడికి ఈ మోసంతో సంబంధంలేదని వెల్లడైంది. ప్రహ్లాద్‌ని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా గుర్తించారు. అతడిని పిలిపించి రవి ఎదురుగా కూర్చోబెట్టి నీ పేరుతో ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సులు తీశాడని చెప్పగా.. ప్రహ్లాద్ ఆశ్చర్యపోయాడు. 2016లో అమీర్‌పేటలో సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకుంటున్నప్పుడు రవి అతడికి తెలియకుండా గుర్తింపు పత్రాలు, ఇతర డాక్యుమెంట్లు కొట్టేశాడు.

చిన్న వినియోగదారుడే ముఖ్యం



వ్యాపారంలో ఒకరిద్దరు పెద్ద వినియోగదారులే ఉండటం కంటే ఎక్కువ మంది చిన్న వినియోగదారులను ఆకర్షించగలగడం ఉత్తమం. ఎందుకంటే పెద్ద వినియోగదారుడు మరో వ్యాపారి వద్దకు వెళ్లిపోతే వ్యాపారం అతలాకుతలం అవుతుంది. అదే చిన్న వినియోగదారులు ఒకరిద్దరు దూరమైనా వ్యాపారానికి ఢోకా ఉండదు. వ్యాపారికి ఒత్తిడి ఉండదు.

– ప్రేమ్ సోని, ఆర్థిక సలహాదారు

ఆమె యాచన అన్నార్తుల కోసం!



యాచిస్తున్న గొర్ల నర్సియమ్మ



ఆలయానికి బియ్యం బస్తాలు దానం చేస్తూ..

మరణించేటప్పుడు వెంట ఏమీ తీసుకెళ్లలేమని భావించిన ఓ 70 ఏళ్ల మహిళ సేవ, ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు వెళుతున్నారు. ఇందుకు ఆమె యాచక వృత్తిని అనుసరించడం మరో విశేషం. తిరుపతి ప్రాంతానికి చెందిన గొర్ల నర్సియమ్మ 42 ఏళ్ల కిందట తుని ప్రాంతానికి వలస వచ్చారు. ప్రస్తుతం పట్టణ శివారులో ఉన్న అమ్మవారి ఆలయం వద్ద ఓ చిన్న రేకుల బడ్డీలో జీవనం సాగిస్తున్నారు. అన్నదమ్ములు ఉన్నా పట్టించుకోకపోవడంతో చాలా రోజుల నుంచి ఒంటరి తనమే తోడయ్యింది. నాలుగేళ్ల క్రితం వరకు యాచనకు వెళుతూ అందరిలాగే బ్రతికిన ఆమె.. ఈ సంపాదనను ఇక అన్నదానానికే ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అప్పటి నుంచి తనకు వస్తున్న డబ్బుతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న చిన్న ఆలయాల్లో అన్నదానం నిర్వహించేటప్పుడు తన వంతుగా 4 బియ్యం బస్తాలు అందిస్తున్నారు. ఇదే కాకుండా కొన్నేళ్ల క్రితం స్థానిక శ్రీదారాలమ్మ అమ్మవారికి వెండి త్రిశూలం చేయించేందుకు రూ.లక్ష, శ్రీశైలం భ్రమరాంబిక అమ్మవారికి రూ.25 వేలతో బంగారు చెవి దిద్దులు చేయించి ఇచ్చారు. ప్రస్తుతం ఓ శివాలయానికి రూ.50 వేలతో వెండి త్రిశూలం చేయించే ప్రయత్నంలో ఉన్నారు. అన్నిదానాల్లోకెల్లా అన్నదానమే గొప్పదని తన తల్లి చెప్పేదని.. అందుకే యాచక వృత్తి చేస్తూ ఆలయాలకు బియ్యం బస్తాలు ఇస్తున్నానని నర్సియమ్మ చెప్పుకొచ్చారు.

– న్యూస్‌టుడే, తుని


(c) eenadu

మైక్రోప్లాస్టిక్స్‌తో పెద్ద ప్రమాదం!

ఆసేతుహిమాచలం వాయునాణ్యత తగ్గిపోయి జనభారతం ఇప్పటికే జబ్బుల పాలవుతోంది. అతిచిన్న ధూళికణాలు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ తదితరాలతో కలుషితమైన గాలిలో సూక్ష్మప్లాస్టిక్‌లూ పెద్దమొత్తంలో తిష్ఠవేస్తున్నాయన్న తాజా సమాచారం మరింత బెంబేలెత్తిస్తోంది. దేశీయంగా ప్రముఖ విద్యాసంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు నాలుగు నగరాల్లో ప్లాస్టిక్ కాలుష్య తీవ్రతపై తొలిసారి జరిపిన పరిశోధన చేదు వాస్తవాలెన్నింటినో వెల్లడించింది. దాని ప్రకారం, నగరభారత ప్రజల శరీరాల్లోకి నిత్యం సగటున 132 మైక్రోగ్రాముల సూక్ష్మాతిసూక్ష్మ ప్లాస్టిక్ కణాలు చేరిపోతున్నాయి. అవి నేరుగా ఊపిరితిత్తుల్లోకి చొచ్చుకుపోతున్నాయి. ప్రమాదకర భారలోహాలైన లెడ్, కాడ్మియంతోపాటు హార్మోన్ల అసమతుల్యానికి దారితీసే రసాయనాలనూ అవి మానవ దేహంలోకి మోసుకెళ్తున్నాయి. దానికి తోడు ఔషధాలకు ఒక పట్టాన లొంగని సూక్ష్మక్రిములనూ వెంటబెట్టుకెళ్తున్నాయి. దాంతో శ్వాస, గుండె సమస్యలు మొదలు క్యాన్సర్ల దాకా వ్యాధులెన్నో కోరచాస్తాయన్న విశ్లేషణలు కలవరపరుస్తున్నాయి. రాబోయే రోజుల్లో ప్రజారోగ్యానికి ప్లాస్టిక్ పెనుముప్పుగా మారుతుందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వాలు తక్షణం జాగృతం కావాలి!

బజారుకు వెళ్లి సరకులు తెచ్చుకోవాలన్నా, ఆహార పదార్థాల పార్శిల్ తీసుకోవాలన్నా, ఇంకే అవసరాలకైనా ప్లాస్టిక్ కవర్లే గతి! నీళ్ల బాటిళ్ల నుంచి ఉప్పూ పప్పూ వంటివి నిల్వచేసే బాక్సుల వరకు సర్వం ప్లాస్టిక్ మయమే! దాంతో ఎక్కడికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు విపరీతంగా వెల్లువెత్తుతున్నాయి. వాటిలో కేవలం ఎనిమిది శాతమే పునర్వినియోగానికి మళ్లుతున్నాయి. ఇంగ్లాండ్‌లోని లీడ్స్ వర్సిటీ పరిశోధన ప్రకారం ఇండియాలోనే ఏటా అత్యధికంగా 93 లక్షల టన్నుల ప్లాస్టిక్ చెత్త రీసైక్లింగ్‌కు నోచుకోవట్లేదు. అందులో 58 లక్షల టన్నులను కాల్చేస్తుంటే, మిగిలింది పర్యావరణంలోకి చేరుతోంది. కాలక్రమంలో అది విచ్ఛిన్నమై ఆహారం, నీరు, గాలి ద్వారా తిరిగి మనిషి శరీరంలో పాగావేస్తోంది. సముద్రాలు, నదుల్లోకి చేరుతున్న మైక్రో ప్లాస్టిక్‌ల వల్ల చేపలు, తాబేళ్లతో పాటు ఎన్నో జీవజాతుల మనుగడకు ముప్పు వాటిల్లుతోంది. పాలిస్టర్ బట్టల నుంచి వెలువడే అతిసూక్ష్మ ప్లాస్టిక్ కణాలతో ప్రమాదం ఇంకా పెరుగుతోంది. ప్లాస్టిక్‌లలో 16వేల రకాల రసాయనాలుంటాయి. అందులో నాలుగో వంతు అత్యంత హానికరమైనవి. మనిషి ఆరోగ్యంతో పాటు జీవావరణాన్నీ అవి నాశనం చేస్తాయి. ఇంతటి వినాశకరమైన ప్లాస్టిక్‌ను వదిలించుకుని తీరాల్సిందే!

ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ ఉత్పత్తులను ప్రభుత్వం మూడున్నరేళ్ల కిందటే నిషేధించింది. కానీ, అధికార యంత్రాంగం వైపు నుంచి నిఘా కరవవడంతో అది అమలులో నీరుగారిపోతోంది. అందుకే, అడుగడుగునా ప్లాస్టిక్ చెత్త పేరుకుపోతోంది. ఉప్పు, చక్కెర, తాగే నీరు, చేపలు, రొయ్యలు, మానవ రక్తం నుంచి చివరికి ఎముక మజ్జలోనూ అది దర్శనమిస్తోంది. పదిహేడేళ్ల కిందటే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై పోరు ప్రారంభించిన రువాండా సమర్థ కార్యాచరణతో మెరుగైన ఫలితాలు రాబట్టింది. జర్మనీ, జపాన్ వంటి దేశాలు ప్లాస్టిక్ పునర్వినియోగంపై అధిక దృష్టి సారించి జనారోగ్యాన్ని, పర్యావరణాన్ని కాచుకుంటున్నాయి. స్వీడన్ అయితే, ప్లాస్టిక్ చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసుకుంటోంది. ఇండియా సైతం ఆయా దేశాల మేలిమి విధానాలను పరిశీలించి అందిపుచ్చుకోవాలి. ప్లాస్టిక్ చేస్తున్న చేటుపై అవగాహన కలిగిస్తూ, దాని వాడకాన్ని తగ్గించాలని ప్రజలకు తెలియజెప్పడమే కాకుండా- ఉత్పత్తి స్థాయిలోనే ప్రభుత్వాలు దాన్ని పూర్తిగా కట్టడి చేయాలి. నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలను గుర్తించి వాడుకలోకి తెచ్చేందుకు పరిశోధనలకు మరింత ఊతమివ్వాలి!



నిజమైన ప్రేమకు ఓర్పు ఉంటుంది.
అసహనంతో ఎగిరెగిరి పడేది కోరికే తప్ప
ప్రేమ కాదు. మనిషిగా పుట్టడం తేలికే.
మానవత్వంతో బతకడమే కష్టం.

– గాలిబ్

వైకుంఠుడి ఏకాదశి

'వికుంఠం' అనే పదానికి 'విష్ణులోకం' అనే అర్థాన్ని చెబుతాయి నిఘంటువులు. ఆ విష్ణులోకంలో ఉండేవాడు కాబట్టి- శ్రీమన్నారాయణుడికి 'వైకుంఠుడు' అనే పేరు స్థిరపడింది. నిజానికి వికుంఠం అనేది అత్యున్నత ఆధ్యాత్మిక సాధనకు ఫలితంగా లభించే లోకోత్తర అనుభూతి. వికుంఠుడైన మనిషిలోని దైవత్వానికి స్థావరమే- వైకుంఠం. కుంఠుడు అనే మాటకు మూర్ఖుడని అర్థం. చెడు పట్ల విశేషంగా ఆకర్షితులై, లోకంలో దురాచారాలకు పాల్పడేవారంతా - కుంఠులే! రాక్షస అంశ మితిమీరినప్పుడు మానవుడు దానవుడు అవుతాడు. మురాసురుడికి అనుచరుడవుతాడు. ఆ మురాసురుణ్ని తుదముట్టించడానికి మనిషిలో ఆవిర్భవించే దైవశక్తికి సంకేతమే- ఏకాదశి!

మహావిష్ణువు దివ్యసంకల్పంలోంచి రాక్షస సంహారం నిమిత్తం ఆవిర్భవించిన స్త్రీ శక్తి స్వరూపాన్ని ఏకాదశిగా సంభావించాయి పురాణాలు. ధ్యాన, ఉపవాస, ఉపాసనాది ఆధ్యాత్మిక సాధనల ద్వారా లోపలి కుంఠుణ్ని సమూలంగా నిర్మూలించిన నాడు- హృదయ కమలంలో దైవాంశ విచ్చుకుంటుంది. ఆ పరమాద్భుత స్థితికి వికుంఠం అని పేరు. కుంఠుణ్ని సంహరించిన ప్రతి సాధకుడూ వికుంఠుడే. సిద్ధి పొందడం ద్వారా వికుంఠుడికి దక్కేది వైకుంఠం! అందుకే 'వికుంఠ' అనే పుణ్యస్త్రీకి జన్మించడం వల్ల శ్రీహరి వైకుంఠుడయ్యాడంది అమరకోశం.



అంతర్యామి

సాధకుడికి సిద్ధిని అందించే గొప్ప తిథి - ఏకాదశి. అది పదకొండో తిథి. అంటే మనిషిని లోబర్చుకుని ఒక ఆట ఆడించే పది ఇంద్రియాల ప్రభావ తీవ్రతను నియంత్రిస్తుందని అర్థం. అలా ఏకాదశి నియమాలను ఏకాగ్రతతో, శ్రద్ధగా పాటించి, సిద్ధి పొందిన వైఖానసుడి కథను పురాణాలు వివరించాయి. తద్వారా ఆయన తన తండ్రికి స్వర్గాన్ని ప్రసాదించాడని చెప్పాయి. అలా స్వర్గసుఖాలకు కారణమయ్యే ధనుర్మాసంలోని ఏకాదశికి- సౌఖ్య'ద' ఏకాదశి అని, మోక్షప్రాప్తికి దోహదపడుతోందన్న అర్థంలో- 'మోక్ష ఏకాదశి' అనీ ప్రసిద్ధి ఏర్పడింది.

దక్షిణాదిలో వైకుంఠ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా వ్యవహరిస్తారు. దేవతల సంఖ్య మూడు కోట్లని, ముప్ఫది మూడు కోట్లని లెక్కలున్నాయి. నిజానికి కోటి అనేది సంఖ్యాశాస్త్ర సంకేతం కాదు. ఏకాదశ రుద్రులు(11), ద్వాదశ ఆదిత్యులు (12), అష్టవసువులు (8), ఇద్దరు అశ్వినీ దేవతలను కలిపి ఆ సంఖ్య ముప్ఫది మూడు అంది వేదం. సృష్టి నిర్వహణకు వారందరూ బాధ్యులే. వారినే ముక్కోటి దేవతలుగా పురాణాలు అభివర్ణించాయి. వారంతా ఒక్కటై మహావిష్ణువును సేవించడానికి తరలివచ్చే తిథిని ముక్కోటి ఏకాదశి అన్నాయి. వారి కోసం ప్రత్యేకంగా తెరచుకునే ఉత్తర ద్వారం... స్వర్గ ద్వారం. అందుకే అది స్వర్గ ద్వార ఏకాదశి అయింది. మనిషికి జాగ్రత్, స్వప్న, సుషుప్తి అనే మూడు అవస్థలుంటాయి. వాటి అంచుకు 'కోటి' అని పేరు. ఆ అంచులు దాటించి జీవుడికి జీవన్ముక్తిని అనుగ్రహిస్తుందనే విశ్వాసంతో మనవారు దాన్ని ముక్కోటి ఏకాదశి అన్నారు. ఆనాడు ముక్కోటి దేవతలతోపాటు తామూ ఉత్తర ద్వారదర్శనం చేయాలని భక్తులు ఉవ్విళ్లూరుతారు.

దర్శనమనేది మనం చేసేది కాదు- దేవుడిచ్చేది!

– ఎఱ్ఱాప్రగడ రామకృష్ణ

ఉజ్జ్వల భవితకు గ్రీన్ స్కిల్స్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతోంది. వాతావరణ మార్పులు, కర్బన ఉద్గారాల నియంత్రణ, పర్యావరణ బాధ్యత వంటి అంశాలు ప్రభుత్వ విధానాలు, కార్పొరేట్ వ్యూహాలు, పెట్టుబడుల నిర్ణయాలను కూడా ప్రభావితం చేస్తున్నాయి. భారత్ సహా ప్రపంచమంతా హరిత ఆర్థిక వ్యవస్థ (గ్రీన్ ఎకానమీ) వైపు అడుగులు వేస్తోంది. ఈ మార్పు భారత యువతకు ఉపాధిని పెంచుతుందా, అవకాశాలను తగ్గిస్తుందా అన్నది ఇప్పుడు కీలక ప్రశ్న.

ప్రపంచవ్యాప్తంగా హరిత పరిశ్రమలకు సంబంధించిన ఉద్యోగాలకు డిమాండు ఎంతో వేగంగా పెరుగుతోందని 'లింక్డిన్' ఇటీవల విడుదల చేసిన 'గ్రీన్ స్కిల్స్ రిపోర్ట్' స్పష్టీకరిస్తోంది. అదే సమయంలో మనదేశంలో గిరాకీకి తగిన స్థాయిలో వృత్తి నిపుణులు లేరన్న విషయాన్ని అది గుర్తుచేస్తోంది. ప్రపంచమంతా హరిత



సాంకేతిక మార్పుల దిశగా అడుగులు వేస్తున్న సందర్భంలో, నైపుణ్యాల కొరత మూలంగా కొత్త అవకాశాల్ని అందిపుచ్చుకోవడంలో భారతీయ యువత వెనకంజ వేసే ప్రమాదం ఉంది.

ఆయా దేశాల్లో 2021–25 మధ్య హరిత ఉద్యోగాల్లో నియామకాల వార్షిక పెరుగుదల రేటు (శాతాల్లో)...

దేశం	నియామకాలు
బ్రెజిల్	10.7
అమెరికా	8.9
కెనడా	8.7
యూకే	7.8
ఆస్ట్రేలియా	5.8
జర్మనీ	5.4
ఇండియా	5.3
ఫ్రాన్స్	4.9

బహుళ రంగాల్లో ఉద్యోగాలు

గ్రీన్ ఉద్యోగాలు అంటే ఇప్పటికీ చాలామందికి సౌర ప్యానెల్ ఇంజినీర్లు, విండ్ టర్బైన్ టెక్నీషియన్లే గుర్తుకొస్తారు. గ్రీన్ ఉద్యోగాలు ఇప్పుడు బహుళ రంగాలకు విస్తరించాయి. ఈఎస్జీ అనలిస్టులు, సస్టెయినబిలిటీ కన్సల్టెంట్లు, క్లైమేట్ రిస్క్ మేనేజర్లు, కార్బన్ అకౌంటింగ్ నిపుణులు, గ్రీన్ ఫైనాన్స్ వృత్తి నిపుణులు, సప్లై చైన్ సస్టెయినబిలిటీ మేనేజర్లు వంటి కొలువులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ ఉద్యోగాలకు కేవలం పర్యావరణంపై అవగాహన సరిపోదు. ఫైనాన్స్, చట్టం, పాలసీ, డేటా అనలిటిక్స్ వంటి రంగాలపై సమగ్ర అవగాహన అవసరం. ఇక్కడే భారతదేశ విద్యా వ్యవస్థలోని లోపం బయట పడుతోంది. 'లింక్డిన్' నివేదిక ప్రకారం, విశ్వవిద్యాలయాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు ఈ నైపుణ్యాలతో సిద్ధంగా ఉండటం లేదు. చాలా భారతీయ కళాశాలలు ఇప్పటికీ సస్టెయినబిలిటీని ఒక ఐచ్ఛిక అంశంగానే చూస్తున్నాయి. ఇదంతా గ్రీన్ ఎకానమీ అవసరాలకు సరిపోదు. అలాగని మనదేశంలో పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగానే ఉందని చెప్పలేం. కొన్ని విద్యా సంస్థలు ఇప్పటికే మార్పును గుర్తించి ముందడుగు వేశాయి. దిల్లీలోని 'టెరి' స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ సంస్థ సస్టెయినబిలిటీ మేనేజ్‌మెంట్, క్లైమేట్ సైన్స్, పాలసీల్లో ఎంబీఏ కోర్సును అందిస్తూ గ్రీన్ స్కిల్స్ విద్యలో భారత్‌కు మార్గదర్శకంగా నిలుస్తోంది. మద్రాస్, దిల్లీ ఐఐటీలు, ఐఐఎస్సీ బెంగళూరు వంటి సంస్థలు రెన్యూవబుల్ ఎనర్జీ, క్లైమేట్ సైన్స్, సస్టెయినబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై శిక్షణ, పరిశోధన అందిస్తున్నాయి. బిజినెస్ విద్యలో కూడా మార్పు కనిపిస్తోంది. ఐఐఎం అహ్మదాబాద్, బెంగళూరు, డీవోఎంఎస్-నల్సార్, ఎక్స్ఎల్ఆర్ఐ వంటి ప్రముఖ బిజినెస్ స్కూల్స్ ఈఎస్జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్), రెస్పాన్సిబుల్ బిజినెస్, సస్టెయినబుల్ ఫైనాన్స్ వంటి ఎలెక్టివ్ కోర్సులను ప్రవేశపెట్టాయి. టిస్, అశోకా యూనివర్సిటీ, ఒ.పి.జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలు సస్టెయినబిలిటీ, పర్యావరణ పాలసీ, క్లైమేట్ గవర్నెన్స్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే ఇలాంటివన్నీ కొద్దిమంది విద్యార్థులకే అందుబాటులో ఉండటం మరో సమస్య.

గ్రీన్ స్కిల్స్ విషయంలో ఇతర దేశాలు ఎంతో ముందున్నాయి. హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ ప్రధాన అధ్యయనంగా ఉంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీలు సస్టెయినబిలిటీ విద్యకు ప్రపంచ కేంద్రాలుగా గుర్తింపు పొందాయి. ఇన్సీడ్, యేల్ వంటి సంస్థలు ఎంబీఏలో సస్టెయినబిలిటీ, క్లైమేట్ ఫైనాన్స్, ఎనర్జీ ట్రాన్సిషన్ వంటి ప్రత్యేక కోర్సులను అందిస్తున్నాయి. ఈ సంస్థల్లో సస్టెయినబిలిటీ కీలకం. సంప్రదాయ పరిశ్రమల్లో కూడా గ్రీన్ స్కిల్స్ నిపుణుల అవసరం పెరుగుతోంది. తయారీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, ఐటీ, కన్సల్టింగ్, స్థిరాస్తి వంటి రంగాల కంపెనీలు సస్టెయినబిలిటీ సంబంధిత నైపుణ్యాలను ఆశిస్తున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు గ్రీన్ ఫైనాన్స్, క్లైమేట్ రిస్క్ అసెస్‌మెంట్, ఈఎస్జీ రిపోర్టింగ్ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులను కోరుకుంటున్నాయి. ఐటీ, టెక్నాలజీ కంపెనీలు ఎనర్జీ ఎఫిషియెన్సీ, కార్బన్ ఫుట్‌ప్రింట్ మానిటరింగ్, సస్టెయినబుల్ డేటా సెంటర్లపై పనిచేసే నిపుణులను నియమించుకుంటున్నాయి. ఇలాంటి గ్రీన్ నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులకు కెరీర్ అవకాశాలు విస్తృతమవుతున్నాయి. వేతనాలు కూడా ఇతర సాధారణ నైపుణ్యాల కంటే మెరుగ్గా లభిస్తున్నాయి.

యువతకు సంకేతం


గ్రీన్ స్కిల్స్ భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు కేంద్రబిందువుగా మారనున్నాయి. ఈ పరిణామాలు భారత యువతకు స్పష్టమైన సంకేతాన్నిస్తున్నాయి. ప్రపంచ స్థాయి ఉద్యోగ మార్కెట్ హరిత నైపుణ్యాలకే ప్రాధాన్యం ఇస్తోంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే విద్యా వ్యవస్థ, పరిశ్రమలు, ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేయాలి. గ్రీన్ స్కిల్స్‌ను ప్రధాన విద్యలో భాగంగా చేయాలి. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, లా, ఎకనామిక్స్ వంటి కోర్సులేవైనా- సస్టెయినబిలిటీ, క్లైమేట్ లిటరసీ తప్పనిసరి కావాలి. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య బలమైన అనుసంధానం అవసరం. ఉద్యోగ మార్కెట్‌లో వస్తున్న మార్పులకు తగినట్లుగా సిలబస్ కూడా వేగంగా మారుతుండాలి. ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు గ్రీన్ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. యువత మారుతున్న మార్కెట్‌ను అర్థం చేసుకుని గ్రీన్ స్కిల్స్ నేర్చుకోవాలి. లింక్డిన్ నివేదికను మన దేశానికి ముందస్తు హెచ్చరికగా భావించాలి. భారత్ ఈ మార్పులకు నాయకత్వం వహిస్తుందా, నైపుణ్యలేమితో వెనకబడుతుందా... అనేది కాలమే నిర్ణయిస్తుంది.



ప్రొఫెసర్ పి.శ్రీనివాస్ సుబ్బారావు
మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి,
నల్సార్ లా యూనివర్సిటీ

కొంతమంది వ్యక్తుల గురించి వాళ్ల పనితనమే మాట్లాడుతుంది. పీయూష్ పాండే ఆ కోవకు చెందిన వ్యక్తే. ప్రకటనలతో ఒక ట్రెండ్‌ను సృష్టించిన సృజనశీలత ఆయన సొంతం. ఫెవికాల్, క్యాడ్‌బరీ, ఏషియన్ పెయింట్స్, హచ్, వొడాఫోన్ వంటి బ్రాండ్‌లను తలచుకోగానే పాండే ప్రకటనలు గుర్తొస్తాయి. చూసిన ప్రతిసారీ, మొదటిసారి చూసినంత ఆకర్షణీయంగా, ఆలోచనాత్మకంగా, హాస్యభరితంగా ఉండటం పీయూష్ ప్రకటనల ప్రత్యేకత.

ప్రకటనలంటే... పాండే!



దూరదర్శన్, శాటిలైట్ టీవీల రాక, ఆర్థిక సరళీకరణలతో దేశంలో ప్రకటనల రంగం ఊపందుకుంది. అలిక్ పదమ్సీ, ప్రహ్లాద్ కక్కర్, సురేష్ మాలిక్ వంటి వారు 70లు, 80ల్లో భారతీయ ప్రకటనల రంగానికి విశిష్టతను కల్పించారు. తరవాతి కాలంలో ఆర్.బాల్కి, అర్వింద్ శర్మ, పీయూష్ పాండే.. తమవైన ముద్ర వేశారు. ముఖ్యంగా పీయూష్‌ని ప్రకటనల రంగంలో దిగ్గజం అనవచ్చు. జైపుర్‌లో జన్మించిన పీయూష్ అక్కడే పాఠశాల విద్య పూర్తిచేశాక, దిల్లీలో సెయింట్ స్టీఫెన్స్ నుంచి పీజీ చేశారు. ఉద్యోగం కోసం 1980ల్లో ముంబయి చేరారు. ఆయన భాషా పరిజ్ఞానం, సృజనాత్మకతను గుర్తించిన ఓ స్నేహితుడు ప్రకటనల రంగంలోకి అడుగుపెట్టమని సూచించారు. అలా ఒగిల్వీ సంస్థలో ట్రైనీ అకౌంట్ ఎగ్జిక్యూటివ్‌గా చేరారు. తరవాత ఆరేళ్లకు పీయూష్ ప్రతిభను గుర్తించి ప్రకటనల విభాగంలోకి మార్చిందా కంపెనీ. ఆయన ప్రకటనలు సూటిగా, సృజనాత్మకంగా, వాస్తవికంగా ఉంటాయి. వాటిలో భారతీయ సంస్కృతిని మేళవించడంతోపాటు కథనంలో మంచి అల్లిక, బిగింపు కనపడతాయి. పీయూష్ క్రికెటర్ కూడా. రాజస్థాన్ తరఫున రంజీలు ఆడారు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా రైళ్లలో తిరిగి సామాన్యుల్ని దగ్గరగా చూశారు. తన మాటల్లో క్రికెట్ భాష ఎక్కువగా వినిపిస్తుంది. క్యాడ్‌బరీ ప్రకటనలో బ్యాటర్ సెంచరీ కొట్టగానే ఓ అమ్మాయి చాక్లెట్ తింటూ మైదానంలోకి డ్యాన్స్ చేసుకుంటూ రావడం.. క్రికెట్‌పై ఆయనకున్న మక్కువకు నిదర్శనం. ఎనభైల్లో పీయూష్ కలం నుంచి జాలువారిన 'మిలే సుర్ మేరా తుమ్హారా' గీతం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటింది.

ఒక సంస్థ ఎంత వినూత్నమైన, ఉత్తమమైన ఉత్పత్తి తెచ్చినా, ఆ విషయం వినియోగదారులకు సరిగ్గా చేరితేనే ఆ బ్రాండ్ విజయం సాధిస్తుంది. 'ఉత్పత్తి వినియోగదారులకు భావోద్వేగపరంగా దగ్గరవ్వాలి, బ్రాండ్‌ని మంచి కథ ద్వారా, హాస్యాన్ని జోడించి చెబితే హృదయాన్ని హత్తుకుంటుంది' అనేది పీయూష్ మాట. పీయూష్ ఆధ్వర్యంలో వచ్చిన 'దో బూంద్ జిందగీ కే' (జీవితం కోసం రెండు చుక్కలు) పోలియో ప్రచారం అద్భుతంగా పనిచేసింది.

2016లో 'పద్మశ్రీ' అందుకున్న పీయూష్- ప్రకటనల రంగంలో ఇచ్చే 'లయన్ ఆఫ్ సెయింట్ మార్క్' అవార్డును తమ్ముడు ప్రసూన్‌తో పంచుకున్నారు. భిన్నమైన అభిరుచులూ అనుభవాలు సృజనాత్మకతలో కీలకమనే పీయూష్ మాట అక్షరసత్యం. ఇటీవలే తుదిశ్వాస విడిచిన ఆయనది ప్రకటన రంగంతో ఫెవికాల్ బంధం. మీసకట్టుతో ఉండే పీయూష్ ముఖచిత్రం భారతీయ ప్రకటనల రంగానికి మస్కట్‌గా నిలిచిపోతుంది.

– సుంకరి చంద్రశేఖర్

బరువెక్కుతున్నారు!

గతి తప్పిన జీవన విధానం, విపరీతంగా జంక్‌ఫుడ్ వినియోగం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఊబకాయుల సంఖ్య అధికమవుతోంది. బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ) 30 మించితే మధుమేహం, అధిక బీపీలతో పాటు గుండెజబ్బులు, కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. 2022లో ప్రపంచవ్యాప్తంగా 18 ఏళ్లు పైబడిన జనాభాలో 16.02 శాతం మంది స్థూలకాయులే. ఆయా దేశాల్లో అలాంటి వారు ఎందరున్నారంటే (శాతాల్లో)...

అమెరికా	42.87
ఆస్ట్రేలియా	31.82
బ్రెజిల్	28.76
యూకే	28.71
రష్యా	28.05
కెనడా	27.32
ఇండోనేసియా	11.5
శ్రీలంక	10.61
చైనా	8.21
మయన్మార్	7.54
ఇండియా	7.21
దక్షిణ కొరియా	6.73
నేపాల్	6.58
బంగ్లాదేశ్	5.29

(ఆధారం: డబ్ల్యూహెచ్‌వో-గ్లోబల్ హెల్త్ అబ్జర్వేటరీ 2025)

కారడవులను కాపుగాసే ఏఐ!

ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వినియోగం విస్తృతమవుతోంది. అటవీశాఖ పనితీరును మెరుగుపరచడంలోనూ ఇది బహుళ ప్రయోజనకారిగా పనిచేసే అవకాశం ఉంది. అటవీశాఖ దగ్గర దశాబ్దాల సమాచారం ఉంది. ఏఐతో దీన్ని విశ్లేషించడం ద్వారా వన్యప్రాణులు తరచూ సంచరించే ప్రదేశాలను ముందుగానే గుర్తించవచ్చు. టేకు, ఎర్రచందనం వంటి కలపనిచ్చే వృక్ష జాతులు విస్తరించిన ప్రాంతాల్లో ఏఐతో గట్టి నిఘా పెట్టడం, చెట్లు నరికే వ్యక్తులనూ సమూహాలను గుర్తించడం, మనుషులకు వన్యప్రాణులకు మధ్య జరిగే సంఘర్షణ ప్రదేశాలను గమనించడం, వాటిని నివారించడానికి తగిన చర్యలను తీసుకోవడం సాధ్యమవుతుంది. విస్తారమైన డేటాను విశ్లేషించడం, అంచనా నివేదికలను రూపొందించడం వంటి సామర్థ్యాలు కలిగిన ఏఐ- అడవుల నిర్వహణ, సంరక్షణలో ఆధునిక సాంకేతికత సాయాన్ని పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. అటవీ పర్యవేక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టడం, వాతావరణ మార్పులను ముందుగానే గుర్తించడం, వాటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం తదితర అంశాల్లోనూ ఏఐ వాడకం వేగంగా విస్తరిస్తోంది.



దేశంలో ఎనిమిది కోట్లకుపైగా హెక్టార్లలో అడవులు విస్తరించాయి. జీవ వైవిధ్యానికి నిలయాలైన అరణ్యాలు... కర్బన నిల్వలు, వాతావరణ నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. విస్తీర్ణం, సాంద్రత తగ్గుదల, వనరుల దుర్వినియోగం, అగ్నిప్రమాదాలు, వాతావరణ మార్పులు వంటి తీవ్ర సవాళ్లను అడవులు ఎదుర్కొంటున్నాయి. సంప్రదాయ అటవీ నిర్వహణ పద్ధతులతో వీటిని అధిగమించడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో అటవీ సంరక్షణ, సమర్థ నిర్వహణలో కృత్రిమ మేధ(ఏఐ) ఆశాకిరణంగా కనిపిస్తోంది.

తక్షణ హెచ్చరికలకు...

అనేక ప్రాంతాల్లో విస్తరించిన అరణ్యాల్లో ఎక్కడో కొన్ని ప్రదేశాల్లో అటవీ ప్రాంతాల ఆక్రమణ, వనరుల దోపిడీ వంటివి జరుగుతూనే ఉంటాయి. అటువంటి ప్రదేశాలను కాలినడకన గస్తీ తిరిగే సిబ్బంది గుర్తించడంలో ఆలస్యం జరగవచ్చు. డ్రోన్లు, ఏఐ ఆధారిత పరికరాల ద్వారా వాటిని గుర్తించి, తక్షణమే సిబ్బంది అక్కడికి చేరుకుని నష్టాన్ని అరికట్టవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో భూఆధారిత సమాచార వ్యవస్థ (జీఐఎస్) ఉపగ్రహ చిత్రాలను ఉపయోగిస్తూ అటవీ ప్రాంతాల్లో సంభవించే మార్పులను తరచూ అధ్యయనం చేస్తూ, వాటికిగల కారణాలను విశ్లేషించి, అటవీ నిర్వహణ తీరును మెరుగుపరిచే కృషి జరుగుతోంది. నాగార్జున సాగర్, అమ్రాబాద్, కవ్వాల్ వంటి పులుల సంరక్షణ కేంద్రాల్లో పులుల కదలికలు, పర్యవేక్షణకు ఎం-స్ట్రైప్స్ వ్యవస్థను ఉపయోగిస్తున్నారు. అగ్నిప్రమాదాలకు సంబంధించిన చారిత్రక డేటా, వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రమాదం సంభవించడానికి అవకాశం ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించవచ్చు. ఈ క్రమంలో ఏఐ ఆధారిత పరికరాలు తక్షణ హెచ్చరికలను అందిస్తూ అగ్నిమాపక సిబ్బందికి సహాయ పడుతున్నాయి. దీని వల్ల విపత్తువేళ స్పందన సమయం 20-40శాతం తగ్గినట్లు వెల్లడైంది. శబ్ద పర్యవేక్షణ ద్వారా పక్షుల కిలకిలలు, పులుల గర్జనలు వంటి వాటిని ఏఐ సాంకేతికత విశ్లేషిస్తోంది. వివిధ జీవజాతులను గుర్తిస్తోంది. కెమెరా ట్రాప్స్ ద్వారా సేకరించిన లక్షల సంఖ్యలోని చిత్రాలను ఏఐ వర్గీకరిస్తూ మానవ శ్రమను తగ్గిస్తోంది. అస్సాం, కేరళలో ఏనుగుల విషయంలో వినియోగించిన ఏఐ ఆధారిత సాంకేతిక ఉపకరణాలు మానవ-జంతు ఘర్షణలను తగ్గించాయి.

వేటగాళ్లపై నిఘాకు...

అటవీ పరిరక్షణ, నిర్వహణలో ఏఐ సాంకేతికతను వాడే విషయంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. స్థానిక జాతులు, నేల నాణ్యత, వన్యప్రాణుల కదలికలపై డేటా లభ్యత తక్కువగా ఉంటోంది. మౌలిక వసతుల లోపం, ఇంటర్నెట్, విద్యుత్ సౌకర్యం లేని ప్రాంతాల్లో ఏఐ ఉపకరణాలను వినియోగించడం కష్టమవుతుంది. ఏఐ పరికరాలు ఖరీదైనవి, పైగా సిబ్బంది శిక్షణకు అధిక వ్యయం అవుతుంది. ఇలాంటి సమస్యలను అధిగమించాల్సిన అవసరం ఉంది. ఏఐ ద్వారా నేల ఆరోగ్యం, కార్బన్ స్థాయులు, వేటగాళ్ల కార్యకలాపాలను పర్యవేక్షించే స్మార్ట్ సెన్సర్లను అభివృద్ధి చేసుకోవాలి. జాతీయ హరిత మిషన్ కింద ఏఐ వినియోగానికి విధానపరమైన ప్రోత్సాహం అందించాలి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం, గ్రామస్థులు, విద్యార్థులు మొబైల్ యాప్‌ల ద్వారా అక్రమ కార్యకలాపాలను ప్రభుత్వానికి నివేదించడం వంటి పనులు చేపట్టవచ్చు. అటవీ సంరక్షణలో సమర్థ పర్యవేక్షణ, తక్షణ చర్యలు మొదలు అంచనా, విశ్లేషణల దాకా ఏఐ కీలకపాత్ర పోషిస్తుంది. రాబోయే కాలంలో సవాళ్లను మరింత సమర్థంగా అధిగమిస్తూ అందరి సహకారంతో ముందుకు సాగితే- ఏఐ ఆధారిత అటవీ నిర్వహణలో భారత్ ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తుంది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో అటవీ విభాగాలను ఆధునికీకరించడం, కొత్త సాంకేతికతను, పరికరాలను, మెలకువలను సమకూర్చడం అవసరం.



డాక్టర్ దెందులూరి నళినీ మోహన్
విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి,
ఏపీ రాష్ట్ర పూర్వ ముఖ్య వన్యప్రాణి సంరక్షణాధికారి

మూడు సూత్రాలు

స్కూల్ నుంచి రాగానే మ్యాథ్స్ హోంవర్క్ చేయడానికి కూర్చున్నాడు గిరి. కానీ తనకు అస్సలు అర్థంకావట్లేదు. దాంతో పుస్తకాలు పక్కన పెట్టి మౌనంగా కూర్చున్నాడు. అదంతా గమనించిన వాళ్ల నాన్న మాధవరావు.. 'లెక్కలు బాగా రావాలంటే మూడు సూత్రాలు తెలియాలి. అవి తెలిస్తే చాలా తేలిక' అని చెప్పాడు. 'అవునా! అవేంటో చెప్పండి నాన్నా!' అడిగాడు గిరి. 'అది తరవాత చెబుతాలే గానీ.. మన ఊర్లో సర్కస్ జరుగుతోంది వెళ్దాం పద!' అన్నాడు నాన్న. 'అవునా! అయితే తొందరగా పదండి నాన్నా!' అన్నాడు గిరి. అక్కడ రకరకాల విన్యాసాలు చేశారు. అవన్నీ చాలా ఆసక్తిగా చూశాడు గిరి. చేతిలో కర్ర పట్టుకుని ఒక అమ్మాయి తాడుపైన, ఎక్కడా పట్టు తప్పకుండా నడిచింది. సర్కస్



పూర్తవ్వగానే ఇంటికి వచ్చేశారు గిరి, వాళ్ల నాన్న. 'భలే ఉంది నాన్నా సర్కస్. ఎంత బాగా చేశారో. అవును మీరు మూడు సూత్రాల గురించి చెబుతా అన్నారు. ఇప్పుడు చెప్పండి నాన్నా!' అన్నాడు గిరి. 'నువ్వు సర్కస్‌లో ఫీట్లు అన్నీ చూసి ఆనందించావు కదా! చివర్లో ఒకమ్మాయి తాడుపైన నడవటం ఇంకా విచిత్రంగా అనిపించింది. దాని ఆధారంగానే నేను చెప్పేది ఉంటుంది' అన్నాడు మాధవరావు. 'అవునా! అయితే తొందరగా చెప్పండి నాన్నా!' మళ్లీ అన్నాడు గిరి. 'ఏకాగ్రత, పట్టుదల, అభ్యాసం.. ఏ పనినైనా సాధించడానికి కావాల్సినవి. ఈ మూడు సూత్రాలు పాటిస్తే చాలు. ఒక పని చేసేటప్పుడు దాని మీద ఏకాగ్రత, చేయగలననే పట్టుదల ఉండాలి. ఒకటికి పదిసార్లు సాధన చేయాలి. అలా చేసినప్పుడే విజయం సాధిస్తాం. లేకపోతే మధ్యలోనే ఆగిపోతాం. సర్కస్‌లో ఆ తాడు మీద నడిచిన అమ్మాయికి ఆ మూడింట్లో ఏది లేకపోయినా మధ్యలోనే కిందపడిపోయేది. నువ్వు కూడా పట్టుదలతో ఉండు. ఏకాగ్రతతో లెక్కలు చేయడానికి ప్రయత్నించు. అప్పుడు కష్టంగా అనిపించదు' అన్నాడు నాన్న. 'అలాగే నాన్నా! మీరు చెప్పినట్లే చేస్తాను' అన్నాడు గిరి.

– కె.కె.రఘునందన

నేనెవర్ని?

1. నాలుగు అక్షరాల పదాన్ని నేను. 'జత'లో ఉంటాను కానీ 'పాత'లో లేను. 'నయం'లో ఉంటాను కానీ 'గాయం'లో లేను. 'వర్షం'లో ఉంటాను కానీ 'హర్షం'లో లేను. 'హరి'లో ఉంటాను కానీ 'హల్లు'లో లేను. నేనెవర్ని?
2. నేనో మూడు అక్షరాల పదాన్ని. 'ధనం'లో ఉంటాను కానీ 'దానం'లో లేను. 'రణం'లో ఉంటాను కానీ 'కణం'లో లేను. 'వాణి'లో ఉంటాను కానీ 'వారం'లో లేను. ఇంతకీ నేనెవరినో తెలిసిందా?

జవాబు: 1.జనవరి 2.ధరణి

(c) eenadu

ప్రభుత్వ స్థలంలోనే ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు

తప్పుడు ప్రచారాలు నమ్మొద్దన్న కలెక్టర్ లక్ష్మీశ

విద్యాధరపురం, న్యూస్‌టుడే : 'ప్రభుత్వ స్థలంలోనే ఆవకాయ్ అమరావతి ఉత్సవాలు నిర్వహిస్తాం.. ప్రభుత్వ స్థలాల సమీపంలోని ప్రైవేటు వారి గోడలు, నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు చేస్తున్న ప్రచారం అవాస్తవం. సందర్శకులకు ఇబ్బంది లేకుండా షెడ్లను ఖాళీ చేయమని కోరాం. సందర్శకుల భద్రత దృష్ట్యా మాత్రమే ఎగ్జిబిషన్ అనుమతులు తాత్కాలిక అనుమతులు రద్దు చేశాం.. దీనిపై కొందరు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ వదంతులను నమ్మొద్దు. అవగాహన రాహిత్యంతో అసత్యాలు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టతనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం- 2026 జనవరి 8 నుంచి 10 వరకు భవానీ ఐలండ్, బరం పార్కు, సైన్సు సెంటర్, పున్నమి ఘాట్ పరిసరాల్లో 'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

సైబర్ మోసాలు.. అవగాహన పెంచుకోండిలా..!

★ డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ 30న

ఈనాడు మీతోడు



సైబర్ నేరాలు నిత్యకృత్యమయ్యాయి. ఏ లింక్ క్లిక్ చేస్తే ఏమవుతుందో? ఖాతా ఎప్పుడు ఖాళీ అవుతుందో అని అందరూ బెంబేలెత్తిపోతున్నారు. పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని దోచేస్తున్నారు. డబ్బులు పోతే తిరిగి వస్తాయన్న నమ్మకం పూర్తిగా పోయింది. వీటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కావాల్సిన సాయం తదితర అంశాలపై 'ఈనాడు' సైబర్ క్రైం డీసీపీ కె.కృష్ణ ప్రసన్నతో ఫోన్ ఇన్ కార్యక్రమం చేపట్టింది. ప్రజలు తమకున్న సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. మీరు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో దిగువ నంబరుకు ఫోన్ చేయడమే. - ఈనాడు, అమరావతి

80085 74651 | 30.12.25 మంగళవారం | ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

యూరియా దందా.. అంతే లేదయా!

బస్తా రూ.400లకు పైగా అమ్మకం ✪ తెలంగాణకు తరలుతున్నా పట్టదే..

ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, తిరువూరు



తిరువూరు లక్ష్మీపురం సొసైటీ దగ్గర యూరియా కోసం పడిగాపులు

జిల్లాలో ప్రైవేటు వ్యాపారుల యూరియా దందా హద్దు దాటుతోంది. కృత్రిమ కొరత సృష్టించి నల్లబజారులో అడ్డగోలుగా అమ్మేస్తున్నారు. నిల్వలు రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ప్యాకేజీలు పెట్టి అమ్మకాలు: ★ వరి, మొక్కజొన్న, మిరప, పుల్ల శనగ, కూరగాయలు సాగు జరుగుతోంది. దీంతో ప్రైవేటు వ్యాపారులంతా కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ★ 50 కిలోల బస్తా రూ. 266.50లకు అమ్మాలి. రూ.350-400 పైగా అమ్ముతున్నారు. ★ తిరువూరులో దాదాపు అన్ని దుకాణాల్లో మూడు బస్తాల కాంప్లెక్స్ ఎరువు కొంటేనే రెండు బస్తాల యూరియా ఇస్తున్నారు. ఇలా మొత్తం కలిపి తీసుకుంటే రైతుకు రూ.5 వేలు భారమే. యూరియా మాత్రమే కావాలంటే లేదని చెప్పేస్తున్నారు. ★ కొన్ని సొసైటీల్లోనూ ఇదేతీరు. తిరువూరులో ఓ సొసైటీలో మూడు కాంప్లెక్స్ ఎరువుల బస్తాలు కొంటేనే రెండు యూరియా బస్తాలు ఇస్తామని చెబుతున్నారు. ★ నందిగామ, ఎ.కొండూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం... ఇలా ప్రతి చోట ఇదే తంతు. గ్రోమోర్, సొసైటీలు, ఆర్ఎస్‌కేల్లో నిల్వలు వచ్చినా వెంటనే ఖాళీ అయిపోతున్నాయి. నిల్వలు రాగానే కొందరు రైతులు అవసరం ఉన్నా లేకున్నా కొని దాచుతున్నారు.

అక్రమ రవాణా..

తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట.. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలు కావడంతో భారీగా యూరియా పొరుగు రాష్ట్రానికి తరలిపోతోంది. స్థానిక రైతులకు పాస్‌పుస్తకం, ఆధార్ ఉంటేనే యూరియా ఇస్తామంటున్న వ్యాపారులు తెలంగాణ రైతులకు మాత్రం ఎన్ని కావాలంటే అన్ని బస్తాలు ఇచ్చేస్తున్నారు.

సమీక్షలతో సరి.. ★ యూరియా అక్రమాలపై అధికారులకు తెలిసినా వ్యాపారులతో మొక్కుబడి సమావేశాలు పెట్టి సరిపెడుతున్నారు. అంతా బాగుందని ఉన్నతాధికారులను మభ్యపెడుతున్నారు. ★ వ్యాపారుల అక్రమాలపై ఉన్నతాధికారులు సైతం ఆకస్మిక తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకునేందుకు కదలడం లేదు. స్థానిక అధికారులు వ్యాపారులను కాపాడటానికి తాయిలాల ముచ్చటే కారణమని రైతులు వాపోతున్నారు.

★ జిల్లా వ్యవసాయాధికారిణి విజయకుమారి మాట్లాడుతూ.. సమావేశాలు పెట్టి వ్యాపారులను హెచ్చరించామనీ.. పద్ధతి మార్చుకోకుంటే తనిఖీలతో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 29వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతి పత్రాలను స్వీకరించనున్నట్లు వివరించారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ దాఖలు

ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.



హుషారెత్తించిన విజయ్‌ప్రకాశ్, నేహ



విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలకు తరలివచ్చిన నగరవాసులు



ఉర్రూతలూగించిన దినకర్, సమీరా భరద్వాజ్

ఊరంతా సరిగమ.. ఊసంతా మధురిమ!

✧ కృష్ణా తీరాన ఆనంద తాండవం చేసిన విజయవాడవాసులు
✧ ఘనంగా 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాల వేడుకలు

ఈనాడు @50 | ETV @30 వసంతాల వేడుకలు

ఈనాడు, అమరావతి
- విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే

'**సం**గీత సవ్వడులకు కృష్ణా తీరం పులకించింది. దేదీప్య కాంతుల నడుమ.. ఉర్రూతలూగించే సంగీతం.. ఆకట్టుకునే గీతాలకు.. ఆహుతులు మైమరచిపోయారు. ప్రముఖ గాయనీ, గాయకులతో కలిసి స్వరం కలిపి.. ఆనంద తాండవం చేశారు. 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా.. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వేడుకలు కనులపండువగా సాగాయి. వేల మంది ప్రజలు తరలివచ్చి.. వేడుకలను తిలకించారు. సినీ నేపథ్య గాయకులు.. విజయ్‌ప్రకాష్, సమీరా భరద్వాజ్, దినకర్, నేహా, హరిప్రియ, ఇండియన్ ఐడల్ రేవంత్, మంగ్లీ, వాగ్దేవి, రిషిల్.. ఆలపించిన గీతాలకు.. ఆహ్వానితులు ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ఆదివారం కావడంతో.. కుటుంబాలు, పిల్లలతో కలిసి.. భారీగా నగరవాసులు తరలివచ్చి.. ఆస్వాదించారు. ఉర్రూతలూగించే సినీ గీతాలకు.. చిన్నాపెద్ద కేరింతలు కొడుతూ.. స్టెప్పులేస్తూ ఉల్లాసంగా గడిపారు.



50 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లు..

విజయవాడతో నాకు విడదీయలేని అనుబంధం ఉంది. ఇక్కడ ఈనాడు, 50, ఈటీవీ 30 ఏళ్ల ఉత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఇన్నేళ్ల ప్రస్థానంలో ఎన్నో అద్భుతమైన కార్యక్రమాలను 'ఈనాడు, ఈటీవీ' చేపట్టాయి. రామోజీరావు చేపట్టిన మహా యజ్ఞం ఫలాలివి. ఆయన సినిమా రంగానికి చేసిన సేవలు అనన్యం. సువిశాల ప్రదేశంలో రామోజీ ఫిల్మ్‌సిటీని స్థాపించి.. కొలమానం లేనన్ని సేవలు అందించారు. ఈటీవీ పాడుతా తీయగా.. లాంటి కార్యక్రమాలు.. ప్రజలకు ఎంతో చేరువయ్యాయి. ఈ వేడుకలకు వెళ్లాలని రామోజీరావు ఆదేశించారు.. సిబ్బంది ఆహ్వానించారు.. నేను విచ్చేశాను.

- బ్రహ్మానందం, ప్రముఖ సినీ హాస్యనటులు




బొమ్మరిల్లు సీరియల్ టీం సందడి





మంగ్లీ, హరిప్రియ, రేవంత్



ఇక్కడి నుంచి ఆరంభిస్తే విజయమే..

మా 'అనగనగ ఒకరోజు' సినిమా ప్రచార కార్యక్రమాలను విజయవాడలోని ఈ వేదిక మీద నుంచి ఆరంభిస్తున్నాం. ఇక్కడి నుంచి ఆరంభిస్తే విజయం వరిస్తుందనే నమ్మకం ఉంది. అందుకే విజయవాడలో ఈ వేదిక పైనుంచి ఆరంభిస్తున్నాం. జనవరి 14న సినిమాను అందరూ తప్పకుండా చూడాలి. - నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి

కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సుమ కనకాల వ్యవహరించారు. సినీనటి మానసచౌదరి, బొమ్మరిల్లు శిరీష తమ నృత్యాలతో అలరించారు. ముఖ్య అతిథిగా బ్రహ్మానందం పాల్గొన్నారు.



ప్రత్యేక అతిథులుగా.. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు, కలెక్టర్ లక్ష్మీశ, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సమస్యలకు..
అరచేతిలో పరిష్కారం

మీ ప్రమేయం లేకుండానే ఖాతాలో నగదు కట్ అయిందా.. ఖాతా పూర్తిగా స్తంభించిపోయిందా..బ్యాంకు మార్చిన చెక్ సొమ్ము ఖాతాలో జమ కాలేదా.. ఇలాంటి ఇబ్బందులు వచ్చినప్పుడు ఖాతాదారులకు ఏం చేయాలో పాలుపోదు..పడుతూ లేస్తూ బ్యాంకుకు పరుగులు పెడతారు. నానా హైరానా పడిపోతుంటారు. బ్యాంకు సమస్యలు ఉత్పన్నమైతే అరచేతిలోనే పరిష్కారం ఉంది. అసలేంటీ నంబర్లు..ఈ అంబుడ్స్‌మెన్‌లో ఫిర్యాదులు ఎలాగో తెలుసుకుందాం పదండి. – ఈనాడు, అమరావతి

ఇవీ టోల్ ఫ్రీ నంబర్లు...

- యూనియన్ బ్యాంకు : 1800 208 2244
- కెనరా బ్యాంకు: 1800 1030
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు:1800 425 2045
- స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా:1800 1234
- యాక్సెస్ బ్యాంకు: 1800 209 5577

మొండి సమస్యలు చక్కదిద్దేలా..

సాధారణంగా బ్యాంకుల్లో సమస్యలు టోల్‌ఫ్రీ నంబర్లు, నేరుగా వెళ్లి ఫిర్యాదు చేయడంతో పరిష్కారం అవుతాయి. కొన్ని సమస్యలు ఫిర్యాదులతో కూడా పరిష్కారం కావు. ✪ కొన్నిసార్లు బ్యాంకు అధికారులు సవ్యంగా స్పందించరు. ఈ సమయంలో అవగాహన లేక చాలా మంది ఖాతాదారులు నష్టపోతున్నారు. బ్యాంకులో ఫిర్యాదు చేసిన నెల రోజుల్లో అధికారుల నుంచి సరైన స్పందన లేకపోతే అంబుడ్స్‌మెన్ అనే న్యాయ వ్యవస్థను సంప్రదించవచ్చు. ✪ టోల్ ఫ్రీ నంబరు 14448కు ఫోన్ చేసి సమస్యను తెలియజేయవచ్చు. లేదా సీఎమ్ఎస్.ఆర్‌బీఐ.ఓఆర్‌జీ అనే పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

డిజిటల్ చెల్లింపుల్లో ఇక్కట్లా?

✪ ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏడాదికి రూ.3లక్షల కోట్ల విలువైన 30కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతాయి. ప్రస్తుతం అడుగడుగునా డిజిటల్ చెల్లింపులు జరుగుతున్న నేపథ్యంలో అనేక పొరపాట్లు దొర్లుతున్నాయి. ✪ మనం పంపాల్సిన వారికి కాకుండా మరొకరికి నగదు వెళ్లిపోతోంది. కొన్నిసార్లు పెండింగులో ఉండిపోతోంది.✪ ఈ నేపథ్యంలో వారికి ఫోన్ చేసినా స్పందన ఉండదు. ఈ సమయంలో 24 గంటల్లోగా సదరు బ్యాంకును సంప్రదించాలి. లావాదేవీ వివరాలు అధికారులకు అందించాలి. ✪ ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చు. సైబర్ వలలో చిక్కి సొమ్ము చేజార్చుకున్నవారు జిల్లాలో చాలా మంది ఏం చేయాలో తెలియక మిన్నకుంటున్నారు.



వీరు **1930** సైబర్ క్రైం హెల్ప్ లైన్ నంబరుకు ఫోన్ చేస్తే పరిష్కారం దొరుకుతుంది.

రూ.5 కోట్ల ఖర్చుకు.. వెలుగేదీ..?!

ఈనాడు, అమరావతి

☛ ఆరేళ్లుగా 5.85 ఎకరాలపై ఆదాయమూ లేదు
☛ ఏటా 16 లక్షల యూనిట్ల విద్యుత్తు ఎక్కడ?

దుర్గమ్మకు వచ్చే ఆదాయాన్ని కరిగించడంలో ముందుండే అధికారులు.. సద్వినియోగంలో మాత్రం విఫలం అవుతున్నారు. 2020లో రూ.5 కోట్లు ఖర్చుపెట్టి.. పాతపాడులో 5.85 ఎకరాల దేవస్థానం స్థలంలో ఒక మెగావాట్ సోలార్ ప్లాంట్ నిర్మించారు. 2022 సెప్టెంబరులో ప్లాంట్ నుంచి ఉత్పత్తి ఆరంభించారు. ఏటా 16 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని.. నెడ్‌క్యాప్, దేవస్థానం అధికారులు వెల్లడించారు.



సోలార్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్

"దుర్గగుడికి వాడగా.. తిరిగి విద్యుత్తు సంస్థ నుంచే డబ్బులు వస్తాయని సెలవిచ్చారు. దేవస్థానం డబ్బులు నీళ్లలా ఖర్చుపెట్టి ప్లాంట్ పెట్టేశారు. ఈ లెక్కన.. మూడేళ్లలో 48 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి అవ్వాలి. దుర్గగుడికి రూపాయి బిల్లు రాకూడదు. కానీ.. ఇవేవీ జరగలేదు. పైగా.. రూ.3.50 కోట్లు తమకే చెల్లించాలనీ.. రూ.40 లక్షల జరిమానాతో సహా విద్యుత్తు సంస్థ తాఖీదులను ఇచ్చింది."

20 ఏళ్లు బిల్లులే ఉండవన్నారు..

దుర్గమ్మ ఆలయ పరిసరాలు, మహామండపం, ఇతర భవనాలు, కార్యాలయాలు, సీవీరెడ్డి ఛారిటీస్, ఉద్యోగుల క్వార్టర్లు, జమ్మిదొడ్డి, మాడపాటి సత్రం అన్నీకలిపి.. 2020 నాటికి నెలకు 1.12 లక్షల యూనిట్ల విద్యుత్తు వాడేవారు. ఏటా 13.50 లక్షల యూనిట్లు వాడి.. రూ.82 లక్షల బిల్లు చెల్లించేవాళ్లు. ✪ ఈ లెక్కన ప్లాంట్‌కు రూ.5 కోట్లు పెడితే.. నిర్మాణ వ్యయం ఆరేళ్లలో వెనక్కి వస్తుందనీ, తర్వాత 20 ఏళ్లు బిల్లే చెల్లించక్కర్లేదనేది ప్రతిపాదన. ✪ పైగా.. 20ఏళ్లు ఈ ప్లాంట్‌ను నిర్మించిన గుత్తేదారు సంస్థే దీని నిర్వహణ చూసుకుని.. ఏటా 16 లక్షల యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తుందన్నారు. ✪ ప్లాంట్ నిర్మాణానికి.. నెడ్‌క్యాప్ నుంచి రూ.92.80 లక్షల రాయితీ రాగా.. మిగతాది దేవస్థానం వెచ్చించింది. ఉత్పత్తయ్యే 16 లక్షల యూనిట్లలో.. 13.50 లక్షలు వాడుకోగా.. మిగిలింది అప్పటి ధర ప్రకారం.. యూనిట్‌కు రూ.5.48 చొప్పున రూ.13.70 లక్షలను విద్యుత్తుశాఖే.. దేవస్థానానికి చెల్లిస్తుందని చెప్పారు.

ఇప్పటికైనా దృష్టిపెట్టాలి..

ప్లాంట్ నుంచి ఎంత విద్యుదుత్పత్తి అవుతుందో.. స్పష్టత లేదు. అప్పటి ఈవోలు, అధికారులు.. ఇప్పుడు లేరు. తాజాగా ఆలయానికి విద్యుత్తు సరఫరా ఆపేసి భక్తులను ఇబ్బంది పెట్టేవరకూ పరిస్థితి వచ్చింది. ఇప్పటికైనా.. కాకిలెక్కలతో కాలయాపన చేయకుండా.. విద్యుత్తు, దేవాదాయ అధికారులు సమస్య పరిష్కరించుకోవాలి.



మహిళల సింగిల్స్ విజేత సూర్య చరిష్మా(ఆంధ్రప్రదేశ్)ను భుజాలపైకెత్తి అభినందిస్తున్న క్రీడాకారులు



పోటీపడుతున్న కర్ణాటక, మణిపూర్, ఉత్తరప్రదేశ్ జట్లు

మన చరిష్మా అదుర్స్..

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో పటమటలోని సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం, గురునానక్ కాలనీలోని సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో వారం పాటు జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ 78వ అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్-2025 ఆదివారం ముగిశాయి. ఈ నెల 22, 23వ తేదీల్లో అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో ఎనిమిది, మహిళల విభాగంలో ఏడు జట్లు తలపడ్డాయి. 24 నుంచి 28వ తేదీ వరకు జరిగిన జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల వ్యక్తిగత విభాగంలో 119 మంది, మహిళల వ్యక్తిగత విభాగంలో 114 మంది, పురుషుల డబుల్స్‌లో 60, మహిళల డబుల్స్‌లో 58 జోడీలు, మిక్స్‌డ్ డబుల్స్‌లో 61 జోడీలు తలపడ్డాయి. అంతర్ రాష్ట్ర ఇంటర్ జోనల్ ఛాంపియన్‌షిప్‌లో పీవీ సింధు, తమిరి సూర్య చరిష్మ, ఎస్.కవిప్రియ, కందేరి నవ్య, డి.దీపిక, డి.స్రవంతి, సీఎస్ఆర్ ప్రణవి, ఎం.తనిష్క, ఆమర్తి హర్షిక, ఆమర్తి ప్రవల్లిక మణి రాష్ట్ర మహిళా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.

ఆన్‌లైన్‌లో తిరుపతమ్మ ఆలయ టికెట్లు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవాలయంలో దర్శనం, సేవలు, ప్రసాదాలను రాష్ట్రప్రభుత్వ వాట్సప్ మన మిత్ర ద్వారా పొందవచ్చు. మన మిత్ర నంబరు 95523 00009 వాట్సప్ ద్వారా, www.aptemplesap.gov.in ద్వారా సేవలు పొందవచ్చని ఈవో మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయా సేవల కోసం క్యూలైన్‌లో వేచి ఉండాల్సిన అవసరం లేదని ఈవో తెలిపారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని 30వ తేదీ మంగళవారం దేవాలయంలో ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటు చేశామని చెప్పారు.

ప్రథమ వర్ధంతి



మమ్మల్ని గుండెల నిండుగా ప్రేమించి, మాకు ఆప్యాయతానురాగాలను పంచి, మా ఉన్నతికై అహర్నిశలు అలుపెరుగక శ్రమించి, కల్మషమెరుగని మంచి మనిషిగా జీవించిన మీరు దైవసన్నిధికి చేరి నేటికి ఒక సంవత్సరం గడిచినా మీ జ్ఞాపకాలు మరువలేము..

కీ॥శే॥ గుండె నాగేశ్వరరావు గారు
(Retd.) Asst. Divisional Managar
New India Assurance, Vijayawada.
జననం: 12-11-1955, మరణం: 08-01-2025

భార్య : వి.హిమబిందు
Deputy Director, Employment, Vizag Region
కుమార్తె : మన్నే సుధా ప్రియదర్శిని
అల్లుడు : మన్నే సాయికృష్ణ
మనుమడు : అమోఘ శౌర్య
మనుమరాలు : ఆధ్యా సరయు



సభలో ప్రసంగిస్తున్న ఎంపీ శివనాథ్

ఖండాంతరాలు దాటిన కేబీఎన్ కళాశాల పేరు

చిట్టినగర్, న్యూస్‌టుడే : పేద, మధ్య తరగతి వర్గాలకు కేబీఎన్ కళాశాల ఒక విద్యా దీపం వంటిదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. కొత్తపేటలోని ఆ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ వందలాది మంది విద్యార్థులు ఇక్కడ చదివి దేశ, విదేశాల్లో స్థిరపడటం హర్షనీయమన్నారు. చంద్రయాన్, ఆదిత్య ఎల్-1, మ్యాన్‌మిషన్, పలు రాకెట్లలో వాడే విడి భాగాలను తయారు చేసే బీఎన్.రెడ్డి వంటి ప్రముఖులు చదివిన ఈ కళాశాల పేరు ఖండాంతరాలు దాటిందన్నారు. కేబీఎన్ కళాశాలలో మరో మూడు నెలల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. పూర్వ విద్యార్థి, సినీ హీరో సుహాస్, ఐఎఫ్ఎస్ అధికారి జె.ఎ.సి.ఎస్.రావు, ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏవో నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి తదితరులు ప్రసంగించారు. సీనియర్ అధ్యాపకులు పూర్వ విద్యార్థులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు పట్టు.. సొమ్ములు కొల్లగొట్టు!

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే

జక్కంపూడి కాలనీలో పారిశుద్ధ్యం పేరిట రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ కాంట్రాక్టును ఓ ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరుడికి చెందిన గుత్తేదారు సంస్థకు కట్టబెట్టి అధిక చెల్లింపులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ★ జక్కంపూడి కాలనీలో 5,500 ఇళ్లు, 20,500 మంది జనాభా ఉన్నట్లు ఇటీవల వరకు 41 మంది కార్మికులతో పారిశుద్ధ్య పనులు నిర్వహించేవారు. అందుకు ఏటా రూ.71.59 లక్షలు ఖర్చు చేసేవారు. ★ ప్రస్తుతం ఇళ్లు 8032, జనాభా 30,400కి పెరిగినట్లు చెబుతూ కార్మికుల సంఖ్య 50కి చేర్చారు. వారి వేతనాల కోసం ఏటా రూ. 1,48,09,800 చెల్లించేలా ఇటీవల ఆమోదించారు. ★ కాలనీ పారిశుద్ధ్య వ్యయాన్ని ఏళ్లుగా కార్పొరేషన్ భరిస్తోంది. ఆ ప్రాంతం జక్కంపూడి పంచాయతీ పరిధిలోకి వస్తున్నందున పారిశుద్ధ్య నిర్వహణ పంచాయతీ చూసుకునేలా కౌన్సిల్లో తీర్మానించి, జిల్లా పంచాయతీ అధికారులకు పంపారు. కానీ వైకాపా పాలకపక్షం అధికారంలోకి వచ్చాక కార్పొరేషనే పారిశుద్ధ్య పనులు చేయిస్తూ.. ఆ వ్యయాన్ని పెంచుతోంది.

☛ పారిశుద్ధ్య నిర్వహణ టెండర్‌ను యశ్వంత్ ఫెసిలిటీ సర్వీస్ సంస్థకు అప్పగించగా.. 2025 అక్టోబరు 31తో కాలపరిమితి ముగిసింది. 2025 నవంబరు 1 నుంచి 2026 అక్టోబరు 31 వరకు తిరిగి టెండర్లు పిలిచేందుకు తీర్మానించి బుట్టదాఖలు చేశారు. ☛ నిబంధనలకు తూట్లు పొడిచి పాత గుత్తేదారుని కొనసాగించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్మికుడికి రూ.21,000 చొప్పున వేతనం చెల్లించాలి. కార్మికుల సంఖ్య 50కి పెంచి, రూ.24,683 చొప్పున చెల్లించేలా ఆమోదించుకున్నారు. గుత్తేదారుకు 13 శాతం జీఎస్టీ, 5 శాతం కమీషన్ కలిపి నెలకు రూ.12,34,150 చొప్పున ఏడాదికి రూ.1,48,09,800 చెల్లిస్తున్నారు. ☛ గుత్తేదారు మాత్రం కార్మికులకు రూ.13-15 వేలు చెల్లిస్తున్నట్లు కార్మిక సంఘాలు సీడీఎంఏకు, వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ వామపక్ష నాయకులు కమిషనర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ప్రతి నెలా కార్మికులకు వేతనాలు చెల్లించినట్లు గుత్తేదారు సంస్థ కార్పొరేషన్‌కు ఎవిడెన్స్ సమర్పిస్తేనే బిల్లు ఇవ్వాలి. కానీ ముఖ్య ప్రజాప్రతినిధి ఒత్తిడితో ప్రతి నెలా ఆ సంస్థ ఖాతాకి జమ చేస్తున్నారు.

జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ..

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

సెమీస్‌కు నలంద.. వీఆర్ సిద్ధార్థ జట్లు

ఉత్సాహంగా 'ఈఎస్ఎల్' క్రికెట్ టోర్నీ

న్యూస్‌టుడే–విజయవాడ క్రీడలు

EENADU SPORTS LEAGUE 2025
KAMINENI HOSPITALS VIJAYAWADA

'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025 ఉత్సాహంగా సాగుతోంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో నలంద డిగ్రీ కళాశాల, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్లు సెమీఫైనల్స్ కౌనూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టు క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రవేశించింది.

నిప్పులు చెరిగిన రామ్‌ప్రసాద్

● ఆదివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల జట్టు తొమ్మిది పరుగుల ఆధిక్యంతో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన పీబీ సిద్ధార్థ జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా లయోలా జట్టు నిర్ణీత పది ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 60 పరుగులు చేసింది. వై.అరవింద్ 26 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ ఏక్తాన్‌సింగ్ 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన పీబీ సిద్ధార్థ జట్టు 9.4 ఓవర్లలో 51 పరుగులకే ఆలౌటైంది. రూపేష్ 17, మోహిత్ 13 పరుగులు చేశారు. ప్రత్యర్థి బౌలర్ జె.రామ్‌ప్రసాద్ మూడు పరుగులు ఇచ్చి అయిదు వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జె.రామ్‌ప్రసాద్ ఎంపికయ్యాడు.



రాణించిన నలంద బ్యాటర్లు..



● రెండో మ్యాచ్‌లో నలంద డిగ్రీ కళాశాల జట్టు 74 పరుగుల తేడాతో అమృతసాయి ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన నలంద జట్టు పది ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 125 పరుగులు చేసింది. ఎన్.భానుప్రసాద్ 39 పరుగులతో క్రీజ్‌లో నిలవగా. . జె.బన్నీ 36 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ ఆర్.అనిల్ 25 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన అమృతసాయి జట్టు 9.2 ఓవర్లలో 51 పరుగులకే కుప్పకూలింది. కె.సాయిరామ్ 23 పరుగులు చేశాడు. ప్రత్యర్థి బౌలర్ ఎ.వాసు మూడు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎన్.భానుప్రసాద్ ఎంపికయ్యాడు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

- ★ పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల × కేబీఎన్ డిగ్రీ కళాశాల (మొదటి మ్యాచ్)
- ★ శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాల × ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కళాశాల (రెండో మ్యాచ్)
- ★ దీక్ష జూనియర్ కళాశాల × విశ్వశాంతి జూనియర్ కళాశాల (మూడో మ్యాచ్)

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్ వీరే..



జె.రామ్ ప్రసాద్ | ఎన్.భాను ప్రసాద్ | పి.మనోజ్

ఆరు వికెట్ల తేడాతో విజయం

● మూడో మ్యాచ్‌లో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో ఎంవీఆర్ ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన వీఆర్ సిద్ధార్థ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా. . బ్యాటింగ్‌కు దిగిన ఎంవీఆర్ జట్టు పది ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసింది. వి.బాలకృష్ణ 31 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ప్రత్యర్థి బౌలర్ పి.మనోజ్ 11 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు కూల్చాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన వీఆర్ సిద్ధార్థ జట్టు 8.4 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసి విజయకేతనం ఎగురవేసింది. పి.మనోజ్ 13 పరుగులతో క్రీజ్‌లో నిలవగా.. ఎస్.తరుణ్‌సాయి 12 పరుగులు జోడించాడు. ప్రత్యర్థి బౌలర్ వి.బాలకృష్ణ 12 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.మనోజ్ ఎంపికయ్యాడు.




Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (NECC) (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: Chalapathi Institute of Technology, Autonomous, Mothadaka Campus
District Sponsor: GGU Godavari Global University, Rajahmahendravaram, A.P.
Beverage Partner: CMR Shopping Mall — The joy of life
Digital Partner: ETV Bharat, ఈనాడు.నెట్ | FM Partner: ఈ FM Mee FM | TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Gift Partner: KL (Deemed to be University)
Organised by ఈనాడు

నూతన సంవత్సర వేడుకలు ఆహ్లాదకరంగా ఉండాలి

ప్రజలకు పోలీస్ కమిషనర్ సూచన

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: నూతన సంవత్సరం-2026కు స్వాగతం పలుకుతూ డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించుకునే వేడుకలకు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు తెలిపారు. వేడుకలు ఆహ్లాదకరంగా.. అందరికీ ఆమోదయోగ్యంగా.. హాని రహితంగా ఉండాలని కోరారు. ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసేసి అధిక శబ్దాలతో హోరెత్తించినా, అతి వేగంతో రోడ్లపై తిరిగినా, వాహనాలపై విన్యాసాలు చేసినా, బాణసంచా కాల్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించమని పేర్కొన్నారు.
● అర్ధరాత్రి రోడ్లపై వేడుకలకు అనుమతులు లేవు. ● వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపరాదు. ● ట్రిపుల్, జిగ్‌జాగ్ డ్రైవింగ్ చేయరాదు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు. ● మహాత్మా గాంధీ రోడ్డు, బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్లలో ట్రాఫిక్ ఆంక్షలు. ● బెంజిసర్కిల్ రెండు పైవంతెనలు, కనకదుర్గా పైవంతెనపై వాహనాలను అనుమతించరు. ● గుంపులుగా చేరి నడిరోడ్డుపై కేకులు కోసి అల్లర్లు చేయకూడదు. ● కేకలు వేస్తూ వాహనాలపై తిరగరాదు. ● హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు.



ఈనాడు-50, ఈటీవీ-30 వసంతాల వేడుకలో ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్, తెదేపా జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు చేతుల మీదుగా జ్ఞాపికలు స్వీకరిస్తున్న స్పాన్సర్లు తదితరులు

స్పాన్సర్లకు సత్కారం

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు ఆదివారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి స్పాన్సర్లుగా వ్యవహరించిన వారిని ఘనంగా సత్కరించారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రతినిధి, మేనేజర్ ఎం.చంద్రశేఖర్ ఆజాద్, ప్రీమియ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ ఏరియా సేల్స్ మేనేజర్ నారాయణ, విజయవాడ డిస్ట్రిబ్యూటర్ ఎం.ఆంజనేయులు, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ ప్రతినిధులు సుభాని, జి.ఎస్.ఎన్.ప్రసాద్, ఫిజికమ్ మధుక్యూర్ జ్యూస్ అండ్ క్యాప్సూల్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సి.సి.కేశవరావు, రాజేశ్వరి, మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ మేనేజర్ కె.కృష్ణమోహన్, ఒటో క్లాతింగ్ డీజీఎం మధుకుమార్, శ్రీలలిత రైస్ విజయవాడ, గుంటూరు రీజియన్ జనరల్ మేనేజర్ ఎస్.ఎ.బాషా, వేగా జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.నవీన్‌కుమార్, సుధాకర్, మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రతినిధి కె.శ్రీనివాసరావు, ఆక్సిజన్ కూల్ డ్రింక్స్ విజయవాడ డిస్ట్రిబ్యూటర్ ఎం.నాగశైలజ, ఎం.ప్రభాకరరావు, మల్లిక స్పైన్ సెంటర్(గుంటూరు) మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జె.నరేష్‌బాబు, అక్కినేని హాస్పిటల్స్(విజయవాడ) ప్రతినిధి డి.జి.రెడ్డి, స్వీట్ శ్రీనివాస్‌గారి శ్రీబాలాజీ ఘీ స్వీట్స్(విజయవాడ) మేనేజింగ్ డైరెక్టర్ కనమర్లపూడి శ్రీనివాస్, శ్రీకోస్టలైట్స్ మెడికల్ అకాడమీ(విజయవాడ) డైరెక్టర్ వెనిగళ్ల నరేంద్రబాబు, విజేత సూపర్‌మార్కెట్ ఏపీ, తెలంగాణ స్టోర్స్ మేనేజర్(విజయవాడ) డి.సాయి పవన్, పినాకిల్ జూనియర్ కాలేజ్(విజయవాడ) ఛైర్మన్ శంకరమంచి సాయిరామ్, శ్రీశాస్త్రా గ్లోబల్ స్కూల్(విజయవాడ) డైరెక్టర్ కిషోర్‌బాబు, లక్ష్మీనారాయణ, మన వీవీఐటీ యూనివర్సిటీ (నంబూరు) ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, అరుణప్రియ, అంబికా దర్బార్‌బత్తి(విజయవాడ) డిస్ట్రిబ్యూటర్ పువ్వాడ భాస్కరరావును సత్కరించారు. వీరికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్, గద్దె అనూరాధ, కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేశారు.



చిన్న రాజగోపురం వద్ద బారులు తీరిన భక్తులు

దుర్గమ్మ దర్శనం అపురూపం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. దీంతో ఘాట్ రోడ్డు, కనకదుర్గానగర్ లిఫ్ట్‌మార్గం భక్తులతో కిటకిటలాడాయి. వాహనాలు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో అటు శాంతి కెనాల్ రోడ్డు, జాతీయ రహదారిపై కుమ్మరిపాలెం సెంటరు వరకు నిలిపి కాలినడకన అమ్మవారిని దర్శించుకున్నారు. రద్దీ దృష్ట్యా మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు భక్తులను ముఖమండప దర్శనానికి పరిమితం చేశారు. ప్రొటోకాల్ దర్శనాలను నియంత్రించారు. సుమారు 60 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. సర్వదర్శనం చేసుకునేందుకు రెండు గంటల సమయం పట్టిందని పలువురు తెలిపారు. క్యూలైన్లో వేచి ఉన్న వారికి తాగునీరు అందించేందుకు ఈవో శీనానాయక్ చర్యలు తీసుకున్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి అధిక ధరకు కొనబడును (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

INDUSTRY

MACHINERY FOR SALE

విత్తనశుద్ధి యంత్రాలు మరియు జనపనార సంచులు అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి సంప్ర||. ✆ 72880 65253.

JOBS

Wanted Female Telecallers, Counsellors & Receptionist for a reputed college in Labbipet. Pay upto 15k+incentives. Qual: Any Degree. Age: 25-40 yrs. Min 2 yrs exp. Ph: 63030 85727.

VJA-2 గవర్నర్‌పేట పైలెట్ సర్వీసు స్టేషన్ IOCL పెట్రోల్ బంక్ నందు సేల్స్‌మెన్స్‌గా పనిచేయుటకు M/F కావలెను. ✆ 94412 49912/ 92463 75420.

గన్నవరం కార్యాలయంలో పనిచేయుటకు అనుభవం కలిగి ఉన్న అకౌంటెంట్ కావలెను, ట్యాలీ & GST ఫైలింగ్‌లో పని అనుభవం ఉండాలి. ✆ 94401 75207.

'మహానాడు మీడియా'లో వీడియో ఎడిటర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. కాల్: 73372 22004.

కంకిపాడు దగ్గర గల రిలయన్స్ వేర్ హౌస్‌లో పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్స్ కావలెను. Q: ఇంటర్ ఆపైన, Ph: 99511 40777.

ప్రముఖ రియల్ ఎస్టేట్స్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. జీతం+ కమీషన్ ఇవ్వబడును. సంప్ర ✆ 93906 65999.

ఫ్రాంచైజ్ బ్యూటీపార్లర్‌కు మేనేజర్‌గా పనిచేయుటకు అనుభవం గల అభ్యర్థులు కావలెను. ✆ 81878 89997.

లేడీ అభ్యర్థి (హెల్పర్) 10th P/F ఏలూరురోడ్డు, సీతారాంపురం ఫ్లైవుడ్ అండ్ డోర్స్ షాపులో పనిచేయుటకు కావలెను. 12,000/-. 9-30 to 7-30. ✆92472 88381

డైలీ ఇంటికొచ్చి డ్రెస్సింగ్ (2legs) డ్రెస్సింగ్ చేయుటకు ఫిమేల్ నర్స్ కావలెను. సీతారామపురం, ఏలూరు రోడ్. ✆ 93482 88381.

SECURITY GUARDS

సెక్యూరిటీగార్డులు & హెల్పర్లు కావలెను. విజయవాడ MG రోడ్‌లో ప్రముఖ షోరూమ్‌లో పనిచేయుటకు. జీతము గార్డ్సుకు 15,000/- & హెల్పర్లకు 12,000/-. ఇతర సదుపాయాలు కలవు. ✆ 80994 44758 / 96401 48367.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం



సైకిల్ ర్యాలీలో కలెక్టర్ లక్ష్మీశ, డీఎస్‌డీవో కోటేశ్వరరావు, క్రీడాకారులు

సైక్లింగ్‌తో మానసిక ఆరోగ్యం సొంతం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : ఆరోగ్యకర జీవితంతో పాటు కాలుష్య రహిత సమాజానికి సైకిల్ సవారీ దోహదపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఆదివారం 'ఫిట్ ఇండియా ఆన్ సండేస్' సైకిల్ రన్ కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులు, యువత సైక్లింగ్‌ను ఓ ఆనందకర అలవాటుగా చేసుకోవాలని సూచించారు. దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సొంతమవుతుందని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందడంతోపాటు భావి తరాలకు కాలుష్య రహిత పర్యావరణాన్ని వారసత్వ సంపదగా అందించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఒక మంచి అలవాటు.. ఎన్నో విజయాలకు సోపానమవుతుందన్నారు. అవగాహన పెంచుకొని.. సైక్లింగ్‌ను అభిరుచిగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. బెంజిసర్కిల్, పాలీక్లినిక్ రోడ్డు, పీబీ సిద్ధార్థ కళాశాల, రెడ్ సర్కిల్ మీదుగా సుమారు 9కి.మీ. మేర సైకిల్ ర్యాలీ సాగింది. డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు, శిక్షకులు, జిల్లా సైక్లింగ్ సంఘం సభ్యుడు సుగుణరావు, కోచ్ రాహుల్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

NANDIGAMA MUNICIPALITY

'e' Procurement Tender Notice Roc No: 1106/2024/E1, Dt: 23-12-2025

Sl. No	Name of the Grant	No of works	Estimate Amount (in Lakhs)	Opening date	Closing date
1	15th Finance Commission	9	176.38	29-12-2025	05-01-2026
2	MPLADS	1	03.32	29-12-2025	05-01-2026
3	General Funds	2	24.13	29-12-2025	05-01-2026
	TOTAL	12	203.83		

Note: All rights are reserved to the Commissioner to cancel or Reject the tenders without any reasons (As per G.O.Ms No.94, Dt. 01.07.2003 I & CAD) Further details can be seen@ 'e' procurement market place @www.tender.apeprocurement.gov.in
1. Download of bid documents starts from : 29-12-2025 @ 11:00 A.M.
2. Last Date/time for receipt of tenders : 05-01-2026 @ 11:00 A.M.
3. Bid Closing : 05-01-2026 @ 05:00 P.M
Contact No: 9490781856, 8341509213
Sd/- Commissioner, Nandigama Municipality

విద్యకు పేదరికం అవరోధం కాకూడదు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : విద్యతోనే విజ్ఞానం, ఉన్నత స్థానాలను అధిరోహించడం సాధ్యపడుతుందని సామాజికవేత్త వి.దొరరాజు అన్నారు. కోపా (కాపు అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యాభివృద్ధిని కాంక్షిస్తూ 28ఏళ్లుగా కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ఉపకారవేతనాలు పంపిణీ చేస్తున్న కోపా సేవలు అభినందనీయమన్నారు. ఇందులో తాను భాగస్వామి కావాలన్న ఉద్దేశంతో ఏటా రూ.లక్ష విరాళాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దావులూరి కైలాసరావు మాట్లాడుతూ. . దాతలు, సభ్యుల సహకారంతో విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ 5376 మంది విద్యార్థులకు రూ.1.82 కోట్ల ఉపకారవేతనాలు అందజేసినట్లు వెల్లడించారు. ఉపకారవేతనాలు పొందిన విద్యార్థులే.. దాతలుగా మారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. విద్యకు పేదరికం అవరోధం కాకూడదన్న ఆశయంతో డాక్టర్ బల్లెం నాగేశ్వరరావు ఈ సంస్థను ప్రారంభించారని గుర్తుచేశారు. అనంతరం 150 మంది విద్యార్థులకు రూ.10 లక్షల ఉపకారవేతనాలు అందజేశారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బల్లెం నాగేశ్వరరావు, దుట్టా రమేష్ కుమార్, వైద్యుడు సీఎస్ఆర్ ప్రసాదరావు, గల్లా భాస్కరరావు, కొత్తపల్లి సంజీవ్, గాజుల రామారావు, రామాయణం నాగసత్యం, కె.వెంకట రమణారావు, డి.వసుంధర తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న నాగేశ్వరరావు, కైలాసరావు, దొరరాజు

'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : భవానీపురం పున్నమి ఘాట్ సమీపంలో జనవరి 8 నుంచి 10 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆవకాయ్ అమరావతి' ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో నగరవాసులు హాజరుకానున్నారు. కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలతో కార్పొరేషన్, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో మాత్రమే ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ప్రకటించారు. అధిక సంఖ్యలో హాజరయ్యే నగరవాసులను దృష్టిలో ఉంచుకొని భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఎగ్జిబిషన్‌కు ఇచ్చిన అనుమతిని రద్దు చేశారు. తాత్కాలికంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన షెడ్లను అధికారులు తొలగించారు. నగరవాసుల రాకపోకలకు అడ్డుగా వచ్చే గోడలు, గట్లను తొలగించే పనులు ముమ్మరం చేశారు.

పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో పే అండ్ అకౌంట్స్ ఉద్యోగులకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో భవన్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పే అండ్ అకౌంట్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల సర్వీస్ రూల్స్, రేషియో ఫిక్సేషన్, పదోన్నతులు, అడిషనల్ ఛార్జ్ తదితర దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.హరనాథ్ మాట్లాడుతూ.. నూతన జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించి, సంఘాన్ని బలోపేతం చేయాలని కోరారు. విద్యాసాగర్‌ను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం కోఆప్షన్ ద్వారా నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పమ్మి శ్రీనివాస్(విశాఖపట్నం), కార్యదర్శులుగా జల్లేపల్లి స్వామి(విజయవాడ), మోహనరావు(విజయనగరం) ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వి.రమణారెడ్డి, సహాధ్యక్షుడు టి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి కె.శ్రీనివాసరావు, కోశాధికారి టి.లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న సంఘ నాయకులు

భక్తితో ఏసుక్రీస్తు జయంతి- 2025 జూబిలీ వేడుకలు

పటమట, న్యూస్‌టుడే: విశ్వవ్యాప్త కథోలిక శ్రీసభలో ఏసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ, చారిత్రక ఘట్టంగా మిగిలిపోతాయని విజయవాడ కథోలిక డయోసిస్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. పటమటలోని సెయింట్ పాల్స్ కథెడ్రల్ చర్చిలో ఆదివారం ఏసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన బిషప్ రాజారావు మాట్లాడుతూ.. విశ్వశాంతి దూత దివంగత పోప్ ఫ్రాన్సిస్ 2025 సంవత్సరాన్ని ఏసుక్రీస్తు జయంతి జూబిలీ వేడుకలుగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం పవిత్ర పూజ పీఠంపై బిషప్ రాజారావు, విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, ఫాదర్లు గాబ్రియేలు, కిరణ్ తదితర డయోసిస్ గురువులు సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్లు కొలకాని మరియన్న, జోసఫ్, తోట సునీల్ రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



పవిత్ర శిలువను ప్రదర్శిస్తున్న బిషప్ రాజారావు, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, ఫాదర్లు గాబ్రియేలు, కిరణ్ తదితరులు

91.9FM Vijayawada — ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: షాబుఖారీ దర్గా ఉరుసు మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరానుండటంతో నిర్వాహకులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపల్లి బి.కాలనీ నుంచి దర్గా వరకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. పురపాలిక ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం పోలీసులు బందోబస్తు పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజుల పాటు భక్తులకు ఇబ్బందులు పడకుండా షెల్టర్లు ఏర్పాటు చేశారు.



దీప కాంతుల్లో దర్గా

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు



వేణుగోపాలస్వామి

నెమలి (గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సహాయ కమిషనర్ ఎన్.సంధ్య తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఆ రోజు వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వారంలో గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు రజత గరుడ వాహనంపై గ్రామోత్సవం ఉంటుందని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? చెవుటూరు ఎస్సీ కాలనీలో కోతులు గుంపులుగా ఇళ్ల మధ్య తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. బెడద తొలగింపునకు చర్యలు చేపట్టాలి. **-పి.రోహిత్ గ్రామస్థుడు** ✔ సమస్య నా దృష్టికి వచ్చింది. కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెడతాం. **-వై.బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి, -జి.కొండూరు, న్యూస్‌టుడే**

స్పందనలు: ✦ పట్టణంలోని ఏడు వార్డులో డ్రెయిన్లలో మురుగు పేరుకుపోయిందని స్థానికుడు కోటేశ్వరరావు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి సమస్య పరిష్కరించారు. ✦ పట్టణంలోని 11వ వార్డులో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడం లేదని స్థానికుడు రాజేష్ 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. శానిటరీ అధికారి సంతోష్ స్పందించి.. సిబ్బందితో శుభ్రం చేయించారు. -తిరువూరుటౌన్ న్యూస్‌టుడే

పరుగు పందెం పోటీకి అర్హత

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జోనల్ స్థాయి పరుగు పందెం పోటీలకు మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి హెచ్.రోహిత్‌కుమార్ అర్హత సాధించాడు. గుంటూరు జిల్లా నంబూరులో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శనివారం ఎవరెస్ట్ బేస్ క్యాంపు నిర్వహించారు. ఇందులో రోహిత్ కుమార్ ఎంపిక కావడంతో స్టేట్ ఐఈ కోఆర్డినేటర్ వనజ, జిల్లా కోఆర్డినేటరు నారాయణ, ఐఈ ఉపాధ్యాయురాలు చంద్రావతి, ఉషారాణి అభినందనలు తెలిపారు.

అభాగ్యుల పెన్నిధి... సీఎం సహాయనిధి!

ఏడాదిన్నరలో రూ.11 కోట్లకు పైగా సాయం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం పొందలేని నిరుపేదలను ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటోంది. మైలవరం నియోజకవర్గ పరిధిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు రాజకీయాలకు అతీతంగా 1406 మందికి చెక్కులు, ఎల్వోసీల రూపంలో రూ.11,42,43,692 ముఖ్య మంత్రి సహాయ నిధిని శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ అందజేశారు.

చెల్లింపులు ఇలా.. హఠాత్తుగా ఆరోగ్యం దెబ్బతిని ఆసుపత్రులలో చేరిన వారికి శస్త్రచికిత్సలు చేయడానికి, ఆధునిక వైద్యం అందించడానికి సీఎం ఆర్ఎఫ్ నుంచి ఎల్వోసీలు జారీ చేయిస్తున్నారు. వైద్యశాలల్లో చేరి చికిత్స పొందిన వారు సంబంధిత బిల్లులు, పత్రాలను గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమర్పిస్తే.. శాసనసభ్యుడి సిఫార్సుతో సీఎంఆర్ఎఫ్ కార్యాలయానికి సిబ్బంది పంపుతున్నారు. ఖర్చు చేసిన దానిలో 60 నుంచి 90 శాతం వరకు తిరిగి చెల్లిస్తున్నారు.



లబ్ధిదారుడికి ఎల్వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

సమర్పించాల్సిన పత్రాలు: రేషన్ కార్డు, చికిత్స పొందుతున్న ఆసుపత్రి రిజిస్ట్రేషన్ పత్రం, చికిత్స పూర్తయితే ఆ వివరాలు, ఖర్చులు, ఔషధాలు, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయినట్లు పత్రం, చెల్లించిన నగదు రసీదులు సమర్పించాలి. వీటికి ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం మొదటి పేజీ నకళ్లను జతచేయాలి.

గరిష్ఠంగా రూ.15 లక్షల వరకు: క్యాన్సర్, గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారి వైద్యం కోసం గరిష్ఠంగా రూ.12లక్షల నుంచి రూ.15 లక్షల సహాయం అందుతుంది. అర్హులకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉదారంగా సాయం చేస్తున్నారని శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ తెలిపారు. పేదలు, సామాన్య ప్రజలకు సాయాన్ని కొనసాగిస్తామని చెప్పారు.

గోడ గడియారాల ఆవిష్కరణ



గడియారాలను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, పక్కన నాయకులు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చిత్రాలతో తిరువూరు సామాజిక ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ ఎ.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోడ గడియారాలను ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేష్, సింధు శ్రీను, కె.చంటి, ఆర్.శ్రీనివాసరావు, వి.లక్ష్మీనారాయణరావు, హనీ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయపురంలో స్వచ్ఛతా కార్యక్రమాలు

ఆంజనేయపురం (తిరువూరు): మండలంలోని ఆంజనేయపురంలో పలు వీధుల్లో సర్పంచి ఎం.కుటుంబరావు, కార్యదర్శి లావణ్య ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. అంతర్గత రహదారుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను కూలీలతో తొలగించారు.

ఇసుక తరలింపులో జేసీబీల వినియోగంపై ఆగ్రహం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు, గంపలగూడెం మండలాల పరిధిలోని కట్లేరు పరివాహకంలో ఇసుకను కొందరు యంత్రాలతో తోడేస్తున్నారని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి కొందరు తూట్లు పొడుస్తున్నా.. అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లోని ప్రజల గృహ నిర్మాణాలకు ఉచిత ఇసుక పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ఆదివారం కొందరు కూలీలతో కాకుండా జేసీబీలతో కట్లేరులోని ఇసుక ట్రాక్టర్లలో లోడు చేసుకుని తరలిస్తుంటే.. అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అటువంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా పైపులైన్!

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: స్థానిక 16వ వార్డులోని వైఎస్ఆర్ బజారు రీడింగ్ రూమ్ కూడలిలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ పైపులైన్ పగిలిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. పురపాలక అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆలయాల్లో ధనుర్మాస పూజలు

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని ఆలయాల్లో అర్చకులు గోదారంగనాయకుల విశేష అలంకరణలు చేసి, పూజలు నిర్వహించారు. పాశురాలు పఠించారు. పలుచోట్ల పాండురంగస్వామికి లక్ష తులసి పూజ, తిరుప్పావై సేవలు చేశారు. భక్తులతో సందడి నెలకొంది. సాయి, శివ స్వాములు.. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలతో భక్తులు వెంటరాగా నగర సంకీర్తనకు బయలుదేరారు. ఈ సందర్భంగా మహిళలు స్వాగతం పలికి హారతులు ఇచ్చారు.



గంపలగూడెంలో గోపికాకృష్ణుల అలంకరణలో బాలబాలికలు



తిరువూరులో శ్రీకృష్ణుడికి అలంకరణ



భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

ఇబ్రహీంపట్నం గ్రామీణం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం రాధా మాధవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున ఎన్టీటీపీఎస్ వి కాలనీలో నగర సంకీర్తన నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అర్చకులు...



కోదండ రామాలయంలో లక్ష తులసి పూజ

గ్రంథాలయానికి వితరణ

ఆర్లపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఆర్లపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయానికి తహసీల్దార్ వి.రాజకుమారి రూ.10వేలు విరాళంగా ఇచ్చారు.. పాఠకుల సౌకర్యార్థం కుర్చీలు కొనుగోలు చేశారు. ఆదివారం వాటిని కమిటీ సభ్యులు బి.మోహన్, వి.వరమయ్య, ఎం.ఆంజనేయులు, వి.సురేష్, హనుమ తదితరులు గ్రంథాలయానికి అందజేశారు.

ప్రజా ప్రతినిధులకు సన్మానం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన విస్సన్నపేట ఎంపీపీ గద్దల మల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్ పతిపాటి రాంబాబులను స్థానిక సీఎస్ఐ చర్చి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి సంఘం డీసీ ఛైర్మన్ కలపాల రాంబాబు, విశ్వాసులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

విలువైన జలాలు.. రహదారిపాలు!

జి.కొండూరు, న్యూస్‌టుడే: స్థానిక హైస్కూల్ రోడ్డులో పోస్టాఫీసు సమీపంలో కృష్ణా జలాల పంపు విరిగిపోయి నీరంతా రహదారి వెంబడి వృథాగా పోతోంది. ఈ కారణంగా రాకపోకలు సాగించే సమయంలో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పంపు విరిగిపోవడంతో నీరు పట్టుకునేందుకు వీలు పడటం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



జాగ్రత్త సుమా.. చూసి వెళ్లండి!

మేడూరు (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని మేడూరులో ప్రధాన రహదారి మధ్యలో గుంత ఏర్పడింది. అటుగా వీరాంజనేయస్వామి, శివాలయం, వేంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాలు ఉన్నాయి. వాటికి నిత్యం భక్తులు వెళుతుంటారు. వాహనాల రాకపోకలూ అధికంగా ఉంటాయి. రహదారిపై పడిన గుంతను పూడ్చకపోతే ప్రమాదాలు జరుగుతాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గుంతలో కర్ర ఉంచి ఎర్రటి సంచి తొడిగారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



అంచులో కంపలు.. రాకపోకలకు ఇక్కట్లు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు పీడీ కొత్తూరు నుంచి చింతలపాడు వరకు 12 కి.మీ మేర ఆర్అండ్‌బీ రహదారికి ఇరువైపులా అంచుల్లో పిచ్చి మొక్కలు, కంప చెట్లు దట్టంగా పెరిగాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకొనేందుకు అవకాశం లేదు. మరోవైపు రహదారి పొడవునా గోతులు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య నెలల తరబడి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దీనిపై ఏఈ గాయత్రి మాట్లాడుతూ గుత్తేదారుకు తెలిపి వెంటనే పెరిగిన కంప, పిచ్చి మొక్కలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అవే దరఖాస్తులు.. తీరని వెతలు!

మైలవరం, న్యూస్‌టుడే

వందల ఎకరాలు.. వేలాది మంది లబ్ధిదారులు. ఇళ్ల స్థలాల సమస్య తీరిందని భావించిన అధికారులు. తీరా చూస్తే.. ఎక్కడ సభ, సమావేశం నిర్వహించినా, మళ్లీ వాటి కోసమే దరఖాస్తులు. ఇదెక్కడి తంటా అంటూ తలలు పట్టుకుంటుంటే, గతంలో పంపిణీ చేసిన కాలనీల్లో స్థలాలు ఖాళీగా వెక్కిరిస్తున్నాయి. దీంతో ముందుకెళ్లలేక, అర్జీలు పరిష్కారం కాక ప్రభుత్వంపైనే భారం వేస్తున్నారు.

దశాబ్ద కాలంగా మైలవరం నియోజకవర్గంలో పేదలకు పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. నాలుగైదు గ్రామాలు మినహా, అన్ని చోట్ల లబ్ధిదారులను ఎంపిక చేసి, పట్టాలు కూడా అందించారు. అయితే, వాటిలో రాజకీయ జోక్యం పెచ్చుమీరడంతో పెద్ద ఎత్తున అనర్హులూ చేరిపోతున్నారు. ఫలితంగా అర్హుల్లో కొందరికి స్థలం అందని ద్రాక్షగా మారుతోంది. దాని ఫలితమే నేటికీ ఎక్కడ సభ నిర్వహించినా.. స్థలాలకు సంబంధించిన అర్జీలే వస్తున్నాయి.



మైలవరం అయ్యప్పనగర్ కాలనీలో ఖాళీ స్థలాలు

విన్నపాలు వినవలె..

★ ఈ నెల 2న మైలవరంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కలెక్టర్, ఎమ్మెల్యే నేతృత్వంలో నిర్వహించారు. సుమారు 600 అర్జీలు వచ్చాయి. అందులో 350 వరకు స్థలాల కోసమేనని అధికారుల చెబుతున్నారు. ఇందులో మైలవరం మండలంలోనే 250కి పైగా ఉన్నాయి. ★ నెల కిందట ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మండలాల్లో ప్రజాదర్బార్ పేరిట సభలు నిర్వహించగా.. దాదాపు 100 మందికి పైగా స్థలాల కోసం అర్జీలు ఇచ్చారు.

కాలనీల్లో సగం ఖాళీలే..

నియోజకవర్గంలోనే అతి పెద్ద లేఅవుట్ కాలనీగా ఉన్న పూరగుట్టలో 2 వేల మందికి పైగా ఐదేళ్ల కిందటే స్థలాలు పంపిణీ చేయగా, అందులో నేటికీ సగానికి పైగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ★ మైలవరం అయ్యప్పనగర్ కాలనీలోని 350 ప్లాట్లలో కొన్ని బేరాలు జరగ్గా, సగం మేర ఖాళీగా ఉన్నాయి. ★ కొండపల్లి మున్సిపాలిటీ, ఈలప్రోలు తదితర గ్రామాల్లోని కాలనీల్లో చాలా వరకు ఖాళీలు కన్పిస్తున్నాయి.

ఆన్‌లైన్‌లో నమోదు

మైలవరం పీజీఆర్ఎస్‌లో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రభుత్వ ఆదేశాలు, ప్రజాప్రతినిధుల సూచనలతో స్థల లభ్యత మేరకు చర్యలు తీసుకుంటాం.

-అబ్దుల్ దరియా, తహసీల్దార్, మైలవరం

మహిళలకు చీరల పంపిణీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యక్షుడు కె.విద్యాధరరావు ఆర్థిక సహకారంతో మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలో నిరుపేద వృద్ధులు, వితంతువులు 60 మందికి ఆదివారం చీరలు పంపిణీ చేశారు.

వృద్ధులకు దుప్పట్లు..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జంపాల సాహితీ ఫౌండేషన్ ఛైర్మన్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సీతారామయ్య ఆధ్వర్యంలో కాచవరం అమ్మానాన్న వృద్ధాశ్రమ వృద్ధులకు ఆదివారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమార్తె డాక్టర్ సాహితి వర్ధంతి సందర్భంగా ఏటా నిర్వహించే సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో జంపాల కుటుంబ సభ్యులతో పాటు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



మైలవరంలో పాల్గొన్న నాయకులు



తిరువూరులో..

మైలవరం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం మైలవరంలో ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ ప్రగతిలో కాంగ్రెస్ పాత్రను వివరించారు. కార్యక్రమంలో నాయకులు పిట్టల నాగేశ్వరరావు, శీలం రామ్మకృష్ణ, దోసపాటి గిరి, దుర్గారావు, సుధాకర్ పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: గంపలగూడెం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు వై.రామకృష్ణ, ఎం.దానియేలు, వి.పాపమ్మ, జి.ఆదాం తదితరులు పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కేకు కోసి మిఠాయిలు పంచారు.

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని రాజీవ్ భవన్‌లో ఆదివారం నాయకులు బి.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, జీవన్‌బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.

కరాటేలో ప్రతిభ

జి.కొండూరు: స్థానిక శ్రీశ్రీ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని గొర్రె రమ్యశ్రీ కరాటేలో ప్రతిభ చూపి బ్లాక్‌బెల్ట్ సాధించింది. విజయవాడ సింగ్‌నగర్‌లో కియో జపాన్ షోటోకాన్ కరాటే ఇండియా వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బ్లాక్‌బెల్ట్ పరీక్షలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ కె.కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా రమ్యశ్రీని, శిక్షకుడు పి.మురళీని.. పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి అభినందించారు.



ప్రతిభ చూపిన విద్యార్థిని రమ్యశ్రీ, పక్కన శిక్షకుడు మురళీ తదితరులు

కార్మిక, కర్షక హక్కుల సాధనకు సీపీఐ పోరాటం



మాట్లాడుతున్న యల్లమందరావు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మిక, కర్షక హక్కుల కోసం సీపీఐ నిరంతరం పోరాడుతుందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యల్లమందరావు అన్నారు. సీపీఐ కొటికలపూడి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపక దినోత్సవం గ్రామంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దున్నేవాడికే భూమి దక్కాలన్న నినాదంతో గ్రామంలోని 650 ఎకరాల లంక భూములను పేదలకు పంపిణీ చేసిన ఘనత తమ పార్టీదేనన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంలో గ్రామానికి చెందిన ముగ్గురు కార్యకర్తలు అమరులయ్యారని గుర్తుచేశారు. తొలుత పార్టీ జెండాను గ్రామ కమిటీ కార్యదర్శి బాబూరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, జొన్నలగడ్డ కోటేశ్వరరావు, గోవిందరావు, షేక్ ఖుదాం, రెంటపల్లి దాసు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మైలవరం: మండలంలోని బొర్రగూడెంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై ఆదివారం పోలీసులు దాడిచేశారు. ఈ సందర్భంగా నలుగురిని అదుపులోకి తీసుకుని, రూ.3 వేలు, రెండు పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు.

మిట్టగూడెంలో వాహనాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మిట్టగూడెం కూడలిలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. రెడ్డిగూడెం స్టేషన్ ఏఎస్సై సక్రూనాయక్, సిబ్బంది పాల్గొన్నారు. శిరస్త్రాణం ధరించని వారు, ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించడంపై కేసులు నమోదు చేశారు. వాహనాలు నడుపుతున్న బాలలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు.



తనిఖీ చేస్తున్న ఏఎస్సై సక్రూనాయక్, సిబ్బంది

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలి దుర్మరణం

కొండపల్లి, న్యూస్‌టుడే: మట్టి రవాణా చేసే టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలు మృతిచెందిన సంఘటన కొండపల్లి ఖిల్లా రోడ్డులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఖిల్లా రోడ్డులో నివాసముండే కంపా సలోమి(65) అదే ప్రాంతంలో రహదారి పక్కన కూర్చొని ఉంది. ఈ క్రమంలో మట్టి రవాణా చేస్తున్న టిప్పర్ డ్రైవర్.. సలోమీని గమనించకపోవడంతో వాహనం ఆమెపై నుంచి వెళ్లింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందింది. సంఘటన జరిగిన అనంతరం అక్కడి నుంచి డ్రైవర్ వాహనంతో సహా వేగంగా వెళ్లిపోయాడు. స్థానికులు ద్విచక్ర వాహనాలతో వెంబడించి పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి.. పోలీసులకు అప్పగించారు. నిందితుడు రాష్ట్రేతరుడుగా పోలీసులు పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని విజయవాడ ఆసుపత్రి తరలించారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

కొండపల్లి, న్యూస్‌టుడే: రైలు పట్టాలపై యువకుడి మృతదేహాన్ని కొండపల్లి రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం గుర్తించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(36) మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. పట్టాలకు ఓ వైపు తల, మరోవైపు మొండెం ఉండటంతో బలవన్మరణానికి పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ విషయాన్ని రైల్వే, ఇబ్రహీంపట్నం పోలీసులకు అక్కడి వారు తెలియజేశారు. మృతిచెందిన వ్యక్తి రాష్ట్రేతరుడిగా స్థానికులు పేర్కొంటున్నారు.

3న హిందూ మహాసమ్మేళనం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో జనవరి 3న హిందూ మహా సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి హిందూ సంఘాల ప్రతినిధులు సమావేశం జరిగింది. స్థానిక తంబరేణి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని శ్రీ తిరుపతమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన గోపీబాబు, జడ్పీటీసీ మాజీ సభ్యులు కాకాని శ్రీనివాసరావు, గజ్జి కృష్ణమూర్తి, భాజపా నాయకురాలు కల్లూరి శ్రీవాణి పిలుపునిచ్చారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. నేత్ర చికిత్సలతో పాటు సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కూలీ అనుమానాస్పద మృతి

చెవిటికల్లు(కంచికచర్ల), న్యూస్‌టుడే: కూలీ పనులకు వెళ్లిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండలంలోని చెవిటికల్లులో ఆదివారం జరిగింది. ఎస్సై పి.విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాలది నందయ్య(70) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పనుల నిమిత్తం తరచూ దూర ప్రాంతాలకు వెళ్లి వారానికి ఒకసారి ఇంటికి వచ్చేవాడు. ఈ నెల 25న అతడు పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆదివారం గ్రామ సమీపంలోని కృష్ణా నదిలో వ్యక్తి మృతదేహం కనిపించడంతో పరిశీలించగా అతను నందయ్యగా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అతని కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తలసీమియా, సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధులు జన్యుపరమైనవని విజయవాడకు చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ వి.శ్రీదేవి తెలిపారు. మలేరియాను తట్టుకునే క్రమంలో జరిగే జన్యు మార్పులతో తలసీమియా, ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గిపోతే రక్తహీనత వస్తుందన్నారు. ఎ.కొండూరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఆదివారం ప్రజా ఆరోగ్య వేదిక, ఇండియన్ అకాడమి ఆఫ్ పిడియాట్రిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురి నుంచి వ్యాధి నిర్ధారణకు అవసరమైన రక్త నమూనాలు సేకరించారు. ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ రక్తహీనత ఉందని వైద్యుని సలహా లేకుండా సొంతగా ఐరన్ మందులు వాడకూడదన్నారు. ప్రజాఆరోగ్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయ్‌ప్రకాష్, కిన్నెర ఫౌండేషన్ యజమాని కె.రాజ్‌గోపాల్, స్థానికులు ఎం.కుమార్‌నాయక్, జె.వెంకటేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

చందర్లపాడు, న్యూస్‌టుడే: సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు చందర్లపాడులో ఆదివారం గోడపత్రికలు ఆవిష్కరించారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు సభలు జరుగుతాయని జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాల్ తెలిపారు. చివరి రోజు జరిగే బహిరంగ సభకు కార్మికులు, కర్షకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. గోపీనాయక్, తోట రామారావు, రంగిశెట్టి ఏడుకొండలు, అమీర్‌బాషా, మౌలాలీ, నాగుల్, మస్తాన్, సందరరావు తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న నాయకులు

8న వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ అభినందన సభ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో జనవరి 8న నూతన పాలకవర్గ అభినందన సభ నిర్వహిస్తున్నారు. సభను విజయవంతం చేయడానికి అవసరమైన కార్యాచరణపై చర్చించేందుకు మార్కెట్ యార్డులో నాయకులు, దళితులు ఆదివారం సమావేశమయ్యారు. ఛైర్మన్ పదవిని మల్లెల సీతమ్మకు ఇచ్చిన విషయాన్ని ఇంటింటికి తిరిగి తెలియజేసి, సభకు ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలని నేతలు నిర్ణయించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఫ్యాషన్ కోర్సుల్లోకి నిఫ్ట్‌ల ఆహ్వానం!

సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ హుందాగా, ఆకర్షణీయంగా కనిపించడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం దుస్తులు, వస్తువుల ఎంపికపై శ్రద్ధ వహిస్తున్నారు. ఈ పరిణామాలు పేరున్న సంస్థల్లో ఫ్యాషన్ కోర్సులు పూర్తిచేసినవారికి మేటి అవకాశాలు అందిస్తున్నాయి. అలాంటి వాటిలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్)లు ముఖ్యమైనవి. వీటిలో పలు యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.



ఇంజినీరింగ్ చదవడానికి ఐఐటీలు, వైద్యవిద్య కోసం ఎయిమ్స్ ఉన్నట్లుగానే ఫ్యాషన్ ప్రపంచంలో రాణించాలనుకునేవారికి నిఫ్ట్‌లు జాతీయ స్థాయిలో పేరున్న సంస్థలు. ఇవి దేశంలో హైదరాబాద్ సహా 20 కేంద్రాల్లో ఉన్నాయి. ఇవి నాలుగేళ్ల యూజీలో.. ఫ్యాషన్ టెక్నాలజీతోపాటు యాక్సెసరీ డిజైన్, నిట్‌వేర్ డిజైన్, ఫ్యాషన్ కమ్యూనికేషన్, లెదర్ డిజైన్, ఫ్యాషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ కోర్సులు అందిస్తున్నాయి. రెండేళ్ల పీజీలో.. డిజైన్, ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. సృజనాత్మకత, డిజైన్‌పై ఆసక్తి, ఊహలకు రూపమివ్వగలిగే నైపుణ్యం, స్కెచింగ్ ప్రావీణ్యం ఉన్నవారు ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాషన్ డిజైన్ కోర్సుల్లో చేరడానికి ప్రాధాన్యమివ్వొచ్చు. అన్ని సంస్థల్లోనూ యూజీ, పీజీల్లో 5000కు పైగా సీట్లు ఉన్నాయి.

కోర్సు, అర్హత

కోర్సు: బ్యాచిలర్ ఆఫ్ డిజైన్
అర్హత: ఇంటర్మీడియట్ లేదా సమాన స్థాయి కోర్సు.

కోర్సు: బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ
అర్హత: మ్యాథ్స్, ఫిజిక్స్‌తో ఇంటర్ లేదా మూడేళ్ల డిప్లొమా.

వయసు: పై రెండు కోర్సులకూ ఆగస్టు 1, 2026 నాటికి 24 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఐదేళ్లు మినహాయింపు.

కోర్సులు: మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్
అర్హత: ఏదైనా డిగ్రీ లేదా నిఫ్ట్ లేదా నిడ్ నుంచి కనీసం మూడేళ్ల వ్యవధితో యూజీ డిప్లొమా.

కోర్సు: మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ
అర్హత: నిఫ్ట్ నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్‌టెక్) లేదా ఏదైనా సంస్థ నుంచి బీఈ/బీటెక్.

అన్ని యూజీ, పీజీ కోర్సులకూ చివరి ఏడాది విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. పీజీకి గరిష్ఠ వయసు నిబంధన లేదు.

పరీక్ష

ఎంచుకున్న కోర్సు ప్రకారం ప్రశ్నపత్రం మారుతుంది. ప్రతి సరైన సమాధానానికీ ఒక మార్కు. తప్పు జవాబుకు పావు మార్కు తగ్గిస్తారు.

బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సుల్లో సీటు పొందడానికి జనరల్ ఎబిలిటీ టెస్ట్ (జీఏటీ), క్రియేటివ్ ఎబిలిటీ టెస్టు(సీఏటీ), సిచ్యువేషన్ టెస్టుల్లో ప్రతిభ చూపాలి. జీఏటీ ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 2 గంటలు. పరీక్షలో వంద ప్రశ్నలుంటాయి. వీటిలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ 20, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 40, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ 15, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ 25 ప్రశ్నలు వస్తాయి. ఈ పరీక్షకు 30 శాతం వెయిటేజీ.

సీఏటీ ద్వారా డిజైనింగ్‌లో సృజనాత్మకత ఎలా ఉందో పరిశీలిస్తారు. వ్యవధి 3 గంటలు. 3 ప్రశ్నలు వస్తాయి. పేపర్‌పై సమాధానాలు రాయాలి. ఈ విభాగానికి 50 శాతం వెయిటేజీ.

జీఏటీ, సీఏటీల్లో ప్రతిభ చూపినవారికి సిచ్యువేషన్ టెస్టు ఉంటుంది. ఇందులో అభ్యర్థిలోని సృజన, 3డీ మోడలింగ్ నైపుణ్యం పరీక్షిస్తారు. దీనికి 20 శాతం వెయిటేజీ.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (బీఎఫ్‌టెక్) కోర్సులకు జనరల్ ఎబిలిటీ టెస్టు (జీఏటీ)లో ప్రతిభ చూపితే సరిపోతుంది. ఇందులో రెండు సెక్షన్ల నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. వీటిని మూడు గంటల్లో పూర్తిచేయాలి.

పరీక్షలో: క్వాంటిటేటివ్ ఎబిలిటీ 35, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 40, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ 30, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. కేస్ స్టడీకి 20 మార్కులు.

అధిక మార్కులకు..

- ✦ నోటిఫికేషన్‌లోని సిలబస్ వివరాలు శ్రద్ధగా చదవాలి.
- ✦ అందులోని విభాగాలు/ అంశాల వారీ సన్నద్ధత ప్రారంభించాలి. ఇందుకోసం ఇంటర్మీడియట్, హైస్కూల్ పాఠ్యపుస్తకాల్లోని సమాచారం కొంత వరకు ఉపయోగపడుతుంది.
- ✦ ఏదైనా ఒక ప్రామాణిక పుస్తకాన్నే తీసుకుని, పూర్తిగా అధ్యయనం చేయాలి. అందులోని మాదిరి ప్రశ్నలన్నీ పూర్తిగా సాధన చేయాలి.
- ✦ గత ఐదేళ్ల ప్రశ్నపత్రాలు నిశితంగా పరిశీలించాలి. విభాగాల వారీ ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయి, ఏ స్థాయిలో అడుగుతున్నారు. వాటి కోసం ఏం చదవాలో అవగాహన ఏర్పడుతుంది.
- ✦ పరీక్షకు ముందు కనీసం పది మాక్ టెస్టులు రాసి, ఫలితాలు సమీక్షించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోగలిగితే నిఫ్ట్‌లో సీటు ఖాయమైనట్లే.

ఉద్యోగాలిలా..

నిఫ్ట్‌ల్లో కోర్సులు పూర్తిచేసుకున్నవారిని బహుళ జాతి సంస్థలు ప్రాంగణ నియామకాల్లో ఎంపిక చేసుకుంటున్నాయి. దీంతో నైపుణ్యం ఉన్నవారు సులువుగానే అవకాశాలు అందుకుంటున్నారు. ప్రతి సందర్భాన్నీ వేడుకగా నిర్వహించే సంస్కృతీ పెరుగుతోంది. కార్యక్రమం ప్రకారం దుస్తులు, యాక్సెసరీస్ ఉపయోగిస్తున్నారు. అందువల్ల ఆకట్టుకునేలా, వైవిధ్యం ఉట్టిపడేలా.. డిజైన్ చేయగలిగే నైపుణ్యం ఉన్నవాళ్లు లక్షల్లో సంపాదిస్తున్నారు. కోర్సులు విజయవంతంగా పూర్తిచేసుకున్న తర్వాత ఫ్యాషన్ డిజైనర్, స్టైలిస్ట్ (స్టోర్స్), ఫ్యాషన్ రిటైలర్, ఫ్యాషన్ ఆంత్రప్రెన్యూర్, పర్సనల్ స్టైలిస్ట్, సెలబ్రిటీ స్టైలిస్ట్.. హోదాల్లో రాణించగలరు. సొంతగా బొటిక్ నిర్వహించుకోవచ్చు. వెండితెర, బుల్లితెర, ఓటీటీల వేదికల్లోనూ అవకాశాలు అందుకోవచ్చు.

వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6. రూ.5000 ఫైన్‌తో జనవరి 10.

పరీక్ష ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.500. మిగిలిన అందరికీ రూ.2000. రెండు కోర్సులకైతే.. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.750, మిగిలిన అందరికీ రూ.3000.

ప్రవేశ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 8

వెబ్‌సైట్: https://www.nift.ac.in/admission

నాబార్డ్‌లో యంగ్ ప్రొఫెషనల్స్

నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్), ముంబయి.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- యంగ్ ప్రొఫెషనల్: 44 పోస్టులు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: నవంబరు 1, 1995 - నవంబరు 1, 2004 మధ్య జన్మించినవారు అర్హులు.
వేతనం: నెలకు రూ.70,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 12.
దరఖాస్తు ఫీజు: రూ.150. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://www.nabard.org/careers-notices1.aspx?cid=693&id=26

ఏసీసీఏ కోర్సు ఎంత మేలు?

మా అబ్బాయి ఇంటర్మీడియట్ (ఎంఈసీ) రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఏసీసీఏ కోర్సుతో ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?
- కేవీఆర్ రావు



■ అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) లండన్ కేంద్రంగా ఉన్న ప్రసిద్ధ ప్రొఫెషనల్ అకౌంటింగ్ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో ఏసీసీఏకు గుర్తింపు ఉంది. మనదేశంలోనూ ఈ కోర్సు ప్రాధాన్యం పెరుగుతోంది. గ్లోబల్ కెరియర్ లక్ష్యంగా ఉన్నవారికి ఏసీసీఏ ఒక మంచి ఉపాధి అవకాశం.

▸ ఈ కోర్సులో మొత్తం 13 పేపర్లు ఉంటాయి. వీటిలో ఫైనాన్షియల్ అకౌంటింగ్, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ట్యాక్సేషన్, ఆడిటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ బిజినెస్ లీడర్‌షిప్ లాంటివి ముఖ్యమైనవి. ఏసీసీఏ పరీక్షల ఉత్తీర్ణతతో పాటు 36 నెలల ప్రాక్టికల్ అనుభవం కూడా పూర్తిచేయాలి.

ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఏసీసీఏను వెంటనే ప్రారంభించవచ్చు. ముఖ్యంగా బీకామ్, బీబీఏ, బీబీఎం, ఎంబీఏ చదువుతోన్న లేదా పూర్తిచేసిన వారికి ఎక్కువ పేపర్ల మినహాయింపు లభిస్తుంది. మ్యాథ్స్, అకౌంటింగ్‌పై ప్రాథమిక అవగాహన ఉన్నవారికి ఈ కోర్సు సులువుగానే అనిపిస్తుంది. వయసు నిబంధన లేకపోవడం ఏసీసీఏ ప్రత్యేకత.

▸ మన దేశంలో ఏసీసీఏ అర్హతతో బహుళ జాతి సంస్థలు, బిగ్ ఫోర్ ఆడిట్ ఫర్మ్‌లు (డెలాయిట్, ఈవై, కేపీఎంజీ, పీడబ్ల్యూసీ), ఆర్థిక సేవలు అందించే సంస్థలు, కార్పొరేట్ కంపెనీల్లో ఎక్కువ ఉద్యోగాలుంటాయి. ఫైనాన్షియల్ అకౌంటెంట్, ఆడిటర్, ట్యాక్స్ కన్సల్టెంట్, ఫైనాన్షియల్ అనలిస్ట్, రిస్క్ మేనేజర్ లాంటి హోదాలు లభిస్తాయి. ప్రారంభ వార్షిక వేతనం సాధారణంగా ఆరు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు ఉంటుంది. యూకే, యూరప్, ఆఫ్రికా, సింగపూర్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో ఏసీసీఏ నిపుణులకు డిమాండ్ ఉంది. వీరికి గ్లోబల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్‌పై లోతైన అవగాహన ఉండటం వల్ల అంతర్జాతీయ సంస్థల్లో ఉద్యోగాలు సులభంగా లభిస్తాయి. విదేశాల్లో ఆకర్షణీయ వేతనాలూ అందుతాయి.

▸ మన దేశ సీఏ కోర్సుతో పోలిస్తే ఏసీసీఏ కోర్సు ప్రపంచ దృక్పథంతో రూపొందించారు. సీఏ ప్రధానంగా భారతదేశ నిబంధనలు, టాక్స్ చట్టాలపై దృష్టి పెడుతుంది. ఏసీసీఏ అంతర్జాతీయ అకౌంటింగ్ ప్రమాణాలపై అవగాహన కలిగిస్తుంది. ఉత్తీర్ణత శాతం పరంగా ఏసీసీఏ కొంత మెరుగ్గా ఉండటం వల్ల, ఏదైనా డిగ్రీ కోర్సు చదువుతూ పూర్తి చేయవచ్చు. అయితే భారతదేశంలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయాలంటే సీఏకి చట్టపరమైన అధికారాలు ఎక్కువగా ఉంటాయి.

▸ ఏసీసీఏ కోర్సు ఫీజు భారత విద్యార్థులకు కొంచెం ఎక్కువగా అనిపిస్తుంది. అంతే కాకుండా సొంతంగా చదువుతూ, ఆన్‌లైన్ తరగతులపై ఎక్కువగా ఆధారపడాలి. అకడమిక్ క్రమశిక్షణ, టైమ్ మేనేజ్‌మెంట్ లేకపోతే ఉత్తీర్ణత కష్టమవుతుంది. ప్రాక్టికల్ అనుభవం సరిగా లేకపోతే మెంబర్‌షిప్ ఆలస్యం అవుతుంది. అకౌంటింగ్, ఫైనాన్స్, ఆడిట్ రంగాల్లో విశ్వవ్యాప్త అవకాశాలు పొందాలనుకునేవారికి ఇది సరైన మార్గం.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

కుందుజ్ టెక్నాలజీస్‌లో

1. ఫిజిక్స్ అకడమిక్ సపోర్ట్ ట్యూటర్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఫిజిక్స్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్ (ఎస్ఎంఈ), టీచింగ్ స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 22
☛ https://tinyurl.com/4eh9ecc2

2. డౌట్ సాల్వింగ్ ఎక్స్‌పర్ట్ (స్టాటిస్టిక్స్)
నైపుణ్యాలు: ఆన్‌లైన్ టీచింగ్, స్టాటిస్టిక్స్, టీచింగ్ స్టైపెండ్: రూ.4,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/bdhnzm9t

హ్యూమన్ రిసోర్సెస్ (హెచ్ఆర్)
సంస్థ: హ్యూమానిటీ ఫౌండర్స్
నైపుణ్యాలు: కోఆర్డినేషన్, క్రియేటివ్ డైరెక్షన్, క్రియేటివ్ థింకింగ్, క్రియేటివిటీ, లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిక్రూట్‌మెంట్, రెజ్యూమ్ స్క్రీనింగ్, టీమ్ మేనేజ్‌మెంట్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.3,000-6,000
దరఖాస్తు గడువు: జనవరి 22
☛ https://tinyurl.com/46a6md5a

రీల్ ఎడిటర్
సంస్థ: బడ్డింగ్ మారినర్స్ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, ఆడియో ఎడిటింగ్, కేన్వా, డావిన్సీ రిసాల్వ్, ఫైనల్ కట్ ప్రో, మార్కెట్ అనాలిసిస్, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.4,000-8,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/278dh2cn

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: వేర్‌వియ్ కన్సల్టెన్సీ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ప్రీమియర్ ప్రో, ఫైనల్ కట్ ప్రో, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.4,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/2pau6t62

యూఐ/యూఎక్స్ కమ్ ప్రొడక్ట్ డిజైనర్
సంస్థ: ఏబీయూఈఎం వర్కిఫైయింగ్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఎక్స్‌డీ, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.25,000-41,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/yz2yy3us

క్వాలిటీ అనలిస్ట్
సంస్థ: జటాయు గ్యాడ్జెట్స్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.11,000-25,000
దరఖాస్తు గడువు: జనవరి 22
☛ https://tinyurl.com/yc4myz4f

వీడియో ఎడిటర్
సంస్థ: సీఎస్‌టీఈ ఇంటర్నేషనల్
నైపుణ్యాలు: క్రియేటివిటీ, వీడియో ఎడిటింగ్
స్టైపెండ్: రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/4j5ayxw2

సీనియర్ రిసెర్చ్ స్ట్రాటజిస్ట్ (ఎస్ఈఓ/ ఏఐఎస్ఓ/ జీఈఓ)
సంస్థ: వెస్లే సెమీ (మెల్‌బోర్న్, ఆస్ట్రేలియా)
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, గూగుల్ సెర్చ్ కన్సోల్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.13,000-19,000
దరఖాస్తు గడువు: జనవరి 21
☛ https://tinyurl.com/pkps9kbw

ఎన్‌సీఈఆర్‌టీలో..

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ), న్యూదిల్లీ.. గ్రూప్- ఏ, బీ, సీ విభాగాల్లో 173 నాన్ అకడమిక్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- గ్రూప్-ఏ: 09 పోస్టులు
- గ్రూప్-బీ: 26 పోస్టులు
- గ్రూప్-సీ: 138 పోస్టులు

అర్హతలు: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
ఎంపిక: పోస్టుల ప్రకారం రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో.
దరఖాస్తు ఫీజు: గ్రూప్-ఏ పోస్టులకు రూ.1,500. గ్రూప్-బీ పోస్టులకు రూ.1,200. గ్రూప్-సీ పోస్టులకు రూ.1,000. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 16.01.2026.
వెబ్‌సైట్: https://ncert.nic.in/

అప్రెంటిస్‌షిప్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ 501 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, టెలికమ్యూనికేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెషినిస్ట్, డేటా ఎంట్రీ, సివిల్, ఫిట్టర్.. మొదలైనవి..
అర్హత: సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిగ్రీ ఉండాలి.
వయసు: 31.12.2025 నాటికి 18 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 12.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://iocl.com/apprenticeships

ఆర్టీసీలో సూపర్‌వైజర్లు

తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్.. సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రెయినీ (టీఎస్‌టీ): 84
- మెకానికల్ సూపర్‌వైజర్ ట్రెయినీ (ఎంఎస్‌టీ): 114

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉండాలి.
వయసు: జులై 1, 2025 నాటికి 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్‌లకు ఐదేళ్లు, ఈఎస్ఎంకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుంది. **వేతన శ్రేణి:** నెలకు రూ.27,080 - 81,400. **దరఖాస్తు ఫీజు:** రూ.800. ఎస్సీ, ఎస్టీలకు రూ.400.
ఆన్‌లైన్ దరఖాస్తులు: డిసెంబరు 30 నుంచి జనవరి 20 వరకు స్వీకరిస్తారు.
ఎంపిక: రాత పరీక్షతో.
వెబ్‌సైట్: https://www.tgprb.in/

బీఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుళ్లు

భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖకు చెందిన బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) స్పోర్ట్స్ కోటాలో 549 కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పదో తరగతి విద్యార్హతతో పాటు క్రీడల్లో ప్రతిభ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.



అథ్లెటిక్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, స్విమ్మింగ్, షూటింగ్, జూడో, కరాటే, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, సైక్లింగ్, వాటర్ స్పోర్ట్స్, ఉషు.. మొదలైన క్రీడా విభాగాలు ఉన్నాయి. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ (పీఎస్‌టీ), మెరిట్ లిస్ట్ (క్రీడా ప్రదర్శన ఆధారంగా), ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలతో నియామకాలుంటాయి.

అంతర్జాతీయ క్రీడా పోటీల్లో బంగారు/ వెండి/ కాంస్య పతకాలు సాధించిన లేదా పాల్గొన్నవారికి మొదటి ప్రాధాన్యమిస్తారు. జాతీయ క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన/ పాల్గొన్నవారికి రెండో ప్రాధాన్యమిస్తారు. పతకాలవారీగా మార్కుల కేటాయింపు ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్: పురుషుల ఎత్తు 170 సెం.మీ. (ఎస్టీ 162.5 సెం.మీ.), మహిళలు 157 సెం.మీ. (ఎస్టీ 150 సెం.మీ.) ఉండాలి.

- పురుషుల ఛాతీ 80 సెం.మీ.ఉండి.. గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ. పెరగాలి. ఎస్టీకి 76 సెం.మీ.. ఉండి, గాలి పీల్చినప్పుడు 5 సెం.మీ. పెరగాలి.
- పురుషులు, మహిళలు ఎత్తు, వయసులకు తగ్గ బరువు ఉండాలి.

ముఖ్యాంశాలు

ఖాళీలు: 549. పురుషులకు 277, మహిళలకు 272.
అర్హత: పదోతరగతి. గత రెండేళ్లలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించివారు లేదా పాల్గొన్నవారు దరఖాస్తుకు అర్హులు.
వయసు: 23 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.159. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలకు ఫీజు లేదు.
వేతన శ్రేణి: నెలకు రూ.21,700-69,100.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15.01.2026
వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

సీఎంఈఆర్ఐలో టెక్నీషియన్లు

సీఎస్ఐఆర్ అనుబంధ సంస్థ.. సెంట్రల్ మెకానికల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ) దుర్గాపుర్ (పశ్చిమ్‌బంగా).. 20 టెక్నీషియన్-1 పోస్టులను ప్రకటించింది. పదోతరగతి, ఐటీఐలతో దరఖాస్తు చేసుకోవచ్చు. ట్రేడ్‌టెస్ట్, రాతపరీక్షలతో నియామకాలు ఉంటాయి.



విద్యార్హతలు, అనుభవంతో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ట్రేడ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. ఇందులో అర్హత పొందినవారికి రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇది ఓఎంఆర్/ కంప్యూటర్ బేస్డ్ విధానంలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలతో ఉంటుంది.

- మూడు పేపర్లలో 150 ప్రశ్నలు ఇస్తారు. పేపర్-1 మెంటల్ ఎబిలిటీ టెస్ట్-50 ప్రశ్నలు-100 మార్కులు. ప్రశ్నకు రెండు మార్కులు. రుణాత్మక మార్కులు లేవు. దీంట్లో భాగంగా జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సిచ్యువేషన్ జడ్జిమెంట్‌ల నుంచి ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి 60 నిమిషాలు.
- పేపర్-2-జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలకు 75 మార్కులు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలకు 75 మార్కులు. ప్రతి ప్రశ్నకు 3 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ 1 మార్కు తగ్గిస్తారు. వ్యవధి 30 నిమిషాలు.
- పేపర్-3లో సబ్జెక్టు సంబంధిత 50 ప్రశ్నలకు 150 మార్కులు. ప్రశ్నకు 3 మార్కులు. ప్రతి తప్పు సమాధానానికీ 1 మార్కు తగ్గిస్తారు. వ్యవధి 60 నిమిషాలు.
- పేపర్-1లో ప్రతిభ చూపినవారికి మాత్రమే పేపర్-2, 3 రాసే అవకాశం ఇస్తారు. పేపర్-2, 3ల్లో సాధించిన మార్కులతో మెరిట్ లిస్టును రూపొందిస్తారు.
- ట్రేడ్ టెస్ట్ తేదీ, సమయం, వేదిక వివరాలను సంస్థ వెబ్‌సైట్‌లో తెలియజేస్తారు. తాజా ఉద్యోగ సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

సన్నద్ధత

ట్రేడ్ టెస్ట్‌లో అర్హత సాధిస్తేనే రాత పరీక్షకు ఎంపిక చేస్తారు. కాబట్టి ముందుగా ఈ టెస్ట్‌ను సమర్థంగా ఎదుర్కోవాలి. తర్వాత ముఖ్యమైంది పేపర్-1. ఇందులో సఫలమైతేనే పేపర్-2, 3 రాసే అవకాశం ఉంటుంది. ఈ పేపర్‌లో ఉండే జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, సిచ్యువేషన్ జడ్జిమెంట్‌లపై అవగాహనకు వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

- పేపర్-1కు రుణాత్మక మార్కులు లేవు. కాబట్టి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి. సమయం ఎక్కువ తీసుకునే ప్రశ్నలను చివరిలో ప్రయత్నించవచ్చు.
- రాత పరీక్ష తేదీని ఇంకా ప్రకటించలేదు. కాబట్టి ఇప్పటి నుంచే సన్నద్ధతను కొనసాగిస్తే ఫలితం ఉంటుంది.

వివరాలు

అర్హతలు: పదోతరగతి, ఫిట్టర్/ ఎలక్ట్రీషియన్/ మెకానిక్ (ఎలక్ట్రికల్ పవర్ డ్రైవ్స్)/ ఎలక్ట్రానిక్స్ మెకానిక్/ ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/ డిజిటల్ ఫొటోగ్రఫీ ట్రేడ్‌తో ఐటీఐ 55 శాతంతో పూర్తిచేయాలి. రెండేళ్ల ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: దరఖాస్తు గడువు తేదీ నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్లు సడలిస్తారు.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ మహిళలు/ దివ్యాంగులకు ఫీజు లేదు.

వేతన శ్రేణి: నెలకు రూ.19,900-63,200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 21.01.2026

వెబ్‌సైట్: http://www.cmeri.res.in/

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

'రాజకీయాల్లో రాణించాలంటే చతురత చాలా అవసరం... ఆడవాళ్లకు అది సాధ్యం కాదు' అని కొందరు చెప్పిన మాటల్ని పక్కకు నెట్టి... ఈ రంగంలో తమదైన పాత్ర పోషిస్తున్నారు మహిళలు. అలా ఈ ఏడాది ప్రజల మనసులు గెలుచుకున్న రాజకీయ నాయకురాళ్లు వీళ్లు...

నాయిక 2025

ప్రజల మనసులు గెలిచిన... నాయకురాళ్లు..!

మహిళా సంక్షేమమే ధ్యేయంగా... – రేఖాగుప్తా



హరియాణాలోని జులానా రేఖా గుప్తా స్వస్థలం. తండ్రి జై భగవాన్ జిందాల్ స్టేట్ బ్యాంక్ ఉద్యోగి. రేఖకు రెండేళ్ల వయసులోనే దిల్లీకి మకాం మార్చారు తల్లిదండ్రులు. దాంతో విద్యార్థి దశ నుంచే ఆమెలో రాజకీయాలపై ఆసక్తి మొదలైంది. స్కూల్లో ఉండగానే ఆర్‌ఎస్‌ఎస్ భావజాలానికి ఆకర్షితురాలయ్యారీమె. చదువుతోపాటు పోరాటాల్లోనూ చురుగ్గా ఉండేవారు. 1996లో దిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో గెలుపొంది తన లక్ష్య సాధనలో మొదటి అడుగు వేశారు. 'ఆడవాళ్లు ఇంటి బాధ్యతలు నిర్వర్తిస్తే చాలు' అనుకునే కుటుంబ నేపథ్యమే ఈమెది కూడా. కానీ పట్టుదలగా ఇంటా బయటా పనులు చక్కబెడుతూ వచ్చారు రేఖ. 2002లో భాజపాలో చేరారు. అప్పట్నుంచి పార్టీ కార్యకలాపాల్లో తనదైన ముద్ర వేశారు. పార్టీలోని వివిధ విభాగాలకు సెక్రటరీ, వైస్-ఛైర్‌పర్సన్, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు, ఇన్‌ఛార్జిగా... పలు హోదాల్లో పనిచేశారు. 2015, 2020ల్లో జరిగిన ఎన్నికల్లో షాలిమర్ బాగ్ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. రెండూ విఫలయత్నాలే. అయినా వెనుతిరగలేదామె. 'రాజకీయాల్లో జయాపజయాలకు చోటుండకూడదు. గెలిచినా, ఓడినా సేవకు దూరం అవ్వకూడదు' అంటారీమె. ఈ కార్యదక్షతను మెచ్చే ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో రేఖకు పట్టం కట్టారు హస్తిన వాసులు. వాక్చాతుర్యం, సూటిగా ప్రశ్నించే తత్వానికి ఫిదా అయిన అధిష్ఠానం ముఖ్యమంత్రి పదవికి ఈమెను ఎంపిక చేసింది. అది మొదలు ఏడాదిగా సుపరిపాలన, మహిళా సంక్షేమమే లక్ష్యంగా సాగిపోతున్నారు రేఖ. బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రతకు పెద్ద పీట వేశారీమె. వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి 48వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను స్థాపించే దిశగా అడుగులు వేశారు. వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్ల స్థాపనకు తీసుకున్న నిర్ణయం కూడా చెప్పుకోదగినదే. అంతేకాదు, మహిళా రక్షణకు దిల్లీ వ్యాప్తంగా 50 వేల సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేయాలన్న ఆదేశాల్నీ జారీ చేశారు. మాతాశిశు సంక్షేమానికి పోషణ్ 2.0, న్యూట్రిషన్ కిట్లు వంటివీ అందిస్తున్నారు.

క్షేత్రస్థాయి సమస్యలు తెలుసు కాబట్టే... – శ్రేయసి సింగ్



ఉన్నత కుటుంబం, రాజకీయాలపై అవగాహన, వారసత్వం... ఇన్ని ఉన్నా తనకంటూ ప్రత్యేక గుర్తింపును కోరుకున్నారు శ్రేయసి సింగ్. షూటర్‌గా రాణించాలని కలలు కన్నారు. తను అనుకున్నట్లుగానే కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు కొల్లగొట్టారు. అర్జున అవార్డు గ్రహీత కూడా. బిహార్, జముయి జిల్లాలోని గిధౌర్ గ్రామంలో పుట్టిపెరిగారీమె. తండ్రి ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చారు శ్రేయసి. గతంలో తల్లి లోక్‌సభ స్థానానికి పోటీ చేయగా ప్రచార బాధ్యతలు తలకెత్తుకున్నారీమె. దాంతో క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్ని తెలుసుకుని వాళ్లలో ఒకరిగా కలిసిపోయారు. కొవిడ్ సమయంలోనూ పలు సేవాకార్యక్రమాల్లో తనదైన పాత్ర పోషించారు శ్రేయసి. ఈ అనుభవాలన్నీ ఎన్నికల్లో గెలుపునకు కారణం అయ్యాయి. ఐటీ, క్రీడాశాఖల మంత్రిగా శ్రేయసికి పట్టం కట్టాయి. క్రీడాకారిణిగా శిక్షణ, ఎంపిక, అవకాశాల విషయంలో తనకు ఎదురైన ఇబ్బందులు ఇంకెవరికీ ఎదురవ్వకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నారీమె. ఇందుకుగానూ జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ క్యాలెండర్‌ను రూపొందించారీమె. మారుమూల గ్రామాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారుల్ని వెలికి తీసేందుకు అకాడమీల స్థాపనకు ప్రయత్నిస్తున్నారు. ఉపాధి, టెక్నాలజీలో అభివృద్ధి కోసం ఐటీ కారిడార్లనీ బిహార్‌లో నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నారు.

మోదీ ప్రశంసలు పొంది... – మైథిలీ ఠాకుర్



బిహార్‌లోని మధుబని జిల్లా, బేనీపట్టీలో పుట్టిపెరిగారు మైథిలీ ఠాకుర్. సంగీత నేపథ్యం ఉన్న కుటుంబం. దాంతో మైథిలి కూడా ఈ రంగంలో రాణించాలని కలలు కన్నారు. సామాజిక స్పృహ ఎక్కువ ఈమెకు. అందరిలా మూసధోరణిలో కొట్టుకుపోకుండా... పాటతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓటరు హక్కులు, జాబితాలో నమోదు, ఓటుకున్న ప్రాధాన్యత లాంటి విషయాలన్నీ పాటలుగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. దాంతో ఎన్నికల కమిషన్ బిహార్ స్టేట్ ఐకాన్‌గా ఈమెకు పట్టం కట్టింది. భోజ్‌పురి, హిందీ భాషల్లో పాడతారీమె. జానపద, శాస్త్రీయ సంగీతాల్లో దిట్ట. ఈ గుణాలన్నీ అట్టడుగు వర్గాలకు ఆమెను చేరువ చేశాయి. వీటికి తోడు అయోధ్య రామమందిరం ప్రారంభ ఉత్సవంలో శబరి మీద పాడిన పాట ప్రధాని మోదీ ప్రశంసలు అందుకునేలా చేసింది. ఇవన్నీ తన రాజకీయ జీవితానికి మార్గం సుగమం చేశాయి. దాంతో 2025 బిహార్ ఎన్నికల్లో అలీనగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, ఎమ్మెల్యేగా గెలిచారీమె.

వారసత్వాన్ని అందిపుచ్చుకుని... – దేవయాని సింగ్ రానా



జమ్మూలో వ్యాపారవేత్తల కుటుంబంలో పుట్టి పెరిగారు దేవయాని. తండ్రి దేవేంద్ర సింగ్ నగ్రోటా ఎమ్మెల్యే. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా పొందారు దేవయాని. చదువయ్యాక కుటుంబ వ్యాపారాల్ని చూసుకునేవారు. తండ్రిలానే రాజకీయాల్లోనూ రాణించాలని కలలు కనేవారు. అందుకే పనుల నుంచి కాస్త ఖాళీ దొరికినా, సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారీమె. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ 2024లో దేవేంద్ర సింగ్ మరణించారు. అదే ఏడాది భారతీయ జనతా యువ మోర్చాలో వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారీమె. అక్కడా తనదైన శైలితో రాణించారు. తర్వాత వచ్చిన ఉపఎన్నికల్లో పోటీచేసి భారీ మెజార్టీతో గెలుపొందారీమె.



శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనలు చేయాలంటే ఆసక్తి, పట్టుదల, తెలివితేటలు మాత్రమే సరిపోవు. సమయాన్నీ కేటాయించాలి. వృత్తిలో ఎదురయ్యే పోటీని తట్టుకోగలగాలి. కుటుంబజీవనంలో ఉన్న స్త్రీలకు అది కష్టసాధ్యమే. కానీ ఆ సవాళ్లని అధిగమిస్తున్నారు. అందుకే గత రెండు దశాబ్దాలుగా మహిళా శాస్త్రవేత్తల సంఖ్య పెరుగుతోంది. అలా తమ పరిశోధనలతో ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అవార్డుల్ని అందుకున్నారీ మహిళలు.

శా'స్త్రీ'య శోధకులు!

జీవపరిణామ శోధనలో...



ఒకే రకమైన పర్యావరణ మార్పులకు కొన్ని జీవులు మరణిస్తే, మరికొన్ని వృద్ధి చెందుతాయి. దీనికి కారణాలేంటి, అవి జీవుల్లో ఎలా ప్రభావితం చేస్తున్నాయనే దాని మీద ఇప్పటికే అనేక పరిశోధన పత్రాలను సమర్పించారు డా.దీపా అగాశే. బెంగళూరులోని నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్. పుణెలో మైక్రోబయాలజీలో డిగ్రీ, మాస్టర్స్ అనంతరం టెక్సాస్‌లోని ఆస్టిన్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ, హార్వర్డ్‌లో పోస్ట్ డాక్టొరల్ రిసర్చ్ చేశారు. అక్కడ ఉన్నప్పుడే బ్యాక్టీరియా పరిణామంలో జన్యుమార్పుల ప్రభావాన్ని గుర్తించారు. భారత్‌కు తిరిగొచ్చి బెంగళూరులోని ఎన్‌సీబీఎస్‌లో ఎకాలజీ, ఎవల్యూషనరీ బయాలజీ, మాలిక్యులర్ బయాలజీ విభాగాలకి నాయకురాలిగా ఉన్నారు. ఎక్స్‌పరిమెంటల్ ఎవల్యూషన్, జెనోమిక్స్, ఫైలోజెనెటిక్స్ వంటి టూల్స్ సాయంతో బ్యాక్టీరియా, కీటకాలు కొత్త వాతావరణానికి అనుగుణంగా ఎలా మారుతున్నాయనే దానిపై పరిశోధన చేస్తున్నారు. ఈ రంగంలో ఈమె బృందం చేసిన కృషికి ఈ ఏడాది రాష్ట్రపతి నుంచి రాష్ట్రీయ విజ్ఞాన్ యువ-శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారాన్ని అందుకున్నారు. పరిశోధనలతోపాటు వంట చేయడం, ఈత కొట్టడం, హైకింగ్‌కి వెళ్లడాన్నీ ఇష్టపడతారు దీప.

ఆర్కిటిక్‌పై పరిశోధనలు చేసి..!



అతి శీతల వాతావరణం, సుదీర్ఘ రాత్రుళ్లూ పగళ్లూ... ఏమాత్రం నివాస యోగ్యంకాని ప్రాంతమే ఉత్తర ధ్రువంలోని ఆర్కిటిక్. గ్లోబల్‌వార్మింగ్‌తో వేగంగా వేడెక్కుతూ ప్రపంచ వాతావరణాన్నీ ప్రభావితం చేస్తుంది. అందుకే ఆ ప్రాంతాన్ని అధ్యయనం చేసేందుకు మనదేశం కూడా 'హిమాద్రి' పేరుతో పరిశోధనా కేంద్రాన్ని 2008లో నెలకొల్పింది. అలాంటి కఠిన వాతావరణ పరిస్థితుల్లోకి మూడుసార్లు వెళ్లారు కేరళకు చెందిన డా.అను గోపీనాథ్. మంచు కరగడంపై మీథేన్ వాయువు ప్రభావం, పెట్రోలియం ఉత్పత్తులతో సాగర జలాలకు కలిగే నష్టం... వంటి ఎన్నో అంశాల్ని అధ్యయనం చేశారు. అందుకే ఆర్కిటిక్‌పై భారత విధానంతోపాటు వీటి ఆధారంగా హిమాలయాలపై గ్లోబల్‌వార్మింగ్ ప్రభావాన్ని అర్థంచేసుకోవడం... వంటి అనేక అంశాలతో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఆన్‌లైన్ కోర్సుల రూపకల్పనకు ఈమెను ఎంపిక చేసింది యూజీసీ. 'పర్యావరణ పరంగా ధ్రువ ప్రాంతాల్లో మంచు కరగడంపై సర్వత్రా ఆందోళనే. కానీ సహస్రాబ్దాల నాటి ఆ మంచు కరిగి కొత్త దారుల్నీ ఏర్పరుస్తుంది. దీని ఆధారంగా ఆర్థిక, రక్షణ వ్యూహాలను రచించుకోవచ్చు. ఆర్కిటిక్‌కు నౌకామార్గాలను అన్వేషించడం అధ్యయనం కోసమే కాదు, ఇతర దేశాల ఆధిపత్యాన్నీ మనం అడ్డుకోవచ్చు. ఈ పరిశోధనలన్నీ భవిష్యత్ పెట్టుబడులకు బాట వేస్తాయి' అంటారామె.

లెక్చరర్‌గా కెరియర్ ప్రారంభించి, ఆర్కిటిక్ వరకూ సాగిన ఆమె ప్రయాణంలో మైలురాళ్లెన్నో. ప్రస్తుతం కేరళ యూనివర్సిటీ ఆఫ్ ఫిషరీస్ అండ్ ఓషన్ స్టడీస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్, ఆక్వాటిక్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ విభాగానికి అధిపతిగా ఉంటూనే, ఇస్రో చేపట్టేవాటితో సహా అనేక పరిశోధనల్లో పాల్గొంటున్నారు అను గోపీనాథ్. అందుకే ప్రతిష్ఠాత్మక ఇండియన్ సొసైటీ ఆఫ్ అనలిటికల్ సైంటిస్ట్స్(ఐఎస్ఏఎస్) సంస్థ ఆమెను ఈ ఏడాది 'ఉత్తమ మహిళా శాస్త్రవేత్త'గా ఎంపికచేసింది.

నలభైల్లో కెరియర్ ప్రారంభించి!



'లక్ష్యాన్ని సాధించడానికి వయసుతో సంబంధం లేదు. దృఢ సంకల్పం ఉంటే చాలు' అని నిరూపించారు డా.ఆర్.ఎస్. జయశ్రీ. 45 ఏళ్ల వయసులో కెరియర్‌ను ప్రారంభించారు. ఈమెది ఎర్నాకుళంలోని ఉత్తర పరవూర్. ఫిజిక్స్‌లో డిగ్రీ పూర్తయ్యాక కొచ్చి యూనివర్సిటీ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. పెళ్లయ్యాక కేరళ యూనివర్సిటీలో పీహెచ్‌డీలో చేరారు. ముగ్గురు పిల్లలు, కుటుంబ బాధ్యతలు. చదవడానికి సమయం చిక్కేది కాదు. ఎలాగో వీలుచేసుకుని రాత్రి వేళల్లోనే చదివి ఫిజిక్స్‌లో డాక్టరేట్ సంపాదించారు. ఉమన్ ఇన్ సైన్స్ ఫెలోషిప్‌నీ అందుకున్నారు.

'శ్రీ చిత్రా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ'లో రేడియాలజీ విభాగంలో శాస్త్రవేత్తగా కెరియర్‌ను ప్రారంభించాక, ఆస్ట్రేలియాలోని మోనాష్ యూనివర్సిటీ నుంచి పోస్ట్ డాక్టొరల్ ఫెలోషిప్‌నీ పూర్తిచేశారు. తిరిగొచ్చాక చిత్రా ఇన్‌స్టిట్యూట్ ఈమె నాయకత్వంలో బయోఫొటోనిక్స్ అండ్ ఇమేజింగ్ విభాగాన్ని నెలకొల్పింది. ఏళ్ల తరబడి ఆమె చేసిన కృషి, వృత్తిపట్ల కనబరిచిన అంకితభావంతో జాతీయ గుర్తింపునీ పొందారు. క్యాన్సర్ కణితిని గుర్తించేందుకు రామన్ స్కాటరింగ్ అప్లికేషన్స్‌నీ విజయవంతంగా ఉపయోగించారు. 62 ఏళ్ల వయసులోనూ అత్యాధునిక పరిశోధనలకు నాయకత్వం వహిస్తున్నారు. బ్లడ్ బయోమార్కర్ల ద్వారా అల్జీమర్స్ వ్యాధిని ముందుగా గుర్తించే పరికరాన్ని అభివృద్ధి చేసే పనిలో ఉన్నారు. ఫలితమే కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్'(ఎన్ఏఎమ్ఎస్)నుంచి 'ఉమన్ ఇన్ మెడిసిన్' అవార్డు. దీన్ని అందుకున్న తొలి మలయాళీ మహిళ కూడా.

మరి కొందరు...

- డా. శ్వేతా ప్రేమ్ అగర్వాల్... మద్రాస్ ఐఐటీలో ప్రొఫెసర్. క్రిప్టోగ్రఫీ, పోస్ట్-క్వాంటమ్ సిస్టమ్స్‌లో చేసిన విశేష కృషికి రాష్ట్రీయ విజ్ఞాన్ యువ- శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డుని తీసుకున్నారు.
- మంగళూరు శ్రీనివాస యూనివర్సిటీ ప్రొఫెసర్, ప్రిన్సిపల్ రిసర్చ్ సైంటిస్ట్‌గా ఉన్న డా. సంధ్యా షెనోయ్ థర్మో ఎలక్ట్రిక్ మెటీరియల్స్‌లో చేసిన పరిశోధనలకి స్టాన్‌ఫర్డ్ 'టాప్ టూ పర్సెంట్ సైంటిస్ట్స్'లో వరసగా మూడోసారి స్థానం పొందారు.
- హైదరాబాద్‌లోని ఏఐజీలో రిసర్చ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాన్స్‌లేషనల్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్న డా.ఎం.శశికళ... గ్యాస్ట్రో ఎంటరాలజీ, మధుమేహ ట్రాన్స్‌లేషనల్ రిసర్చ్‌లో చేసిన కృషికి ప్రతిష్ఠాత్మక 'అమెరికన్ అసోసియేషన్ ఫర్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ ఫెలోషిప్'ను అందుకున్నారు.

తను ముందులా లేరు!

నాకు 26ఏళ్లు. అమ్మానాన్నలది రెండో పెళ్లి. మొదటి వివాహంలో నాన్నకు ఇద్దరు పిల్లలు. వాళ్లతో సంబంధాలు లేకున్నా... కొడుకంటే ఇష్టం ఆయనకు. దాంతో నన్నెప్పుడూ బిడ్డగా భావించలేదు. నేను ఐదేళ్లుగా ఓ అబ్బాయిని ప్రేమిస్తున్నా. నాన్న ప్రేమకు నోచుకోకపోవడం వల్లనేమో, ఇష్టపడిన అబ్బాయిలో ఆ ప్రేమను వెతుక్కోవాలి అనుకున్నా. తనూ కేరింగ్‌గానే ఉండేవాడు. కానీ ఇప్పుడు ఫోన్ ఎత్తడం లేదు. మళ్లీ ఒంటరిని అయిపోయా అనిపిస్తుంది. –ఓ సోదరి

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

మీరు చెప్పినదానిబట్టి... అప్పటి పరిస్థితుల్లో మీ నాన్న ఓ తోడు కావాలనే ఉద్దేశంతోనే పెళ్లి చేసుకుని ఉంటారు. కానీ గతానుభవాల వల్ల మీకు దగ్గర కాలేకపోయారు. దీనివల్ల మీరు తండ్రి ఆప్యాయతకు దూరమయ్యారు. కాబోయే జీవిత భాగస్వామిలో ఆ ప్రేమాభిమానాల్ని వెతుక్కున్నారు. కానీ ఇది సబబు కాదు. భర్త ఎప్పుడూ తండ్రి కాలేడు. వీరిద్దరి బాధ్యతలు వేర్వేరు. మీరు కోల్పోయిన ప్రేమను వెతుకుతూ... అతని మీద ఆధారపడ్డారు. అది అతనికి భారమై మిమ్మల్ని దూరం పెట్టి ఉండొచ్చు. దాంతో మళ్లీ మీరు ఒంటరితనాన్ని ఫీల్ అవుతున్నారు. డిప్రెషన్ లక్షణాలూ కనిపిస్తున్నాయి. వెంటనే సైకియాట్రిస్టుని కలవండి. సైకలాజికల్ టెస్టింగ్ ద్వారా మీ మానసిక స్థితిని తెలుసుకుంటారు. దానిబట్టి థెరపీకి రిఫర్ చేస్తారు. తండ్రి భాగస్వామి పాత్రలకు మధ్య ఉండే అంతరాన్ని మీకు వివరిస్తారు. బంధాలు బాంధవ్యాల మీద మీ ఆలోచనా దృక్పథం మారేందుకు సహాయపడతారు. ఎందుకంటే ఇది తెలుసుకోనంత వరకూ భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉంటారు.

ఆరోగ్యానికి నిమ్మ



వంటింట్లో అందుబాటులో ఉండే నిమ్మకాయంటే చాలా మందికి చిన్న చూపే. కానీ, ఇందులో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా దీనిలోని విటమిన్ సి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు వంటి వాటిని రాకుండా అడ్డుకుంటుంది. ఇందులోని పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు కణాల ఆరోగ్యాన్ని కాపాడతాయి. నరాల ఆరోగ్యానికి అవసరమైన పొటాషియం పుష్కలంగా వీటి నుంచి లభిస్తుంది. శరీరం ఇనుముని గ్రహించుకోవడానికి సాయపడుతుంది.

ఖాళీగా ఉన్నా అనిపించి..!

నా విజయం

మేము విజయనగరంలో ఉంటాం. బి.కామ్ చదువుకున్నా. కానీ పెళ్లయి పిల్లలు పుట్టాక వాళ్లే ప్రపంచంగా బతికా. పిల్లలు, కుటుంబ బాధ్యతలతో నిమిషం తీరిక లేకుండా గడిపేదాన్ని. వీటన్నింటి మధ్యా రోజులు ఎలా గడిచిపోయాయో కూడా తెలియనే లేదు. ఇప్పుడు నాకు 45 ఏళ్లు. పిల్లలు పెద్దవాళ్లయ్యారు. వాళ్ల పనులు, చదువులు అన్నీ వాళ్లే చూసుకునే స్థాయికి చేరుకున్నారు. మావారు కూడా ఆయన పనుల్లో హడావుడిగా ఉంటున్నారు. ఇంట్లో ఒక్కదాన్నే ఖాళీగా ఉన్నాననే భావన. అందుకే ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నా. 'క్లౌడ్ కిచెన్' ప్రారంభించాలన్న ఆలోచన వచ్చింది. కుటుంబ సభ్యుల మద్దతూ దొరికింది. దాంతో ఈ ఏడాది ప్రారంభించా. బాగా నడుస్తోంది. ముగ్గురికి ఉపాధి కూడా ఇస్తున్నా. నాకు చాలా సంతోషంగా ఉంది. ఇది ఈ ఏడాది నేను సాధించిన విజయం.

– సుభద్ర పానంగిపల్లి, విజయనగరం

గడియారం... వింటేజ్ లుక్‌లో!



సాధారణంగా గోడ గడియారం అనగానే గుండ్రంగానో చతురస్రాకారంలోనో ఉండేవే గుర్తొస్తాయి. కానీ కాలంతో పాటు గడియారాలూ మారుతున్నాయి. ఇప్పటివాళ్లు ఇంటీరియర్‌లో ప్రతి వస్తువులోనూ కొత్తదనం కోరుకుంటున్నారు. జెన్‌జీలయితే మరీనూ. తాతలనాటి జ్ఞాపకాల్ని సమయంతో కలిపి చూడ్డానికి ఇష్టపడుతున్నారు. అందుకే వాళ్లకోసం గడియారాలను గోడలకే పరిమితం చేయకుండా పాతకాలపు రాకింగ్ చెయిర్, పియానో, రిక్షా, రైలు ఇంజిన్, బుల్లెట్, గ్లోబ్...వంటి ఆకారాల్లో తయారుచేస్తున్నారు ఉత్పత్తిదారులు. దాంతో ఇవి వింటేజ్ లుక్‌లో అందంగా కనువిందు చేస్తున్నాయి. వీటిని డ్రాయింగ్ రూమ్, లివింగ్ రూమ్, పిల్లల బెడ్‌రూమ్ గోడలమీదా టీపాయ్‌పైనా పెట్టుకునేలా తీసుకొచ్చారు. రాగి, ఇత్తడి... వంటి మెటల్స్‌తో తయారైన ఈ వింటేజ్ క్లాక్‌లు గది ఉష్ణోగ్రతలనీ తెలియజేస్తాయట. 'గడియారం సమయం విలువను గుర్తుచేస్తుంది. గడిచిన కాలం తిరిగి రాదు' అంటూ బంధుమిత్రులకు బహుమతిగానూ ఇస్తున్నారు. మరి మీకూ నచ్చాయా?!



> మహిళలు మల్టీటాస్కింగ్ చేయగలరు. చేసే పని మీద స్పష్టతతోనూ ఉంటారు. కెరియర్‌లో ఎదగాలంటే కూడా... స్త్రీలు ఒకరికొకరు సాయం చేసుకోవాలి. మెంటార్‌గా ఉండటం, అమ్మాయిలను రిక్రూట్ చేసుకోవడం, నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం... లాంటి చిన్న ప్రయత్నాలు మిమ్మల్ని నాయకత్వ హోదాలో నిల బెడతాయి.
>
> - అపర్ణ బావా, జూమ్ సీవోవో



రంగవల్లిక





దమయంతి, పెదపాడు
15 చుక్కలు
3 వరుసలు
3 వచ్చే వరకూ





బాల దేవి, ఉండ్రాజవరం
29 చుక్కలు
7 వరుసలు
7 వచ్చే వరకూ





జి.అంజలీ దేవి, మధురానగర్
21 చుక్కలు
1 వచ్చేవరకూ

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

(c) eenadu

చాంపియన్



టాస్ గెలవడం.. బౌలర్లు విజృంభించడం.. తర్వాత బ్యాటర్లూ రాణించడంతో భారత్ అలవోకగా గెలవడం.. శ్రీలంకపై ఇలాగే హ్యాట్రిక్ విజయాలతో సిరీస్‌ను చేజిక్కించుకుంది మహిళల జట్టు. నాలుగో మ్యాచ్‌లో టాస్ ప్రత్యర్థిని వరించింది. భారత్ మొదట బ్యాటింగ్ చేసింది. అయినా ఆధిపత్యంలో ఏ మార్పూ లేదు. ఫలితమూ మారలేదు. ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న స్మృతి మంధాన, ఫామ్‌లో ఉన్న షెఫాలి వర్మ రెచ్చిపోవడంతో రికార్డు స్కోరు సాధించిన భారత్.. లంకపై మరో విజయం నమోదు చేసింది.

ఈసారి బ్యాటు ధమాకా

- రెచ్చిపోయిన స్మృతి, షెఫాలి, రిచా
- కాస్త పోటీ ఇచ్చిన లంక
- నాలుగో టీ20లోనూ భారత్ విజయం



తిరువనంతపురం

శ్రీలంకతో అయిదు టీ20ల సిరీస్‌లో భారత్ జోరు కొనసాగుతోంది. ఇప్పటికే సిరీస్‌ను చేజిక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సేన.. ఆదివారం నాలుగో టీ20లోనూ అలవోకగా గెలిచింది. మొదట ఓపెనర్లు స్మృతి మంధాన (80; 48 బంతుల్లో 11×4, 3×6), షెఫాలి వర్మ (79; 46 బంతుల్లో 12×4, 1×6)లతో పాటు రిచా ఘోష్ (40; 16 బంతుల్లో 4×4, 3×6) కూడా చెలరేగడంతో భారత్ 2 వికెట్లకు 221 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఛేదనలో లంక కూడా దీటుగానే స్పందించింది. కానీ లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. లంక 6 వికెట్లకు 191 పరుగులు చేసింది. చమరి ఆటపట్టు (52; 37 బంతుల్లో 3×4, 3×6) టాప్‌స్కోరర్. సిరీస్‌లో చివరిదైన అయిదో టీ20 తిరువనంతపురంలోనే మంగళవారం జరుగుతుంది.

నువ్వానేనా..: తొలి మూడు టీ20ల్లో టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా.. నాలుగో టీ20లో టాస్ లంకను వరించడంతో ఆ జట్టూ అదే పని చేసింది. అయితే లంకలా బ్యాటింగ్‌లో భారత్ తడబడలేదు. గత మ్యాచ్‌లో ఇదే వేదికలో లంక 112 పరుగులే చేయగా.. భారత్ దాదాపుగా రెట్టింపు స్కోరు చేయడం విశేషం. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ షెఫాలి రెచ్చిపోయి బ్యాటింగ్ చేస్తే.. సిరీస్‌లో తొలిసారిగా తన బ్యాటు వాడిని చూపించింది స్మృతి. ఆరంభంలో షెఫాలిదే దూకుడు అయినప్పటికీ.. ఆ తర్వాత స్మృతి కూడా రెచ్చిపోయి షెఫాలికి చేరువగా వచ్చేసింది. ఇద్దరూ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయారు. షెఫాలి 30 బంతుల్లో అర్ధ సెంచరీ చేయగా.. స్మృతి 35 బంతుల్లో అర్ధశతకం సాధించింది. వీరి ధాటికి 11వ ఓవర్లోనే 100కు చేరుకున్న భారత్.. 15వ ఓవర్లో 150 దాటేసింది. అప్పటికే ఇద్దరూ 70ల్లోకి వచ్చేయడంతో సెంచరీలు చేయడం ఖాయమనిపించింది. కానీ ఇద్దరూ వరుస ఓవర్లలో వికెట్లు ఇచ్చేయడంతో నిరాశ తప్పలేదు. షెఫాలి, స్మృతి తొలి వికెట్‌కు 162 పరుగులు జోడించారు. తర్వాత ఓపెనర్ల ఊపును కొనసాగిస్తూ రిచా ఘోష్ విధ్వంసకంగా బ్యాటింగ్ చేయడంతో భారత్ సునాయాసంగా 200 దాటేసింది. కవిష వేసిన 19వ ఓవర్లో ఆమె వరుసగా 6, 6, 4, 6 బాదేసింది. హర్మన్‌ప్రీత్ (16 నాటౌట్)తో అభేద్యమైన మూడో వికెట్‌కు రిచా 53 పరుగులు జోడించింది. అనంతరం లంక కూడా ధాటిగా బ్యాటింగ్ చేసింది కానీ.. లక్ష్యం మరీ పెద్దది కావడంతో ఆ జట్టు గెలిచేలా కనిపించలేదు. తొలి మూడు మ్యాచ్‌ల్లో మాదిరి పరుగుల కోసం ఆపసోపాలు పడకపోవడం ఆ జట్టుకు ఊరట. హాసిని (33; 20 బంతుల్లో 7×4)తో కలిసి చమరి జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చింది. హాసిని ఔటయ్యాక ఇమేషా దులాని (29; 28 బంతుల్లో 3×4)తో మరో కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది చమరి. అయితే 13వ ఓవర్లో చమరి ఔటయ్యాక ఆ జట్టు క్రమంగా లక్ష్యానికి దూరమైంది. ఇమేషా, హర్షిత (20), నీలాక్షిక (23)ల పోరాటం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే ఉపయోగపడింది.

221/2
టీ20ల్లో భారత్‌కిదే అత్యధిక స్కోరు. గత ఏడాది వెస్టిండీస్‌పై 217/4తో నెలకొల్పిన రికార్డు బద్దలైంది. ఈ మ్యాచ్‌లో 191/6తో శ్రీలంక కూడా తన అత్యధిక స్కోరును నమోదు చేసింది.



వేగంగా 10000

మహిళల క్రికెట్లో అత్యంత వేగంగా 10 వేల పరుగుల మైలురాయిని అందుకున్న ప్లేయర్‌గా భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన రికార్డు సృష్టించింది. ఆదివారం శ్రీలంకతో నాలుగో టీ20లో ఆమె 80 పరుగులు చేసింది. 27 పరుగుల వద్ద ఆమె పది వేల పరుగులకు చేరుకుంది. ఇంతకుముందు మిథాలి రాజ్, సుజీ బేట్స్ (న్యూజిలాండ్), చార్లోట్ ఎడ్వర్డ్స్ (ఇంగ్లాండ్) మాత్రమే అంతర్జాతీయ క్రికెట్లో 10 వేలు దాటారు. కానీ వేగంగా (281 మ్యాచ్‌లు) ఈ ఘనత సాధించింది స్మృతి. మిథాలీరాజ్ రికార్డు (291)ను ఆమె బద్దలు కొట్టింది. స్మృతి వన్డేల్లో 5322, టీ20ల్లో 4102, టెస్టుల్లో 629 పరుగులు చేసింది.

భారత్ ఇన్నింగ్స్: స్మృతి (సి) ఇమేషా (బి) షెహాని 80; షెఫాలి (సి) అండ్ (బి) నిమష 79; రిచా నాటౌట్ 40; హర్మన్‌ప్రీత్ నాటౌట్ 16; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 2 వికెట్లకు) **221; వికెట్ల పతనం:** 1-162, 2-168; **బౌలింగ్:** మల్షా షెహాని 4-0-32-1; కావ్య కవింది 4-0-43-0; కవిష 4-0-47-0; రష్మిక 2-0-25-0; చమరి 2-0-30-0; నిమిష 4-0-40-1

శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని పెరీరా (సి) హర్మన్‌ప్రీత్ (బి) అరుంధతి 33; చమరి ఆటపట్టు (సి) స్మృతి (బి) వైష్ణవి 52; ఇమేషా రనౌట్ 29; హర్షిత (స్టంప్డ్) రిచా (బి) వైష్ణవి 20; కవిష (సి) కమలిని (బి) అరుంధతి 13; నీలాక్షిక నాటౌట్ 23; రష్మిక (బి) శ్రీ చరణి 5; కౌశిని నాటౌట్ 5; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **191; వికెట్ల పతనం:** 1-59, 2-116, 3-140, 4-147, 5-170, 6-185; **బౌలింగ్:** రేణుక సింగ్ 3-0-32-0; అరుంధతి 4-0-42-2; దీప్తి శర్మ 4-0-31-0; వైష్ణవి శర్మ 4-0-24-2; అమన్‌జ్యోత్ 1-0-10-0; శ్రీ చరణి 4-0-46-1



ఆదివారం రాంచీలో మహిళల హాకీ ఇండియా లీగ్ ఆరంభోత్సవంలో పాల్గొన్న జేఎస్‌డబ్ల్యూ నాయకురాలు కల్పన సోరెన్, హాకీ ప్లేయర్ నవనీత్ కౌర్.

ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు తేజాలు కోనేరు హంపి, అర్జున్ ఇరిగేశి అదరగొట్టారు. స్థిరమైన ప్రదర్శనతో కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. 38 ఏళ్ల హంపి ర్యాపిడ్ ఫార్మాట్లో ఆధిపత్యాన్ని చాటుకుంటూ మరో పతకం నెగ్గగా.. ఒక ప్రపంచ టోర్నీలో పోడియంపై నిలవడం అర్జున్‌కు ఇదే తొలిసారి.

చెస్‌లో తెలుగు వెలుగులు

హంపి, అర్జున్‌కు కాంస్యాలు

ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్



హంపి ర్యాపిడ్ పతకాలు	
స్వర్ణం	(2019, 2024)
రజతం	(2023)
కాంస్యం	(2012, 2025)

● ప్రపంచ ర్యాపిడ్ చెస్‌లో అయిదు పతకాలు నెగ్గిన తొలి ప్లేయర్‌గా హంపి రికార్డు సాధించింది.

దోహ

ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగిన కోనేరు హంపి.. కాంస్యం పతకాన్ని గెలుచుకుంది. టోర్నీ ఆసాంతం అజేయంగా నిలిచిన హంపి.. 11 గేమ్‌లలో 8.5 పాయింట్లతో అలెగ్జాండ్రా గొర్యాచ్‌కినా (రష్యా), జు జినెర్ (చైనా)తో కలిసి సమానంగా నిలిచింది. పదకొండో గేమ్‌లో గొర్యాచ్‌కినా-జినెర్ డ్రా చేసుకున్నారు. దీంతో చివరి గేమ్‌లో గెలిస్తే టైటిల్ హంపి కైవసం అయ్యేది. కానీ సవితతో గేమ్ డ్రా కావడంతో హంపి.. గొర్యాచ్‌కినా, జినెర్‌తో అగ్రస్థానంలో నిలిచింది. టైబ్రేక్ స్కోరులో హంపి మూడో స్థానంలో నిలవడంతో ఆమె కాంస్య పతకానికి పరిమితమైంది. గొర్యాచ్‌కినాకు స్వర్ణం, జినెర్‌కు రజతం దక్కాయి. సవిత (8) నాలుగు, వైశాలి (8) అయిదు, దివ్య ఎనిమిది, హారిక (7) 19వ స్థానాల్లో నిలిచారు. ఓపెన్ విభాగంలో అర్జున్ ఇరిగేశి కంచు మోగించాడు. అర్జున్ 13 రౌండ్లలో 9.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. అర్జున్‌తో పాటు వ్లాదిస్లావ్ (రష్యా), నీమన్ (జర్మనీ), పెరీజ్ (అమెరికా) కూడా 9.5 పాయింట్లే సాధించినా.. టైబ్రేక్ స్కోరులో వ్లాదిస్లావ్‌కు రజతం, అర్జున్‌కు కాంస్యం లభించాయి. ఒక ప్రపంచ చెస్ టోర్నీలో పతకం గెలవడం అర్జున్‌కు ఇదే తొలిసారి. ప్రపంచ నం.1 మాగ్నస్ కార్ల్‌సన్ (10.5) ఆరోసారి ప్రపంచ ర్యాపిడ్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. 2014, 2015, 2019, 2022, 2023లోనూ అతడు విజేతగా నిలిచాడు. టోర్నీలో ఏడో రౌండ్లో వ్లాదిస్లావ్ చేతిలో ఓటమి ఎదురైనప్పటికీ గొప్పగా పుంజుకున్న కార్ల్‌సన్.. ఆఖరి రోజు వరుసగా మూడు రౌండ్లలో విజయం సాధించి ఆధిక్యంలోకి వెళ్లాడు. ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేశ్ (8.5) 20వ స్థానంలో, ప్రజ్ఞానంద (8.5) 27వ స్థానంలో నిలిచారు. సోమవారం ప్రపంచ బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్ ఆరంభంకానుంది.



గొర్యాచ్‌కినా



కార్ల్‌సన్



విషీ తర్వాత

అంతర్జాతీయ చెస్‌లో అర్జున్ ఇరిగేశి చాలా కాలంగా స్థిరమైన ప్రదర్శన చేస్తున్నాడు. దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద మాదిరే భారత చెస్‌లో వేగంగా ఎదిగిన తెలంగాణ కుర్రాడు అర్జున్.. 2800 ఎలో రేటింగ్ అందుకున్నాడు. లైవ్ రేటింగ్‌లో భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కూడా నిలిచాడు. కానీ ఇలాంటి ఎన్ని మైలురాళ్లు దాటినా.. పెద్ద టోర్నీల్లో తడబడతాడనే ముద్ర పడింది. గుకేశ్, ప్రజ్ఞానంద మాదిరే ప్రపంచ టోర్నీల్లో స్థిరంగా రాణించలేడా అన్న చర్చ మొదలైంది. అయితే దానికి తెరదించుతూ ప్రపంచ ర్యాపిడ్ టోర్నీలో అర్జున్ అదిరే ఆటను ప్రదర్శించాడు. తనకు నప్పే ఈ ఫార్మాట్లో దూకుడుగా ఆడి కార్ల్‌సన్‌తో పోటాపోటీగా నిలిచి టైటిల్ రేసులో నిలిచాడు. కార్ల్‌సన్‌తో గేమ్‌ను డ్రా చేసుకున్న అతడు.. ఆఖరి వరకు పోటీలో నిలిచాడు. కానీ ఆఖరి రోజు ఓ ఓటమి అతడిని టైటిల్‌కు దూరం చేసింది. కానీ కాంస్యంతో అతడు తొలిసారి మెగా విజయాన్ని అందుకున్నాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ప్రపంచ ర్యాపిడ్ టోర్నీలో పతకం సాధించిన భారత ప్లేయర్‌గా అర్జున్ ఘనత సాధించాడు. ఒత్తిడి సమయాల్లో తడబడడం గతంలో అర్జున్‌కు బలహీనతగా ఉండేది. ప్రపంచ ర్యాపిడ్ టోర్నీలో అతడు ఈ విషయంలో మెరుగుపడ్డాడు. అతడు ఇదే జోరు ముమ్ముందు టోర్నీల్లోనూ ప్రదర్శిస్తే అర్జున్ కచ్చితంగా మరిన్ని టైటిళ్లు సొంతం చేసుకునే అవకాశం ఉంది.

చరిష్మ, సంజీవిలకు టైటిళ్లు

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్



సూర్య చరిష్మ, తన్వి



రాధిక, సాత్విక్

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు: ఆంధ్రప్రదేశ్ షట్లర్ సూర్య చరిష్మ సత్తా చాటింది. జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఆదివారం మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆమె 17-21, 21-12, 21-14తో తన్వి పత్రి (ఒడిశా)ను ఓడించింది. తొలి గేమ్ చేజారినా.. తర్వాత చరిష్మ పుంజుకుంది. రెండో గేమ్‌లో 6-5 ఉన్న దశ నుంచి వరుస పాయింట్లతో విజృంభించిన తెలుగ మ్మాయి.. గేమ్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో చరిష్మ సుదీర్ఘమైన ర్యాలీలు ఆడింది. వీటిలో ఎక్కువ శాతం ఆమెదే పైచేయి. దీనికి తోడు తన్వి అనవసర తప్పిదాలు చేయడంతో.. చరిష్మ గేమ్‌తో పాటు టైటిల్‌ను సొంతం చేసుకుంది. పురుషుల సింగిల్స్‌లో రిత్విక్ సంజీవి (తమిళనాడు) విజేతగా నిలిచాడు. ఫైనల్లో అతడు 21-16, 22-20తో భరత్ రాఘవ్ (హరియాణా)ను ఓడించాడు. మహిళల డబుల్స్ టైటిల్‌ను శిఖ గౌతమ్-అశ్విని భట్ (కర్ణాటక) జంట గెలుచుకుంది. తుది పోరులో శిఖ-అశ్విని జంట 21-14, 21-18తో ప్రియ (మణిపుర్)-శ్రుతి మిశ్రా (ఉత్తర్‌ప్రదేశ్) జోడీపై నెగ్గింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో హరిహరన్-రూబెన్ కుమార్ (తమిళనాడు) జంట 21-17, 21-12తో మిథిలేశ్-కృష్ణన్ (పుదుచ్చేరి) ద్వయాన్ని ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్ తుదిపోరులో సాత్విక్ రెడ్డి (తెలంగాణ)-రాధిక శర్మ (పంజాబ్) జంట 21-9, 21-15తో అసిత్ సూర్య-అమృత (కర్ణాటక) జోడీపై నెగ్గి విజేతగా నిలిచింది. మహిళల సింగిల్స్ ఛాంపియన్‌గా నిలిచిన చరిష్మకు స్వర్ణ పతకం, రూ.3.5 లక్షల నగదు బహుమతి లభించింది. ఆమెకు ఆంధ్ర బ్యాడ్మింటన్ సంఘం మరో రూ.3 లక్షల ప్రోత్సాహకం ప్రకటించింది. విజేతలకు జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్, శాప్ ఎండీ భరణి, ఏపీ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ద్వారకానాథ్, పి.అంకమ్మచౌదరి నగదు పురస్కారాలు అందజేశారు.

పంత్ స్థానంలో ఇషాన్?



ఇషాన్ కిషన్

దిల్లీ: వికెట్‌కీపర్ రిషబ్ పంత్‌పై వేటు పడనుందా? న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు అతడిని తప్పించనున్నారా? సెలక్టర్లు సంచలన నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం. పంత్ స్థానంలో ఇషాన్ కిషన్‌ను భారత జట్టుకు ఎంపిక చేయొచ్చని తెలుస్తోంది. కివీస్‌తో జనవరి 11న ప్రారంభమయ్యే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం జట్టు మేనేజ్‌మెంట్ భిన్నమైన ఆలోచనలతో ఉన్నట్లు సెలక్షన్ కమిటీ వర్గాలు ధ్రువీకరించాయి. దేశవాళీ క్రికెట్లో అద్భుత ఫామ్‌లో ఉన్న ఇషాన్ విజయ్ హజారేలో కర్ణాటకపై ఇషాన్ 33 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. భారత లిస్ట్-ఎ క్రికెట్లో రెండో వేగవంతమైన శతకం ఇది. అంతకుముందు అదే రోజు బిహార్ కెప్టెన్ సకిబుల్ గని (32 బంతుల్లో) అత్యంత వేగంగా సెంచరీ నమోదు చేశాడు. ప్రస్తుతం అసాధారణ ఫామ్‌లో ఉన్న ఇషాన్.. టీ20 ప్రపంచకప్ జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. పంత్ చివరిసారిగా 2024 ఆగస్టులో కొలంబోలో శ్రీలంకతో వన్డేలో బరిలో దిగాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు ఎంపికైనా.. అతను ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. మరోవైపు మెడ గాయం నుంచి కోలుకున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ జట్టులోకి తిరిగొచ్చేందుకు సిద్ధంగా ఉన్నాడు. గిల్ గైర్హాజరీలో దక్షిణాఫ్రికాతో సిరీస్‌లో కేఎల్ రాహుల్ జట్టుకు సారథ్యం వహించాడు. గాయంతో ఆటకు దూరమైన వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కూడా జట్టులోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం అతను బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు.

ఆ విషయం 15 రోజుల ముందే..



యశస్వి జైస్వాల్

ముంబయి: అంతర్జాతీయ క్రికెట్లో అరంగేట్రం చేయబోతున్నానని 15 రోజులు ముందే అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ వెల్లడించాడని యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ చెప్పాడు. "రోహిత్ భాయ్ చాలా విషయాలు మాట్లాడేవాడు. దీని వల్ల ఆత్మవిశ్వాసం పెరిగింది. 'మైదానంలోకి వెళ్లి స్వేచ్ఛగా నీ షాట్లు ఆడు. ముందు కుదురుకో.. ఆ తర్వాత పెద్ద ఇన్నింగ్స్‌గా మలిచేందుకు ప్రయత్నించు.. 15 రోజుల ముందే నేను నీకు ఈ విషయం చెబుతున్నా' అని రోహిత్ అన్నాడు. అప్పుడే అర్థం అయింది నేను అరంగేట్రం చేయబోతున్నానని. నన్ను సన్నద్ధం చేయడానికి అతడిలా చెప్పాడు. ఒక అన్నలా అన్ని విషయాలు నేర్పించిన రోహిత్‌కు ఎంతో కృతజ్ఞతలు" అని యశస్వి చెప్పాడు. యశస్వి ఇప్పటిదాకా 28 టెస్టులు ఆడి 2511 పరుగులు చేశాడు. వెస్టిండీస్‌పై అరంగేట్ర టెస్టు తొలి ఇన్నింగ్స్‌లోనే 171 పరుగులతో అదరగొట్టాడు. తొలి వికెట్‌కు రోహిత్ శర్మ (103)తో కలిసి 229 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

షాక్‌లో ఉన్నా: మెల్‌బోర్న్ క్యురేటర్

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య జరిగిన బాక్సింగ్ డే టెస్టులో తొలి రోజే 20 వికెట్లు పడిపోవడంతో షాక్‌కు గురయ్యానని మెల్‌బోర్న్ పిచ్ చీఫ్ క్యురేటర్ మాథ్యూ పేజ్ అన్నాడు. బౌలర్లకు పిచ్ విపరీతంగా అనుకూలించిందని పేజ్ తెలిపాడు. "మొదటి రోజు తర్వాత నేను షాక్‌లో ఉన్నా. రెండ్రోజుల్లోనే మ్యాచ్ ముగించడం తీవ్ర నిరాశ కలిగించింది. ఉత్కంఠభరిత టెస్టును అందించాం. కానీ అది ఎక్కువ సేపు జరగలేదు. ఈ మ్యాచ్ నుంచి నేర్చుకుంటాం. వచ్చే ఏడాది సరిచేసుకుంటాం" అని పేజ్ వివరించాడు.

(c) eenadu

ఏక'తాటి'పై ఉపాధిని గెలిచారు!



కొబ్బరి ఈనెలతో చేసిన చేపలు పట్టే ఊత


తాటాకులతో చేసిన బొకే

ప్లాస్టిక్ వస్తువులతో పోటీపడుతున్న ఈ గృహోపకరణాలు కొబ్బరి, తాటాకులతో చేసినవి. వీటి తయారీ వెనుక ఓ మహిళా సంఘం, ప్రకృతి ప్రేమికుడి కృషి ఉంది. ప్రకృతికి మేలు చేసేలా.. తమకూ ఉపాధి దొరికేలా చేసిన ప్రయత్నంలో భాగంగానే 20 మంది మహిళలు తాటాకును నమ్ముకున్నారు. వివిధ వస్తువులు చేసి పదేళ్లుగా ఉపాధి పొందుతున్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన ఇందిరా ప్రియదర్శిని గ్రూపు సభ్యురాలు జయమణి పదేళ్ల కిందట తమిళనాడు వెళ్లి అక్కడ వీటి తయారీ నేర్చుకొని, వచ్చి తోటి సభ్యులకు నేర్పారు. అప్పటి నుంచి అందరూ కలిసి ప్రజల అవసరాలకు తగినట్లు కొత్త వస్తువులు తయారు చేస్తున్నారు. విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ మైదానంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజారులో తమ ఉత్పత్తులను ప్రదర్శించారు.

● ప్రకృతి వ్యవసాయ నిపుణుడు మేకపోతుల విజయరామ్ కూడా కృష్ణా జిల్లా గూడూరు మండలం పినగూడూరులంక గోసదనంలోని క్షేత్రంలో కళాకారులతో తాటాకులు, ఈతాకులు, కొబ్బరి ఈనెలతో బుట్టలు, టోపీలు, చేపలు పట్టే ఊతలు తయారు చేయిస్తున్నారు. వాటిపై పలువురికి శిక్షణ ఇప్పిస్తూ వారికి ఉపాధి చూపిస్తున్నారు.

– ఈనాడు, విశాఖపట్నం; న్యూస్‌టుడే, మచిలీపట్నం (గొడుగుపేట)


తాటాకు బుట్టలు


తాటాకులతో తయారు చేసిన బుట్ట


ఆర్యవైశ్యులకు పార్టీ కండువా కప్పి జనసేనలో చేర్చుకుంటున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు. చిత్రంలో పెనుగొండ సుబ్బరాయుడు, పి.హరిప్రసాద్ తదితరులు

పోలవరానికి పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలనే సూచనను సమర్థిస్తున్నాం

● ఎమ్మెల్సీ నాగబాబు

● పార్టీలో చేరిన పలువురు ఆర్యవైశ్యులు

ఈనాడు, అమరావతి: అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పోలవరం ప్రాజెక్టుకు పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన సూచనను సమర్థిస్తున్నట్లు ఎమ్మెల్సీ, జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు తెలిపారు. తెలుగు మాట్లాడేవారిని చులకనగా చూసే కాలంలో తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి, ఆంధ్రప్రదేశ్ అవతరణకు కీలకభూమిక పోషించిన పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన నేత పెనుగొండ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పలువురు ఆర్యవైశ్యులు పార్టీలో చేరారు. వారికి నాగబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అనగానే తొలిగా గుర్తొచ్చేది పొట్టిశ్రీరాములే అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు రాజకీయ నాయకుల పేర్లు పెట్టే ఆనవాయితీని తోసిపుచ్చి ప్రజలకు శుద్ధిచేసిన తాగునీరు అందించే నీటి ప్రాజెక్టుకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టి ఆయన త్యాగాలను భవిష్యత్ తరాలు గుర్తుచేసుకునేలా చేశారు' అని అన్నారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ పి.హరిప్రసాద్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశ్రీనివాస్, జనసేన నేతలు చిల్లపల్లి శ్రీనివాసరావు, ఉదయభాను, కిలారి రోశయ్య, పంచకర్ల సందీప్, దేవకీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాటకాలకు నడ్డా లేఖ చెంపపెట్టు

భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి యామినీశర్మ



ఈనాడు, అమరావతి: పీపీపీ విధానంలో వైద్యకళాశాలలు నిర్మించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయిస్తే.. వైకాపా నాయకులు కోటి సంతకాల పేరిట అసత్యాలు ప్రచారం చేస్తున్నారని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామినీశర్మ విమర్శించారు. పీపీపీ విధానాన్ని ప్రోత్సహిస్తూ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా.. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రాసిన లేఖ వైకాపాకు చెంపపెట్టు అని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. '20 రాష్ట్రాల్లో 919 డయాలసిస్ కేంద్రాలు పీపీపీ విధానంలో నడుస్తున్నాయి. వీటికి కేంద్రం 80% వరకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఇస్తోంది. ఒక్కో ప్రాజెక్టుకు రూ.5 కోట్ల సాయం అందిస్తోంద'ని నడ్డా లేఖలో పేర్కొన్న విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వ వైద్యకళాశాలల నిర్మాణం త్వరగా పూర్తిచేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, పేద విద్యార్థులకు వైద్యవిద్య అందించాలని కేంద్రం చెబుతుంటే.. అభివృద్ధిని జగన్ బృందం అడ్డుకుంటోందని యామినీశర్మ ఆరోపించారు.

తెలుగు పండగకు ముస్తాబు

● 3 నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు

● 52 దేశాలకు చెందిన ప్రతినిధులు, తెలుగు సంఘాలకు ఆహ్వానాలు

● 4న మారిషస్ అధ్యక్షుడి రాక

ఈనాడు, అమరావతి: తెలుగువారి ఆత్మీయ పండగకు గుంటూరు ముస్తాబవుతోంది. జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 16వ నంబరు జాతీయ రహదారి పక్కనే సాయి బొమ్మిడాలనగర్‌లోని శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు వేదికవుతోంది. ఈ సభలకు 'తెలుగువారి అనురాగ సంగమం'గా నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ మహాసభల ముఖ్య సమన్వయకర్త పి.రామచంద్రరాజు వేదికల నిర్మాణం, రోడ్ల ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్నారు.

10 ఎకరాల్లో 5 వేదికలు

20 ఎకరాల విస్తీర్ణంలో ఈ సభలు జరగనున్నాయి. 10 ఎకరాల్లో పార్కింగ్, మరో 10 ఎకరాల్లో వేదికలు ఏర్పాటవుతున్నాయి. 5,000 మంది కూర్చునేలా నందమూరి తారకరామారావు ప్రధాన వేదికను నిర్మిస్తున్నారు. కవి సమ్మేళనాలకు జాషువా, కరుణశ్రీ వేదిక, అవధానాల ప్రదర్శనల కోసం కొప్పరపు కవుల వేదిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తూము నరసింహదాసు వేదిక, పాడనా తెలుగు పాట కోసం ఘంటసాల, ఎస్.పి.బాలు వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 52 దేశాలతో పాటు మన దేశంలోని వివిధ తెలుగు సంఘాలకు ఆహ్వానాలు పంపారు.


తెలుగు మహాసభలకు సిద్ధమవుతున్న వేదికలు

రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం

'ఈనాడు' సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ రామోజీరావు పేరుతో 'రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం' ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో పుస్తకాలు, హస్తకళలు, ప్రాచీన తెలుగు వైభవానికి సంబంధించిన అంశాలు ఉంచుతారు. ప్రధానవేదిక ప్రాంగణం ముందుభాగంలో రామోజీరావు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఐదు సభా వేదికల ద్వారాలకు సినారె, దాశరథి, దాసరి నారాయణరావు తదితర తెలుగు కవులు, కళాకారులు, సినీ దిగ్గజాల పేర్లు పెడుతున్నారు. భోజన శాలలను డొక్కా సీతమ్మ, పింగళి వెంకయ్య, డాక్టర్ పి.వి.జె.రాజు వంటి మహనీయుల పేరిట ఏర్పాటు చేస్తున్నారు.

మారిషస్ అధ్యక్షుడి రాక

4న మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ హాజరై సందేశం ఇస్తారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మారిషస్‌లో ఎక్కువమంది తెలుగువారు ఉండడంతో ఆహ్వానించామని చెప్పారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పూర్వపు సీజేఐ జస్టిస్ ఎన్.వి.రమణతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి.. నలుగురు గవర్నర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాష్ట్రాల ఎంపీలు హాజరవుతారని వివరించారు.

పూర్ణకుంభ, విశిష్ట పురస్కారాలు

తెలుగుభాష అభ్యున్నతి, పరిరక్షణకు విశేషకృషి చేసిన సంస్థలు, ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలతో పాటు జీవన సాఫల్య పురస్కారాలనూ ప్రదానం చేయనున్నారు. వెయ్యిమంది కవులతో అమరావతికి సహస్ర కవితా నీరాజనం సమర్పించనున్నారు. పండితులతో అవధానం సాగనుంది.

● వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద మూడు క్యాప్సూల్ హోమ్స్ ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో ఇంటిని తలపించేలా షవర్లు, బెడ్‌రూమ్, బాల్కనీ వంటి వసతులు ఉన్నాయి. అతిథుల కోసం గుంటూరు పరిసరాల్లో 3,000 గదులను సిద్ధం చేశారు. మూడు రోజుల పాటు 25,000 మంది యువతీ యువకులతో తెలుగు భాషపై వివిధ కార్యక్రమాలు చేపడతారు.

భారత్ విశ్వగురువు కావడం ప్రపంచానికే అవసరం



సమావేశంలో పాల్గొన్న దత్తాత్రేయ హోసబలే, భన్వరీలాల్ పురోహిత్, మోహన్ భాగవత్ కమలేష్ డి పటేల్, కృష్ణ ఎల్ల తదితరులు

● విశ్వసంఘ్ శిబిరంలో ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్

ఈనాడు, ఈనాడు డిజిటల్, హైదరాబాద్-నందిగామ, న్యూస్‌టుడే: భారతదేశం విశ్వగురువు కావడం ఆకాంక్ష కాదని ఇది ప్రపంచానికే ఎంతో అవసరమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భాగవత్ అన్నారు. విశ్వంలో కరుణ, దయ నశించడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాటిని సమాజంలో అంతర్భాగం చేయడానికి విశ్వసంఘ్ శిబిరం లాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. శ్రీవిశ్వనికేతన్ సంస్థ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా నందిగామలోని కన్హా శాంతి వనంలో ఐదు రోజులపాటు జరిగిన ఏడో విశ్వసంఘ్ శిబిరం ఆదివారం ముగిసింది. ఇందులో 79 దేశాల నుంచి 1,610 మంది కార్యకర్తలు, స్వయం సేవకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. చివరిరోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో సాంకేతికత, సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ వంటివి మనపై ఆధిపత్యం చెలాయించకూడదని.. సాంకేతికతకు మానవుడే యజమాని కావాలని చెప్పారు. రామచంద్రమిషన్ అధ్యక్షుడు కమలేశ్ డి.పటేల్(దాజీ) మాట్లాడుతూ ధర్మం, ఆధ్యాత్మిక పునాదులు లేకుండా ఏ దేశమూ మనుగడ సాగించదన్నారు. మౌనంగా ఉండటం, నిశ్శబ్దంగా కూర్చోవడం, కళ్లు మూసుకోవడం ధ్యానం కాదని.. మన చేతనను, ఆత్మను అత్యున్నత స్థాయికి చేర్చడమే ధ్యానమని అన్నారు.

ప్రపంచగతిని మార్చిన ఆవిష్కరణలు మనవి: కృష్ణ ఎల్ల

భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ కృష్ణ ఎల్ల మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను ఆవిష్కరణలతో పరిష్కరించడమే తన తొలి లక్ష్యమని చెప్పారు. ప్రపంచగతిని మార్చిన అనేక ఆవిష్కరణలు భారత్ నుంచి వచ్చినవేనని వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం మనకు 25 శాతం జీడీపీ.. ఆవిష్కరణల నుంచే వచ్చేదని ఇప్పుడు కూడా దాన్ని సాధించడం మనందరి ముందున్న సవాల్ అని చెప్పారు. ఆవిష్కరణ ఆలోచనలు తగ్గుతున్నాయని, కోచింగ్ సెంటర్లు, ఐఐటీ అడ్మిషన్ల ఒత్తిడి, వలసవాద ఆలోచనలు మనల్ని ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్నారు. 15 ఏళ్లు అమెరికాలో ఉండి అమ్మ సలహాతో మన దేశానికి 1997లో తిరిగి వచ్చి భారత్ బయోటెక్ ప్రారంభించానని చెప్పారు. రోటావైరస్‌కు, టైఫాయిడ్‌కు టీకాలు తయారు చేశామని చెప్పారు. కొవాగ్జిన్ కోసం రూ.800 కోట్లు ఖర్చు చేశామని, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదని తెలిపారు.

కంపెనీ డేటా లీక్ చేస్తామని బెదిరిస్తున్నారు

గిగా ఏఐ సీఈఓ వరుణ్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాలో గిగా ఏఐ కంపెనీని స్థాపించిన వరుణ్ అనతి కాలంలోనే మంచి పేరు తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా తమ కంపెనీపై కొందరు తప్పుడు ప్రకటనలు చేస్తూ, దోపిడీ చేసేందుకు యత్నిస్తున్నట్లు వరుణ్ ఆరోపించారు. కంపెనీ కీలక సమాచారాన్ని సేకరించి బెదిరిస్తున్నారని వాపోయారు. సంబంధిత ఈ మెయిల్ స్క్రీన్ షాట్లను 'ఎక్స్'లో పెట్టారు. 'సంస్థను లాక్కునేందుకు కొందరు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఇప్పటికే తప్పుడు ఆరోపణలు చేశారు. ఓ క్రిప్టో ఎకౌంట్‌కు 3 మిలియన్ డాలర్లు బదిలీ చేయకుంటే కీలకమైన డేటాను లీక్ చేస్తామంటున్నారు' అని పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు సంస్థకు తెలియజేసినట్లు గిగా ఏఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏపీకి చెందిన వరుణ్ ఐఐటీ ఖరగ్‌పూర్‌లో విద్యనభ్యసించారు. స్నేహితుడితో కలిసి శాన్‌ఫ్రాన్సిస్కోలో 2023లో ఈ స్టార్టప్‌ను ప్రారంభించారు. స్వల్ప వ్యవధిలోనే భారీ పెట్టుబడులను ఆకర్షించి వార్తల్లో నిలిచారు.



24-35 మధ్య వయసులో ఉన్నారా?

మీది 24-35 మధ్య వయసైతే ఈ కాలం చాలా అమూల్యమైంది. ఈ సమయంలో మీరు చేసే వృథా తదనంతర కాలంలో రెట్టింపవుతుంది. కాబట్టి సమాజంలో హోదా కోసం వెంపర్లాడటం మాని నైపుణ్యాలు పెంచుకోవడంపై దృష్టి పెట్టండి. క్రమశిక్షణతో ఉండండి. దీని ఫలితం భవిష్యత్తులో అమోఘంగా కనిపిస్తుంది.

– స్వప్నిల్ కొమ్మావర్, కంటెంట్ క్రియేటర్


చూపులేని వారికి ఏఐ కళ్లజోడును అందిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో బొల్లినేని సోదరులు, డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త భుజంగరావు, ఆత్మకూరు ఆర్డీవో పావని తదితరులు

చూపులేని వారికి 'ఏఐ' వెలుగులు

● ఎదురుగా ఉండే వ్యక్తులు, వస్తువులను గుర్తించి చెబుతుంది

● పత్రికలు చదివి వినిపిస్తుంది.. ఫోన్‌లోని మెసేజ్‌లను వివరిస్తుంది

● కేఎఫ్‌ఆర్‌సీ - అచల హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కళ్లద్దాల పంపిణీ


కార్యక్రమానికి హాజరైన అంధులు

చేజర్ల, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లోని అంధుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఏఐ సాయంతో బొల్లినేని సోదరులు చేస్తున్న కృషి అభినందనీయమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మాముడూరులో ఆదివారం కేఎఫ్ఆర్సీ - అచల హెల్త్‌సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దృష్టి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పుట్టుగుడ్డి, పాక్షిక అంధత్వంతో బాధపడేవారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కళ్లద్దాలు అందించడం వరమన్నారు. ఎదురుగా ఉండే వ్యక్తులు, వస్తువులు, ప్రదేశాలను గుర్తించి తెలియజేయడం, పత్రికలు చదివి వినిపించడం, ఫోన్‌లోని మెసేజ్‌లను వివరించేలా తయారుచేసిన ఈ కళ్లద్దాలను జిల్లావాసులకు ఉచితంగా అందజేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కిమ్స్ ఆస్పత్రి వ్యవస్థాపక ఛైర్మన్ బొల్లినేని కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈ కళ్లజోళ్ల ద్వారా విద్యార్థులు, యువత తమ సామర్థ్యాలు పెంచుకునే అవకాశముందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అంధులందరికీ తమ సంస్థ ద్వారా వీటిని అందజేస్తామని వివరించారు. విద్య, దైవబలంతో పేదరికం నుంచి ఉన్నత స్థానాలను అందుకున్నామని.. అందుకే పేదలకు సేవచేయడం, విద్య ఉపాధి అవకాశాలు కల్పించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నట్లు వివరించారు. కిమ్స్ ఆస్పత్రి సీఎండీ భాస్కరరావు మాట్లాడుతూ.. కేఎఫ్ఆర్సీ ఆధ్వర్యంలో వైద్యరంగంలో పలు పరిశోధనలు చేసి అవయవ మార్పిడిలో ఖర్చు తగ్గించే ప్రయత్నాలను చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అవయవాల రవాణాకు ఎయిర్ అంబులెన్సులు వాడాల్సి రావడంతో భారీగా ఖర్చవుతోందని పేర్కొన్నారు. మనిషి శరీరం నుంచి వెలికితీశాక గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, కిడ్నీలు కొన్ని గంటలపాటు పనిచేసేలా కొత్త సాంకేతికతను ఆవిష్కరిస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని 220 మంది చూపులేని వారికి మంత్రి ఆనం చేతులమీదుగా ఏఐ కళ్లద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్సీపీఎల్ ఎండీ బొల్లినేని శీనయ్య, కేఎఫ్ఆర్సీ ఛైర్మన్, డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త భుజంగరావు, ఆత్మకూరు ఆర్డీవో పావని, తాళ్లూరు గిరినాయుడు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


కంభంపాటి రామ్మోహనరావు మాతృమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రబాబు. చిత్రంలో రామ్మోహనరావు కుటుంబ సభ్యులు, సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, ఎమ్మెల్యే వెంకట్రావు తదితరులు

కంభంపాటి రామ్మోహనరావును పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

పెద్దఅవుటపల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహనరావు మాతృమూర్తి వెంకట నరసమ్మ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం పెద్దఅవుటపల్లిలోని రామ్మోహనరావు నివాసానికి ఆదివారం రాత్రి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకట నరసమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, రామ్మోహనరావు కుటుంబసభ్యులకు తన సానుభూతిని తెలిపారు. సీఎం వెంట విప్, గన్నవరం ఎమ్మెల్యే వెంకట్రావు ఉన్నారు. ఉదయం మంత్రులు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యే రాధాకృష్ణ, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఇతర నేతలు రామ్మోహనరావును పరామర్శించారు.

రూబిక్స్ క్యూబ్‌లతో నటుడు విజయకాంత్ రూపం

చెన్నై, న్యూస్‌టుడే: రూబిక్స్ క్యూబ్‌లతో తమిళ నటుడు విజయకాంత్ రూపాన్ని రూపొందించారు. విజయకాంత్ రెండో వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత అధ్యక్షతన చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది విద్యార్థులు వెయ్యి రూబిక్స్ క్యూబ్‌లతో విజయకాంత్ పూర్తిరూపాన్ని 32 నిమిషాల్లో రూపొందించారు.



అల్లేసుకున్న ఉపాధి

● నరసాపురం లేసు ఉత్పత్తులు ప్రత్యేకం

● మన్‌కీ బాత్‌లో ప్రధాని ప్రస్తావన

ఈనాడు, దిల్లీ, ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: రంగుల దారాలను ముచ్చటగా అల్లుతూ రూపొందించే లేసు ఉత్పత్తులు, దుస్తులకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. గోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు దశాబ్దాల కిందట మొదలైన ఈ లేసు అల్లికలు క్రమంగా మహిళలకు ఉపాధి మార్గంగా అవతరించాయి. ఈ అంశాన్ని ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ ప్రస్తావించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలో 250 గ్రామాల్లో సుమారు లక్ష మంది మహిళలు లేసు అల్లికలు చేస్తున్నారు. ఈ ఉత్పత్తుల ఎగుమతిదారులు నరసాపురం ప్రాంతంలో 50 మంది వరకు ఉన్నారు. లేసు ఆకృతులను బట్టి కిలోకు రూ.100-150 వరకు తయారీదారులకు చెల్లిస్తున్నారు. ఏటా రూ.300 కోట్ల విలువైన ఉత్పత్తులు నరసాపురం పరిసర ప్రాంతాల నుంచి ఎగుమతి అవుతున్నట్లు అంచనా.


లేసు అల్లికలు చేస్తున్న మహిళలు



"మన సంప్రదాయ కళలు సమాజానికి సాధికారత కల్పించడంతో పాటు ప్రజల ఆర్థిక పురోగతికి సాధనంగా పనిచేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళ ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రజాభిమానాన్ని పొందుతోంది. ఈ కళాకారులకు కొత్త డిజైన్లపై ఏపీ ప్రభుత్వం, నాబార్డ్ సంయుక్తంగా శిక్షణనిస్తున్నాయి. తద్వారా ఆయా ఉత్పత్తులు కొత్త మార్కెట్లకు చేరువవుతున్నాయి. ఇలాంటివారిని ముందుకు తీసుకురావడానికి మన్‌కీ బాత్ ఒక వేదికగా పనిచేస్తోంది. మహిళలు తమ కష్టంతో సంప్రదాయ కళను ప్రోత్సహించడంతో పాటు సాధికారత సాధిస్తున్నారు" అని ప్రధాని మన్‌కీ బాత్‌లో వివరించారు.

అధునాతన పద్ధతులపై శిక్షణ

లేసు అల్లికల్లో అధునాతన డిజైన్ల తయారీ, ఉత్పత్తులను నేరుగా విక్రయించునేలా మహిళలను ప్రోత్సహించేందుకు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వద్ద సీతారామపురంలో కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలో హస్తకళల అభివృద్ధి సంస్థ ద్వారా 2003లో లేసు పార్కు నెలకొల్పారు. దీనికి అనుసంధానంగా ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 51 సొసైటీలు ఏర్పాటుచేశారు. తరువాత అంతర్జాతీయ లేస్ ట్రేడ్ సెంటర్ ఏర్పాటుచేశారు. ఈ పార్కును మరింత అభివృద్ధి చేసి, ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మహిళల ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయి.

మార్కెటింగ్‌కు ప్రణాళిక

లేసు అల్లికలతో అధునాతన డిజైన్ల తయారీపై మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు ఆయా ఉత్పత్తుల మార్కెటింగ్‌కు కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. నాబార్డుతో కలిసి మహిళలకు తర్ఫీదివ్వడంతో పాటు లేసు ఉత్పత్తులను ఎన్జీవో ద్వారా ఐదేళ్ల పాటు మార్కెటింగ్ చేస్తారు. నాబార్డు బృందం గత రెండునెలల్లో మూడుసార్లు లేస్ పార్కును సందర్శించి ఉత్పత్తులను పరిశీలించింది. నరసాపురం లేసు అల్లికలకు గతేడాది జులైలో భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ - జీఐ) లభించింది.


లేసు అల్లికల దుస్తులు


మోదీకి ధన్యవాదాలు తెలిపిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఏపీలో తరాలుగా కుటుంబాలు, సమాజం కాపాడుతున్న అద్భుతమైన కళల్లో నరసాపురం లేస్ క్రాఫ్ట్ ఒకటని సీఎం చంద్రబాబు తెలిపారు. మన్‌కీ బాత్‌లో నరసాపురం లేస్ క్రాఫ్ట్‌ను ప్రశంసించిన ప్రధాని మోదీకి ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలియజేశారు. 'కళను సంరక్షించడమే కాకుండా ప్రపంచానికి పరిచయం చేసిన మహిళల నైపుణ్యం, అంకితభావాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. వారికి నిరంతరం ప్రభుత్వం తరఫున మద్దతుగా నిలుస్తున్నాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

(c) eenadu

'కనుబొమ్మ'లతో.. కోటి మాటలు





ఇద్దరు విద్యార్థుల మధ్య ఒక్క మాట వినిపించదు. పెదవులు కదలవు.. కానీ సమాచారం మాత్రం చేరిపోతుంది. ఒకరు కనుబొమ్మలను కదిలిస్తే చాలు.. మరొకరు ఆ భావాన్ని పసిగట్టి పేపర్ మీద వాక్యాలు రాసేస్తారు. దీని కోసం ప్రత్యేకంగా 'ఐబ్రో కోడింగ్' లిపిని సృష్టించారు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు మధు. ఆయన మార్గదర్శకత్వంలో విద్యార్థులు స్ఫూర్తి, తన్మయి ఈ విద్యలో ఆరితేరారు. తిరుపతి వేదికగా జరుగుతున్న భారతీయ వైజ్ఞానిక సమ్మేళనంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఇంగ్లిష్ అక్షరాలు(ఏ-జెడ్), నంబర్లు(0-9) ఇలా ప్రతి దానికి ఒక విశిష్టమైన కోడ్ ఇచ్చారు. కుడి కనుబొమ్మ కదలిక, ఎడమ కనుబొమ్మ కదలిక, రెండూ కలిపి కదల్చడం.. ఇలా రకరకాల కాంబినేషన్లతో కోడ్ రూపొందించారు. నంబర్లు చెప్పడానికి కనురెప్పల బ్లింకింగ్‌తో సంకేతాలు ఇస్తారు.

– ఈనాడు డిజిటల్, తిరుపతి

నిద్రపో కన్నా..!



● ఎనిమిదేళ్ల బాలుడికి రోజూ ఉదయం వాంతి అయినట్టు ఉంటోంది. వైద్య పరీక్షల అనంతరం ఆ పిల్లవాడికి 'స్లీప్ డిప్రివేషన్(నిద్రలేమి)' సమస్య ఉన్నట్టు గుర్తించారు.

● జూనియర్ ఇంటర్ చదువుతున్న ఓ కుర్రాడు ఉదయం లేవగానే నిస్సత్తువగా, చికాకుగా ఉంటున్నాడు. ఆరా తీసిన వైద్యులు ఆ కుర్రాడు రాత్రిళ్లు నిద్రపోకుండా ఫోన్‌లో వీడియోలు చూస్తున్నందువల్ల నిద్రలేమి బారినపడ్డాడని గుర్తించారు.

పిల్లల ఎదుగుదలకు కావాల్సిన 'గ్రోత్ హార్మోన్' నిద్రలోనే విడుదలవుతుంది. బాగా నిద్రపోతే పిల్లల్లో రోగనిరోధక వ్యవస్థ బలోపేతమవుతుంది. మెదడు ఎదుగుదల బాగుంటుంది. పిల్లలు పగలు చదువుకున్నదంతా మెదడులో నిల్వ అయ్యేది కూడా రాత్రి వేళలోనే. తగినంత సమయం, సరిగా నిద్రపోకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. అందుకే పిల్లలు హాయిగా నిద్రపోవడం అలవాటు చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

నాణ్యమైన నిద్ర ఎంత సమయం అవసరం?

వయసు	నిద్ర(గంటల్లో)
0–3 నెలలు	14–17
4–12 నెలలు	12–16
1–2 సంవత్సరాలు	11–14
3–5 సంవత్సరాలు	11–14
6–13 సంవత్సరాలు	9–12
14–17 సంవత్సరాలు	8–10



ఇలా ఉంటే జాగ్రత్త...
- పగటిపూట నిద్రమత్తు
- అలసట, చిరాకు
- ఆలోచించడంలో, దృష్టిసారించడంలో, గుర్తుంచుకోవడంలో ఇబ్బంది
- తరచూ తలనొప్పి

తీవ్రమైన లక్షణాలు:
- కునుకుపాట్లు
- అనియంత్రిత కంటి కదలికలు
- స్పష్టంగా మాట్లాడలేకపోవడం
- వాలిపోతున్న కనురెప్పలు
- చేతులు వణకడం
- దృశ్య, స్పర్శ భ్రాంతులు



నిద్రలేమికి పరీక్షలు...

స్లీప్ అప్నియా: పాలీసోమ్నోగ్రామ్ అని పిలిచే ఈ పరీక్షను స్లీప్ అప్నియా పరీక్ష పరికరంతో చేస్తారు.
ఎలక్ట్రోఎన్సెఫలోగ్రామ్(ఈఈజీ): ఈ పరీక్ష మెదడు తరంగాలను గుర్తించి నమోదు చేస్తుంది. మెదడులో అసాధారణ కార్యకలాపాలను పరిశీలిస్తారు.
యాక్టిగ్రఫీ: గడియారం లాంటి పరికరం ద్వారా నిద్రను ట్రాక్ చేస్తారు. జీవనశైలి రుగ్మతలను నిర్ధారించడంలో ఇది కీలకం.
మల్టిపుల్ స్లీప్ లేటెన్సీ టెస్ట్ (ఎంఎస్‌ఎల్‌టీ): ఈ పరీక్ష ఒక వ్యక్తి పగటిపూట నిద్రపోయే అవకాశం ఉందో లేదో పరిశీలిస్తుంది.

దుర్గతులకు దారితీసేవి



- క్రమశిక్షణారాహిత్య జీవనశైలి.
- రాత్రిళ్లు ఫోన్లలో, కంప్యూటర్లలో, ల్యాప్‌టాప్‌లలో వీడియోలు చూడటం, చాటింగులు చేస్తూ ఉండడం.
- రాత్రి ఆలస్యంగా భోజనం
- అర్ధరాత్రి దాటేవరకూ చదువుతూ ఉండడం.

దీర్ఘకాలిక సమస్యలు..!



- దీర్ఘకాలిక నిద్రలేమి ఉన్నవారికి అలసట, ఊబకాయం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది.
- చిరాకు, డిప్రెషన్ వంటి భావోద్వేగ సమస్యలు.
- టైప్-2 డయాబెటిస్ ప్రమాదం ఎక్కువవుతుంది.
- శరీర సహజ రక్షణ వ్యవస్థ ఇన్‌ఫెక్షన్ వ్యతిరేకంగా పనిచేయలేదు.
- మెదడు పనిచేసే విధానంపై నిద్రలేమి చాలా ప్రతికూల ప్రభావాలను చూపుతుంది.
- ఒత్తిళ్లు, నిద్ర సరిగా లేకపోవడం వల్ల పొట్టలో యాసిడ్ ఉత్పత్తవుతుంది.
- నిర్ణయాత్మక శక్తి, జ్ఞాపకశక్తి తగ్గిపోతాయి.

– ఈనాడు, అమరావతి

తగినంత నిద్ర...
- వయసుకు తగ్గట్టు నిర్ణీత సమయంపాటు నిద్ర ఉండేలా చూసుకోవాలి.
- రాత్రిపూట నిద్రకు ఉపక్రమించేందుకు కనీసం గంట ముందే స్క్రీన్ ఆపేయాలి (ఫోన్, ల్యాప్‌టాప్‌లాంటివి).
- నిద్ర బాగా పట్టేందుకు శరీరంలో మెలటోనిన్ అనే హార్మోన్ విడుదలవుతుంటుంది. వెలుతురు ఎక్కువగా ఉంటే ఈ హార్మోన్ విడుదల తగ్గుతుంది. కాబట్టి రాత్రిళ్లు లైట్ తక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- రాత్రి ఏడెనిమిది గంటలపాటు నిద్రపోవడం వల్ల శరీరం డీహైడ్రేట్ అవుతుంటుంది. కాబట్టి ఉదయం నిద్రలేవగానే మంచినీరు తాగాలి. క్యారెట్‌లాంటి కూరగాయలు, పండ్లు తీసుకోవాలి.
- రోజూ 15-20 నిమిషాలు వ్యాయామం చేయాలి. నిద్రలేమి సమస్యగా మారితే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎస్.దుర్గాప్రసాద్, ఒంగోలు సర్వజనాసుపత్రి.

విషపూరిత మొక్కలైనా తినేస్తుంది



ఈ కీటకాన్ని చూసి సీతాకోకచిలుక అనుకుంటున్నారా.. కాదండీ, మన దేశంలో అరుదుగా కనిపించే ఒలియాండర్ హాక్ మాత్ ఇది (చిమ్మట పురుగు). దీని ప్రత్యేకత ఏంటంటే.. విషపూరితమైన గన్నేరు మొక్కలను తిన్నా కూడా జీర్ణం చేసుకునే శక్తి వీటికి ఉంటుంది. శ్రీకాకుళంలోని విశాఖ 'ఏ' కాలనీలో ఓ ఇంటి గార్డెన్‌లో దర్శనమిచ్చింది. స్పింక్స్ జాతికి చెందిన ఈ జీవి శాస్త్రీయనామం డాఫ్నిస్ నెరి. ఆర్మీ గ్రీన్ మాత్ అని కూడా పిలుస్తుంటారు. దీని పొడవు 9-11 సెం.మీలు ఉంటుందని జంతుశాస్త్ర సీనియర్ అధ్యాపకుడు డా.యాళ్ల పోలినాయుడు తెలిపారు. ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో ఎక్కువగా ఉంటాయన్నారు. క్యాటరింగ్ దశలో మొక్కల ఆకులను తింటాయని, కీటక దశలో మాత్రం పూలలో మకరందాన్ని మాత్రమే తీసుకుంటాయని వివరించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం



అదిగో ఛత్రపతి

గుంటూరు జిల్లా తెనాలి ఆర్ట్ గ్యాలరీలో 20 టన్నుల ఇనుప వస్తువులతో 6.5 అడుగుల ఎత్తుతో రూపొందించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. 21.5 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పుతో మండపం, అందులో 8 అడుగుల సింహాసనంపై ఈ విగ్రహాన్ని తయారుచేశారు. దీని ఆవిష్కరణకు 20 మంది నిపుణులతో కలిసి ఆరు నెలలు శ్రమించామని, వేలసంఖ్యలో ఆటోమొబైల్ విడిభాగాలు, నట్లు, బోల్టులు, బేరింగ్‌లు, చైన్‌లతో కూడిన 20 టన్నుల ఇనుప వస్తువులు ఉపయోగించినట్లు శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్ష తెలిపారు. మొత్తం రూ.35 లక్షలు ఖర్చయిందని, రీ-సైక్లింగ్ వస్తువులతో తయారుచేయడం ద్వారా సామాజిక సందేశాన్ని అందించే ప్రయత్నం చేశామని వివరించారు.

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

ముంగిలిలోనే ముత్యాల పంట





తీర ప్రాంతాల్లోనే కనిపించే ఆల్చిప్పలను ఇంట్లోనే పెంచుతూ ముత్యాలు సాగు చేస్తున్నారు ఓ ఉపాధ్యాయుడు. ఆల్చిప్పలు నీటిలో పెరిగే జీవి. వీటిల్లోనే ముత్యాలు తయారవుతాయి. ఇవి ఆహారం కోసం చిప్పలను తెరిచినప్పుడు ఇసుక రేణువులు(ఫారిన్ బాడీ) వాటి శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇసుక వల్ల ప్రాణాపాయం సంభవించకుండా ఆ రేణువుల చుట్టూ 'నేకర్' అనే ద్రవాన్ని స్రవిస్తుంది. కొన్నిరోజులపాటు స్రవించే ఆ ద్రవం గట్టిపడి ముత్యంగా మారుతుంది. నంద్యాల జిల్లా పాణ్యం మండలం సుగాలిమెట్టకు చెందిన నాగేశ్వర్‌నాయక్... ఒడిశాలోని 'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ ఆక్వాకల్చర్(సీఐఎఫ్‌ఏ)' శాస్త్రవేత్తల ద్వారా కృత్రిమ పద్ధతిలో ముత్యాల తయారీ విధానం నేర్చుకున్నారు. తన సోదరి పార్వతీబాయితో కలిసి వాటిని పెంచడం ప్రారంభించారు. తొలుత ఒడిశా నుంచి కొన్ని ఆల్చిప్ప పిల్లలను తీసుకొచ్చి నీటితొట్టెల్లో పెంచారు. ఇవి మూడేళ్లకు గానీ నేకర్‌ను ఉత్పత్తి చేయలేవు. అప్పటివరకు వేచి ఉండి ఆ తర్వాత చిప్పలను తెరిచి మాంటిల్ కేవిటీ ఇంప్లాంటేషన్ పద్ధతిలో ఫారిన్ బాడీలను చొప్పించారు. ఏడాది తర్వాత ముత్యాలు తయారయ్యాయి. అలా ఇప్పటివరకు 6వేల ముత్యాలు సాగుచేశారు. వాటి పరిమాణం, నాణ్యత ఆధారంగా ఒక్కో ముత్యానికి రూ.150 నుంచి రూ.5వేల వరకు ధర పలుకుతుంది. ఇందులో నైపుణ్యం పొందిన నాగేశ్వర్‌నాయక్ వేంకటేశ్వరస్వామి, శివలింగం అచ్చులను ఆల్చిప్పల్లోకి చొప్పించి ఒక ప్రయోగం చేశారు. ఆ అచ్చుపై ఆల్చిప్ప నేకర్ విడుదల చేయడంతో అందులో తయారైన ముత్యాలు వేంకటేశ్వరస్వామి, శివలింగం ఆకృతుల్లో సహజంగా తయారయ్యాయి.

– ఈనాడు, కర్నూలు

జీపీఎస్ ట్రాకింగ్‌తో రాబందుల గగన యాత్ర!



ముంబయి: మధ్య భారతదేశంలో రాబందుల సంరక్షణ ప్రయత్నాలను బలోపేతం చేయడంలో భాగంగా మహారాష్ట్ర అటవీశాఖ, బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ (బీఎన్‌హెచ్‌ఎస్) ప్రత్యేక కార్యక్రమం చేపట్టాయి. ఈ మేరకు హరియాణాలోని పింజోర్‌లో గల 'జటాయు కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్' నుంచి 14 రాబందులను మహారాష్ట్రలోని పెంచ్ టైగర్ రిజర్వుకు తీసుకువచ్చారు. అడవిలో స్వేచ్ఛగా బతికేలా వీటికి 8నెలలపాటు శిక్షణ ఇచ్చి, డిసెంబరు 11న విడుదల చేశారు. ఈ రాబందులకు అమర్చిన జీపీఎస్ ట్రాన్స్‌మీటర్ల సాయంతో వాటి కదలికలను పర్యవేక్షించారు. వీటిలో చాలావరకు చుట్టుపక్కలే సంచరిస్తూ ఉండగా.. 'జే132' అనే పొడవైన ముక్కు ఉన్న రాబందు ప్రయాణం ఆసక్తికరంగా నమోదైంది. ఈ పక్షి 17 రోజుల వ్యవధిలో 750 కి.మీ.ల మేర పయనించి, డిసెంబరు 27 నాటికి నాసిక్ జిల్లాలోని త్రయంబకేశ్వర్‌కు సమీపాన ఉన్న అంజనేరీ కొండల వద్దకు చేరుకొన్నట్లు అధికారులు ఆదివారం వెల్లడించారు. మేల్‌ఘాట్, తడోబా - అంధారీ టైగర్ రిజర్వులలోనూ ఇదే విధమైన ట్యాగింగ్ ఆపరేషన్లు పూర్తి కావచ్చాయని, ఆయా ప్రాంతాల నుంచి రాబందులను త్వరలో విడుదల చేయనున్నట్లు చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బ్రకోలీ సాగుతో మిలియనీర్లుగా రైతులు



బిహార్‌లోని బుద్ధ గయా సమీప ఖాన్‌జహాన్‌పుర్ 'బ్రకోలీ గ్రామం'గా ప్రసిద్ధి చెందుతోంది. ఈ గ్రామ రైతులు వంద ఎకరాల్లో చేస్తున్న బ్రకోలీ సాగుతో ఏటా దాదాపు రూ.5 కోట్ల దిగుబడిని సాధిస్తున్నారు. పంట సాగులో రూపాయికి రూ.20 లాభం వస్తుండటంతో గ్రామ రైతులు మిలియనీర్లుగా మారుతున్నారు. స్థానికంగా వినియోగం పెరగటమే కాకుండా.. బుద్ధ గయాకు వచ్చే విదేశీయుల కారణంగానూ బ్రకోలీకి ఎక్కువ డిమాండు ఉంటోంది. దీంతో చుట్టుపక్కల గ్రామాలు సైతం ఈ పంట సాగు వైపు మళ్లుతున్నాయి. 40 నుంచి 60 రోజుల్లో దిగుబడి వచ్చే ఈ పంటకు చల్లటి వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉండే బ్రకోలీ జీర్ణశక్తికి మంచిదని, 'సి' విటమిన్‌తో రోగ నిరోధకశక్తిని పెంచి.. బరువు నియంత్రణకు, కంటిచూపు మెరుగుదలకు కూడా ఉపయోగపడుతుందని గయాలోని మాన్‌పుర్ కృషి విజ్ఞానకేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. క్యాన్సర్ ముప్పును తగ్గించే బ్రకోలీ థైరాయిడ్ సమస్య ఉన్నవారికి ప్రమాదకరమన్నారు.

ఈటీవీ భారత్



భవన నిర్మాణంలో సహాయకారి మినీ లేజర్ సెట్టర్

ఈటీవీ భారత్: భవన నిర్మాణరంగంలో కచ్చితమైన కొలతలను అందించే 'మినీ లేజర్ సెట్టర్' సాధనాన్ని గుజరాత్‌లోని భావ్‌నగర్ 'సర్ భావ్‌సింగ్ జీ పాలిటెక్నిక్ కళాశాల' విద్యార్థులు రూపొందించారు. కేవలం రూ.వెయ్యి ఖర్చుతో తయారుచేసిన ఈ పరికరం అత్యంత కచ్చితమైన కొలతలను చూపుతుంది. భవన నిర్మాణాల్లో లెవలింగు చాలా కీలకమైనది. సాధారణంగా తాపీపనిలో గోడమట్టం సరిచూసేందుకు వాడే వడంబం (ప్లంబ్ లైన్), టేపులు, రూలు కర్రల వంటి సంప్రదాయ విధానాలను కార్మికులు అనుసరిస్తుంటారు. బేస్‌లైను కుదిర్చిన లేజర్ సెట్టర్‌తో వాటి అవసరం ఉండదని, దీని తయారీకి తమకు నెలన్నర పట్టినట్లు విద్యార్థి కృష్ణ గోస్వామి తెలిపారు.



అలవాట్లపై దృష్టి పెట్టాలి

మెరుగుపడేందుకు ఉత్తమ మార్గం ఫలితాలపై దృష్టిపెట్టడం కాదు. అలవాట్లపై దృష్టి కేంద్రీకరించడం ముఖ్యం. పనితీరును మెరుగుపరచడంలో లక్ష్యాల కంటే ప్రవర్తన మార్పే ఎక్కువ ప్రభావవంతమని 27 అధ్యయనాలు తేల్చాయి. మనం నియంత్రించగల చర్యలను మార్చడంపైనే అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

– ఆడం గ్రాంట్, రచయిత

ప్రపంచానికే అన్నపూర్ణ అయ్యే సామర్థ్యం మనది

- తయారీ, సులభతర వాణిజ్యం, సేవా రంగాలను ప్రోత్సహించండి
- రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు ప్రధాని మోదీ పిలుపు



సీఎస్‌ల సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

దిల్లీ: తయారీ రంగాన్ని ప్రోత్సహించడం, సులభతర వాణిజ్యానికి సహకారం అందించడం, సేవారంగాన్ని బలోపేతం చేయడంద్వారా భారత్‌ను ప్రపంచ సేవల రంగంలో రారాజుగా మార్చాలని రాష్ట్రాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచానికి అన్నపూర్ణగా మారే సామర్థ్యం భారత్‌కు ఉందని పేర్కొన్నారు. అతి పెద్ద ఆహార ఎగుమతిదారుగా దేశం మారడానికి వ్యవసాయం, ఉద్యానం, పశుపోషణ, పాల ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో అత్యున్నత సాగు దిశగా సాగాలని సూచించారు. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్) 5వ జాతీయ సదస్సు ఆదివారం దిల్లీలో ముగిసింది. 3 రోజులపాటు జరిగిన ఈ సదస్సులో ఆదివారం ప్రధాని మాట్లాడారు. తదుపరి తరం సంస్కరణల సమయంలో ఈ సదస్సు జరుగుతోందని పేర్కొన్నారు. సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను భారత్ అధిరోహించిందని, దాని ప్రధాన ఇంజిన్.. దేశ యువత, ప్రజలేనని స్పష్టం చేశారు. అందుకే ప్రజల్లో సాధికారత కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు. నాణ్యతకు పర్యాయ పదంగా పేర్కొనేలా భారత తయారీ రంగాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. 'సున్నా దుష్ప్రభావం.. సున్నా లోపం' స్థాయికి ఈ రంగాన్ని చేర్చాలన్న మన సంకల్పాన్ని బలోపేతం చేయాలని కోరారు.

■ ఈ సదస్సులో నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్య, యువ సాధికారత, క్రీడలపైనా చర్చించారు.

■ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులను తెచ్చేందుకు ఆధునిక సాంకేతికతను సమ్మిళితం చేయడంపైనా చర్చలు జరిగాయి.

■ ప్రధాన మంత్రి ముఖ్య కార్యదర్శులు పి.కె.మిశ్ర, శక్తికాంత దాస్, క్యాబినెట్ కార్యదర్శి టి.వి.సోమనాథన్, నీతి ఆయోగ్ సభ్యులు, అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

నన్ను బంకర్‌లో దాక్కోమన్నారు

- పాక్ అధ్యక్షుడు జర్దారీ
- ఆపరేషన్ సిందూర్ నాటి అనుభవం వెల్లడి

లాహోర్: ఆపరేషన్ సిందూర్ సమయంలో బంకర్‌లో దాక్కోవాలని తనకు సూచన వచ్చిందని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ వెల్లడించారు. 'నా మిలిటరీ భద్రతా సిబ్బంది నా దగ్గరకు వచ్చి యుద్ధం మొదలైంది. మీరు బంకర్‌లోకి వెళ్లండని చెప్పారు. అయితే త్యాగం చేయాల్సి వస్తే మేమే ముందుంటామని వారికి చెప్పా. నాయకులు బంకర్లలో చనిపోకూడదని, యుద్ధ రంగంలో మరణించాలని స్పష్టం చేశా. వాస్తవానికి యుద్ధం వస్తుందని నేను నాలుగు రోజుల ముందే చెప్పా' అని ఆయన వివరించారు. సింధ్ ప్రావిన్సులోని లార్కానాలో శనివారం జరిగిన మాజీ ప్రధాని, తన భార్య బెనజీర్ భుట్టో 18వ వర్ధంతి సభలో జర్దారీ మాట్లాడారు. రావల్పిండిలోని నూర్ ఖాన్ వైమానిక స్థావరంపై భారత్ జరిపిన దాడుల్లో అది ధ్వంసమైందని విలేకరుల సమావేశంలో పాకిస్థాన్ విదేశాంగ మంత్రి, ఉప ప్రధాని మంత్రి ఇషాక్ దార్ తెలిపారు.

ట్రంప్‌తో జెలెన్‌స్కీ భేటీ

20 పాయింట్ల శాంతి ప్రణాళికపై చర్చ

వాషింగ్టన్: సుదీర్ఘంగా సాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరదించే ప్రయత్నాల్లో భాగంగా తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది! అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఫ్లోరిడా పామ్‌బీచ్‌లోని ఆయన నివాసమైన 'మార్-ఎ-లాగో'లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం (అమెరికా కాలమానం ప్రకారం) భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు కోసం ప్రతిపాదించిన 20 పాయింట్ల శాంతి ప్రణాళికపై చర్చించారు. అంతకుముందు, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. సంక్షోభం ముగింపునకు ఉక్రెయిన్, ఐరోపా సంఘం (ఈయూ) చేసిన తాజా ప్రతిపాదనలను ఆయనతో చర్చించారు. పుతిన్‌తో తన సంభాషణ ఫలవంతంగా సాగిందని ట్రంప్ పేర్కొన్నారు. శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు పుతిన్, జెలెన్‌స్కీ ఇద్దరూ సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఘర్షణకు తెరదించేందుకు తొలుత ట్రంప్ 28 పాయింట్ల శాంతి ప్రణాళికను ప్రతిపాదించారు. ఉక్రెయిన్ దాన్ని 20 పాయింట్ల ప్రణాళికగా సవరించిన సంగతి గమనార్హం.



ఫ్లోరిడాలోని మార్-ఎ-లాగో క్లబ్‌కు చేరుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్

■ అంతకుముందు ఐరోపా సంఘం (ఈయూ), నాటోలోని పలు మిత్రదేశాల నేతలతో జెలెన్‌స్కీ కెనడా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కీలక చర్చలు జరిపారు.

కాంగ్రెస్ అంటే ఒక సిద్ధాంతం

- అది ఎప్పటికీ నశించదు
- వ్యవస్థాపక దినోత్సవంలో ఖర్గే



కాంగ్రెస్ జెండాకు వందనం చేస్తున్న రాహుల్



కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న మల్లికార్జున ఖర్గే. చిత్రంలో సోనియాగాంధీ

దిల్లీ: "కాంగ్రెస్ పార్టీ అంటే ఒక సిద్ధాంతం. సిద్ధాంతాలకు చావులేదు. ఇక కాంగ్రెస్ పని అయిపోయిందని చెప్పేవారికి నేనొకటి స్పష్టం చేయదలచుకున్నా. మా బలం తక్కువే ఉండొచ్చు. కానీ మా వెన్నెముక నిటారుగానే ఉంది" అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో పార్టీ నేతలు, కార్యకర్తల్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. "కాంగ్రెస్‌కు చెందిన గొప్ప నాయకుల కారణంగానే భారత్ ఈరోజు ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యంగా అవతరించింది. రాజ్యాంగం, లౌకికవాదం, పేదల హక్కుల విషయంలో కాంగ్రెస్ ఎన్నడూ రాజీపడలేదు. మేం అధికారంలో లేకపోయినా బేరసారాలకు పాల్పడబోం. మేం ఎన్నడూ మతం పేరుతో ఓట్లు అడగలేదు. మందిరం-మసీదు పేరుతో ఎన్నడూ ద్వేషాన్ని చిమ్మలేదు. మా పార్టీ అందరినీ కలుపుతుంది. భాజపా విడదీస్తుంది. మేం మతాన్ని ఒక విశ్వాసంగానే ఉంచాం. కొందరు మాత్రం మతాన్ని రాజకీయాలుగా మార్చారు. ఇప్పుడు భాజపాకి అధికారం ఉంది గానీ నిజాయతీ లేదు. అందుకే కొన్నిసార్లు డేటా ఆపేస్తారు. కొన్నిసార్లు జనాభాలెక్కలు ఆపేస్తారు. రాజ్యాంగాన్ని మార్చేస్తామని ఇంకొన్నిసార్లు చెబుతుంటారు" అని చెప్పారు. మనతో సమానంగా స్వాతంత్ర్యాన్ని పొందిన దేశాల్లో కొన్నింట్లో ప్రజాస్వామ్యం విఫలమైందని, మరికొన్నింటిలో నియంతృత్వం ఉందని గుర్తుచేశారు. భారత్‌లో మాత్రం ప్రజాస్వామ్యం దేదీప్యమానంగా ఉందంటే దానికి తమపార్టీ నేతలే కారణమన్నారు. కార్యక్రమంలో పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ అంటే మన దేశానికి ఆత్మ అని రాహుల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

సంస్థాగతంగా బలోపేతం కావాల్సిందే: థరూర్

దిల్లీ: పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అభిప్రాయాలకు మద్దతిస్తున్నానని స్పష్టం చేశారు. ఆదివారం పార్టీ 140వ ఆవిర్భావ దినోత్సవం దిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా దిగ్విజయ్ పక్కనే థరూర్ కూర్చున్నారు. ఆయనతో అభిప్రాయాలను పంచుకున్నారు. సంస్థాగత శక్తి ఎంత గొప్పగా ఉంటుందో అంటూ సంఘ్ నేతల దగ్గర నేలపై కూర్చున్న మోదీ చిత్రాన్ని శనివారం దిగ్విజయ్ పోస్టు చేశారు. ఒక సామాన్య కార్యకర్త ముఖ్యమంత్రి, ప్రధాని స్థాయికి ఎదగడంలో ఆ శక్తి ఎలా పని చేస్తుందనడానికి ఇది ఉదాహరణ అని పేర్కొన్నారు. భాజపాను గద్దె దింపడానికి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన లేవనెత్తారు. శనివారం నాటి వ్యాఖ్యలపై స్పందించాలని కోరగా.. ప్రతి సంస్థకు బలం అవసరమేనని దిగ్విజయ్ సింగ్ స్పష్టం చేశారు. శశి థరూర్ కూడా ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. అందులో అనుమానం లేదని ఆయన వ్యాఖ్యానించారు.

EENADU Vol: 52, Issue: 139 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈనాడు బిజినెస్

వెండి మార్కెట్ విలువ రూ.380 లక్షల కోట్లు

యాపిల్, ఆల్ఫాబెట్, మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి మూడో స్థానంలోకి



ఇటీవల ఎవరి నోట విన్నా వెండి మాటే. ధర ఇంతగా పెరుగుతోంది.. ఇంకా ఎంతకు వెళ్తుంది.. ప్రస్తుత ధరల్లో కొనొచ్చా? వంటి ప్రశ్నలే మదుపర్ల నుంచి వస్తున్నాయి. పారిశ్రామిక అవసరాల నిమిత్తం ముఖ్యంగా 5జీ, విద్యుత్తు వాహనాలు, సౌర విద్యుత్తు రంగాల నుంచి ఈ లోహానికి లభిస్తున్న గిరాకీ వల్ల ధర ధర పెరుగుతోంది. వెండిపై పెట్టుబడులు పెట్టిన వారి సంపద విలువ వృద్ధి చెందుతున్నందున, మరింతమంది ఆన్‌లైన్‌లో, లోహం రూపేణ కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా మార్కెట్ విలువ పరంగానూ వెండి అరుదైన ఘనత సొంతం చేసుకుంది.

ప్రపంచవ్యాప్తంగా చూస్తే, అత్యధిక మార్కెట్ విలువ బంగారానిదే. తరవాత స్థానంలో అమెరికా చిప్ దిగ్గజ సంస్థ ఎన్‌వీడియా మార్కెట్ విలువ ఉంది. ఆ తరవాత స్థానంలోకి వెండి చేరింది. వెండి మార్కెట్ విలువ 4.220 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.380 లక్షల కోట్లు)గా పరిగణిస్తున్నారు. అంతర్జాతీయ సాంకేతిక దిగ్గజ సంస్థలైన యాపిల్, ఆల్ఫాబెట్, మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువను ఇప్పటికే వెండి అధిగమించింది. ఎన్‌వీడియా మార్కెట్ విలువ 4.592 ట్రిలియన్ డాలర్ల (రూ.413 లక్షల కోట్ల) కంటే కేవలం 8.1% తక్కువగా ప్రస్తుతం వెండి మార్కెట్ విలువ ఉంది. ఈ లోహం ధరల దూకుడు చూస్తే, త్వరలోనే ఎన్‌వీడియా మార్కెట్ విలువను కూడా అధిగమించి.. అంతర్జాతీయంగా పసిడి తర్వాత అత్యంత విలువైన రెండో ఆస్తిగా నిలిచే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా వెలికితీసిన వెండి 17.51 లక్షల టన్నులు, బంగారం 2.44 లక్షల టన్నులుగా పరిగణించి, ఈ విలువను లెక్క వేస్తున్నారు.

మరింత పెరిగేనా?

ఎంసీఎక్స్‌లో గత ఏడాది కాలంలో వెండి ధర రూ.91,600 (2024 డిసెంబరు 26) నుంచి రూ.2,40,000పైకి చేరింది. అంటే 153% పెరిగింది. ఇదే సమయంలో పసిడి 10 గ్రాముల ధర రూ.77,460 నుంచి 79.75% పెరిగి రూ.1,39,233 స్థాయికి చేరింది. అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల, సురక్షితమని భావిస్తూ బంగారం, వెండిపైకి భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ జనవరి 27-28 సమీక్షలోనూ రేట్ల కోతకు దిగే అవకాశం ఉందన్న అంచనాతో, ధర బాగా పెరుగుతున్న వెండిపై మదుపర్లు పెట్టుబడులు పెంచుతున్నారని తెలుస్తోంది. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, అమెరికా-వెనెజువెలా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు వెండి ధర పెరిగేందుకు దోహదం చేస్తున్నాయి. గిరాకీకి తగ్గట్లు వెండి సరఫరా లేనందునా, ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. 2026 జనవరి 1 నుంచి వెండి ఎగుమతులపై పరిమితులు విధించేందుకు చైనా సిద్ధమవుతోంది. ఇది కూడా ఇతర విపణుల్లో మరింత ప్రతిష్టంభనకు దోహదం చేయొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కమొడిటీస్ అనలిస్ట్ మనవ్ వెల్లడించారు.

ఔన్సు ధర 75 డాలర్లకు పైనే..

అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) వెండి ధర 75 డాలర్లను అధిగమించింది. దేశీయ కమొడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో వెండి ఫ్యూచర్స్ ధర కూడా జీవనకాల గరిష్ఠానికి (కిలో రూ.2,40,000కు పైనే) చేరింది. వెండి ధర కదులుతున్న తీరును గమనిస్తే ఎన్‌వీడియా మార్కెట్ విలువను త్వరలో అధిగమిస్తుందనే విశ్వాసాన్ని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబీజేఏ) జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా వ్యక్తం చేశారు.

మార్కెట్ విలువలో టాప్ అసెట్

అసెట్	మార్కెట్ విలువ (రూ.లక్షల కోట్లలో)	గత వారంలో మార్పు (%)
పసిడి	2,844	11.5
ఎన్‌వీడియా	413	4.21
వెండి	380	11.47
యాపిల్	366	0.05
ఆల్ఫాబెట్	343	2.26
మైక్రోసాఫ్ట్	326	0.43
అమెజాన్	224	2.21
బిట్‌కాయిన్	160	0.69
మెటా	151	1.33
బ్రాడ్‌కామ్	149	2.90

రక్షణ రంగంలో

రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు: అదానీ



రక్షణ ఉత్పత్తుల తయారీ కోసం రూ.1.8 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని అదానీ గ్రూప్ యోచిస్తున్నట్లు సమాచారం. మానవ రహిత అటానమస్ వ్యవస్థలతో పాటు, అడ్వాన్స్‌డ్ గైడెడ్ ఆయుధాలు, సెన్సర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీపై ఈ గ్రూప్ దృష్టి సారించనుంది. దీంతోపాటు ఏఐ (కృత్రిమమేధ) ఆధారిత కార్యకలాపాలు, విమాన ఇంజిన్ల నిర్వహణ - మరమ్మతు-ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌ఓ), శిక్షణ మౌలిక వసతుల సామర్థ్యాలు మెరుగుపరచడంపైనా పనిచేయనుంది. రక్షణ వ్యవస్థలకు సంబంధించి (వాయు, జల, భూమి) అటానమస్ వ్యవస్థల వల్ల ప్రాణాపాయాన్ని నివారించొచ్చనేది సంస్థ యోచన. ఈ ఏడాదిలో అదానీ గ్రూప్ రూపొందించిన దృష్టి 10 యూఏవీ (మానవ రహిత ఏరో వాహనాలు) భారత నౌకాదళంలోకి చేరాయి. రక్షణ బలగాలు నిఘా, పరిశీలన, ప్రత్యర్థి కదలికలను పసిగట్టేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. అదానీ గ్రూప్ రూపొందించిన, 'ప్రత్యర్థి డ్రోన్ల పనిపట్టే వ్యవస్థల'పైనా రక్షణ బలగాల పరిశీలన పూర్తయ్యిందని సమాచారం. 2026లో అటానమస్ వ్యవస్థలను మరింతగా ఉత్పత్తి చేయడంపై అదానీ గ్రూప్ దృష్టి సారించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

భారీ పెట్టుబడులకు

రోల్స్ రాయిస్ సన్నాహాలు

యుద్ధ విమాన ఇంజిన్ తయారీకి ప్రాధాన్యం



దేశీయ విమానయాన విపణి శరవేగంగా వృద్ధి చెందుతుండడం, ఇక్కడి కంపెనీలు 1200కు పైగా కొత్త విమానాలకు ఆర్డర్లు ఇచ్చిన నేపథ్యంలో.. ఈ రంగంలోని అగ్రగామి కంపెనీలు భారత్‌లోనూ తమ వంతు తయారీ చేపట్టేందుకు యోచిస్తున్నాయి. బ్రిటన్‌కు చెందిన విమాన ఇంజిన్ల తయారీ అగ్రగామి సంస్థ రోల్స్ రాయిల్ కూడా, బ్రిటన్ వెలుపల తమ మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారత్‌ను చేయాలని చూస్తోంది. జెట్ ఇంజిన్లు, నేవల్ ప్రొపల్షన్, ల్యాండ్ సిస్టమ్స్, అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్ సహా పలు విభాగాల్లో భారత్‌లోని అవకాశాలు అందిపుచ్చుకోవాలని భావిస్తున్నట్లు రోల్స్ రాయిస్ ఇండియా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శశి ముకుందన్ తెలిపారు. భారత్‌లో భారీ పెట్టుబడులకు ప్రణాళికలు వేస్తున్నట్లు వెల్లడించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) కార్యక్రమం కింద తయారు చేయబోయే కాంబాట్ జెట్‌ల కోసం తదుపరి తరం ఏరో ఇంజిన్‌లను అభివృద్ధి చేయడం తమ ప్రాధాన్యతని పేర్కొన్నారు. భారత నావికాదళ పోరాట సామర్థ్యాన్ని పెంచేలా, విద్యుత్ ప్రొపల్షన్ అవసరాలు తీర్చడంలో రోల్స్ రాయిస్ కీలక పాత్ర పోషించగలదని స్పష్టం చేశారు. ఏఎంసీఏ ఇంజిన్ కోర్‌ను నేవల్ మెరైన్ ఇంజిన్‌గా మార్చడంతో పాటు విద్యుత్ ప్రొపల్షన్ కోసం ఉపయోగించవచ్చని, ప్రపంచవ్యాప్తంగా ఏరో ఇంజిన్‌ను మెరైన్ ఇంజిన్‌గా చేయగల సామర్థ్యం కలిగిన కొద్ది కంపెనీల్లో రోల్స్ రాయిస్ ఒకటని వివరించారు. యుద్ధవిమానాల ఇంజిన్ తయారు చేసేందుకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు.

● భారత్‌లో రక్షణ, పారిశ్రామిక వ్యవస్థలు వేగంగా విస్తరిస్తున్నాయని, దీంతో గణనీయ పెట్టుబడులు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ముకుందన్ తెలిపారు. రెండు ప్రభుత్వ రంగ రక్షణ సంస్థలతో అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకోనున్నట్లు వెల్లడించారు. ఒకటి అర్జున్ ట్యాంక్‌ల ఇంజిన్ల తయారీ కోసం కాగా, మరొకటి భవిష్యత్‌కు సిద్ధమైన కాంబాట్ వాహనాల ఇంజిన్ల కోసమని అన్నారు.

మూడేళ్లలో 14 రెట్లు పెరిగిన బీఎస్ఈ షేరు




బీఎస్ఈ షేరు విలువ మూడేళ్లలో 14 రెట్లు దూసుకెళ్లింది. 2023 జనవరి నుంచి సీఈఓ సుందరరామన్ రామమూర్తి హయాంలో బీఎస్ఈ గణనీయ పురోగతి సాధించడం ఇందుకు నేపథ్యం. ఎక్స్ఛేంజీలో వ్యయ క్రమశిక్షణ పాటించడం, సాంకేతిక నవీకరణలు, ఈక్విటీ డెరివేటివ్స్‌ల పునఃప్రారంభం వల్ల తమ పెట్టుబడిపై పలు రెట్ల ప్రతిఫలాన్ని మదుపర్లు అందుకున్నారు.

● మూడేళ్ల క్రితం చూస్తే, బీఎస్ఈపై కొంత మందే పెట్టుబడులు పెట్టేవారు. ఎండీగా రామమూర్తి బాధ్యతలు స్వీకరించాక తీసుకున్న చర్యలు బీఎస్ఈని బలోపేతం చేయడం వల్ల, వాటాదార్లకు అసాధారణ ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టాయి.

● 2023 జనవరిలో బీఎస్ఈ షేరు రూ.530 దరిదాపుల్లో ఉండేది. 2025 మేలో బీఎస్ఈ ఒక్కో షేరుకు 2 షేర్లు బోనస్‌గా అందించింది. అంటే, ఒక షేరు కొన్నవారికి 3 షేర్లు అయ్యాయి. ప్రస్తుతం ఈ షేరు ధర రూ.2,651. అంటే మూడేళ్ల క్రితం రూ.530 విలువ, ఇప్పుడు రూ.7,953గా పరిగణించాలి. మూడేళ్ల నాటి పెట్టుబడి విలువ 14 రెట్లు పెరిగినట్లయ్యింది.

2030 కల్లా కోల్ ఇండియా అనుబంధ సంస్థల ఐపీఓలు



దిల్లీ: సంస్థ నిర్వహణ తీరును మెరుగుపరచడం, జవాబుదారీతనాన్ని పెంచడానికి.. 2030 కల్లా కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) అన్ని అనుబంధ సంస్థలను స్టాక్ మార్కెట్‌లో నమోదు చేయాలని బొగ్గు మంత్రిత్వ శాఖను ప్రధాన మంత్రి కార్యాలయం ఆదేశించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఆస్తుల నగదీకరణ వల్ల, సంస్థల విలువ మరింత పెరుగుతుందని ఆశిస్తున్నారు. దేశీయ బొగ్గు ఉత్పత్తిలో సీఐఎల్ నుంచే 80% పైగా వస్తోంది.

8 అనుబంధ సంస్థలు

కోల్ ఇండియాకు ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్, సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్ సంస్థలు అనుబంధంగా ఉన్నాయి.

2026-27లో వచ్చే ఐపీఓ వివరాలు

కోల్ ఇండియా అనుబంధ సంస్థల్లో భారత్ కోకింగ్ కోల్, సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ లిమిటెడ్.. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు అనుమతి కోరుతూ కొన్ని నెలల క్రితమే మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ముసాయిదా పత్రాలు సమర్పించాయి. 2026 మార్చిలోపే ఈ 2 సంస్థలు ఐపీఓల్లో నిధులు సమీకరిస్తాయని సమాచారం.

● 2026-27లో సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్, మహానది కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ కూడా ఐపీఓలకు రానున్నాయి.

రూ.44,700 కోట్లతో రెండు నౌకానిర్మాణ పథకాలు

దిల్లీ: రూ.44,700 కోట్లకు పైగా వ్యయంతో రెండు ప్రధాన నౌకా నిర్మాణ పథకాలకు మార్గదర్శకాలను కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నోటిఫై చేసింది. దేశీయ నౌకానిర్మాణ సామర్థ్యాలను బలోపేతం చేయడం, అంతర్జాతీయ స్థాయిలో పోటీతత్వాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా షిప్‌బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ (ఎస్‌బీఎఫ్ఏఎస్), షిప్‌బిల్డింగ్ డెవలప్‌మెంట్ స్కీమ్ (ఎస్‌బీడీఎస్)లను ప్రభుత్వం తీసుకొచ్చింది. మొత్తం రూ.24,736 కోట్ల నిధి కలిగిన ఎస్ఎఫ్ఎఫ్ఏఎస్ కింద విభాగాన్ని బట్టి ఒక్కో నౌకకు 15-25% ఆర్థిక సాయం అందిస్తుంది. రూ.19,989 కోట్ల బడ్జెట్ వ్యయాలు కలిగిన ఎస్‌బీడీఎస్.. దీర్ఘకాలిక సామర్థ్యం, సామర్థ్యాల సృష్టిపై దృష్టి పెడుతుంది. పాత నౌకలను తుక్కుగా మార్చి, కొత్త నిర్మాణానికి ముందుకు వచ్చేవారికి.. తుక్కు విలువపై 40% వరకు క్రెడిట్‌నోట్ ఇస్తారు. దేశీయ నౌకనిర్మాణం పునరుద్ధరణకు ఈ మార్గదర్శకాలు స్థిరమైన, పారదర్శకమైన నియమావళిని సృష్టిస్తాయని కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి శర్బానంద సోనోవాల్ తెలిపారు. ఈ రెండు పథకాలు 2036 మార్చి 31 వరకు కొనసాగనున్నాయి.

విద్యుత్తు ట్రాక్టర్లకు బీఐఎస్ ప్రమాణాలు

దిల్లీ: విద్యుత్తు ట్రాక్టర్ల కోసం దేశంలోనే మొదటి పరీక్షా ప్రమాణాన్ని భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) తీసుకొచ్చింది. ఐఎస్ 19262: 2025 'ఎలక్ట్రిక్ అగ్రికల్చర్ ట్రాక్టర్స్-టెస్ట్ కోడ్' పేరిట రూపొందించిన ఈ ప్రమాణాన్ని కేంద్ర వినియోగదారు వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రి ప్రహ్లాద్ జోషి విడుదల చేశారు. బీఐఎస్ అభివృద్ధి చేసిన ఈ ప్రమాణం, విద్యుత్ ట్రాక్టర్ల భద్రత, విశ్వసనీయత, పనితీరును అంచనా వేయడానికి పరీక్షా నిబంధనలను ఆవిష్కరించింది. పవర్ టేక్-ఆఫ్ (పీటీఓ), డ్రాబార్ పవర్, బెల్ట్, పుల్లీ పనితీరు, వైబ్రేషన్ కొలమానం, భాగాలు, అసెంబ్లీల తనిఖీ వంటి పరీక్షలను ఈ ప్రమాణం చూస్తుంది. వ్యవసాయ వినియోగానికి అనుగుణంగా ఉన్న సంప్రదాయ డీజిల్ ట్రాక్టర్లు, విద్యుత్ వాహనాల కోసం ప్రస్తుతం ఉన్న ప్రమాణాలపై దీన్ని రూపొందించారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ యాంత్రీకరణ, సాంకేతిక విభాగం నుంచి విజ్ఞప్తితో ట్రాక్టర్ తయారీదార్లు, పరీక్షా సంస్థలు, పరిశోధనా సంస్థలు, సాంకేతిక నిపుణుల భాగస్వామ్యంలో ఈ ప్రమాణాన్ని రూపొందించారు.

కోడి గుడ్లు



29న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	650	తూ/ప గోదావరి	665
వరంగల్	652	విశాఖపట్నం	660
విజయవాడ	680	చిత్తూరు	703

స్థిరాస్తి రంగంలో 29% తగ్గిన ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులు: నైట్ ఫ్రాంక్ ఇండియా

దిల్లీ: ఈ ఏడాదిలో స్థిరాస్తి రంగంలోకి ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) పెట్టుబడులు సుమారుగా రూ.31,000 కోట్ల (3.46 బిలియన్ డాలర్ల)కు పరిమితమయ్యాయని స్థిరాస్తి రంగ కన్సల్టింగ్ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. గత సంవత్సరంలో వచ్చిన దాదాపు రూ.44,000 కోట్ల (4.9 బిలియన్ డాలర్ల) పెట్టుబడులతో పోలిస్తే ఇవి 29% తక్కువ. ఇళ్లు/ఫ్లాట్లు, గిడ్డంగుల ప్రాజెక్టుల్లోకి పీఈ పెట్టుబడులు తగ్గాయి. స్థిరాస్తి రంగంలోకి 2018లో వచ్చిన రూ.60,000 కోట్ల (6.73 బి.డా.) పీఈ పెట్టుబడులే ఇప్పటివరకు అత్యధికం.

పసిడి సానుకూలమే!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి ఫిబ్రవరి కాంట్రాక్టుకు ఈవారం రూ.1,36,857 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ లాంగ్ పొజిషన్లు అట్టేపెట్టుకోవడం మంచిదే. రూ.1,41,970 వద్ద నిరోధం ఎదురు కావచ్చు. ఈ స్థాయినీ అధిగమిస్తే రూ.1,44,000; రూ.1,47,536 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.1,36,404 కంటే కిందకు వస్తే రూ.1,32,868; రూ.1,30,838 వరకు దిద్దుబాటు కావొచ్చు.

వెండి



వెండి మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.2,19,961 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే సానుకూల ధోరణి కొనసాగొచ్చు. అయితే రూ.2,51,241 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఒకవేళ రూ.2,19,961 కంటే కిందకు వస్తే రూ.1,98,988; రూ.1,88,501 వరకు దిగి రావచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి జనవరి కాంట్రాక్టు రూ.1,177.65 కంటే దిగువన చలించకుంటే మరింత పెరగొచ్చు. ఒకవేళ ఈ స్థాయికి దిగువన కదలాడితే రూ.1,077.35; రూ.1,027.20 వరకు దిద్దుబాటు అవ్వొచ్చు.

● సీసం జనవరి కాంట్రాక్టు రూ.183.80 కంటే పైన కదలాడకుంటే.. అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ చోటుచేసుకునే అవకాశం ఉంది. అందువల్ల రూ.182.95 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, రూ.181.95 దిగువన షార్ట్ సెల్ చేయడం మంచి వ్యూహం అవుతుంది.

● జింక్ జనవరి కాంట్రాక్టు రూ.319.35 దిగువన ముగిస్తే కనుక, షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపొచ్చు.

● అల్యూమినియం జనవరి కాంట్రాక్టు రూ.295.15 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే పెరగొచ్చు. అయితే రూ.308.60 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఒకవేళ రూ.289.80 కంటే కిందకు వస్తే రూ.278.35; రూ.271 వరకు దిగి వచ్చే అవకాశం ఉంటుంది.

ఇంధన రంగం



● ముడి చమురు జనవరి కాంట్రాక్టు రూ.5,291 కంటే పైన కదలాడితే రూ.5,402; రూ.5,491 వరకు పెరగొచ్చు. ఒకవేళ ప్రతికూల ధోరణిలో చలిస్తే రూ.5,091 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయినీ కోల్పోతే రూ.5,002; రూ.4,891 వరకు దిద్దుబాటు కావచ్చు.

● సహజవాయువు జనవరి కాంట్రాక్టు ఈవారం రూ.324 కంటే దిగువన ట్రేడయితే రూ.319 వరకు దిగిరావచ్చు. ఒకవేళ రూ.324 కంటే పైన కదలాడితే రూ.386.20 వరకు కాంట్రాక్టు జోరు కొనసాగే అవకాశం ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.17,706 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.18,312; రూ.19,350 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.16,062 కంటే కిందకు వస్తే రూ.15,024; రూ.14,418 వరకు దిద్దుబాటు అయ్యే వీలుంది.

● జీలకర్ర జనవరి కాంట్రాక్టుకు రూ.21,483 వద్ద స్టాప్‌లాస్ పరిగణిస్తూ, షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. రూ.22,933 కంటే పైన కదలాడితే మాత్రం రూ.23,466; రూ.24,383 వరకు పెరగొచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/క్షీణత (శాతంలో)
పసిడి (ఫిబ్రవరి)	1,34,899	1,39,940	3.74
వెండి (మార్చి)	2,09,475	2,40,935	15.02
రాగి (జనవరి)	1,127.75	1,277.95	13.32
సీసం (జనవరి)	181.25	182.95	0.94
జింక్ (జనవరి)	303.20	312.85	3.18
అల్యూమినియం (జనవరి)	288.35	301.25	4.47
ముడి చమురు (జనవరి)	5,124	5,180	1.09
సహజ వాయువు (జనవరి)	335.30	352	4.98
పసుపు (ఏప్రిల్)	15,698	17,100	8.93
జీలకర్ర (జనవరి)	21,190	22,400	5.71

సూచీల స్థిరీకరణకే అవకాశం

స్టాక్ మార్కెట్ ఈ వారం

● 26,000 దిగువకు నిఫ్టీ-50 వస్తే బలహీనతలు

● విశ్లేషకుల అంచనాలు



దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం స్థిరీకరణకు గురికావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. సానుకూల సంకేతాలు లేకపోవడం, సంవత్సరాంతంలో అంతర్జాతీయంగానూ ట్రేడింగ్ కార్యకలాపాలు తగ్గడం ఇందుకు కారణంగా నిలవవచ్చు. కార్పొరేట్ సంస్థల డిసెంబరు త్రైమాసిక ఫలితాల అంచనాల కోసం మదుపర్లు వేచిచూస్తారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, విదేశీ మదుపర్ల విక్రయాలు.. సెంటిమెంటుపై ఒత్తిడి తెస్తున్నాయి. డిసెంబరు చివరి 5 ట్రేడింగ్ రోజులు, జనవరి తొలి రెండు ట్రేడింగ్ రోజుల్లో కనిపించే శాంటాక్లాజ్ ర్యాలీ ఈ సారి ఉండకపోవచ్చని భావిస్తున్నారు. సాంకేతికంగా నిఫ్టీ-50 సూచీ 26,000 పాయింట్ల కిందకు వస్తే తాజా అమ్మకాలుంటాయని అంటున్నారు. ఆ స్థాయి ఎగువన ముగిస్తే, 26,200 దిశగా వెళ్లొచ్చన్నది అంచనా. డిసెంబరు ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు నేపథ్యంలో, ఒడుదొడుకులకు అవకాశం ఉంది. వాహన విక్రయ, పారిశ్రామికోత్పత్తి గణాంకాలూ ప్రభావం చూపుతాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● నిఫ్టీ బ్యాంక్ చాలా తక్కువ శ్రేణికి పరిమితం కావొచ్చు. డిసెంబరు త్రైమాసిక ఫలితాల కోసం ఎదురు చూస్తారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు స్థిరంగా, చాలా వరకు ప్రైవేటు రంగ బ్యాంకులు బలంగా గణాంకాలను వెలువరచవచ్చు.

● టెలికాంలో చూస్తే భారతీ ఎయిర్‌టెల్ స్వల్పకాలంలో స్థిరీకరణకు గురికావొచ్చు. వొడాఫోన్ ఐడియా సానుకూల ధోరణిలో కదలాడొచ్చు.

● ప్రామాణిక సూచీలతో పాటే ఎఫ్ఎమ్‌సీజీ షేర్లూ నష్టపోవచ్చు. జీఎస్‌టీ కోత అనంతరం, గిరాకీ పుంజుకుంటుందనే అంచనాలకు అనుగుణంగా పరిస్థితులు లేవని చెబుతున్నారు. షేర్ల అధిక విలువల వల్లా ఒత్తిడి పడుతోంది.

● లోహ సూచీ ఈ వారం కాస్త నష్టపోవచ్చు. అయితే మొత్తం మీద ధోరణి సానుకూలంగానే కనిపిస్తోంది. డాలరు సూచీలో బలహీనతలు, కొత్త ఏడాదిలో అమెరికా వడ్డీరేట్లు తగ్గుతాయన్న అంచనాలు, ప్రభుత్వ మూలధన వ్యయాలు పెరగొచ్చన్న వార్తలు కలిసిరావొచ్చు.

● ఐటీ షేర్లు చాలా తక్కువ శ్రేణికి లోబడి ట్రేడవవచ్చు. ఆర్డర్లు బలంగా ఉండడం, గిరాకీ స్థిరంగా కనిపిస్తున్నందున, ఈ రంగంపై సమీపకాలంలో విశ్లేషకులు బులిష్‌గానే ఉన్నారు. త్రైమాసిక ఫలితాల్లో యాజమాన్యాల వ్యాఖ్యలు, క్లయింట్ల వ్యయాలపై విశ్లేషణలు, ఏఐ కార్యాచరణ వంటివి కీలకం అవుతాయి.

● నిఫ్టీ వాహన షేర్లు సానుకూల ధోరణిని ప్రదర్శించొచ్చు. బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్‌లను పరిశీలించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. డిసెంబరు విక్రయాల్లో రెండంకెల వృద్ధి నమోదు కావచ్చన్న అంచనాలున్నాయి.

● ప్రభావం చూపే వార్తలు లేనందున చమురు-గ్యాస్ షేర్లు హెచ్చుతగ్గులకు లోనుకావొచ్చు. ఈ రంగ సూచీకి సాంకేతికంగా 12,300 పైన బ్రేక్‌అవుట్ కనిపిస్తోంది. చమురు ధరలు తగ్గుతుండడంపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు.

● రాబోయే బడ్జెట్‌పై ఆశలతో యంత్రపరికరాల షేర్లు కొంత రాణించొచ్చు. రైల్వే షేర్లలో ఆ ధోరణి ఇప్పటికే కనిపించింది. షేర్ల ధరలు అధిక విలువ వద్ద ఉండడంతో, లాభాలు పరిమితంగానే ఉండొచ్చు.

● సిమెంటుకు గిరాకీ డిసెంబరు త్రైమాసికంలో 6% పెరిగిందని అంచనా. గ్రూప్ కంపెనీల విలీన వార్తల మధ్య అంబుజా సిమెంట్స్ తన వృద్ధిని కొనసాగించొచ్చు. తక్షణ పన్ను ప్రయోజనాలూ కలిసిరావొచ్చు.

● ఔషధ కంపెనీలు ఒక శ్రేణికి లోబడి కదలాడొచ్చు. భాగస్వామ్యాలు, సామర్థ్య విస్తరణలు, దేశీయంగా విధాన పరిణామాలు కీలకం కానున్నాయి. నొవో నార్డిస్క్ బరువు తగ్గించే ఔషధానికి పేటెంట్ గడువు తీరనుండడంతో, జనరిక్ ఔషధ కంపెనీలపై విశ్లేషకులు బులిష్‌గా ఉన్నారు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	174.68	177.40	171.90
బజాజ్ ఆటో	9064.50	9234.20	8967.20
ఐషర్ మోటార్స్	7324.00	7405.30	7233.30
హీరో మోటోకార్ప్	5637.00	5765.00	5547.00
ఎం అండ్ ఎం	3623.10	3660.60	3595.80
మారుతీ	16596.00	16792.00	16418.00
టీవీఎస్ మోటార్	3634.10	3693.90	3596.50

ఎఫ్ఎమ్‌సీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	6,032.50	6,102.20	5,967.20
కోల్గేట్ పామోలివ్	2,087.40	2,127.70	2,061.90
డాబర్ ఇండియా	488.20	494.80	484.50
ఇమామీ	514.70	521.60	509.60
హిందుస్థాన్ యునిలీవర్	2,285.40	2,298.50	2,268.50
ఐటీసీ	404.15	408.40	401.80
మారికో	743.50	754.70	727.10

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	281.50	289.90	272.80
సీజీ పవర్	656.00	672.40	645.00
ఎల్ అండ్ టీ	4047.30	4077.60	4015.00
సీమెన్స్	3100.90	3138.70	3069.50
థెర్మాక్స్	3012.40	3051.10	2944.30

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	992.10	1001.80	982.80
ఐసీఐసీఐ బ్యాంక్	1350.40	1367.10	1340.10
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	85.12	86.10	83.60
ఇండస్‌ఇండ్ బ్యాంక్	849.85	870.40	826.80
కోటక్‌మహీంద్రా బ్యాంక్	2164.20	2184.30	2142.90
పీఎన్‌బీ	120.37	121.80	118.70
ఎస్‌బీఐ	966.30	973.60	961.10

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1208.30	1228.10	1193.90
బయోకాన్	395.45	404.10	389.80
సిప్లా	1506.00	1520.50	1486.70
డాక్టర్ రెడ్డీస్	1269.30	1282.40	1254.60
గ్లెన్‌మార్క్ ఫార్మా	2010.60	2035.20	1992.00
నాట్కో ఫార్మా	908.50	926.60	897.20

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిండాల్కో	872.90	883.30	855.80
హిందుస్థాన్ జింక్	636.85	651.60	626.60
ఎన్ఎండీసీ	82.61	84.30	80.50
సెయిల్	132.32	134.10	129.70
టాటా స్టీల్	169.12	171.00	166.90
వేదాంతా	600.95	612.90	591.00

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1660.90	1688.50	1636.70
ఇన్ఫోసిస్	1656.10	1676.00	1641.80
పర్సిస్టెంట్ సిస్టమ్స్	6300.50	6449.50	6200.50
టీసీఎస్	3280.00	3338.80	3242.40
టెక్ మహీంద్రా	1612.30	1643.70	1592.30
విప్రో	266.30	270.10	263.80

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1559.20	1564.90	1551.50
బీపీసీఎల్	366.00	371.80	358.80
హెచ్‌పీసీఎల్	467.70	473.90	462.00
ఐఓసీఎల్	160.30	162.90	158.30
ఓఎన్‌జీసీ	234.53	236.50	232.10
ఆయిల్ ఇండియా	402.75	413.30	396.80

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1735.30	1764.40	1710.40
అంబుజా సిమెంట్స్	554.65	559.40	545.80
ఇండియా సిమెంట్స్	441.30	454.00	427.20
శ్రీ సిమెంట్	26420.00	26746.70	25906.70
అల్ట్రాటెక్ సిమెంట్	11794.00	11909.30	11685.30

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	2,105.40	2131.30	2088.90
ఎమ్‌టీఎన్ఎల్	37.09	38.30	35.90
టాటా కమ్యూనికేషన్స్	1777.60	1818.30	1749.70
వొడాఫోన్ ఐడియా	11.94	12.20	11.80

(c) eenadu

ఈనాడు సినిమా

రీల్ రివైండ్ 2025

గడిచిన కాలం పంచిచ్చిన జ్ఞాపకాల్ని నెమరేసుకుంటూ.. సరికొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగు పెట్టే సమయం దగ్గర పడింది. దీంతో ఓసారి 2025 టాలీవుడ్ డైరీని బయటకు తీసి.. లెక్కలన్నీ సరిచూసుకోవాల్సిన తరుణమూ వచ్చేసింది. ఈ ఏడాది బాక్సాఫీస్ బరిలో అగ్రతారల సందడి అంతంత మాత్రంగానే కనిపించింది. చిరంజీవి, ప్రభాస్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్ లాంటి స్టార్ల నుంచి కొత్త సినిమాలు రాకపోవడం పెద్ద లోటుగా మారింది. అయినా మిగిలిన అగ్రహీరోల్లో పలువురు ఒకటికి రెండు చిత్రాలతో థియేటర్లలో సందడి చేయడం ప్రేక్షకుల్లో నూతనోత్తేజాన్ని నింపింది.

అగ్రహీరోల ఆధిపత్యమెంత!



ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా సంక్రాంతి నుంచే బాక్సాఫీస్ బరిలో అగ్రతారల సందడి మొదలైంది. ఈసారి పండగ సంబరాల్ని 'గేమ్ ఛేంజర్' చిత్రంతో ఉత్సాహంగా ప్రారంభించారు కథానాయకుడు రామ్‌చరణ్. కానీ, కథ, కథనాల్లో కొత్తదనం లేకపోవడం... శంకర్ దర్శకత్వంలో పదును కనిపించకపోవడం చిత్ర ఫలితాన్ని దెబ్బ తీశాయి. దీంతో ఇది ప్రారంభ వసూళ్లతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీని తర్వాత ఒక్క రోజు వ్యవధిలోనే బాలకృష్ణ 'డాకు మహారాజ్'తో.. వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం'తో బాక్సాఫీస్ బరిలో తలపడ్డారు. ఈ పోరులో బాలయ్య హిట్టు మాట వినిపించగా.. వెంకీ భారీ వసూళ్లతో ఈ ఏడాదికి ఇండస్ట్రీ హిట్‌ను అందుకున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ముస్తాబైన ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం.. వారాల పాటు హౌస్‌ఫుల్ బోర్డ్స్‌తో థియేటర్లను కళకళలాడించింది. దాదాపు రూ.300కోట్ల వసూళ్లు సాధించింది. ఇక 'డాకు..' విజయం తర్వాత బాలకృష్ణ నుంచి వచ్చిన మరో సినిమా 'అఖండ 2: తాండవం'. విజయవంతమైన 'అఖండ' సినిమాకి కొనసాగింపుగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన చిత్రమిది. ఈనెల తొలి వారంలో విడుదల కావాల్సిన ఈ సినిమా ఆర్థిక సమస్యల వల్ల ఆఖరి నిమిషంలో వాయిదా పడటం ఇటు ఇండస్ట్రీ వర్గాల్ని.. అటు సినీ ప్రియుల్ని కలవరపాటుకు గురిచేసింది. ఆ సమస్యలన్నీ దాటుకుని ఈనెల రెండో వారంలో తెరపైకి వచ్చి అభిమానుల్ని అలరించింది.


ప్రత్యేక పాత్రల్లో నాగ్

అగ్ర కథానాయకుడు నాగార్జున సోలో హీరోగా ఈ ఏడాది ఏ చిత్రం విడుదల చేయనప్పటికీ.. ప్రత్యేక పాత్రల్లో రెండు సినిమాల్లో అలరించారు. ధనుష్‌తో కలిసి 'కుబేర'లో తెర పంచుకున్న ఆయన.. ప్రతినాయక ఛాయలున్న పాత్రతో అందరి ప్రశంసలు దక్కించుకున్నారు. జూన్‌లో థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రానికి తెలుగు నాట మంచి వసూళ్లు లభించినప్పటికీ.. తమిళంలో మిశ్రమ ఆదరణే దక్కింది. ఇక దీని తర్వాత నాగ్ నుంచి వచ్చిన మరో క్రేజీ చిత్రం 'కూలీ'. రజనీకాంత్ టైటిల్ పాత్రలో నటించిన ఈ సినిమాని లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించారు. నాగార్జున దీంట్లో సైమన్ అనే విలన్ పాత్రలో దర్శనమిచ్చారు. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మిశ్రమ ఆదరణనే దక్కించుకుంది. కేవలం ప్రారంభ వసూళ్లతోనే సరిపెట్టుకుంది. అయితే నాగ్ స్టైలిష్ విలనిజానికి మంచి మార్కులు పడ్డాయి. రాజకీయాలతో తీరిక లేకుండా ఉండటం వల్ల గతేడాది ఒక్క చిత్రం విడుదల చేయలేకపోయిన పవన్ కల్యాణ్ ఈ ఏడాది మాత్రం సినీప్రియులకు డబుల్ ట్రీట్ ఇచ్చారు. నెలల వ్యవధిలోనే వరుసగా రెండు సినిమాల్ని అందించారు. నాలుగేళ్లుగా సెట్స్‌పై ఉన్న 'హరి హర వీరమల్లు' అన్ని అవాంతరాల్ని దాటుకుని జులైలో తెరపైకి వచ్చింది. కానీ, వీఎఫ్ఎక్స్ లోపాల వల్ల ఈ చిత్రం ప్రేక్షకుల్ని ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. కానీ, ఆ తర్వాత పవన్ నుంచి వచ్చిన 'ఓజీ' ఆయన అభిమానుల ఆకల్ని తీర్చేసింది. సుజీత్ దర్శకత్వం నుంచి వచ్చిన ఈ స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ బరిలో మంచి వసూళ్లనే కొల్లగొట్టింది. పవన్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.

కంటెంట్‌పై దృష్టి పెడితేనే...

గత కొన్నాళ్లుగా వరుస పరాజయాలతో సతమతమవుతున్న రవితేజ ఈ ఏడాది 'మాస్ జాతర'తో బాక్సాఫీస్ బరిలో అదృష్టం పరీక్షించుకున్నారు. కానీ, భారీ అంచనాల మధ్య థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ప్రేక్షకుల్ని ఏమాత్రం మెప్పించలేకపోయింది. 'దేవర' విజయం తర్వాత కథానాయకుడు ఎన్టీఆర్ నుంచి వచ్చిన చిత్రం 'వార్ 2'. ఇది తారక్‌కు తొలి స్ట్రెయిట్ హిందీ సినిమా. ఆయన.. హృతిక్ రోషన్ కలిసి నటించిన ఈ చిత్రం ఈ ఏడాది ఆగస్టులో విడుదలై చేదు ఫలితాన్ని రుచి చూసింది. మొత్తంగా ఈ ఏడాది అగ్రతారలకు మిశ్రమ ఫలితాల్ని అందిస్తూనే.. ఇమేజ్‌లు, పాన్ ఇండియా లెక్కల్ని పక్కకు నెట్టి కంటెంట్‌పై దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను గుర్తు చేసింది.

అక్షయ్ కొత్త చిత్ర సన్నాహాలు



'కేసరి ఛాప్టర్ 2', 'హౌస్‌ఫుల్ 5', 'జాలీ ఎల్ఎల్‌బీ 3' లాంటి వరుస సినిమాలతో ఈ ఏడాదికి వీడ్కోలు పలికారు బాలీవుడ్ అగ్ర హీరో అక్షయ్ కుమార్. ఇప్పుడాయన కొత్త ప్రాజెక్టులతో వచ్చే ఏడాదికి స్వాగతం పలకడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. దర్శకుడు అనీస్ బాజ్మీ, అక్షయ్ ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిన సంగతి తెలిసిందే. విద్యాబాలన్ కథానాయికగా నటిస్తుంది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను జనవరిలో మొదలు పెట్టనున్నట్లు సమాచారం. "కామెడీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముంబయిలో జనవరి 19న ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు" అని అక్షయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన ఖాతాలో 'భూత్ బంగ్లా', 'వెలకమ్ టు ది జంగిల్' 'హైవాన్' చిత్రాలున్నాయి.

ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా డి.సురేశ్‌బాబు



డి.సురేశ్‌బాబు

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్) అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఛాంబర్ భవనంలో జరిగిన ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ప్యానెల్ తరఫున పోటీ చేసిన ఆయన విజయం సాధించి, ప్రదర్శనకారుల విభాగం నుంచి ఈ పదవికి ఎన్నికయ్యారు. ఛాంబర్‌లో నిర్మాతలు, ప్రదర్శనకారులు, పంపిణీదారులు, స్టూడియో సెక్టార్... ఇలా నాలుగు విభాగాలు ఉంటాయి. ఏటా ఒక విభాగానికి చెందిన వ్యక్తి ఛాంబర్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈ పర్యాయం ప్రదర్శనకారుల విభాగం నుంచి ఛాంబర్ అధ్యక్షుడిగా డి.సురేశ్‌బాబు ఎన్నికయ్యారు. నాలుగు విభాగాలకుగానూ 48 మంది కార్యవర్గానికి ఎన్నికలు జరిగాయి. ప్రముఖ నిర్మాతలు డి.సురేశ్ బాబు, దిల్ రాజు, అల్లు అరవింద్ నేతృత్వంలోని ప్రోగ్రెసివ్ ప్యానెల్, చదలవాడ శ్రీనివాసరావు, టి.ప్రసన్నకుమార్, సి.కల్యాణ్ నేతృత్వంలోని మన ప్యానెల్ బరిలోకి దిగాయి. ప్రోగ్రెసివ్ ప్యానెల్ నుంచి 31, మన ప్యానెల్ నుంచి 17 మంది గెలుపొందారు. అనంతరం నాలుగు విభాగాలు కలిసి ఛాంబర్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నాయి. అధ్యక్షుడిగా డి.సురేశ్‌బాబు, ఉపాధ్యక్షులుగా సూర్యదేవర నాగవంశీ, భరత్ చౌదరి, పి.కిరణ్, కార్యదర్శులుగా కె.అశోక్‌కుమార్ (హైదరాబాద్), కె.వి.వి.ప్రసాద్ (విజయవాడ), కోశాధికారిగా ముత్యాల రామదాసు, సంయుక్త కార్యదర్శులుగా విజేందర్‌రెడ్డి (హైదరాబాద్), మోహన్ వడ్లపట్ల (హైదరాబాద్), జి.వీరనారాయణ బాబు(విజయవాడ), జి.మహేశ్వర రెడ్డి(గుంతకల్లు), ఎన్.నాగార్జున(తిరుపతి), కె.అప్పలరాజు (విశాఖపట్నం)లను ఎన్నుకున్నారు.

'టాక్సిక్'లో ఎలిజబెత్



యశ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ - అప్స్' సినిమా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. సినిమాలోని పాత్రలు ఒక్కొక్కటిగా పరిచయం అవుతున్నాయి. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో హ్యూమా ఖురేషీ ఓ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఆమె ఎలిజబెత్ అనే పాత్రలో నటిస్తున్నట్టుగా ప్రకటిస్తూ... ఆదివారం ఆ పాత్ర లుక్‌ని విడుదల చేశాయి సినీ వర్గాలు. ఆ పాత్ర గురించి దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ సామాజిక మాధ్యమాల్లో పలు విషయాల్ని వెల్లడించారు. "ఎలిజబెత్ పాత్రలో హ్యూమా వేసే ప్రశ్నలు లోతైన ఆలోచనల్ని రేకెత్తించేలా ఉంటాయి. ఒక విభిన్నమైన, బలమైన వ్యక్తిత్వాన్ని తెరపై ఆవిష్కరిస్తుంది. ఇలాంటి పాత్రకు తగ్గ నటిని ఎంపిక చేయడం నాకు ఎంతో కష్టంగా అనిపించింది. ఎప్పుడైతే హ్యూమా నా ఫ్రేమ్‌లోకి అడుగు పెట్టిందో ఆ క్షణంలోనే ఆమె ప్రత్యేకతని గమనించా" అన్నారు. ఈ సినిమా కోసం ఎవరూ ఊహించని సాహసాన్ని మనం చేస్తున్నామని, కెప్టెన్‌గా నువ్వు చేస్తున్న ఈ పని ఓ మాయాజాలం అనీ, ఇది నెరవేరేలా చేసిన తిరుగులేని శక్తి యశ్‌కు కృతజ్ఞతలు అంటూ దర్శకురాల్ని ఉద్దేశిస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్య చేశారు కథానాయిక హ్యూమా ఖురేషీ. వెంకట్ కె. నారాయణ, యశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 19న రానుంది.

సామ్ కుట్టి వచ్చేశాడు

మలయాళ కథానాయకులు టొవినో థామస్, బసిల్ జోసెఫ్, వినీత్ శ్రీనివాసన్ 'అతిరథి' సినిమా కోసం ఏకమై తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ చిత్రానికి అరుణ్ అనిరుధ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే



విడుదలైన ఈ సినిమా టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ చిత్రంలో బసిల్ పాత్రను పరిచయం చేస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది చిత్ర బృందం. "మొదటి పోస్టర్‌ను ఆవిష్కరించడానికి ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. సామ్ కుట్టి అకా సామ్ బాయ్ వచ్చేశాడు. వచ్చే ఏడాది ఓనం సందర్భంగా 'అతిరథి' వస్తోంది" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఈ పోస్టర్‌లో చిరునవ్వులు చిందిస్తూ సరికొత్త అవతారంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు బసిల్. వినోదం, భావోద్వేగాలు, యాక్షన్ లాంటి అంశాలతో తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని డాక్టర్ అనంతు ఎస్, బసిల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

మరో విభిన్నమైన కథతో



ఆది సాయికుమార్

'శంబాల'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు కథానాయకుడు ఆది సాయికుమార్. మిస్టిక్ థ్రిల్లర్ కథతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతూ, విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సినిమా విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు హీరో ప్రభాస్. ఇకపై కూడా ఇలా కొత్త రకమైన కథలతోనే ప్రయాణం చేయాలని నిర్ణయించుకున్నారు ఆది సాయికుమార్. తదుపరి ఆయన చిత్రం హాస్య మూవీస్ పతాకంపై రాజేశ్ దండా నిర్మాణంలో రూపొందనుంది. ఇటీవలే ఈ ప్రాజెక్ట్‌ని నిర్మాత అధికారికంగా ప్రకటించారు. ఈ కలయికలో సినిమా కోసం ఓ కొత్త దర్శకుడు విభిన్నమైన కథని సిద్ధం చేసినట్టు సమాచారం. త్వరలోనే ఈ సినిమా వివరాల్ని ప్రకటించనున్నట్టు తెలిపారు రాజేశ్ దండా.

ఆ అందమే ఓ రాక్షసి



విహాన్షి, షెరాజ్, కృతి

షెరాజ్ మెహదీ కథానాయకుడిగా నటిస్తూ... స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'ఓ అందాల రాక్షసి'. విహాన్షి హెగ్డే, కృతివర్మ కథానాయికలు. సురీందర్ కౌర్ నిర్మాత. ఈ చిత్రం జనవరి 2న రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించింది. కథానాయకుడు మాట్లాడుతూ "వినోదం, సందేశం మేళవింపుగా రూపొందుతున్న చిత్రమిది. కథలోని మలుపులు ఆకట్టుకుంటాయి. అమ్మాయిలకు ఈ చిత్రం మరింతగా నచ్చుతుంది" అన్నారు. "నేటితరం అమ్మాయిల్ని దృష్టిలో ఉంచుకుని సిద్ధం చేసిన కథ ఇది" అన్నారు కథ, మాటల రచయిత భాష్యశ్రీ. అమ్మాయిల్ని మోసం చేస్తే... ఆ అందమే ఓ రాక్షసిగా మారి భరతం పడుతుందని చెప్పే కథే ఈ చిత్రం అన్నారు నాయికలు కృతివర్మ, విహాన్షి హెగ్డే.

ఇదే నా ప్రేమ సందేశం



అగస్త్య, సిమర్

అగస్త్య నంద హీరోగా నటించిన చిత్రం 'ఇక్కీస్'. శ్రీరామ్ రాఘవన్ దర్శకత్వం వహించారు. సిమర్ బాటియా కథానాయిక. జనవరి 1న థియేటర్లలోకి రానుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ సినిమా నుంచి 'సజ్దా..' అనే మరో గీతాన్ని ఇన్‌స్టా వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. 'ఇదే నా ప్రేమ సందేశం' అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో అగస్త్య, సిమర్‌ల మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. "ప్రేమ అంటే ఏంటో తెలుసుకోవడానికి ప్రయత్నించండి.." అంటూ సాగుతున్న ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, అసీస్ కౌర్ ఆలపించారు. చిన్న వయసులోనే పరమవీర చక్ర పురస్కారాన్ని అందుకున్న సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవితం ఆధారంగా దీన్ని రూపొందించారు. దివంగత నటుడు ధర్మేంద్ర, జైదీప్ అహ్లావత్ కీలక పాత్రలు పోషించారు. దినేశ్ విజన్ నిర్మాత.

ప్రళే ప్రపంచంలోకి అలియా?



'ధురంధర్'తో భారీ వసూళ్లను సొంతం చేసుకొని ఈ ఏడాది బాలీవుడ్ బాక్సాఫీసుకు కొత్త కళ తీసుకొచ్చారు కథానాయకుడు రణ్‌వీర్ సింగ్. శక్తిమంతమైన పాత్రలతో ప్రయాణిస్తున్న ఆయన 'ప్రళే' అనే చిత్రంలో నటిస్తున్నట్లు వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. జై మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఇందులో కథానాయికగా అలియా భట్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. "పోస్ట్-అపోకలిప్టిక్ జాంబీ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో అలియాను ప్రేమికురాలిగా పరిచయం చేయట్లేదు. ఆమె పాత్ర హీరో ఆలోచనలను సవాలు చేసేలా ఉంటుంది. ప్రస్తుతం అలియాతో చర్చలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది ఆగస్టులో దీన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లనున్నారు. ఇందులో మనుగడ కోసం పోరాటం చేసే వ్యక్తిగా కనిపించనున్నారు రణ్‌వీర్" అని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే 'గల్లీ బాయ్', 'రాకీ ఔర్ రాణీ కి ప్రేమ్ కహానీ' చిత్రాలతో రణ్‌వీర్, అలియా జంటగా తెరపై సందడి చేశారు.

(c) eenadu

ఈనాడు ప్రతిభ
సోమవారం, డిసెంబరు 29, 2025
15 https://pratibha.eenadu.net https://eenadupratibha.net
విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

ప్రాక్టీస్ బిట్స్

పర్యావరణ అంశాలు

1. అభివృద్ధి, పర్యావరణం మధ్య అంతరాన్ని తగ్గించడానికి కింది విధానాల్లో ఏది ప్రవేశపెట్టారు?
1) క్యోటో ప్రోటోకాల్ 2) ఎజెండా 21 3) ప్యారిస్ ఒప్పందం 4) మేధోసంపత్తి హక్కుల వ్యాపారం

2. అవినీతి సుస్థిరాభివృద్ధిని ఎలా ప్రభావితం చేస్తుంది?
1) ఇది పర్యావరణ పరిరక్షణ ప్రయత్నాలను వేగవంతం చేస్తుంది. 2) పాలన, పారదర్శకత, పర్యావరణ పరిరక్షణను బలహీనపరుస్తుంది. 3) సంపదను మరింత సమానంగా పంపిణీ చేయడానికి సహాయపడుతుంది. 4) ఇది గణనీయమైన ప్రభావం చూపదు.

3. ఐక్యరాజ్యసమితి ఏ చొరవ ప్రపంచ వ్యాప్తంగా సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది?
1) ప్రపంచ వాణిజ్య సంస్థ 2) అంతర్జాతీయ ద్రవ్యనిధి 3) సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు 4) పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ

4. సుస్థిరాభివృద్ధి మూడు ప్రధాన భాగాలు ఏవి?
1) టెక్నాలజీ, ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్ 2) సామాజిక, ఆర్థిక, పర్యావరణ 3) వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు 4) ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, ఎన్‌జీఓలు

సమాధానాలు: 1-2; 2-2; 3-3; 4-2.

దరఖాస్తు చేశారా?
ఎస్ఎస్‌సీ జీడీ కానిస్టేబుల్ ఉద్యోగాలు (25,487)
చివరి తేదీ: 2025, డిసెంబరు 31
ఎయిమ్స్ బిలాస్‌పుర్‌లో 68 జూనియర్ రెసిడెంట్ ఉద్యోగాలు
చివరి తేదీ: 31.12.2025.


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలుగా విభజిస్తూ భారత పార్లమెంటు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014 చేసింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌కు, స్థానికుల ఆకాంక్షలకు స్పందించిన నాటి కేంద్ర ప్రభుత్వం కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా విభజనను నిర్వహించింది. 2014, జూన్ 2 నుంచి సరికొత్త ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను వేర్వేరు రాష్ట్రాలుగా ఉనికిలోకి తెచ్చిన ఈ చట్టం సరిహద్దుల నిర్ణయం, ఆస్తులు, అప్పులు, ఉద్యోగుల పంపిణీ తదితరాలను సమగ్రంగా వివరించింది. హైదరాబాద్‌ను తెలంగాణ శాశ్వత రాజధానిగా, ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు తాత్కాలిక రాజధానిగా ప్రకటించింది. ఆ చట్టం రూపకల్పనకు ఉన్న నేపథ్యం, ఏర్పడిన విధానం, సమగ్ర స్వరూపాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. చట్టంలోని భాగాలు, సెక్షన్లు, షెడ్యూళ్ల వారీగా చర్చించిన, వివరించిన అంశాలను గుర్తుంచుకోవాలి.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014

(ప్రాథమికాంశాలు)


ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరు చేసి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ 1960వ దశకం నుంచి తెలంగాణ ప్రజానీకం ఉద్యమాలు చేస్తూ వచ్చింది. ఇదే ఆశయంతో 2009లో కె.చంద్రశేఖర్ రావు (కేసీఆర్) చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఒత్తిడికి కేంద్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం (యూపీఏ ప్రభుత్వం) తలొగ్గింది. 2009, డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. కేంద్రం ప్రకటనతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని ప్రజానీకం గగ్గోలు పెట్టారు. ఏపీని విభజించవద్దంటూ పెద్దఎత్తున ఉద్యమించారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ ఉద్యమాన్ని శాంతింపజేయడంతో పాటు పరిష్కారాన్ని సూచించడానికి కేంద్రం 2010, ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ అధ్యక్షతన ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. ఈ కమిటీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన అంశాన్ని సమగ్రంగా పరిశీలించి రాష్ట్రాన్ని ఐక్యంగా ఉంచడమే ఉత్తమం అని ప్రతిపాదిస్తూ 2010, డిసెంబరులో కేంద్రానికి నివేదిక సమర్పించింది. తెలంగాణ అసంతృప్తిని పరిష్కరించడానికి బలమైన ప్రాంతీయ మండళ్ల ఏర్పాటు చేయాలని కూడా ఆ కమిటీ చెప్పింది. శ్రీకృష్ణ కమిటీ నివేదికను వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రజానీకం 'మిలియన్ మార్చ్' లాంటి భారీ ఉద్యమాలు దిగడంతో కేంద్రం చివరికి విభజనకే ముందుకు సాగింది. ప్రజల కోరికమేరకు తెలంగాణను ఏర్పాటు చేసింది.


శ్రీకృష్ణ కమిటీ


జైరాం రమేష్

★ ఆంధ్రప్రదేశ్ విభజన చట్టాన్ని రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం 2013, అక్టోబరు 8న అప్పటి రక్షణ శాఖ మంత్రి ఎ.కె.ఆంటోనీ ఛైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో 'గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్'ను ఏర్పాటు చేసింది. విభజన చట్టం తయారీలో అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జైరాం రమేష్ కీలక పాత్ర పోషించారు.

ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లు ఆమోదం


ప్రణబ్ ముఖర్జీ

- లోక్‌సభ ఆమోదం - 2014, ఫిబ్రవరి 18న
- రాజ్యసభ ఆమోదం - 2014, ఫిబ్రవరి 20న
- రాష్ట్రపతి సంతకం - 2014, మార్చి 1న (నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ)
- కేంద్ర ప్రభుత్వ గెజిట్ - 2014, మార్చి 1న
- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం- 2014, జూన్ 2న

విభజన చట్ట స్వరూపం

- చట్టంలో మొత్తం భాగాల(పార్టుల) సంఖ్య- 12
- మొత్తం సెక్షన్ల సంఖ్య - 108
- మొత్తం షెడ్యూళ్ల సంఖ్య- 13

చట్టం పేరు: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం - 2014 (లేదా) ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం



12 భాగాలు.. 13 షెడ్యూళ్లు!



ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం - 2014 విషయ సూచిక

పార్ట్ నంబర్	విషయం	సెక్షన్లు
1.	ప్రవేశిక లేదా ప్రాథమికం	1-2
2.	ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ	3-11
3.	చట్టసభల్లో ప్రాతినిధ్యం	12-29
4.	హైకోర్టు	30-43
5.	తెలంగాణ రాష్ట్రానికి వ్యయ అధికారం, ఆదాయ పంపిణీ	44-46
6.	ఆస్తులు, అప్పుల పంపకం	47-67
7.	కొన్ని కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించిన నిబంధనలు	68-75
8.	అఖిల భారత సర్వీసులకు సంబంధించిన నిబంధనలు	76-83
9.	జలవనరుల నిర్వహణ, అభివృద్ధి	84-91
10.	మౌలిక సదుపాయాలు, ప్రత్యేక ఆర్థిక చర్యలు	92-94
11.	ఉన్నత విద్యావకాశాలు	95
12.	న్యాయ, వివిధ సంబంధ నిబంధనలు	96-108

పార్ట్-1: ఇందులో సెక్షన్-1, సెక్షన్-2 ఉన్నాయి. చట్టంలోని పద జాలం గురించి వివరిస్తాయి.

పార్ట్-2 (సెక్షన్-3 నుంచి - 11): 'ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ' గురించి ఉంది. తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దులు, జిల్లాల సరిహద్దులు, జీహెచ్ఎంసీ పరిధి (ఉమ్మడి రాజధాని), అందులో గవర్నర్ అధికారాల విశదీకరణ, రెండు రాష్ట్రాల్లో పోలీస్ బలగాలు, గ్రేహౌండ్స్ దళాల పంపిణీ తదితరాలన్నీ ఇందులో ఉన్నాయి.

పార్ట్-3 (సెక్షన్ 12 నుంచి సెక్షన్ 29 వరకు): చట్టసభల్లో ప్రాతినిధ్యం గురించి ఇందులో ఉంది. రెండు రాష్ట్రాల శాసన సభ, శాసన మండళ్ల సభ్యుల పంపిణీ, నియోజకవర్గాల పరిధులు, నియోజకవర్గాల సంఖ్య పెంపు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలక్షన్ కమిషన్ పాత్ర మొదలైన అంశాలను వివరించారు.

జనరల్ స్టడీస్
ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ

పార్ట్-4 (సెక్షన్ 30 నుంచి సెక్షన్ 43 వరకు): ఇది హైకోర్టుకు సంబంధించిన వివరాలతో ఉంటుంది. అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్త హైకోర్టు ఏర్పడేంత వరకు, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న హైకోర్టు రెండు రాష్ట్రాలకు హైకోర్టుగా ఉంటుంది.

పార్ట్-5 (సెక్షన్ 44 నుంచి సెక్షన్ 46 వరకు): 'వ్యయానికి అనుమతి, రాబడుల పంపిణీ' గురించి ఈ భాగంలో చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య ఖర్చులు, ఆదాయాల పంపిణీ వివరాలు, జనాభా ఆధారంగా వీటి పంపిణీ, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం అదనపు నిధులివ్వడం మొదలైనవి ఉన్నాయి.

పార్ట్-6 (సెక్షన్ 47 నుంచి సెక్షన్ 67): రెండు రాష్ట్రాల మధ్య ఆస్తులు, అప్పుల పంపకం గురించి ఇందులో ఉంది. పన్నులు, ఆస్తుల పంపిణీ ప్రాతిపదికలు, అవసరమైన చోట కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌కు నిర్ణయాధికారం మొదలైన వాటిని వివరిస్తుంది.

పార్ట్-7 (సెక్షన్ 68 నుంచి సెక్షన్ 75): వివిధ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించిన నిబంధనలు, వాటి పరిధులు, అధికారాల గురించి వివరిస్తుంది.

పార్ట్-8 (సెక్షన్ 76 నుంచి సెక్షన్ 83): అఖిల భారత సర్వీసులకు సంబంధించిన నిబంధనలు, అధికారుల పంపిణీ, రాష్ట్ర కేడర్లు మొదలైనవి.

పార్ట్-9 (సెక్షన్ 84 నుంచి సెక్షన్ 91): జలవనరుల నిర్వహణ, అభివృద్ధి, పంపిణీ వ్యవస్థ, గోదావరి జల వనరుల బోర్డు మొదలైన వాటిని వివరిస్తుంది.

పార్ట్-10 (సెక్షన్ 92 నుంచి సెక్షన్ 94): ఇందులో మౌలిక సదుపాయాలు, ప్రత్యేక ఆర్థిక చర్యలు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సహజ వనరుల పంపిణీ, రెండు రాష్ట్రాల్లో ఆర్థిక అభివృద్ధి కోసం కేంద్రం ఇవ్వవలసిన పన్ను మినహాయింపులు, అవశేష ఆంధ్రప్రదేశ్‌లో నిర్మించబోయే కొత్త రాజధాని, కేంద్రం చేయబోయే సాయం మొదలైన వాటి గురించి వివరిస్తుంది.


పార్ట్-11 (సెక్షన్ 95): ఉన్నత విద్యావ్యవస్థలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో పదేళ్ల పాటు కొనసాగింపు గురించి వివరిస్తుంది.

పార్ట్-12 (సెక్షన్ 96 నుంచి సెక్షన్ 108): నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని రాజ్యాంగంలో చేర్చడం లాంటి న్యాయ వ్యవహారాల గురించి వివరిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం-2014 హైదరాబాద్‌ను కొత్త తెలంగాణ రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా, అవశేష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పదేళ్ల పాటు తాత్కాలిక రాజధానిగా పేర్కొంది.


రచయిత: సుబ్బారెడ్డి

SENIOR INTER Maths–2A
Theory of equations



Final Exams-2026 IMPORTANT Q&A

1. Form the polynomial equation of degree 3 whose roots are 2, 3 and 6.

Sol: The polynomial equation whose roots are 2, 3, 6 is
$(x-2)(x-3)(x-6)=0 \Rightarrow x^3-11x^2+36x-36=0$

2. Find the polynomial equation whose roots are 1, −1, 3.

Sol: The polynomial equation whose roots are 1, −1, 3 is
$(x-1)(x+1)(x-3)=0 \Rightarrow x^3-3x^2-x+3=0$

3. The Polynomial equation whose roots are $2\pm\sqrt{3}$, $1\pm 2i$. **2 Marks**

Sol: The polynomial equation whose roots are $2\pm\sqrt{3}$, $1\pm 2i$ is
$\{x-(2+\sqrt{3})\}\{x-(2-\sqrt{3})\}$
$\{x-(1+2i)\}\{x-(1-2i)\}=0$
$\Rightarrow x^4-6x^3+14x^2-22x+5=0$

4. Form the polynomial equation whose roots are 0, 0, 2, 2, −2, −2.

Sol: The polynomial equation whose roots are 0, 0, 2, 2, −2, −2 is
$(x-0)(x-0)(x-2)(x-2)(x+2)(x+2)=0$
$\Rightarrow x^2(x-2)^2(x+2)^2=0$
$\Rightarrow x^2(x^2-4)^2=0 \Rightarrow x^6-8x^4+16x^2=0$

5. If 1, 2, 3, 4 are the roots of $x^4+ax^3+bx^2+cx+d=0$ then find the value of a, b, c and d.

Sol: Since 1, 2, 3, 4 are the roots of given equation then $-a=1+2+3+4=-10$
$b=1.2+1.3+1.4+2.3+2.4+3.4=35$
$-c=1.2.3+1.2.4+1.3.4+2.3.4=-50$
$d=(1)(2)(3)(4)=24$

6. If −1, 2, α are the roots of $2x^3+x^2-7x-6=0$ then find α.

Sol: Sum of roots $=(-1)+(2)+(\alpha)=-\frac{1}{2} \Rightarrow \alpha=-\frac{3}{2}$

More Imp Q & Ans

7. If 1, 1, α are the roots of $x^3-6x^2+9x-4=0$ then find α.

Sol: Sum of roots $=(1)+(1)+(\alpha)=6 \Rightarrow \alpha=4$


Writer: B. Eswar rao

ఆ మహా నగరమే చిరుతపులి రాజధాని!

దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన కూడా చేపట్టాలని, పోస్టల్ పిన్ స్థానంలో డిజిపిన్ తీసుకురావాలనే కీలక నిర్ణయాలు గత జూన్‌లో వెలువడ్డాయి. ఐపీఎల్ కప్ తొలిసారి బెంగళూరు జట్టును వరించింది. అహ్మదాబాద్‌లో విమానం కూలి రెండు వందల నలభై మందికి పైగా మృతి చెందారు. ఇజ్రాయెల్- ఇరాన్ యుద్ధం, పన్నెండు దేశాల పౌరులకు అమెరికా ప్రవేశంపై ట్రంప్ నిషేధం తదితర సంచలన ప్రకటనలు వార్తల్లో పతాక శీర్షికల్లో నిలిచాయి. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ జరిగింది. ఏపీలో తల్లికి వందనం పథకానికి నిధులు విడుదలయ్యాయి. విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం రికార్డులు సృష్టించింది. ఒలింపిక్స్ పతకాలను గెలిచి తెచ్చేవారికి తెలంగాణ రివార్డులు ప్రకటించింది. ప్రధాని మోదీ సైప్రస్, కెనడా, క్రొయేషియా దేశాల్లో పర్యటించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరిన తొలి భారతీయుడిగా శుభాంశు శుక్లా ఘనత సాధించారు. ఈ విధంగా అనేక విశేషాలతోపాటు ఆ నెలలో చోటు చేసుకున్న స్థానిక, జాతీయ, అంతర్జాతీయ వర్తమానాంశాలను అభ్యర్థులు పోటీ పరీక్షల కోసం మరోసారి అధ్యయనం చేయాలి.



ముఖ్యాంశాలు

❖ దేశంలో మొదటి ఏఐ - కేంద్రీకృత ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)ని ఇండోర్‌కు చెందిన కార్బన్ - న్యూట్రల్ డేటా సెంటర్ సంస్థ రాక్‌బ్యాంక్ డేటా సెంటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నేతృత్వంలో రూ.1000 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు.

❖ పోలండ్ అధ్యక్షుడిగా కన్జర్వేటివ్ నాయకుడు కరోల్ నౌరోకీ ఎన్నికయ్యారు. వార్సా మేయర్ రఫల్ ట్రస్కోవ్‌స్కీపై ఈయన గెలుపొందారు.


ఫ్రెంచ్ ఓపెన్ - 2025 మహిళల సింగిల్స్ విజేతగా కోకో గాఫ్ (అమెరికా) నిలిచింది. రన్నరప్ సబలెంకా (బెలారస్). పురుషుల సింగిల్స్ విన్నర్‌గా కార్లోస్ అల్కరాస్ (స్పెయిన్) నిలిచాడు. జానిక్ సినర్ (ఇటలీ)పై ఫైనల్లో విజయం సాధించాడు.

❖ దక్షిణ కొరియా అధ్యక్షుడిగా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి లీజే మ్యుంగ్ విజయం సాధించారు. దేశాధ్యక్షుడిగా ఉన్న యూన్ సుక్ యోల్ సైనిక పాలన విధించిన కారణంగా అభిశంసనకు గురై పదవి కోల్పోవడంతో ఎన్నికలు నిర్వహించారు.

❖ ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ నూతన అధ్యక్షురాలిగా జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేబాక్ ఎన్నికయ్యారు. ఈమెకు 167 ఓట్లు లభించగా, ప్రత్యర్థి జర్మన్ దౌత్యవేత్త హెల్గాష్మిడ్‌కు 7 ఓట్లే వచ్చాయి. 2025, సెప్టెంబరులో ఐరాస సర్వప్రతినిధి సభ 80వ సమావేశంలో ఈమె ఫిలెమాన్ యాంగ్ నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

❖ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-18 టైటిల్ విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నిలిచింది. జూన్ 3న అహ్మదాబాద్‌లో జరిగిన ఫైనల్లో 6 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించిన ఆర్‌సీబీ తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను కైవసంచేసుకుంది. విజేతకు రూ.20 కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

❖ దేశ 16వ జనగణనను 2027, ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పాటే కులగణననూ అదే నెల చివరి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించింది.

❖ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ సైన్సెస్ (ఐఐఏఎస్) అధ్యక్ష పదవిని భారత్ తొలిసారిగా గెలుచుకుంది. శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించే ఐఐఏఎస్‌లో 31 దేశాలకు సభ్యత్వం ఉంది. 1998 నుంచి ఈ సంస్థలో భారత్‌కు సభ్యత్వం ఉంది. ఈ సంస్థ కేంద్ర కార్యాలయం బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో ఉంది.

❖ 12 దేశాల పౌరులు అమెరికాలోకి ప్రవేశించకుండా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిషేధం విధించారు. అఫ్గానిస్థాన్, మయన్మార్, చాద్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, ఎరిత్రియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్ దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.

❖ పోస్టల్ ఇండెక్స్ నంబర్ (పిఐఎన్-పిన్) కోడ్ స్థానంలో తపాలా శాఖ మెరుగైన డిజిపిన్‌ను అందుబాటులోకి తెచ్చింది. చిరునామాను సులభంగా గుర్తించేందుకు సాయపడే 10 అంకెల సంకేతమే డిజిపిన్. దీనిలో అక్షరాలు, అంకెలు కలిసి ఉంటాయి. ఐఐటీ హైదరాబాద్, ఇస్రోకు చెందిన జాతీయ రిమోట్ సెన్సింగ్ కేంద్రం కలిసి ఈ డిజిపిన్‌ను అభివృద్ధి చేశాయి.

❖ రఫేల్ యుద్ధ విమానాల్లో కీలక భాగమైన ఫ్యూజ్‌లేజ్‌ను హైదరాబాద్‌లో తయారు చేసేందుకు ఫ్రెంచ్ సంస్థ దసో ఏవియేషన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్)తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది.


బెంగళూరు అధికారికంగా భారతదేశ 'చిరుతపులి రాజధాని'గా అవతరించింది. ఒక ప్రధాన మహానగరం అంచుల్లో నివసిస్తున్న, అత్యధిక సంఖ్యలో స్వేచ్ఛగా తిరిగే అడవి చిరుత పులుల పరంగా ముంబయిని బెంగళూరు అధిగమించింది.

❖ భారత వాతావరణ శాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్రకు ఐక్యరాజ్యసమితికి చెందిన డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (యూఎన్‌డీఆర్ఆర్) కార్యాలయం 'ససాకవా' పురస్కారం ప్రదానం చేసింది. ఉష్ణమండల తుపానుల అంచనా, హెచ్చరిక వ్యవస్థలకు సంబంధించి ఈయన చేసిన కృషికి ఈ గౌరవం దక్కింది.

❖ ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్‌గా ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సూర్యదేవర మహేంద్ర దేవ్ నియమితులయ్యారు.

❖ తెలంగాణ మంత్రివర్గాన్ని విస్తరించారు. రాష్ట్ర మంత్రులుగా గడ్డం వివేక్ (గనులు, కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమల శాఖలు), వాకిటి శ్రీహరి (పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసులు, మత్స్య శాఖలు), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖలు) బాధ్యతలు చేపట్టారు.

❖ టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ ఐసీసీ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో స్థానం పొందారు. దీంతో ఈ ఘనత సాధించిన 11వ భారత క్రికెటర్‌గా ధోనీ నిలిచాడు.

❖ భారత వృద్ధి రేటు 2025 - 26లో 6.3 శాతంగా నమోదు కావచ్చని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. 2026-27లో అది 6.5 శాతంగా నమోదు కావచ్చని పేర్కొంది.


❖ బాలీవుడ్ నటి కత్రినా కైఫ్ మాల్దీవులకు గ్లోబల్ టూరిజం అంబాసిడర్‌గా నియమితులయ్యారు.

❖ వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన 2025 గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్టులో భారత్ మొత్తం 148 దేశాల్లో 131వ స్థానంలో నిలిచింది. ఐస్‌లాండ్, ఫిన్లాండ్, నార్వే, యూకే, న్యూజిలాండ్‌లు ఈ నివేదికలో వరుసగా తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి.

❖ జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ సహా మొత్తం 242 మంది ప్రయాణికులు మరణించారు. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన కొన్ని నిమిషాలకే ప్రమాదానికి గురైంది.


ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) టైటిల్‌ను దక్షిణాఫ్రికా గెలుచుకుంది. ఫైనల్లో 5 వికెట్ల తేడాతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై నెగ్గింది.

❖ తెలంగాణలోని టీజీఎస్ఆర్‌టీసీలో తొలి మహిళా బస్‌డ్రైవర్‌గా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సీత్యతండాకు చెందిన సరిత జూన్ 14న విధుల్లోకి చేరారు.


కెనడాలోని అల్బర్టాలో ఉన్న కనానాస్కిస్ వేదికగా జీ-7 శిఖరాగ్ర సదస్సును జూన్ 15 నుంచి 17 వరకు నిర్వహించారు.

❖ భారత రాష్ట్రపతికి ఎయిడ్ - డె - క్యాంప్ (ఏడీసీ)గా నియమితులైన మొదటి మహిళా అధికారిగా నావికాదళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ యశస్వి సోలంకి వార్తల్లో నిలిచారు.

❖ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 'తల్లికి వందనం' పథక నిధులను జూన్ 13న కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. 67,27,164 మంది విద్యార్థులకు రూ.15 వేల చొప్పున చెల్లించేందుకు రూ.10090.74 కోట్లు అందిస్తారు. ఈ మొత్తంలో రూ.1,346 కోట్లు పాఠశాలల అభివృద్ధికి వెళ్తుంది.

❖ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ - 2024ను జూన్ 14న హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ప్రదానం చేశారు. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్‌ను నందమూరి బాలకృష్ణ, ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్, ఉత్తమ నటిగా నివేదా థామస్, ఉత్తమ దర్శకుడిగా నాగ్ అశ్విన్ పురస్కారాలు గెలుచుకున్నారు.


భారత టెన్నిస్ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక (తెలంగాణ)కు ప్రతిష్ఠాత్మక బిల్లీ జీన్ కింగ్ కప్ హార్ట్ పురస్కారం దక్కింది. 2025లో బిల్లీ జీన్ కింగ్ కప్ ఆసియా - ఓసియానియా గ్రూప్ - I టోర్నీలో ప్రదర్శనకు ఈమెకు ఈ అవార్డు లభించింది. సానియా మీర్జా, అంకిత రైనా తర్వాత భారత్ నుంచి శ్రీవల్లికి మాత్రమే ఈ గౌరవం దక్కింది.

❖ ప్రధాని నరేంద్ర మోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా జూన్ 15న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'ని నరేంద్ర మోదీకి ప్రదానం చేశారు. చేనేత కశ్మీరీ సిల్క్ తివాచీని మోదీ సైప్రస్ అధ్యక్షుడికి బహూకరించారు. ఏపీలో తయారైన వెండి పర్సును అందజేశారు. సైప్రస్ పర్యటన అనంతరం మోదీ కెనడా వెళ్లి జీ-7 సదస్సులో పాల్గొన్నారు. అనంతరం క్రొయేషియా పర్యటనకు వెళ్లారు.

❖ యూకే ప్రభుత్వ నిఘా సంస్థ 'ఎమ్ఐ6' 18వ చీఫ్‌గా బ్లేయిస్ మెట్రెవేలీ నియమితులయ్యారు. 116 ఏళ్ల చరిత్ర ఉన్న 'ఎమ్ఐ6'కు నాయకత్వం వహించనున్న తొలి మహిళగా ఈమె నిలిచారు.

❖ దేశంలోనే అతిపెద్ద ఆటోమొబైల్ గతిశక్తి కార్గో టెర్మినల్‌ను హరియాణాలోని మారుతీ సుజుకీ మానేసర్ ప్లాంట్‌లో కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ జూన్ 17న ప్రారంభించారు. కంపెనీ నుంచి డీలర్లకు కార్లను పంపించేందుకు ఇది ఉపయోగపడుతుంది.

❖ ప్రఖ్యాత విద్యాసంస్థ మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) అధిపతి (ప్రోవోస్ట్)గా భారత సంతతికి చెందిన ప్రొఫెసర్ అనంత చంద్రకశెన్ నియమితులయ్యారు. ఈ పదవికి ఎంపికైన తొలి భారతీయ అమెరికన్‌గా ఘనత సాధించారు.

❖ దేశంలోనే తొలిసారిగా క్వాంటమ్ 5జీ టెక్నాలజీతో సిమ్ లేకుండానే, వైర్‌లెస్‌గా ఇంటర్నెట్ సేవలను బీఎస్ఎన్ఎల్ హైదరాబాద్‌లో ప్రవేశపెట్టింది.


❖ విశాఖపట్నం నేవల్ డాక్ యార్డ్‌లో యుద్ధనౌక 'ఐఎన్ఎస్ అర్నాలా'ను చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ జాతికి అంకితం చేశారు.

❖ ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం కారణంగా ఇరాన్‌లో చిక్కుకున్న భారతీయుల్ని స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సింధు' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.

❖ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, ప్రసాద్ సూరిలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు లభించాయి. శివకుమార్ రాసిన 'కబుర్ల దేవత'కు బాల సాహిత్యం, ప్రసాద్ సూరి రచించిన 'మైరావణ'కు యువ సాహిత్య పురస్కారాలు లభించాయి.

❖ తెలంగాణలో అత్యవసర సేవల కోసం డయల్ 112 వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా ఇది అత్యవసర సేవల నంబరుగా కొనసాగుతుండగా, జూన్ 21 నుంచి తెలంగాణలోనూ అందుబాటులోకి వచ్చింది.

❖ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న విశాఖపట్నం సహా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాలు రెండు గిన్నిస్ రికార్డులు, 21 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులు సృష్టించాయి.


జూన్ 25న అమెరికాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి భారత వైమానిక దళ ఫైటర్ పైలట్ అయిన శుభాంశు శుక్లా మరో ముగ్గురితో కలసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమయ్యారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా స్పేస్ ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ ద్వారా డ్రాగన్ స్పేస్ క్రాఫ్ట్ వీరిని తీసుకెళ్లింది.

❖ 'ఐఎన్ఎస్ నీలగిరి' యుద్ధనౌక జూన్ 22న తూర్పు నౌకాదళంలో చేరింది. ప్రాజెక్ట్ -17 ఎ పేరిట దేశీయ రక్షణ పరిజ్ఞానంతో దీన్ని ముంబయిలో నిర్మించారు.

❖ ఆంగ్ల విభాగంలో దేశంలోనే తొలి డాక్టరేట్ పొందిన ట్రాన్స్‌జెండర్‌గా తమిళనాడుకు చెందిన జెన్నీ వార్తల్లో నిలిచారు.

❖ జూన్ 20న పీఎఫ్ఆర్‌డీఏ (పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్‌పర్సన్‌గా శివ సుబ్రమణియన్ రామన్ బాధ్యతలు స్వీకరించారు.

❖ భారత అంతరిక్ష చరిత్రలో ఐఎస్ఎస్‌ను చేరిన తొలి భారతీయుడిగా జూన్ 26న శుభాంశు శుక్లా ఘనత సాధించారు.


రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్

(c) eenadu

వాయిదాలు

ఏదైనా రుణదాత నుంచి రుణం తీసుకున్నప్పుడు దాన్ని తిరిగి చెల్లించేటప్పుడు ఒకేసారి కాకుండా నెలవారీ పద్ధతిలో చెల్లిస్తాం. ఏదైనా వస్తువు కొనాలనుకున్నప్పుడు చేతిలో కొద్ది మొత్తంలోనే డబ్బు ఉన్నప్పుడు దాన్ని చెల్లించి, మిగతా రుణాన్ని భాగాలుగా చేసుకుని వాయిదా పద్ధతిలో చెల్లిస్తాం. ఈ చెల్లించే ప్రతి భాగాన్ని ఇన్‌స్టాల్‌మెంట్ అంటారు. వాయిదా పద్ధతిలో వసూలు చేసే వడ్డీ మారుతూ ఉంటే, రూపాయల్లో విలువ మాత్రం స్థిరంగా ఉంటుంది. పరీక్షల్లో వాయిదాలు అనే అంశం నుంచి అడిగే ప్రశ్నలకు సమాధానాలు కనుక్కునేందుకు శాతాలు, గణిత ప్రక్రియలపై పట్టు పెంచుకోవడం తప్పనిసరి.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

ఆరు వాయిదాల్లో చెల్లిస్తే అప్పుగా తీసుకున్న అసలు?

మాదిరి ప్రశ్నలు

1. అక్షిత్ రూ. 1,33,000లను $16\frac{2}{3}\%$ బారువడ్డీతో అప్పుగా తీసుకుని, మూడు సమాన వార్షిక వాయిదాల పద్ధతిలో చెల్లించాడు. అయితే ఒక్కో వాయిదా విలువ ఎంత? (రూ.లో)

1) 57,000 2) 56,500 3) 58,000 4) 57,500

సాధన: ఒక్కో వాయిదా భాగాలు = 100 అనుకుందాం.

$R = 16\frac{2}{3}\% = \frac{50}{3}\%$; T = 3 ఏళ్లు $= 0 + R + 2R = 3R$

$A = (3 \times 100) + 3R = 300 + 3\left(\frac{50}{3}\right) = 350$ భాగాలు

$P = 133000, R = \frac{50}{3}\%$; T = 3 సం.లు,

వడ్డీ $= \frac{133000}{100} \times 3 \times \frac{50}{3} = 66500$

$A = 133000 + 66500 = 199500$ (350 భాగాల విలువ)

ఒక్కో వాయిదా 100 భాగాల విలువ $= 199500 \times \frac{100}{350}$

= రూ. 57000

సమాధానం: 1

2. రూ. 5600లను సమాన వార్షిక వాయిదాలతో ఆరేళ్లలో 12% బారువడ్డీ రేటు చొప్పున ఎంత అప్పును పూర్తిగా చెల్లించవచ్చు?

1) 43860 2) 43680 3) 46380 4) 46830

సాధన: వాయిదా = 5600, T = 15R; R = 12%

వాయిదా = 100 భాగాలు అనుకుందాం.

$A = 100(6) + 15R = 600 + 15(12) = 780$ భాగాలు

100 భాగాల విలువ = 5600

780 భాగాల విలువ $= \frac{5600 \times 780}{100}$ = రూ. 43680

సమాధానం: 2

3. రూ. 1,24,200 అప్పును ఆరేళ్లలో $11\frac{1}{9}\%$ బారువడ్డీ రేటుతో తీర్చడానికి, చెల్లించాల్సిన సమాన వార్షిక వాయిదా మొత్తం ఎంత?

1) 18500 2) 27000 3) 16200 4) 24000

సాధన: $A = 124200, R = 11\frac{1}{9}\% = \frac{100}{9}\%$

T = 6 ఏళ్లు $= 0 + R + 2R + 3R + 4R + 5R = 15R$

వార్షిక వాయిదా 100 భాగాలు అనుకుందాం.

$A = 6(100) + 15R = 600 + 15\left(\frac{100}{9}\right) = \frac{2300}{3}$ భాగాలు

$\frac{2300}{3}$ భాగాల విలువ = రూ. 124200

ఒక్కొక్క వాయిదా 100 భాగాల విలువ $= \frac{124200 \times 100 \times 3}{2300}$

= రూ. 16200

సమాధానం: 3

4. అవంత్ కొంత సొమ్మును అప్పుగా తీసుకొని $13\frac{1}{3}\%$ బారువడ్డీ రేటుతో 6 వార్షిక వాయిదాలు, ఒక్కొక్కటి రూ. 1800 చొప్పున చెల్లించి అప్పు మొత్తం తీర్చాడు. అయితే అతడు అప్పుగా తీసుకున్న అసలు సొమ్ము ఎంత? (రూ.లో)

1) 9800 2) 10800 3) 7500 4) 8000

సాధన: $R = 13\frac{1}{3}\% = \frac{40}{3}\%$, T = 6 సం.లు

$T = 0 + R + 2R + 3R + 4R + 5R = 15R$

లెక్కప్రకారం, ఒక్కో వాయిదా 100 భాగాల విలువ = రూ. 1800

$A = 6(100) + 15R = 600 + 15\left(\frac{40}{3}\right) = 800$ భాగాలు

100 భాగాల విలువ = రూ. 1800

A = 800 భాగాల విలువ $= \frac{1800 \times 800}{100}$ = రూ. 14,400

P = రూ. 100 అనుకుందాం.

$I = \frac{PTR}{100} = \frac{100}{100} \times 6 \times \frac{40}{3} = 80$

A = 100 + 80 = రూ. 180 అయితే P = రూ. 100

A = రూ. 14400 అయితే $P = 100 \times \frac{14400}{180}$ = రూ. 8000

సమాధానం: 4

5. వికాస్ రూ. 74,200 లను $13\frac{3}{5}\%$ బారువడ్డీతో అప్పుగా తీసుకుని అయిదు సమాన వార్షిక వాయిదాల పద్ధతిలో అప్పు పూర్తిగా చెల్లించాడు. అయితే అతడు చెల్లించిన ఒక్కో సమాన వార్షిక వాయిదా మొత్తం ఎంత? (రూ.లో)

1) 19000 2) 19600 3) 18500 4) 20000

సాధన: ఒక్కో వాయిదా = 100 భాగాలు అనుకుందాం.

$R = 13\frac{3}{5}\% = \frac{68}{5}\%$

T = 5 ఏళ్లు $= 0 + R + 2R + 3R + 4R = 10R$

$A = 5(100) + 10R = 500 + 10\left(\frac{68}{5}\right) = 636$ భాగాలు

$P = 74{,}200, R = \frac{68}{5}\%$, T = 5 ఏళ్లు,

$I = \frac{74200}{100} \times \frac{68}{5} \times 5 = 50456$

$A = 74200 + 50456$

= రూ. 124656 (636 భాగాల విలువ)

ఒక్కో వాయిదా = 100 భాగాల విలువ

$= \frac{124656 \times 100}{636}$

= రూ. 19600

సమాధానం: 2



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

Word of the Day 875

Reproach

Telugu meaning: నిందించడం, ఆక్షేపించడం

English meaning: The word reproach (రిప్రోచ్) is a noun or verb that refers to expressing disapproval or disappointment, especially because of someone's wrong action or failure.

Synonyms: Blame, Criticism

Antonyms: Praise, Approval

Usage: **1. (As a Noun):** The manager's tone was full of reproach when he addressed the team's careless handling of the project.

2. (As a Verb): She reproached her friend for ignoring repeated warnings despite knowing the serious consequences.

కరెంట్ అఫైర్స్



వీర బాలదివస్ సందర్భంగా కేంద్ర మహిళా, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 26 డిసెంబరు 2025న 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ - 2025'ను 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలు అందుకున్నారు. ఈ కార్యక్రమం దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగింది. తెలంగాణ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతారోహకుడు విశ్వనాథ్‌కార్తికేయ పడకంటి, ఏపీ కర్నూల్ జిల్లాకు చెందిన 17 ఏళ్ల శివాని హోసూరు ఉప్పర (షాట్‌పుట్, జావెలిన్‌త్రో) రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాలు తీసుకున్నారు. ఈ అవార్డులను ధైర్యసాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవ, శాస్త్రసాంకేతిక, క్రీడా విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన వారికి అందజేస్తారు.



ప్రపంచంలోకెల్లా అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్ వే సొరంగాన్ని చైనా 26 డిసెంబరు 2025న ప్రారంభించింది. ఈ సొరంగం పొడవు 22.13 కిలోమీటర్లు. దీనికి 'తియాన్షన్ షెంగ్లీ' అని పేరు పెట్టారు. వాయవ్య చైనాలోని షింజియాంగ్ యూగర్ అటానమస్ రీజియన్‌లో సెంట్రల్ తియాన్షన్ పర్వతాల మీదుగా వెళ్లే ఈ సొరంగం గంటల పాటు పట్టే ప్రయాణాన్ని 20 నిమిషాలకు తగ్గిస్తుంది.



దేశ రాజధాని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 2025, డిసెంబరు 25న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంథాలీ భాషలో రచించిన భారత రాజ్యాంగాన్ని ఆవిష్కరించారు. దేశంలో మనుగడలో ఉన్న అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటైన సంథాలీని 2003లో 92వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చారు.

☛ ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు ఈ భాషను మాట్లాడతారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఎం.ఎస్. స్వామినాథన్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన భారతదేశానికి చెందిన ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త. వ్యవసాయం, ఆహార భద్రత, సుస్థిరాభివృద్ధి రంగాల అభివృద్ధికి గణనీయంగా కృషిచేశారు. ముఖ్యంగా అధిక ఆహారోత్పత్తి సాధించే వంగడాలకు రూపకల్పన చేసి, ఆకలి బాధను తగ్గించడంలో కీలక పాత్ర పోషించారు. ఎక్కువ దిగుబడిని ఇచ్చే పొట్టి గోధుమ రకమైన 'పర్బతిసొనారా'ను అభివృద్ధి చేశారు. వ్యవసాయాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని ఆయన బలంగా విశ్వసించారు. ఆ రంగంలో నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు చేశారు. భారతదేశ హరిత విప్లవ పితామహుడనే గొప్ప కీర్తిని గడించారు. దేశంలో రైతుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడిన ఈ మహనీయుడి జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

☛ ఎంఎస్ స్వామినాథన్ తమిళనాడులోని కుంభకోణంలో 1925, ఆగస్టు 7న జన్మించారు. పూర్తి పేరు మాన్‌కొంబు సాంబశివన్ స్వామినాథన్.

☛ కుంభకోణంలోని క్యాథలిక్ లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. చిన్నతనం నుంచే ఆయనకు వ్యవసాయం పట్ల ఆసక్తి ఉండేది.



చివరగా: ప్రస్తుతం మన దేశం ధాన్యం నిల్వల్లో స్వయం సమృద్ధి సాధించి ఇతర దేశాలకు ఆహారోత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి చేరిందంటే దానికి స్వామినాథన్ పరిశోధనలే కారణం. హరిత విప్లవంతో భారత పంటపొలాల ముఖ చిత్రాన్నే మార్చేశారు. వ్యవసాయాన్ని ఆధునికీకరించే దిశగా అద్భుతమైన ప్రయత్నాలు చేశారు. దేశ ఆహార భద్రతకు ఇవి ఎంతగానో తోడ్పాటు అందించాయి. రైతుల ఆదాయాలూ రెట్టింపయ్యాయి. ఆహార కొరత నుంచి దేశం స్వయం సమృద్ధి సాధించే దిశగా దేశం తీసుకున్న అనేక నిర్ణయాల్లో స్వామినాథన్ కీలక పాత్ర పోషించారు. ఈయన 2023, సెప్టెంబరు 28న చెన్నైలో మరణించారు.

ఎం.ఎస్. స్వామినాథన్ వృత్తి జీవితం, చేసిన ముఖ్యమైన పరిశోధనలు, పొందిన అవార్డులు - గౌరవాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

EENADU Epratibha

జనరల్ స్టడీస్ - ఎకానమీ


పర్యావరణ క్షీణత - సుస్థిరాభివృద్ధి

ఏ దేశమైనా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పర్యావరణంలో లభించే సహజ వనరులు ఎంతో కీలకం. పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. కాలుష్యం, అటవీ నిర్మూలన, వనరుల తగ్గుదల లాంటి అంశాలు పర్యావరణ క్షీణతను సూచిస్తాయి. ఇది ఆర్థిక వ్యవస్థలో స్థిరమైన అభివృద్ధికి సవాళ్లను కలిగించడంతోపాటు ఆర్థిక వృద్ధి, మానవ ఆరోగ్యం, పర్యావరణ వ్యవస్థ సేవలను ప్రభావితం చేస్తుంది. అందుకే మానవుడు పర్యావరణాన్ని కాపాడుకుంటూనే సుస్థిరాభివృద్ధి కోసం కృషి చేయాలి.

పర్యావరణం: విశ్వంలోని జీవరాశుల సమూహం చుట్టూ వ్యాపించి ఉన్న సకల పదార్థాలను లేదా పరిస్థితులను కలిపి పర్యావరణంగా పేర్కొంటారు.

పర్యావరణంపై ఆర్థికాభివృద్ధి ప్రభావం – పర్యావరణ క్షీణత

పర్యావరణంపై మానవుల ప్రభావం వారి సంఖ్య, వనరుల వినియోగంపై ఆధారపడి ఉంటుంది. ఆర్థిక కార్యకలాపాలకు మూలాలైన ఈ రెండు స్వతంత్ర కారకాలు. ఇవి వినియోగ స్థాయి కూర్పును, వస్తు ఉత్పత్తిని ప్రభావితం చేస్తాయి.



సహజ వనరులు

ప్రకృతి నుంచి సహజసిద్ధంగా లభించే వాటిని సహజ వనరులు అంటారు. ఇవి ప్రకృతి నుంచి లభిస్తాయి కాబట్టి వీటిని ప్రకృతి వనరులు అని కూడా అంటారు.

పర్యావరణం - భాగాలు, సహజ వనరులు - రకాలు, పర్యావరణం - ఆర్థిక వ్యవస్థ మధ్య సంబంధం, సుస్థిరాభివృద్ధి - ప్రాధాన్యం, సహస్రాబ్ది లక్ష్యాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Senior Resident jobs

The Employees' State Insurance Corporation (ESIC), Ranchi, is inviting applications for faculty and non-faculty positions in various departments on a contract basis. Total no.of posts is 99. Last date of offline application is January 3, 2026.

Faculty Jobs

The Employees' State Insurance Corporation (ESIC), Punjab is conducting interviews for filling Faculty and Non-Faculty positions in various departments on a contract basis. Total no.of posts is 97. Application fee is Rs. 500. Last date of application December 31, 2025.

Apprentice Recruitment 2025

Mazagon Dock Shipbuilders Limited (MDL) has released a notification for One-Year Apprenticeship Training under the Apprenticeship (Amendment) Act. Online applications are invited from eligible Engineering Graduates, Engineering Diploma holders, and General Stream Graduates for the Apprentices Batch 2025-26. Total no.of posts is 200. Last date for online application is 5 January 2026.

Did You Apply..?

Today (December 29) is the last date for the following Jobs

☛ SRF vacancies at IISER Tirupati.
Eligibility: MSc and PhD (Life Sciences or Biotechnology).

☛ Welder Jobs in Indian Coast Guard.
Eligibility: Tenth/Internship.

For more information and other notifications - scan QR code

Fill in the Blanks

Directions (Qs. 1 - 21): *Select the most appropriate option to fill in the blank(s).*

1. Rapid urbanization has led to the .... of agricultural land on the outskirts of major cities.
A) Preservation B) Expansion
C) Shrinkage D) Protection

2. The recent reforms aim to .... unnecessary paperwork and make public services more accessible.
A) Complicate B) Streamline
C) Multiply D) Abandon

3. Her determination and patience were the key .... behind her success in competitive exams.
A) Obstacles B) Barriers
C) Failures D) Factors

4. Many historical buildings are in danger due to the lack of adequate ....
A) Maintenance B) Negligence
C) Abandonment D) Ignorance

5. The new tax system intends to .... financial transparency among corporations.
A) Obscure B) Promote
C) Conceal D) Dismiss

6. The teacher used visual aids to .... students' understanding of complex concepts.
A) Hinder B) Diminish
C) Enhance D) Confuse

7. The manager's calm response helped to .... the tension during the heated discussion.
A) Escalate B) Fuel
C) Spread D) Defuse

8. Citizens are urged to .... the misuse of public property and report such incidents.
A) Resist B) Accept
C) Encourage D) Overlook

9. The documentary successfully .... the struggles of frontline workers during the pandemic.
A) Depicts B) Overlooks
C) Conceals D) Rejects

10. The organization provides free legal support to victims of domestic ....
A) Care B) Abuse
C) Honor D) Praise

11. To improve public health, the government plans to .... awareness about sanitation.
A) Suppress B) Reject
C) Spread D) Reduce

12. Scientists are working continuously to .... low-cost solutions for clean drinking water.
A) Eliminate B) Abandon
C) Dismiss D) Devise

SSC Exams

English

13. The success of the mission depends largely on the .... between all team members.
A) Coordination B) Dispute
C) Isolation D) Conflict

14. The rise of online education has .... new opportunities for remote learners.
A) Closed B) Opened
C) Destroyed D) Blocked

15. The official statement was released to .... rumors circulating on social media.
A) Amplify B) Confirm
C) Clarify D) Spread

16. The government plans to .... digital literacy in rural areas and .... access to online services.
A) Reduce, Obstruct
B) Dismiss, Restrict
C) Conceal, Block
D) Foster, Expand

17. Strict laws are needed to .... cyber-crimes and .... data security for users.
A) Encourage, Undermine
B) Curb, Strengthen
C) Support, Reduce
D) Ignore, Weaken

18. The charity event was organized to .... funds for education and .... awareness about child rights.
A) Raise, Spread B) Reject, Conceal
C) Lower, Limit D) Waste, Diminish

19. The new platform aims to .... small businesses and .... direct communication with customers.
A) Weaken, Block
B) Hinder, Reduce
C) Discourage, Delay
D) Empower, Enable

20. The training program helped students .... confidence and .... practical skills.
A) Lose, Destroy B) Reject, Discard
C) Gain, Develop D) Remove, Reduce

21. To reduce pollution, industries must .... cleaner technologies and .... hazardous emissions.
A) Adopt, Minimize
B) Avoid, Increase
C) Reject, Multiply
D) Suspend, Maximize


Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

52 ఉపగ్రహాలను ఒకేసారి నింగిలోకి పంపిన రష్యా

మాస్కో: సోయజ్-2.1బి అనే వాహక నౌక ద్వారా రష్యా ఆదివారం ఒకేసారి 52 ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. వోస్టోక్నీ స్పేస్‌పోర్టు నుంచి ఈ ప్రయోగం చేపట్టినట్లు జాతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ 'రాస్‌కాస్మోస్' తెలిపింది. రష్యా ఆదివారం కక్ష్యలో ప్రవేశపెట్టినవాటిలో ఇరాన్‌కు చెందిన మూడు కమ్యూనికేషన్ ఉపగ్రహాలు కూడా ఉన్నాయి. వాటిలో ఒకటైన 'పాయా' బరువు 150 కిలోలు. ఇరాన్ ఇప్పటివరకూ కక్ష్యలోకి పంపించిన అత్యంత బరువైన ఉపగ్రహం ఇదే.

ఉక్రెయిన్‌కు పుతిన్ హెచ్చరిక



ఇంటర్నెట్ డెస్క్: యుద్ధం ముగింపునకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్న వేళ రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతియుత మార్గంలో సమస్య పరిష్కారానికి ఉక్రెయిన్ ముందుకు రాకపోతే.. తాము ప్రత్యేక సైనిక మార్గాలను అనుసరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రష్యా మిలిటరీ కమాండ్ పోస్టును సందర్శించిన పుతిన్ తాజాగా ఈ మేరకు మాట్లాడారు. మరోవైపు- ఐరోపాలో ఏ దేశంపైనా దాడి చేసే ఉద్దేశం తమకు లేదని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆదివారం స్పష్టం చేశారు. ఐరోపా దేశమేదైనా తమపై దాడికి దిగితే మాత్రం తమ ప్రతిస్పందన అత్యంత భయానకంగా ఉంటుందని హెచ్చరించారు.

మొబైల్ విస్తృత వాడకంతో హ్రస్వ దృష్టి ముప్పు

ఈటీవీ భారత్: మొబైల్, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లను విపరీతంగా వాడటంవల్ల పిల్లలు కళ్లలోని తేమను కోల్పోవడంతోపాటు హ్రస్వ దృష్టి లోపానికి గురవుతున్నారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దాదాపు పది వేల మంది పిల్లల కళ్లను పరీక్షించిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పుర్‌కు చెందిన నేత్ర వైద్యులు.. ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఒకరికి కళ్లజోడు అవసరం ఉందని గుర్తించారు. చిన్నారుల కళ్లపై గ్యాడ్జెట్ల ప్రభావాన్ని కాన్పుర్‌కు చెందిన నేత్ర వైద్యులు ఇటీవల పరిశీలించారు. ఇందులో భాగంగా నగరంలోని 29 పాఠశాలల విద్యార్థులకు కళ్ల పరీక్షలు నిర్వహించారు. అనేక మంది చిన్నారులు బ్లాక్‌బోర్డును సరిగ్గా చూడలేకపోతున్నట్లు గుర్తించారు. కళ్లమంట, కళ్లు పొడిబారడం [illegible] ఈ సమస్యలు తల్లిదండ్రులు దృష్టికి తీసుకువచ్చారు. నేత్ర వైద్యులు [illegible] పిల్లలు [illegible] ఎక్కువ సమయం గడపడం, చల్లని గాలి, గదుల్లోనే ఉండటం [illegible] వంటి సమస్యలు మరింత పెంచుతాయి. పలు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చిన్నారుల కళ్లను కాపాడుకోవాలని సూచించారు.

సిక్కింలో యూపీ పర్వతారోహకుడి మృతి

గ్యాంగ్‌టక్: సిక్కింలోని ప్రఖ్యాత గోయెచాలా ట్రెక్కింగ్ మార్గంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన 45 ఏళ్ల పర్వతారోహకుడు మృతిచెందాడు. మృతుడిని సూరజ్ కుమార్ తివారీగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. సూరజ్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి యుక్సోమ్ ప్రాంతంలోని ప్రపంచ వారసత్వ ప్రదేశమైన ఖంగ్‌చెండ్జోంగా జాతీయ పార్కులో మిడ్ రేంజ్ ట్రెక్కింగ్ యాత్రకు వెళ్లాడు. అది పూర్తి చేసిన అనంతరం కోక్‌చురాంగ్ క్యాంప్ సమీపంలో అస్వస్థతకు గురయ్యాడు. పర్యాటక శాఖ [illegible] తరలించగా, అక్కడ [illegible] ఆతడిని యుక్సోమ్ వైపు తరలిస్తుండగా పెమింగ్ క్యాంప్ వద్ద మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అమెరికానే నిజమైన ఐరాస

- మావల్లే థాయ్, కంబోడియాల సంధి
- ట్రంప్ వ్యాఖ్యలు

న్యూయార్క్, వాషింగ్టన్: అమెరికానే నిజమైన ఐక్యరాజ్య సమితిగా వ్యవహరిస్తోందని, ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను నివారించడంలో ఐరాస పెద్దగా సాయపడటం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. థాయ్‌లాండ్, కంబోడియాల మధ్య యుద్ధం విడతల వారీగా ఆగుతుందని తెలిపారు. ఇటీవల కుదిరిన ఒప్పందం ప్రకారం రెండు దేశాలు శాంతియుత పరిస్థితుల్లోకి వెళ్తాయని ఆదివారం సోషల్ మీడియాద్వారా వెల్లడించారు. యుద్ధాలకు ముగింపు పలకడంలో అమెరికా చేసిన సాయంపట్ల ఎల్లప్పుడూ గర్విస్తామని తెలిపారు. తాను రెండోసారి అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన తర్వాత 11 నెలల్లో 8 యుద్ధాలను ఆపానని వివరించారు. ఐరాస క్రియాశీలంగా మారి ప్రపంచ శాంతికి కృషి చేయాలని సూచించారు.

◆ శాంతి చర్చల్లో భాగంగా థాయ్‌లాండ్, కంబోడియా దేశాల నేతలు ఆదివారం చైనాలో సమావేశమయ్యారు. ఇవి రెండు రోజులపాటు జరగనున్నాయి. ఈ దేశాల మధ్య శాంతిని నెలకొల్పడంలో తన పాత్రను మరింత బలోపేతం చేసుకునే దిశగా చైనా ఈ చర్చలకు తెరలేపింది.

చర్మమే స్మార్ట్ సెన్సర్!

- సరికొత్త విధానం సిద్ధం
- వైద్యరంగంలో విస్తృత ప్రయోజనాలు



చర్మాన్నే సెన్సర్‌గా మార్చే ఒక అద్భుత విధానాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. వీరు కాంతి సాయంతో అధిక సామర్థ్య ఎలక్ట్రానిక్ ఎలక్ట్రోడ్లను తయారుచేయగలిగారు. ఈ క్రమంలో ఎలాంటి రసాయనాలనూ ఉపయోగించలేదు. ఈ విధానం వల్ల గాజు, వస్త్రాలు.. చివరికి చర్మంపై కూడా విద్యుత్‌వాహక సామర్థ్యమున్న ప్లాస్టిక్ పొరలను ఏర్పాటు చేయవచ్చు. ఎలక్ట్రానిక్, వైద్య రంగాల్లో అనేక ప్రయోజనాలకు ఇది బాటలు వేయనుంది. సులువైన, ఎలాంటి ఖరీదైన పరికరాల అవసరం లేని ఎలక్ట్రానిక్స్‌ను సృష్టించడానికి ఇది అద్భుత మార్గం కానుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఏమిటీ ఎలక్ట్రోడ్లు?

విద్యుత్ వాహక సామర్థ్యం కలిగిన ఈ తరహా కండక్టివ్ ప్లాస్టిక్స్‌ను కాంజుగేటెడ్ పాలిమర్స్ అంటారు. ఈ పదార్థాల్లో లోహాలు, సెమీకండక్టర్లకు సంబంధించిన పనితీరుతోపాటు ప్లాస్టిక్‌తో ముడిపడిన తక్కువ బరువు, సులువుగా వంగే సామర్థ్యం వంటి లక్షణాలు ఉన్నాయి.

పాలిమర్లు హైడ్రోకార్బన్లతో కూడిన పొడవైన శృంఖలాలతో తయారవుతాయి. గొలుసులోని భాగాలను మోనోమర్లు అంటారు. వీటిని అనుసంధానించి, పాలిమర్‌గా మార్చే ప్రక్రియను పాలిమరైజేషన్ అంటారు. ఇందుకోసం గాఢమైన, విషతుల్య రసాయనాలను ఉపయోగించాల్సి వస్తుంది. అందువల్ల ఈ పాలిమర్లను భారీగా ఉత్పత్తి చేయడానికి, వైద్యం వంటి రంగాల్లో సురక్షితంగా వాడటానికి అవరోధంగా మారుతోంది.

కాంతితో సర్దుబాటు

హానికారక రసాయనాల అవసరంలేకుండానే దృశ్యకాంతితో పాలిమరైజేషన్ ప్రక్రియను చేపట్టే విధానాన్ని స్వీడన్‌లోని లింకోపింగ్, లుండ్ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు కనుగొన్నారు. తద్వారా విద్యుత్ వాహక సామర్థ్యమున్న ప్లాస్టిక్‌లతో ఎలక్ట్రోడ్లను తయారుచేశారు.

■ ఈ విధానంలో ప్రత్యేకంగా డిజైన్ చేసిన, నీటిలో కరిగిపోయే మోనోమర్లను ఉపయోగించారు. ఇవి దృశ్యకాంతికి స్పందించి క్రియాశీలమవుతాయి. అందువల్ల ఎలక్ట్రోడ్ల తయారీకి విషతుల్య రసాయనాలు, హానికారక అతినీలలోహిత కాంతి, అదనపు ప్రాసెసింగ్ చర్యలు అవసరం లేదు.

■ తొలుత ఈ మోనోమర్లతో కూడిన ఒక ద్రావకాన్ని ఒక ఉపరితలంపై ఉంచారు. ఆ తర్వాత దానిపైకి కాంతిని ప్రసరింపచేశారు. తద్వారా అవసరమైన చోట్ల, కావాల్సిన రీతిలో ఎలక్ట్రోడ్లను ఏర్పర్చగలిగారు.

■ ఈ విధానంలో పాలిమరైజేషన్‌కు గురికాని ద్రావకాన్ని కడిగేయవచ్చు. ఫలితంగా పూర్తిస్థాయి ఎలక్ట్రోడ్లు మాత్రమే మిగిలిపోతాయి.

■ ఈ ఎలక్ట్రోడ్లు.. ఎలక్ట్రాన్లు, అయాన్లను రవాణా చేయగలవు. అవి శరీరంతో సహజరీతిలో కమ్యూనికేట్ కాగలవు. హానికర రసాయనాలు లేకపోవడం వల్ల కణజాలానికి ఎలాంటి హాని జరగదు.

విరివిగా ఉపయోగాలు..

ఈ తరహా ఎలక్ట్రోడ్ల వల్ల కొత్తరకం ఎలక్ట్రానిక్స్, వైద్య సెన్సింగ్, పునరుత్పాదక శక్తి పరిజ్ఞానాల్లో కొత్త అవకాశాలకు వీలు కలుగుతుంది. ప్రయోగంలో భాగంగా ఈ ఎలక్ట్రోడ్లను నేరుగా ఒక ఎలుక చర్మంపై ఏర్పరిచారు. ఇవి సంప్రదాయ లోహపు ఈఈజీ ఎలక్ట్రోడ్ల కన్నా మెరుగ్గా మెదడుకు సంబంధించిన తక్కువ పౌనఃపున్య చర్యలను నమోదు చేయగలవని పరీక్షల్లో వెల్లడైంది.

■ దుస్తులపై కూడా ఈ సెన్సర్లను నిర్మించవచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆర్గానిక్ ఎలక్ట్రానిక్స్ సర్క్యూట్లను భారీ స్థాయిలో ఉత్పత్తి చేయడానికి దీన్ని ఉపయోగించవచ్చని పేర్కొన్నారు.

-ఈనాడు ప్రత్యేక విభాగం



చెట్టంత పండగ

క్రిస్మస్ పండగ కేరళలో అత్యంత వైభవంగా జరుగుతుంది. అక్కడి ప్రతి ఇంటినీ రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. వీధులన్నీ వెలుగు జిలుగులతో మెరిసిపోతుంటాయి. క్రిస్మస్ రోజైన 25వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకూ రాష్ట్రమంతా విద్యుత్తు కాంతులీనుతుంది. అందులో భాగంగానే కొచ్చిలోని వెలి మైదానంలో ఉన్న 200 ఏళ్లనాటి వృక్షాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. 80 అడుగుల ఎత్తుండే ఈ చెట్టును వేల మంది సందర్శిస్తారు. ఆదివారం విద్యుద్దీపాల మధ్య వృక్షరాజం ఇలా కనిపించింది.

ఈటీవీ భారత్

యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

రోబోటిక్ సాంకేతికతతో.. అరుదైన మూత్రాశయ కణితి తొలగింపు

మూత్రాశయ సమస్యతో బాధపడుతున్న ఓ రోగికి ఉత్తర్‌ప్రదేశ్‌లోని సంజయ్‌గాంధీ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. బాధితుడి మూత్రాశయంలో ఉన్న కణితిని అత్యాధునిక రోబోటిక్ సాంకేతికత సాయంతో తొలగించారు. ఈ తరహా సర్జరీ ప్రపంచంలో మొదటిదని సంబంధిత వైద్యులు వెల్లడించారు. ఇటీవల ఆసుపత్రికి వచ్చిన 60ఏళ్ల రోగి.. మూత్ర విసర్జన సమయంలో అకస్మాత్తుగా కళ్లు తిరగడం, తలనొప్పి, గుండె వేగంగా కొట్టుకోవడం, అధిక రక్తపోటు వంటి లక్షణాలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పరీక్షించిన వైద్యులు మూత్రాశయంలో అరుదైన కణితి ఉన్నట్లు కనుగొన్నారు. దాని ప్రభావంతోనే ఈ లక్షణాలు కనిపిస్తున్నట్లు నిర్ధారించారు. సాధారణంగా ఇటువంటి సర్జరీల కోసం లాప్రోస్కోపీ లేదా సంప్రదాయ శస్త్రచికిత్సలు చేస్తారు. కానీ, మూత్రనాళానికి ప్రమాదం ఉండే అవకాశం ఉందని గ్రహించిన వైద్యులు.. రోబోటిక్ టెక్నాలజీని ఉపయోగించారు. యూరాలజీ విభాగం నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృందం శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసింది. ఈ కేసుతో దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా ఆసుపత్రి ఖ్యాతి మరింత పెరిగిందని, ఈ సమస్యతో బాధపడే రోగులకు భరోసా కలిగిస్తోందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి.

ఆదుకొన్న రైతుకు ఆత్మీయనేస్తం 'మీటు'



"మీరు సహాయహస్తం అందిస్తే.. కొత్తవారు కూడా మీ సొంతమవుతారు" అనే మానవతా సూత్రం గుజరాత్‌లోని కోడినార్ పట్టణ సమీప వెల్వా గ్రామంలో ఓ అపురూపమైన స్నేహానికి రూపమిచ్చింది. ఆర్నెల్ల కిందట తన పొలంలో పనిచేసుకొంటున్న నారన్ భాయ్ అనే రైతుకు తల్లి నుంచి వేరుపడిన చిరు చిలుక కనిపించింది. చుట్టూ ఎంత వెదికినా తల్లి జాడ లేకపోవడంతో ఆ రైతు చిలుకను ఇంటికి తీసుకువెళ్లి ఆహారం అందించి పెంచారు. నారన్ కుటుంబం 'మీటు' అని దానికి పేరు పెట్టింది. రెక్కల శక్తి పుంజుకొన్నాక రైతు ఆ చిలుకను పంజరం నుంచి వదిలేసినా.. మళ్లీ వెనుక్కి వచ్చింది. ఇప్పుడు నారన్ పొలంలో పనిచేస్తున్నా.. ద్విచక్ర వాహనంపై వెళుతున్నా.. గ్రామస్థులతో కబుర్లు చెప్పుకొంటున్నా 'మీటు' ఆయన భుజం నుంచి దిగనంటోంది.

హాదీ హంతకులు భారత్‌లోకి రాలేదు

- బంగ్లా మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోంది
- బీఎస్ఎఫ్, మేఘాలయ పోలీసుల స్పష్టీకరణ

దిల్లీ/ఢాకా: బంగ్లాదేశ్ విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్యకు సంబంధించి ఆ దేశ మీడియాలో వస్తున్న కథనాలపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. షరీఫ్‌ను హత్య చేసిన ఇద్దరు వ్యక్తులు భారత్‌లోని మేఘాలయలోకి చొరబడ్డారన్న వార్తల్లో నిజం లేదని బీఎస్ఎఫ్, మేఘాలయ పోలీసులు స్పష్టం చేశారు. ఇదంతా తప్పుడు ప్రచారమని బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (మేఘాలయ) ఓపీ ఉపాధ్యాయ తెలిపారు. "మేఘాలయలోని హలువాఘాట్ దగ్గర అంతర్జాతీయ సరిహద్దును దాటి భారత్‌లోకి ఏ వ్యక్తీ ప్రవేశించినట్లు ఆధారాలు లేవు. అలాంటి ఘటనను బీఎస్ఎఫ్ గుర్తించలేదు. అందుకు సంబంధించి ఎలాంటి నివేదికా మాకు అందలేదు" అని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు వస్తున్న కథనాలు అబద్ధమని స్పష్టంచేశారు. మేఘాలయ పోలీసు అధికారి కూడా ఈ వార్తలను ఖండించారు. ఎవరూ రాష్ట్రంలోకి రాలేదని, తాము ఎవరినీ అరెస్టు చేయలేదని తెలిపారు. ఇవన్నీ భారత్‌పై చేస్తున్న తప్పుడు ఆరోపణలని, ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించేందుకు బంగ్లాదేశ్ మీడియా కల్పిత కథనాలను సృష్టిస్తోందని అన్నారు.

భారత్‌కే పారిపోయారు

అంతకుముందు హాదీ హత్యకేసులో ఇద్దరు ప్రధాన నిందితులు భారత్‌కు పారిపోయారంటూ బంగ్లాదేశ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. "అనుమానితులు ఫైసల్ కరీం మసూద్, ఆలంగీర్ షేక్‌లు స్థానికుల మద్దతుతో సరిహద్దులు దాటి భారత్‌లోని మేఘాలయకు పారిపోయారు. వారిని పుర్తి అనే వ్యక్తి కలిశారు. సమీ అనే ట్యాక్సీ డ్రైవర్.. మేఘాలయలోని తురా సిటీకి తీసుకెళ్లాడు. నిందితులకు సాయం చేసిన వారు భారత పోలీసుల అదుపులో ఉన్నారు" అని ఢాకా అదనపు పోలీస్ కమిషనర్ నజ్రుల్ ఇస్లామ్ పేర్కొన్నట్లు 'ది డైలీ స్టార్' పత్రిక పేర్కొంది. ఇంకిలాబ్ మోంచాకు చెందిన 32 ఏళ్ల హాదీపై ఈ నెల 12న ఢాకాలో కాల్పులు జరిగాయి. మెరుగైన వైద్యం కోసం ఆయన్ను సింగపూర్‌కు తరలించారు. అక్కడ ఈ నెల 18న మరణించారు. అనంతరం దేశవ్యాప్తంగా అల్లర్లు జరిగాయి. ఆ సందర్భంగా పత్రికా కార్యాలయాలపైనా దాడులు జరిగాయి. దీన్ని బంగ్లాదేశ్ ఎడిటర్స్ కౌన్సిల్ ఖండించింది. తాత్కాలిక ప్రభుత్వంలోని కొన్ని శక్తులే ఈ హింసకు కారణమని ఆరోపించింది.



బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ బెంగళూరులో హిందూ సంఘాల ఆందోళన

హిందూ యువకుడిపైన దాడిపై ప్రపంచం స్పందించాలి: రో ఖన్నా

బంగ్లాదేశ్‌లో హిందూ యువకుడు దీపూ చంద్ర దాస్ హత్యను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా ఖండించారు. ఇలాంటి విద్వేషపూరిత చర్యలకు వ్యతిరేకంగా ప్రపంచం తన గొంతుకను వినిపించాలని ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి కూడా ఈ ఘటనను తప్పుబట్టారు. బంగ్లాదేశ్‌లోని అన్ని వర్గాల భద్రత కోసం ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మత, భావ ప్రకటన స్వేచ్ఛకు అమెరికా మద్దతిస్తుందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారత్ వ్యక్తం చేసిన ఆందోళనలను ఢాకా ఖండించింది. ఒకట్రెండు నేరపూరిత ఘటనలను భూతద్దంలో చూపించి బంగ్లా వ్యతిరేక ప్రచారానికి భారత్ పాల్పడుతోందని ఆరోపించింది. భారత్‌లోనే మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయని ఎదురుదాడి చేసింది.

హమాస్ దగ్గర ఆయుధాలు లాక్కోం

- వాళ్ల సొరంగాలను ధ్వంసం చేయం
- అది మా పని కాదు
- అమెరికాకు స్పష్టంచేసిన పాక్

ఇంటర్నెట్‌డెస్క్: గాజాలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో భాగంగా తమ దళాలను పంపించడానికి సానుకూలంగా స్పందించిన పాక్.. ఇందుకు ఓ మెలిక పెట్టింది. అమెరికా ప్రతిపాదిత 20 అంశాల ప్లాన్‌లో హమాస్‌ను నిరాయుధీకరించాలన్న పాయింట్‌ను తొలగించినప్పుడే తాము భాగమవుతామని పేర్కొంది. ఈమేరకు పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్)లో తమ దేశం భాగం కావడం చాలా సున్నితమైన అంశంగా అభివర్ణించారు. శాంతిని పరిరక్షించే దళంగానే పాకిస్థాన్ కొనసాగుతుందన్నారు. "మేం వెళ్లి యుద్ధం చేయాలంటే చేయం. హమాస్‌ను నిరాయుధీకరణ చేయాలి.. వారి నుంచి ఆయుధాలు తీసుకోవాలి.. వారి సొరంగాలను ధ్వంసం చేయాలంటే అది మా పనికాదు. ఈ విషయంలో మేం చాలా స్పష్టంగా ఉన్నాం. అలాంటి పని చేయం. అక్కడ శాంతిని కొనసాగించమంటే సంతోషంగా ఆ పని చేస్తాం. అలా కాకుండా హమాస్ దగ్గర ఆయుధాలు తీసుకోవాలంటే మాత్రం అంగీకరించం" అని పేర్కొన్నారు. అమెరికా ప్రతిపాదిత శాంతి ప్రణాళిక రెండో దశలో హమాస్‌ను నిరాయుధీకరణ చేయడమే ప్రధాన అంశంగా ఉంది. గాజాలో శాంతి స్థాపించడంలో ఇదే ముఖ్యమైన దశగా అమెరికా విశ్వసిస్తోంది. ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ గాజాకు బలగాలు పంపుతామని పాకిస్థాన్ ఆఫర్ చేసినట్లు పేర్కొన్నారు. దీంతోపాటు పలు దేశాలు కూడా దీనిలో భాగం అయ్యేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు. హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణను కొనసాగించేందుకు ఐఎస్ఎఫ్ కృషి ఉపయోగపడుతుందని ట్రంప్ కార్యవర్గం బలంగా విశ్వసిస్తోంది.

జమ్మూలో 30 మందికిపైగా పాక్ ఉగ్రవాదులు

అప్రమత్తమైన భద్రతా బలగాలు

ఇంటర్నెట్ డెస్క్: జమ్మూ ప్రాంతంలో 30 మందికి పైగా పాకిస్థానీ ఉగ్రవాదులు నక్కినట్లు నిఘా వర్గాలు పేర్కొనడంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఉగ్ర స్థావరాలు గుర్తించడానికి భద్రతా దళాలు కొండలు, అడవులు, మారుమూల లోయల్లో గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఉగ్రవాదుల జాడను కనిపెట్టడానికి డ్రోన్లు, థర్మల్ ఇమేజర్లు, గ్రౌండ్ సెన్సర్లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. జమ్మూలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా పడిపోవడంతో ఉగ్రవాదులపై నిరంతర నిఘా కోసం పర్వత ప్రాంతాల్లో తాత్కాలిక నిఘా స్థావరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు జమ్మూ కశ్మీర్‌లో మంచు కురుస్తుండడంతో చొరబాట్లకు ఇదే అదునుగా భావించిన ఉగ్రమూకలు అంతర్జాతీయ సరిహద్దును దాటుకుని దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సరిహద్దు భద్రతా దళంఅధికారి వెల్లడించారు. అయితే ఆ ప్రయత్నాలను తమ దళాలు తిప్పికొడుతున్నాయన్నారు. సరిహద్దుల్లో ఉగ్ర కదలికల నేపథ్యంలో కశ్మీర్‌లోని గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాలతో సహా పలు సున్నితమైన ప్రదేశాల్లో భద్రతా దళాలను మోహరించాయన్నారు.

కెనడాలో భారత సంతతి వ్యక్తి మృతి ఘటన.. స్పందించిన మస్క్



ఇంటర్నెట్ డెస్క్: కెనడాలో భారత సంతతి వ్యక్తి ప్రశాంత్ శ్రీకుమార్ ఇటీవల ప్రాణాలు కోల్పోవడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఆయన చనిపోయాడనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్పందిస్తూ కెనడా ఆరోగ్య వ్యవస్థపై విమర్శలు గుప్పించారు. కెనడా ఆరోగ్య వ్యవస్థ సరిగ్గాలేదని పరోక్షంగా మండిపడ్డారు. కెనడాకు చెందిన శ్రీకుమార్‌కు ఇటీవల ఛాతీలో నొప్పి రావడంతో ఎడ్మంటన్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఈసీజీ తీసి, అది గుండెపోటు కాదని తేల్చారు. అక్కడే నిరీక్షిస్తున్న సమయంలో మరోసారి తీవ్ర నొప్పి వచ్చి ప్రాణాలు కోల్పోయాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ప్రశాంత్ చనిపోయాడంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆ క్రమంలో తమతో ఆస్పత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని శ్రీకుమార్ భార్య వాపోయారు.

నెహ్రూ లేఖలను ప్రధాని మ్యూజియానికి తిరిగివ్వండి

సోనియాకు కేంద్ర మంత్రి షెకావత్ విజ్ఞప్తి

ఇంటర్నెట్ డెస్క్: భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు, ఇతర డాక్యుమెంట్లను ప్రధానమంత్రి మ్యూజియానికి తిరిగివ్వాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి విజ్ఞప్తి చేశారు. అవి ఏ ఒక్క వ్యక్తికి చెందినవి కావని, దేశానికి చెందినవని అన్నారు. పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడిన షెకావత్.. కాంగ్రెస్ అనవసర అంశాలను లేవనెత్తుతుందనడానికి ఆరావళి పర్వతాల వివాదం ఓ చక్కటి ఉదాహరణ అంటూ విమర్శలు గుప్పించారు. "మాజీ ప్రధాని నెహ్రూ మరణానంతరం ఆయన పేరుతో స్మారక మ్యూజియం, లైబ్రరీ (ప్రస్తుతం ప్రధానమంత్రి మ్యూజియంగా పేరు మార్చారు)ని ఏర్పాటు చేశారు. ఓ వ్యవస్థ ఏర్పడినప్పటికీ దాని నిర్వహణ సరిగ్గా లేదు. 1970 నుంచి 1990 మధ్యకాలంలో నెహ్రూకు సంబంధించిన అన్ని అనధికార దస్త్రాలను మ్యూజియానికి తీసుకొచ్చారు. ఇందులో పౌరులకు నెహ్రూ రాసిన లేఖలు, అందుకున్న ప్రత్యుత్తరాలున్నాయి. ఇలాంటివి అందరు ప్రధానులకు సంబంధించి 2.5 కోట్ల దస్త్రాలను మ్యూజియంలో భద్రపరిచారు. వీటిలో 4లక్షలు నెహ్రూకు చెందినవే. అయితే, ఆ కుటుంబానికి చెందిన వ్యక్తిగత లేఖలు ఇవ్వాలని చేసిన విజ్ఞప్తి మేరకు 57 కార్టన్లలో 26వేల దస్త్రాలను 2008లో మ్యూజియం నుంచి తీసుకెళ్లారు. వాటిని తిరిగి ఇవ్వాలని కోరుతున్నాం. ఆ విషయాన్ని పరిశీలిస్తామని సోనియా గాంధీ చెప్పారు. ఇప్పటికి రెండుసార్లు లేఖలు రాశాం. వాటిని మ్యూజియానికి అప్పగించాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం" అని షెకావత్ పేర్కొన్నారు.

జాతి వివక్ష కేసులో భారతీయుడి గెలుపు

రూ.81 లక్షల పరిహారానికి ట్రైబ్యునల్ ఆదేశం

లండన్: పని ప్రదేశంలో జాతి వివక్ష, తప్పుడు కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించడంపై లండన్‌లో ఓ భారతీయుడు చేసిన న్యాయపోరాటానికి ఫలితం దక్కింది. సుమారు 67 వేల పౌండ్ల(రూ.81 లక్షలు) పరిహారాన్ని అతడు సాధించాడు. తమిళనాడుకు చెందిన మాదేశ్ రవిచంద్రన్ లండన్‌లో కేఎఫ్‌సీ ఫ్రాంఛైజీకి చెందిన ఓ రెస్టారెంటులో పనిచేసేవాడు. మేనేజరుగా ఉన్న శ్రీలంకకు చెందిన తమిళుడైన కజన్ అతడితో ఎక్కువ గంటలు పనిచేయిస్తూ వేధింపులకు గురిచేసేవాడు. సెలవులు ఇచ్చే విషయంలోనూ అతడి అభ్యర్థనలను పట్టించుకోకుండా శ్రీలంక తమిళులైన సిబ్బందికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. భారతీయులు మోసగాళ్లంటూ వ్యాఖ్యానించడంతోపాటు మాదేశ్‌ను 'బానిస' అని హేళన చేసేవాడు. చివరకు అతడికి సరైన కారణం చూపకుండానే, వారం రోజుల ముందస్తు నోటీసు కూడా ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగించాడు. దీనిపై మాదేశ్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాడు. మాదేశ్ చేసిన ఆరోపణలు నిజమేనని తేల్చిన ట్రైబ్యునల్ 67 వేల పౌండ్ల పరిహారాన్ని అతడికి చెల్లించాలని ఆదేశించింది.

సూరినామ్‌లో కత్తితో ఉన్మాది వీరంగం.. 9 మంది మృత్యువాత

మృతుల్లో నలుగురు అతడి పిల్లలే

పరమరిబో: దక్షిణ అమెరికా దేశమైన సూరినామ్‌లో ఓ ఉన్మాది వీరంగం సృష్టించాడు. దేశ రాజధాని పరమరిబో శివార్లలోని రిచెలియూ ప్రాంతంలో తన సొంత పిల్లలపై, ఇరుగుపొరుగువారిపై కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో మొత్తం తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. వారిలో నలుగురు.. నిందితుడి కన్నబిడ్డలు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులపై కూడా నిందితుడు దాడికి ప్రయత్నించాడు. చివరకు పోలీసులు అతణ్ని అరెస్టు చేశారు. అరెస్టు చేసే క్రమంలో నిందితుడు గాయపడ్డాడని, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు ఆదివారం తెలిపారు. ఉన్మాది తన కన్నబిడ్డలపై దాడికి పాల్పడుతుండగా, వారిని కాపాడటానికి వచ్చి ఓ చిన్నారి సహా ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు.

పోలీసు కస్టడీతో వచ్చి.. పుణెలో గ్యాంగ్‌స్టర్ నామినేషన్

- మనవడి హత్యకేసులో అరెస్టయిన వైనం



ఇంటర్నెట్ డెస్క్: సొంత మనవడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న గ్యాంగ్‌స్టర్ బందు అందేకర్ (68) పుణె మున్సిపల్ కార్పొరేషను ఎన్నికల్లో పోటీకి శనివారం నామినేషను దాఖలు చేశాడు. ముఖానికి నల్లటి వస్త్రం కట్టి, చేతులను తాళ్లతో బంధించి పోలీసులు అతడిని జైలు నుంచి నామినేషను కార్యాలయానికి తీసుకొచ్చారు. ఇంజినీరింగు చదువుతున్న మనవడు ఆయుష్ కుమార్ (18) హత్యకేసులో అరెస్టయిన అందేకర్ ప్రస్తుతం జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నాడు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడంతో ఇండిపెండెంటుగా బరిలోకి దిగాడు. నామినేషను వేసేందుకు కార్యాలయానికి వస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశాడు. ఇదే హత్యకేసులో నిందితులుగా ఉన్న అందేకర్ కుటుంబంలోని మరో ఇద్దరు మహిళలు కూడా కోర్టు అనుమతితో ఎన్నికల్లో పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. అందేకర్ కుమారుడైన ఎన్సీపీ కార్పొరేటరు వనరాజ్ అందేకర్ ఆస్తి తగాదాల కారణంగా హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అరెస్టయిన ఆయుష్ తండ్రి ప్రస్తుతం జైలులో ఉన్నాడు. వనరాజ్ హత్యకు ప్రతీకారంగా కుమార్తె తనయుడైన ఆయుష్ హత్యకు తాత అందేకర్ కుట్ర పన్నినట్లు పోలీసుల అభియోగం. ఆయుష్ సెప్టెంబరు 5న నానాపేట వద్ద జరిగిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోగా.. అతడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అందేకర్ కుటుంబంలోని ముగ్గురితోపాటు మరో 15 మందికి ఈ హత్యలో ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం వీరంతా జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. పుణె సహా మరో 28 ప్రాంతాల్లో జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి.

విమాన ప్రయాణికులకు బాసటగా 24x7 కంట్రోల్‌రూం

దిల్లీ: విమాన ప్రయాణికుల ఇబ్బందుల్ని మరింత మెరుగ్గా పరిష్కరించడానికి 'ప్రయాణికుల సహాయ కంట్రోల్ రూం' (పీఏసీఆర్)ను పౌరవిమానయాన మంత్రిత్వశాఖ ఏర్పాటుచేసింది. 24×7 ప్రాతిపదికన ఇది రోజంతా పనిచేస్తుంది. దీనిలో మంత్రిత్వశాఖతో పాటు, పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ), విమానయాన సంస్థలు, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ)ల అధికారులు అందుబాటులో ఉంటారు. విమాన కార్యకలాపాలను ఇది పర్యవేక్షిస్తుంది. ఫిర్యాదుల్ని స్వీకరించి, పరిష్కారానికి ఆయా వర్గాల సమన్వయంతో పనిచేస్తుంది. ఇండిగో విమానాలకు సమస్య ఎదురైనప్పుడు.. ఈ నెల 10న పీఏసీఆర్ అందుబాటులోకి వచ్చింది. ఇది ఏర్పాటయ్యాక ప్రయాణికుల సమస్యల పరిష్కారం మెరుగుపడిందని పౌర విమానయాన శాఖ కార్యదర్శి సమీర్‌కుమార్ సిన్హా తెలిపారు. విమానాలు రద్దు కావడం, లగేజీ రాకపోవడం, భోజనం అందించకపోవడం వంటి రకరకాల అంశాలపై ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిని 72 గంటల్లోగా పరిష్కరించాల్సి ఉంటుంది.

(c) eenadu

రతన్‌టాటాకు చంద్రబాబు నివాళి

ఈనాడు, అమరావతి: ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత రతన్‌టాటా జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళి అర్పించారు. 'దూరదృష్టి గల పారిశ్రామికవేత్తగా, మానవత్వం నిండిన మనిషిగా, సేవా కార్యక్రమాలతో సమాజం మీద ఆయన తనదైన ముద్రవేశారు' అని ఎక్స్‌ వేదికగా పేర్కొన్నారు.

భారతరత్నం రతన్ టాటా: జగన్

ఉత్తమ పారిశ్రామిక విధానాలతో భారత పరిశ్రమను ప్రపంచస్థాయికి తీసుకెళ్లిన రతన్ టాటా ఓ భారత రత్నమని మాజీ సీఎం జగన్ ఆదివారం 'ఎక్స్‌'లో పేర్కొన్నారు. రతన్ టాటా దాతృత్వం, నిరాడంబరత ఎల్లప్పుడూ మనకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాయని, ఆయన జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు.

దావోస్ పర్యటనకు ఐఏఎస్ అధికారులు

ఈనాడు, అమరావతి: దావోస్‌లో వచ్చే నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరగబోయే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సుకు ఏపీ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, ఏపీ ఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో ధాత్రి రెడ్డి, ఏపీఎస్ఎఫ్ఎల్ ఎండీ గీతాంజలి శర్మ హాజరు కానున్నారు. ఈ మేరకు వారి పర్యటనకు అనుమతిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

'భాజపా ముక్త్ భారత్' పోరాటానికి సిద్ధం కావాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: దేశానికి మరో స్వాతంత్ర్యం రావాల్సి ఉందని, భాజపా ముక్త్ భారత్ ఉద్యమానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సిద్ధంకావాలని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిలుపునిచ్చారు. దేశ వ్యవస్థలన్నింటిపై దెబ్బ తీసే మతోన్మాదులను బంగాళాఖాతంలో కలపాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ షర్మిల ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు సాయిబాబా మృతి



హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ అభిమాన సంఘాల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చిన్నమనేని సాయిబాబా(69) శనివారం అర్ధరాత్రి తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎన్టీఆర్ కుమారుడు నందమూరి రామకృష్ణ, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, ముఠాగోపాల్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, నేతలు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కాట్రగడ్డ ప్రసూన, బక్కని నర్సింహులు, శ్రీపతి సతీశ్, అరవిందకుమార్ గౌడ్ తదితరులు సాయిబాబా నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. సాయిబాబా భౌతికకాయాన్ని సోమవారం ఇందిరాపార్కు సమీపంలోని తెదేపా కార్యాలయానికి తరలిస్తారు. అనంతరం అంబర్‌పేట శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

సిగాచీ సీఈవో అరెస్ట్

- పేలుడు జరిగిన ఆరు నెలలకు పోలీసుల చర్య
- 14 రోజుల రిమాండ్.. కంది జైలుకు తరలింపు



అమిత్‌రాజ్ సిన్హా

ఈనాడు, సంగారెడ్డి, న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్: సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలోని సిగాచీ పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనకు సంబంధించి పోలీసులు ఎట్టకేలకు పరిశ్రమ ఎండీ, సీఈవో అమిత్‌రాజ్ సిన్హాను అరెస్టు చేశారు. జూన్ 30న జరిగిన ప్రమాదంలో డ్రయర్ పేలి 46 మంది కార్మికులు మృతి చెందగా మరో ఎనిమిది మంది ఆచూకీ లభించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద తీవ్రతను పరిశీలించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కంపెనీ నుంచి రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని ప్రకటించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబాలకు చెందిన వారు అప్పట్లో బానూరు ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు యాజమాన్యంపై బీఎన్ఎస్ సెక్షన్లు 105, 110, 118(1), 118(2) కింద కేసు నమోదు చేశారు. బాధితులకు పరిహారం అందించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని స్థానిక న్యాయవాది బాబూరావు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు చేపట్టేలా న్యాయస్థానాన్ని కోరారు. న్యాయస్థానం సమగ్ర విచారణ చేపట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. ప్రమాదానికి కారకులైన యాజమాన్య ప్రతినిధులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో బానూరు ఠాణాలో నమోదైన కేసుల ఆధారంగా శనివారం సాయంత్రం ఎండీ, సీఈవో అమిత్‌రాజ్ సిన్హాను అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. 14 రోజుల రిమాండు విధించడంతో కందిలోని జిల్లా జైలుకు తరలించారు.

అరెస్టు సంకేతాలతో పరిహారం పంపిణీ

ఘటన జరిగిన సమయంలో మృతిచెందిన 46 మంది కార్మికుల కుటుంబాలకు రూ.42 లక్షల చొప్పున పరిహారం అందించారు. ఆచూకీ లభించని ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల చొప్పున పంపిణీ చేశారు. ప్రభుత్వం నియమించిన సాంకేతిక కమిటీతోపాటు హైలెవల్ కమిటీలు కంపెనీ యాజమాన్య నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని నివేదికలు సమర్పించాయి. దీంతో పాటు న్యాయస్థానం సైతం ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించిన నేపథ్యంలో రెండు రోజుల కిందట ప్రమాదంలో ఆచూకీ లభించని ఎనిమిది మంది కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి మరో రూ.17 లక్షల చొప్పున చెల్లించేందుకు కార్మిక శాఖ అధికారులకు అందించారు. ప్రభుత్వం రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని గతంలో ప్రకటించిన నేపథ్యంలో మిగిలిన దానిపై స్పష్టత కొరవడింది. అమిత్‌రాజ్ సిన్హా అరెస్టు నేపథ్యంలో సంస్థ ప్రతినిధులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. చట్టప్రక్రియకు పూర్తిగా సహకరిస్తున్నామని పేర్కొన్నారు.

సమ్మోహనపరిచిన శ్రీకృష్ణావతారుడు

నేడు భద్రాద్రి రామయ్యకు తెప్పోత్సవం



కృష్ణావతారంలో స్వామివారు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం సీతారామచంద్రస్వామి ముక్కోటి ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. భక్తులు గోపాలుడిని భక్తిశ్రద్ధలతో కీర్తించి వెన్న సమర్పించారు. హరేరామ హరేకృష్ణ అంటూ కోలాటాలు ఆడటంతో భద్రగిరి పులకించింది. మహోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటలకు ఆలయం నుంచి స్వామివారు గోదావరికి వేంచేస్తారు. నదిలో ప్రత్యేకంగా తయారు చేసిన హంసాలంకృత వాహనంపై సీతారాములవారు పూజలు అందుకుని విహరిస్తారు. 30న ఉదయం ఉత్తర ద్వార దర్శన పూజల కోసం ఈఓ దామోదర్‌రావు ఏర్పాట్లు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు, ప్రముఖులు రానుండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

యాదగిరిగుట్ట క్షేత్రంలో 6 రోజులపాటు నిత్యకల్యాణం రద్దు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో ఆర్జిత నిత్య కైంకర్యాలుగా నిర్వహించే సుదర్శన నారసింహ హోమం, లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంతో సహా జోడు సేవా పర్వాలను మంగళవారం నుంచి ఆరు రోజులపాటు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావు తెలిపారు. ఆలయ వార్షిక అధ్యయనోత్సవాలు ఈ నెల 30 నుంచి వచ్చే నెల 4 వరకు కొనసాగనుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 30న జరిగే ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి దాటాక 2 గంటల నుంచి ఆలయ కైంకర్యాలు మొదలవుతాయని ఆలయ ఈవో వెంకట్రావు పేర్కొన్నారు. రెండు గంటలకు ఆలయాన్ని తెరిచి స్వయంభువులను మేల్కొలిపి సుప్రభాత సేవ చేపడతారు. 2:30కి ప్రాతఃకాల తిరువారాధన, 3 గంటలకు తిరుప్పావై సేవాకాలం, 3:30కి బాలభోగం, 4:15కు స్వామి అలంకరణ, 5:30కి ఉత్తర ద్వార దర్శనం, 6:30కి తిరువీధి సేవోత్సవం, 8 గంటలకు అధ్యయనోత్సవం, పురవీధి సేవాపర్వం నిర్వహిస్తారు. 8 గంటలకు సర్వ దర్శనం, 10:30 నుంచి 11:30 గంటల వరకు బ్రేక్ దర్శనం ఉంటాయి.

ఆర్థిక సంఘం నిధుల వ్యయంపై నియంత్రణ

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తుల్లో ఆర్థికసంఘం నిధుల వ్యయంపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నియంత్రణ విధించింది. ఇష్టానుసారం కాకుండా.. కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఖర్చుచేయాలని సూచించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ తప్పనిసరని, పొరపాట్లు జరిగితే వారే బాధ్యులని హెచ్చరించారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం మరో మూడు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో నిధుల దుర్వినియోగానికి ఆస్కారం లేకుండా ఈ చర్యలు చేపట్టారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తుల్లో ప్రస్తుతం రూ.1,000 కోట్ల వరకు ఆర్థిక సంఘం నిధులున్నాయి.

వీటికే ఖర్చు చేయాలి

● గ్రామాల్లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించాలి ● గ్రీన్ అంబాసిడర్లకు 2025 డిసెంబరు వరకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు అందజేయాలి ● విద్యుత్తు ఛార్జీల బకాయిలు చెల్లించాలి ● రక్షిత నీటిపథకాల నిర్వహణ (ఓఅండ్‌ఎం), నీటి సరఫరా పనులకు ఖర్చుచేయాలి ● సీఎఫ్‌ఎంఎస్, పీఎఫ్‌ఎంఎస్ పోర్టళ్లలో బిల్లులు అప్‌లోడ్ చేసేటప్పుడు పంచాయతీ అభివృద్ధి అధికారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలి. పొరపాట్లకు వారే బాధ్యులు ● మండల పరిషత్తులు లింకు రోడ్లు, గ్రామాల్లోని చేతిపంపుల నిర్వహణపై దృష్టిసారించాలి. స్వచ్ఛ రథాల నిర్వహణకు నిధులివ్వాలి ● అవసరాన్ని బట్టి జడ్పీ లింకు రోడ్ల మరమ్మతులు, నిర్వహణకు ఖర్చు చేయాలి ● నిబంధనలకు విరుద్ధంగా చేసే నిధుల వ్యయంపై చర్యలు చేపట్టాలి.

ఏపీ ఫార్మసీ కౌన్సిల్‌కు ఆరుగురు సభ్యుల ఎన్నిక

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. పోస్టల్ బ్యాలట్ విధానంలో నిర్వహించిన ఎన్నికల్లో 44 మంది పోటీచేయగా. . ఆరుగురు గెలిచినట్లు రిటర్నింగ్ అధికారి, ఆయుష్ శాఖ సంచాలకుడు కె.దినేష్‌కుమార్ ప్రకటించారు. శనివారం అర్ధరాత్రి వరకు ఓట్ల లెక్కింపు కొనసాగింది. అత్యధిక ఓట్లు సాధించిన ఆరుగురు అభ్యర్థులు 2025-29 కాలానికి ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు. గెలిచిన వారిలో దేవనబోయిన నరేంద్రకు 13,187 ఓట్లు, ఎన్.విజయభాస్కర్‌కు 13,125, దారపు నూక ప్రసాదరెడ్డికి 13,106, పి.రాంబాబుకు 13,038, వి.ఎస్.కల్యాణచక్రవర్తికి 12,766, టి.సుబ్బారామ గుప్తకు 12,709 ఓట్లు వచ్చినట్లు వెల్లడించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు ఫార్మసీ రంగ అభివృద్ధికి, ఫార్మసిస్టుల హక్కుల కోసం కృషిచేయాలని సూచించారు.

ముగిసిన పాక హనుమంతు అంత్యక్రియలు

భారీగా తరలి వచ్చిన జనం

చండూరు, న్యూస్‌టుడే: మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు పాక హనుమంతు అలియాస్ గణేశ్ ఉయికే అంత్యక్రియలను ఆయన స్వగ్రామం నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలో ఆదివారం నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం ఒడిశా రాష్ట్రం కంధమాల్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాక హనుమంతు మృతి చెందగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. చివరి చూపు కోసం భారీగా జనం తరలివచ్చారు. ఎలాంటి ఘటనలు జరగకుండా డీఎస్పీ శివరామిరెడ్డి పర్యవేక్షణలో పోలీసులు మోహరించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత, మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి, మునగాల నారాయణరావు తదితరులు హాజరై హనుమంతు మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాకారుల పాటలు, ప్రసంగాలతో అంతిమయాత్ర సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, కార్యదర్శి నారాయణ, సుక్కా రామనర్సయ్య, పద్మకుమారి, భవాని, అంజమ్మ, పాణి, రివేరా, సంధ్య, నర్ల రవి, స్టాలిన్, హరిబాబు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



అంతిమ యాత్రలో పాల్గొన్న జనం

హైదరాబాద్‌లో డీజే కన్సర్ట్‌లో డ్రగ్స్ కలకలం

ఈనాడు- హైదరాబాద్: కొత్త సంవత్సర వేడుకలకు ముందు ఈగల్ ఫోర్స్ వరుస ఆపరేషన్లతో డ్రగ్స్, గంజాయి వినియోగదారుల 'మత్తు' వదిలిస్తోంది. శనివారం రాత్రి హైదరాబాద్ కొండాపూర్‌లోని క్వేక్ అరేనా పబ్‌లో జరిగిన ఉక్రేనియన్ డీజే ఆర్ట్‌బాట్ మ్యూజిక్ కన్సర్ట్‌లో ఆకస్మిక దాడులు చేసి 8 మంది డ్రగ్స్ వినియోగదారుల్ని పట్టుకున్నట్లు ఈగల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. నిందితుల్లో ఇద్దరు యువతులున్నారని పేర్కొంది.

అభిమానుల రూపంలో..: కొందరు డ్రగ్స్ వినియోగించి డీజే కన్సర్ట్‌కు హాజరవుతున్నారని సమాచారం అందుకున్న ఈగల్.. సైబరాబాద్ పోలీసులతో కలిసి కన్సర్ట్ జరిగే ప్రాంతానికి అభిమానుల రూపంలో వెళ్లింది. వినియోగదారులు ఒక్కొక్కర్ని గుర్తించి మొత్తం 14 మందిని ఒక పక్కకు తీసుకెళ్లి డ్రగ్స్ కిట్లతో పరీక్షలు నిర్వహించింది. 8 మందికి పాజిటివ్ వచ్చింది. షేక్‌పేటకు చెందిన రియాజ్ (26), షాపూర్‌నగర్‌కు చెందిన యశ్వంత్(28), కేపీహెచ్‌బీకి చెందిన భరత్(35), నేరేడ్‌మెట్‌కు చెందిన మోహన్(23), తిరుమలగిరికి చెందిన సబ్రీనా(27), త్రిష(22), సంగారెడ్డి గణేశ్‌నగర్‌కు చెందిన శ్రవణ్(26), బోరబండకు చెందిన విశాల్(27)లకు పాజిటివ్ వచ్చింది.

ప్రజలకు నచ్చేది వ్యతిరేకిస్తే

మీకు ఓట్లెలా వస్తాయి?

- రాహుల్‌కు అమిత్‌షా ప్రశ్న



అహ్మదాబాద్: ప్రజలకు నచ్చే ప్రతిదాన్నీ ఏ పార్టీ అయినా వ్యతిరేకిస్తుంటే ఓట్లెలా వస్తాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. ఈ సులువైన తార్కికత (లాజిక్)ను రాహుల్‌గాంధీకి అర్థమయ్యేలా చెప్పడం తన శక్తికి మించిన పని అని, కాంగ్రెస్ నేతలూ దానిలో విఫలమయ్యారని చెప్పారు. అహ్మదాబాద్ సమీపంలోని ఒక గ్రామంలో ఆదివారం ఏర్పాటుచేసిన సభలో అమిత్‌షా ప్రసంగించారు. 173 మందికి భూ యాజమాన్య పత్రాలు అందజేశారు. మురుగునీటిపారుదల వ్యవస్థను ప్రారంభించారు. "ఇటీవల లోక్‌సభలో ఒకానొక చర్చలో విపక్షనేత రాహుల్‌గాంధీ నన్నొక వింతైన ప్రశ్న అడిగారు. తమ పార్టీయే ప్రతిసారీ ఎందుకు ఓడిపోతోందనేది ఆ ప్రశ్న! ప్రజల్ని అడిగి తెలుసుకోవాల్సిన విషయమది. ఈ రోజు నేను ఇక్కడ ప్రారంభించిన రెండింటిని అర్థం చేసుకుంటే రాహుల్‌బాబా ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది. ఓటములతో రాహుల్ అప్పుడే అలసిపోకూడదు. ఎందుకంటే.. త్వరలో జరగబోయే తమిళనాడు, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ఓటమి ఖాయం. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ప్రధాని మోదీ నేతృత్వంలోని భాజపాయే విజేతగా అవతరిస్తుంది. మా సిద్ధాంతాలతో ప్రజలు అనుసంధానమై ఉన్నారు. అందుకే మేం విజయాలు సాధిస్తున్నాం. అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఉగ్రవాదులపై మెరుపుదాడులు, 370 రాజ్యాంగ అధికరణం రద్దు, ఉమ్మడి పౌరస్మృతి, ముమ్మారు తలాక్ నిషేధం, బంగ్లాదేశ్ చొరబాటుదారుల ఏరివేత వంటి అంశాలన్నింటినీ కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఇప్పుడు చెప్పండి.. ఇలాంటి పరిస్థితుల్లో మీకు (కాంగ్రెస్‌కు) ఓట్లు ఎలా వస్తాయి?" అని అమిత్‌షా ప్రశ్నించారు.

త్వరలో మలేరియా నిర్మూలన

దేశంలో మలేరియా కేసులు ఇప్పటికే 97% తగ్గాయని, త్వరలోనే దీనిని పూర్తిగా నిర్మూలించబోతున్నామని అమిత్‌షా చెప్పారు. భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) ఆదివారం అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రసంగించారు. ఆయుష్మాన్ భారత్, మిషన్ ఇంద్ర ధనుష్ వంటివి మంచి ఫలితాలనిస్తున్నాయని చెప్పారు.

ధిక్కరణకు అత్యున్నత అధికారే బాధ్యుడు

- అలహాబాద్ హైకోర్టు స్పష్టీకరణ

ప్రయాగ్‌రాజ్: పాలన యంత్రాంగంలో అయోమయం వల్ల ఒక రిట్ పిటిషన్లోని ఉత్తర్వును అమలుపరచకపోతే ధిక్కరణ చర్యలకు బాధ్యుడు ఆ ప్రభుత్వ శాఖలోని అత్యున్నత అధికారే అవుతారని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. వివిధ విభాగాల మధ్య పని విభజనను నెపంగా చూపించి కోర్టు ఆదేశాల అమలు నుంచి తప్పించుకోజాలరని స్పష్టంచేసింది. భూసేకరణ చట్టం-1984 కింద కోల్పోయిన భూములకు పరిహారానికి సంబంధించిన ధిక్కరణ కేసుల్లో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని బాధ్యుడిని చేస్తున్నట్లు జస్టిస్ సలీల్‌కుమార్ రాయ్ ధర్మాసనం తెలిపింది. తమ ఆదేశాలు పూర్తిగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తేల్చిచెప్పింది. తమ ఉత్తర్వును రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు ఉద్దేశపూర్వకంగానే అమలు చేయలేదని, పర్యవసానాలు ఎలా ఉంటాయో కూడా వాటికి తెలుసునని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భూసేకరణ వ్యవహారాలకు రాష్ట్రంలో అత్యున్నత అధికారి ప్రధాన కార్యదర్శి అని, తాము ఇచ్చిన ఉత్తర్వుల్ని అమలు చేయడానికి మరో నెల రోజుల సమయం ఆయనకు ఇస్తున్నామని తెలిపింది. లేనిపక్షంలో జనవరి 5న జరిగే తదుపరి విచారణకు హాజరుకావాలని స్పష్టంచేసింది.



బిహార్‌లోని జముయ్ జిల్లాలో సిమెంటు లోడుతో వెళ్తున్న గూడ్సు రైలు పట్టాలు తప్పిన అనంతరం వంతెన వద్ద చెల్లాచెదురుగా పడిన వ్యాగన్లు

ఆరావళిపై సుప్రీంకోర్టులో నేడు సుమోటో విచారణ

దిల్లీ: ఆరావళి పర్వతశ్రేణుల నిర్వచనంపై రేగిన వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం సుమోటో విచారణ చేపట్టనుంది. ఈ అంశాన్ని కోర్టు తనంతట తానుగా విచారణకు స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌ల ధర్మాసనం దీనిపై వాదనలు వినే అవకాశం ఉంది. ఆరావళి పర్వతాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఆమోదించిన నిర్వచనంపై వివాదం చెలరేగిన వేళ ఈ అంశాన్ని పునఃపరిశీలించేందుకు అత్యున్నత న్యాయస్థానం సిద్ధమైంది. కేంద్రం సిఫార్సులతో ఆరావళి పర్వతశ్రేణుల ఏకరీతి నిర్వచనాన్ని నవంబరు 20న సుప్రీంకోర్టు ఆమోదించిన విషయం తెలిసిందే.

ఉన్నావ్ అత్యాచార కేసులో దోషికి శిక్ష నిలిపివేత.. సుప్రీంకోర్టులో నేడు సీబీఐ పిటిషన్‌పై విచారణ

దిల్లీ: ఉన్నావ్ అత్యాచార కేసులో భాజపా బహిష్కృత నేత కుల్‌దీప్ సింగ్ సెంగర్‌కు పడిన జీవిత ఖైదు శిక్షను దిల్లీ హైకోర్టు నిలిపివేయడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ అగస్టీన్ మసీహ్‌లతో కూడిన వెకేషన్ బెంచ్ ఈ వ్యాజ్యాన్ని విచారించే అవకాశం ఉంది. ఇదే కేసులో దిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేయడంతో పాటు దానిపై స్టే విధించాలని కోరుతూ న్యాయవాదులు అంజల్ పటేల్, పూజా శిల్పాకర్ వేసిన మరో పిటిషన్‌ను సైతం సుప్రీంకోర్టు విచారించనుంది. ఉన్నావ్ అత్యాచార కేసులో కుల్‌దీప్ సింగ్ సెంగర్‌ను దోషిగా తేలుస్తూ 2019 డిసెంబరులో దిగువ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఈ శిక్షను ఈ నెల 23న దిల్లీ హైకోర్టు నిలిపివేసిన విషయం తెలిసిందే.

పశ్చిమబెంగాల్ సీఈవోకు వై ప్లస్ కేటగిరీ భద్రత

దిల్లీ, కోల్‌కతా: ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో పశ్చిమబెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) మనోజ్ అగర్వాల్‌కు కేంద్ర ప్రభుత్వం వై ప్లస్ కేటగిరి భద్రత కల్పించింది. హోంశాఖ ఆదేశాల మేరకు 'కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం' (సీఐఎస్ఎఫ్) బలగాలు కోల్‌కతాలో ఆయనకు రక్షణగా నిలుస్తున్నాయి. అగర్వాల్‌కు, ఆయన నివాసానికి భద్రత కోసం 12 మంది సిబ్బందిని కేటాయించారు. సీఈవోకు ముప్పు ఉందని కేంద్ర నిఘా వర్గాలకు అందిన సమాచారం మేరకు ఈ ఏర్పాటు చేశారు.

భారత్‌లో సి-130జె విమానాల ఉత్పత్తి!

- లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ప్రణాళికలు



మారియెట్టా: భారత్ 80 సైనిక రవాణా విమానాల కొనుగోలుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో అమెరికాకు ఏరోస్పేస్ దిగ్గజ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్.. తమ సి-130జె సూపర్ హెర్క్యులెస్ విమానాలను బరిలోకి దించింది. భారత్‌కు ఇవి అత్యంత అనువైనవని పేర్కొంది. ఈ కాంట్రాక్టుకు తమను ఎంపిక చేస్తే.. భారత్‌లో ఈ విమానాల ఉత్పత్తికి ఒక మెగాహబ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపింది. అక్కడి నుంచి విదేశాలకూ ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని వివరించింది. అమెరికా వెలుపల ఇలాంటి కర్మాగారాన్ని తమ సంస్థ ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారని తెలిపింది. సి-130జె విమానాలు ఇప్పటికే 23 దేశాలకు సేవలు అందిస్తున్నాయని పేర్కొంది. భారత వాయుసేన వద్ద ఇప్పటికే ఈ రకం లోహవిహంగాలు 12 ఉన్నాయని గుర్తుచేసింది. క్వాడ్ కూటమిలోని ఆస్ట్రేలియా, జపాన్‌లు ఆధునిక సి-130జెలను సమకూర్చుకుంటోందని లాక్‌హీడ్ మార్టిన్ ఉన్నతాధికారి రాబర్ట్ టాథ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ తరగతికి చెందిన మరిన్ని విమానాలను సమకూర్చుకోవడం వల్ల భారత్‌కు పైచేయి లభిస్తుందని తెలిపారు. సి-130జెకి సంబంధించిన కొన్ని భాగాలను టాటా సంస్థతో కలిసి లాక్‌హీడ్ మార్టిన్. . హైదరాబాద్‌లో ఉత్పత్తి చేస్తోంది. సైనిక రవాణా విమానాల కాంట్రాక్టు కోసం బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రేయర్ కేసీ-390 మిలీనియం విమానం, ఎయిర్‌బస్ సంస్థకు చెందిన ఎ-400ఎం ప్లేన్‌లు కూడా పోటీపడుతున్నాయి.

ముగ్గురు ఉన్నత సైనికాధికారులపై చైనా వేటు

బీజింగ్: అవినీతి ఆరోపణలపై ముగ్గురు ఉన్నత సైనికాధికారులను పదవుల నుంచి చైనా తొలగించింది. సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) రాజకీయ, చట్ట వ్యవహారాల అధిపతి వాంగ్ రెన్హువా, పీపుల్స్ ఆర్మ్‌డ్ పోలీస్ (పీఏపీ) కీలక అధికారి జాంగ్ హాంగ్ బింగ్, సీఎంసీ శిక్షణ విభాగం డైరెక్టర్ వాంగ్ పెంగ్‌లను నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ (పార్లమెంటు) స్టాండింగ్ కమిటీ బహిష్కరించింది. ఈ ముగ్గురు.. జులైలో జరిగిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) వార్షికోత్సవం సహా పలు కీలక కార్యక్రమాల్లో కనిపించలేదు. దీంతో అనుమానాలు చెలరేగాయి. సీఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ హీడాంగ్‌పైనా నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ స్టాండింగ్ కమిటీ వేటు వేసింది. ఇప్పటికే ఈయన్ను చైనా కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ నుంచి తొలగించారు.

మయన్మార్‌లో తొలి విడత ఎన్నికలు పూర్తి

యాంగూన్: అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం నిర్వహించిన తొలి దశ ఎన్నికలు ఆదివారం ముగిశాయి. జనవరి నెలాఖరు నాటికి మిగతా రెండు దశలు పూర్తవుతాయి. ఫిబ్రవరిలో ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలున్నాయి. జాతీయ, ప్రాంతీయ చట్ట సభల్లో సీట్ల కోసం 57 పార్టీలకు చెందిన 4,800కి పైగా అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. సైన్యం మద్దతుతో బరిలో ఉన్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ (యూఎస్‌డీపీ)యే బలంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. 2021 ఫిబ్రవరిలో ఆంగ్‌సాన్ సూచీకి చెందిన నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ (ఎన్ఎల్‌డీ) ఏర్పాటు చేసిన ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని సైన్యం కూల్చివేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జనరల్ మిన్ అంగ్ లెయాంగ్ నేతృత్వంలో సైనిక కూటమే(జుంటా) పాలన సాగిస్తోంది.

అదానీ ప్రస్థానం యువతకు స్ఫూర్తి: పవార్

బారామతి: పెద్ద కలలు కంటూ వాటి సాకారానికి కష్టించి పనిచేసే యువతకు పారిశ్రామికవేత్త గౌతం అదానీ ప్రస్థానం స్ఫూర్తిదాయకమని ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్‌పవార్ పేర్కొన్నారు. ఆదివారం పుణె జిల్లాలోని బారామతిలో 'శరద్‌చంద్ర పవార్ కృత్రిమ మేధ ఉత్కృష్ట కేంద్రా'న్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అదానీ గ్రూపు ఛైర్మన్ దీనికి నిధులు సమకూర్చారు. గుజరాత్‌లో కరవు ప్రభావిత జిల్లా అయిన బనాస్‌కాంఠాలో పుట్టిన అదానీ అతిచిన్న వ్యాపారం కోసం ముంబయికి వచ్చి, ప్రస్తుతం 23 రాష్ట్రాల్లో వ్యాపారాన్ని విస్తరించారని పవార్ చెప్పారు. పవార్ తనకు మార్గదర్శకుడని అదానీ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై పూర్తి అవగాహన, జాతీయ ఎజెండా ఆయనలో ఉన్నాయని చెప్పారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, అపారమైన జ్ఞానంతో పాటు బలమైన సహానుభూతితో గట్టిముద్రను ఆయన సొంతం చేసుకున్నారని కొనియాడారు.



కార్యక్రమంలో శరద్ పవార్, గౌతమ్ అదానీ మాటామంతీ

ఖాలిదా ఆరోగ్యం మరింత విషమం

ఢాకా: మాజీ ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ ఛైర్ పర్సన్ ఖాలిదా జియా ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు ఆదివారం తెలిపారు. 80 ఏళ్ల జియా.. ఈ నెల 23 నుంచి పలు ఆరోగ్యపరమైన సమస్యలతో ఢాకాలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 12 నుంచి ఆమె వెంటిలేటర్‌పైనే ఉన్నారు.

ఖనిజాన్వేషణలో పాక్‌తో అమెరికా దోస్తీ

లాహోర్: అమెరికా, పాకిస్థాన్ వాణిజ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో అమెరికా తన లోకోమోటివ్ రైళ్లను పాక్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు సమాచారం. దీంతో పాటు పాకిస్థాన్‌లో అరుదైన ఖనిజాల అన్వేషణపై సమష్టిగా కృషి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పాక్ మీడియా వెల్లడించింది.

ప్రాణహాని ఉందన్న తేజ్‌ప్రతాప్.. భద్రత కోరుతూ సర్కారుకు లేఖ



ఈటీవీ భారత్: ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ తనయుడు తేజ్‌ప్రతాప్ యాదవ్ తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని కోరుతూ బిహార్ హోం మంత్రి, ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరీకి లేఖ రాశారు. కుటుంబంతో విభేదించి బయటకొచ్చిన తేజ్‌ప్రతాప్ జనశక్తి జనతాదళ్ (జేజేడీ) పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న విషయం తెలిసిందే. తనకు వస్తున్న బెదిరింపులపై సచివాలయ పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పుకొచ్చారు. అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించి పార్టీ నుంచి తాము బహిష్కరించిన జేజేడీ మాజీ జాతీయ ప్రతినిధి సంతోష్ రేణు యాదవ్ ఈ బెదిరింపులకు ప్రధాన కారణంగా లేఖలో పేర్కొన్నారు. తేజ్‌ప్రతాప్ ఫిర్యాదుపై సచివాలయ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పని ఒత్తిడితో మరో బీఎల్‌వో మృతి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని బాంకురా జిల్లాలో బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో) ఒకరు మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని ఆదివారం ఒక పాఠశాల ప్రాంగణంలో గుర్తించారు. ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు రాసిన లేఖ దొరికినట్లు పోలీసులు తెలిపారు. పని ఒత్తిడి భరించలేకపోతున్నట్లు దానిలో రాసి ఉంది. ఎస్ఐఆర్ పనులతో ఒత్తిడి పెరగడమే బీఎల్‌వో మృతికి కారణమని, ఇప్పటివరకు ఇలా 50 మంది ప్రాణాలు కోల్పోయారని తృణమూల్ తెలిపింది.